
ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 6-1-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 147 రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఓఎన్‌జీసీ బావిలో భారీ బ్లోఅవుట్



ఇరుసుమండలోని మోరి-5 ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ సైట్‌లోని బావిలో ఎగసిపడుతున్న మంటలు

- 30 మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్న అగ్నికీలలు
- డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఘటన



పరుగులు పెడుతున్న అగ్నిమాపక, ఓఎన్‌జీసీ సిబ్బంది, పోలీసులు

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే-మామిడికుదురు, మలికిపురం, రాజోలు: పచ్చని కోనసీమలో బ్లోఅవుట్ ప్రజలను మరోసారి భయభ్రాంతులకు గురి చేసింది. భీకర ధ్వనితో పేలుళ్లు, ఎగసిన మంటలతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో స్థానికులు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని మోరి-5 డ్రిల్లింగ్ సైటులో సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో గ్యాస్ లీకేజీ ఆరంభమైంది. 12.35 గంటలకల్లా నిప్పు తోడవడంతో 30 మీటర్ల ఎత్తున అగ్నిజ్వాలలు ఎగసిపడ్డాయి. ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. ఈ హఠాత్పరిణామంతో సమీపంలోని ఇరుసుమండ, లక్కవరం గ్రామస్థులు తల్లడిల్లిపోయారు.

గ్యాస్ పీడన స్థాయి అంచనా తప్పి: ఇరుసుమండ సమీపంలోని మోరి-5 సైటులో 1993లో గ్యాస్, చమురు నిక్షేపాల వెలికితీత ప్రారంభమైంది. తర్వాత కాలంలో ఈ బావిలో నిక్షేపాల పీడన స్థాయి తగ్గిపోయి నీరు ఎక్కువగా వచ్చింది. ఇందులో నిక్షేపాల వెలికితీతకు 2024లో డీప్ ఇండస్ట్రీ లిమిటెడ్ కంపెనీకి లీజుకు అప్పగించారు. తాజాగా 2,700 మీటర్ల లోపల కొత్త జోన్‌లోకి వెళ్లేటప్పుడు లాగింగ్ టూల్ టెస్టింగ్ ద్వారా బాంబింగ్ ప్రక్రియ నిర్వహించారు. సోమవారం అనూహ్యంగా 2,500 పీడన స్థాయి(పీఎస్ఐ)లో గ్యాస్ బయటకు రాగా నియంత్రించేందుకు కెమికల్ మడ్ పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. పీడన స్థాయి విపరీతంగా ఉండటం, మడ్ పంపింగ్ అదుపు చేయకపోవడంతో (మిగతా 3లో)

ప్రమాదంపై ముఖ్యమంత్రి ఆరా

సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో మాట్లాడిన చంద్రబాబు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టండి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 3లో

కోనసీమ గుండెపై నిప్పులకొలిమి 14లో



మాతృభాషలో చదువుకుంటేనే రాణింపు

సాంకేతికత సాయంతో భాషను కాపాడుకోగలం ● పిల్లలకు తెలుగుపై మమకారం, ప్రేమను పెంచాలి

'ఈనాడు'తో తెలుగు భాషాభివృద్ధికి రామోజీరావు చేసిన కృషిని జాతి మరవదు

తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన ఎన్టీఆర్ ● మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం చంద్రబాబు



ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గుంటూరు మేయర్ రవీంద్ర, సభల సమన్వయకర్త పి.రామచంద్రరాజు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, గజల్ శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ ఛైర్మన్ జస్టిస్ ఖులుసు శివశంకరరావు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, రెడ్డప్ప

ఈనాడు - అమరావతి

'అమ్మభాషను మరిస్తే మనల్ని మనం కోల్పోయినట్లే. ఉపాధి కోసం ఇంగ్లిష్ అవసరమే. కానీ మాతృభాషలో చదువుకున్న వారే అత్యున్నతంగా రాణిస్తారనే విషయం గుర్తుంచుకోవాలి. అందుకే పిల్లలకు తెలుగుభాషపై మమకారం పెంచాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. 'సాంకేతికత వల్ల మన భాషను కాపాడుకోవడం రాబోయే రోజుల్లో చాలా సులభమవుతుంది. తెలుగులో మాట్లాడితే తెలుగులోనే సమాధానం ఇచ్చే యాప్‌లు వచ్చాయి. టైప్ చేయడం తెలియని వారు కూడా ఈ సాంకేతికత ఉపయోగించుకునే పరిస్థితి వస్తుంది. అలాంటి సాంకేతికతలో మనం, మన భాష మనుగడ సాధించాలి' అని చెప్పారు. గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు చివరిరోజు సోమవారం నిర్వహించిన సభలో సీఎం ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సభల కోసం తపాలాశాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించి గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతిరాజుకు అందజేశారు. అనంతరం సభలో సీఎం మాట్లాడారు.

'దేశంలో హిందీ తర్వాత ఎక్కువ రాష్ట్రాల్లో మాట్లాడే భాష తెలుగు. అలాంటి మాతృభాష మన మూలాలకు సంకేతం, (మిగతా 3లో)

పదహారణాల తెలుగుకు.. 16 సూత్రాలతో పట్టం



- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి ప్రతిపాదన

10లో

భాష రక్షణకు పోరుబాట

- మాతృభాషపై విద్య, వ్యాపార శక్తుల దాడి
- ప్రపంచ తెలుగు మహాసభల్లో పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ



కలిసి ఎదుగుదాం

తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలొద్దు

గోదావరి నీటిని తెలంగాణ వాడుకున్నా అభ్యంతరం లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలూ కలిసి సాగాలని.. ఒకరికొకరు సహకరించుకుందామని, ఎలాంటి విద్వేషాలు లేకుండా కలిసి నడుద్దామని, ప్రపంచంలోనే అత్యున్నత జాతి స్థాయికి ఎదుగుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మదరాసీ నుంచి తెలుగుజాతిగా గుర్తింపు తెచ్చుకున్నప్పటి నుంచి ప్రపంచంలోనే తెలుగువారు ఎంత గొప్పగా ఎలా ఎదిగారో, సైబరాబాద్ (మిగతా 3లో)

విచారణార్హతే సమస్య

- 'పోలవరం-నల్లమలసాగర్'పై తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య
- సివిల్ సూట్ వేసుకోవాలని ఆ రాష్ట్రానికి సూచన
- తదుపరి విచారణ 12వ తేదీకి వాయిదా
- ఇరు రాష్ట్రాలూ మధ్యవర్తిత్వాన్ని పరిశీలించాలన్న సీజేఐ

ఈనాడు, దిల్లీ: పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్(పీఎఫ్ఆర్)కి సీడబ్ల్యూసీ ఆమోదముద్ర వేయకముందే డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ సర్కారు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు 12వ తేదీకి వాయిదా వేసింది. అంతర్రాష్ట్ర జల వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్ విచారణార్హతపై కోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. దీనిపై ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించింది. ధర్మాసనం సూచనను పరిశీలించి అభిప్రాయం చెప్పడానికి గడువు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ చేసిన విజ్ఞప్తి మేరకు కేసు విచారణను (మిగతా 3లో)

వైద్య విద్యార్థినుల ఉత్సాహం.. అబ్బురపరిచిన నృత్య సంబరం



గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థినుల జానపద నృత్య ప్రదర్శన

తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం(ఎస్వీవీయూ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాల క్రీడ, సాంస్కృతిక, సాహిత్య సంబరాలు సోమవారం విజయనగరం జిల్లా గరివిడి పశువైద్య కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి పశువైద్య కళాశాలలతో పాటు తిరుపతి డెయిరీ టెక్నాలజీ కళాశాల నుంచి 530 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ స్పెషల్ పోలీస్ ఫస్ట్ బెటాలియన్(విశాఖ) కమాండెంట్ సెహెచ్.ఏసుబాబు ముఖ్యఅతిథిగా, ఎస్వీవీయూ విద్యార్థి విభాగం డీన్ వైకుంఠరావు తదితరులు హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు జానపద నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకొన్నారు. యువత కేరింతలతో ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ నెల 10వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. - న్యూస్‌టుడే, గరివిడి

నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు: ట్రంప్



న్యూయార్క్/వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంపై తాను సంతోషంగా లేనని, భారత్‌పై అతి త్వరలో సుంకాలను పెంచే అవకాశముందని ప్రధానమంత్రి మోదీకి తెలుసునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్ డీసీకి వెళ్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "నన్ను సంతోషపెట్టాలని వాళ్లు (భారత్) అనుకుంటున్నారు. ప్రధాని మోదీ చాలామంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. వారు రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేం సుంకాలను పెంచుతాం. అది వారికి ఏమాత్రం బాగోదు. మా ఆంక్షలు రష్యాను తీవ్రంగా బాధిస్తున్నాయి" అంటూ భారత్ గురించి ప్రస్తావించారు. ఆయనతోపాటు ఉన్న సెనేటర్ లిండ్సే గ్రాహం స్పందిస్తూ.. రష్యా చమురు కొంటున్నందుకు భారత్‌పై 25% టారిఫ్ విధించామని చెప్పారు. "నెల రోజుల క్రితం నేను భారత రాయబారి నివాసంలో ఉన్నాను. రష్యా నుంచి ఇప్పుడు తాము చమురు కొనుగోళ్లు ఎంత తగ్గించామో చెప్పడానికి ఆయన తాపత్రయపడ్డారు. ఆ విషయం అధ్యక్షుడికి తెలియపరిచి టారిఫ్ నుంచి ఉపశమనం కల్పించాలని చెప్పగలరా అని కోరారు. మేం విధించిన సుంకాల కారణంగానే భారతదేశం ఇప్పుడు రష్యా నుంచి తక్కువగా చమురు దిగుమతి చేసుకుంటోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడాలంటే రష్యా వినియోగదారులపై ఒత్తిడి పెంచాల్సిందే" అని గ్రాహం అన్నారు.

గ్రీన్‌లాండ్ మాక్కావాలి

వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించిన అనంతరం లాటిన్ అమెరికా దేశాలను బెదిరించిన ట్రంప్ ఇప్పుడు గ్రీన్‌లాండ్‌పై దృష్టి సారించారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. "గ్రీన్‌లాండ్ గురించి ఇంకో 20 రోజుల్లో మాట్లాడదాం. మా రక్షణ అవసరాల దృష్ట్యా ఆ దేశం మాకు కావాలి. ప్రస్తుతం గ్రీన్‌లాండ్ మొత్తం రష్యా, చైనా నౌకలతో నిండిపోయి ఉంది" అని పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం గ్రీన్‌లాండ్.. డెన్మార్క్ అధీనంలో పాక్షిక స్వతంత్ర ప్రాంతంగా ఉంది. ట్రంప్ వ్యాఖ్యలపై గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ తీవ్రంగా స్పందించారు. పదే పదే తమ దేశం కోసం అగ్రరాజ్యం మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. 'ఇక ఒత్తిళ్లు చేయొద్దు. కల్పనలూ చేయొద్దు. మేం చర్చలకు సిద్ధం. అయితే అవి సరైన మార్గాల ద్వారా అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ జరగాలి" అని ఆయన పేర్కొన్నారు. ★ రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడి విషయంలో ట్రంప్ స్వరం మారింది. గత వారం పుతిన్ ఇంటిపై దాడిపై ఆందోళన వ్యక్తం చేసిన ట్రంప్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పుతిన్ ఇంటిని ఉక్రెయిన్ సైన్యం లక్ష్యంగా చేసుకోలేదనుకుంటున్నానని చెప్పారు. పుతిన్ ఇంటిని ఉక్రెయిన్ డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయనడానికి ఎలాంటి ఆధారాలు అమెరికా అధికారులకు లభించలేదన్నారు.

పారిశ్రామిక అవసరాల కోసం ఓర్వకల్లులో రూ.370 కోట్లతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు


ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమల నీటి అవసరాల కోసం 4,205 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం, 4 ఏళ్ల నిర్వహణకు రూ.370 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ స్పెషల్ ప్రాజెక్ట్స్ డెవలప్‌మెంట్ కంపెనీ, ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో దీన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సచివాలయంలో సమావేశమైంది. పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆన్‌లైన్‌లో హాజరు కాగా, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సచివాలయంలో సమావేశమయ్యారు. కోర్టు ఆదేశాలతో 62 ఏళ్ల వయో పరిమితితో 2,831 మంది ఉద్యోగులు ఇప్పటికే కొనసాగుతున్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థల ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంపై అధికారులతో ఉపసంఘం చర్చించింది.

ప్రభుత్వ వర్సిటీలు ర్యాంకులు మెరుగుపర్చుకోవాలి

- విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించే బోధన ఉండాలి
- వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో టాప్-100లో నిలిచేందుకు ప్రయత్నించాలని వర్సిటీల ఛాన్స్‌లర్, గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. రాష్ట్రంలోని 25 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 2025లో ఒక్క ఆంధ్ర వర్సిటీ మాత్రమే తొలి 50 స్థానాల్లో నిలిచిందని, ఆచార్య నాగార్జున టాప్-100లో ఉందని తెలిపారు. ఈ ర్యాంకులు రాష్ట్ర వర్సిటీలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని వెల్లడించారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. "ఏపీలో ఉన్నత విద్య ప్రస్తుత స్థితి, భవిష్యత్తులో మరింత బలోపేతం కావడానికి ఏం చేయాలన్న దానిపై దృష్టిసారించడానికి ఈ సమావేశం చక్కటి వేదిక. రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీలు, కళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగి, యువత ఉన్నత విద్య ప్రవేశానికి మార్గం సుగమమైంది. వర్సిటీలు బోధన కేంద్రాలే కాదు.. అవి జ్ఞానం సృష్టించే ఇంజిన్లుగా వ్యవహరించాలి. ఇప్పుడు మనం అసాధారణ సాంకేతిక పురోగతి యుగంలో జీవిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం డిగ్రీ సంపాదన కాదు. విద్యార్థుల్లో ఆలోచనలు, నైతిక విలువలు పెంపొందించే వాతావరణాన్ని సృష్టించడానికి వర్సిటీలు కృషి చేయాలి" అని సూచించారు.

విద్య అంటే మెదడును నింపడం కాదు

"ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి తన చదువును ధైర్యంగా.. నైపుణ్యంతో పూర్తి చేసేలా సహాయం చేయడం వర్సిటీల ముందున్న సవాల్. స్వామి వివేకానంద చెప్పినట్లుగా విద్య అంటే మెదడును నింపడం కాదు. మనసుకు శిక్షణ ఇవ్వడం. సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. కేవలం పాఠాలు కంఠస్థం చేయడం కాదు.. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి తెలుసుకునేలా బోధన ఉండాలి" అని గవర్నర్ తెలిపారు.

"పేద విద్యార్థులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సంక్షేమ పథకాల ద్వారా చర్యలు చేపట్టింది. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా.. విద్య అంతిమ లక్ష్యం నైపుణ్యం, నిపుణత కలిగిన మంచి మనుషులను తయారు చేయడం. వైస్ ఛాన్స్‌లర్ల నాయకత్వం సంస్థలను తీర్చిదిద్దుతుంది. ఏపీ భవిష్యత్తు.. వసతులు, ఆర్థిక పెట్టుబడులపైనే కాకుండా మానవవనరుల బలోపేతంపైనా ఆధారపడి ఉంటుంది. ఈ లక్ష్య సాధనలో వర్సిటీలు ప్రధాన కేంద్రాలుగా నిలవాలి. ఏపీ ఉన్నత విద్యా రంగం రానున్న దశాబ్దాల సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటుందనే నమ్మకం ఉంది" అని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

విద్యార్థులతో ఓపెన్ హౌస్ నిర్వహించాలి

- విద్యా విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలి
- వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: వైస్ ఛాన్స్‌లర్లు ప్రతివారం కొన్ని గంటలైనా విద్యార్థులతో నేరుగా మాట్లాడే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. విద్యార్థుల అనుభవాలను పట్టించుకోని వర్సిటీ ఎంత ప్రతిష్ఠాత్మకమైనదైనా.. సమయానుకూలత కోల్పోతే ప్రమాదమని పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. "ప్రపంచ స్థాయి పబ్లిక్ విశ్వవిద్యాలయాలు మన లక్ష్యం. ఈ సరికొత్త ప్రయాణం ఈ రోజు నుంచే ప్రారంభం కావాలి. వైస్ ఛాన్స్‌లర్ల స్వతంత్రతను పరిరక్షిస్తాం. ప్రతిభను గుర్తిస్తాం. విద్యా రంగాన్ని నడిపించే నాయకులు.. సంస్కరణలకు అంబాసిడర్లుగా పనిచేయాలి. వర్సిటీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. యువతకు ఏది అవసరం, మనం ఏం నేర్పుతున్నాం అనేదాన్ని పరిశీలించాలి. రాబోయే పదేళ్లలో వచ్చే ఉద్యోగాల్లో.. 80% ఇప్పటికీ తెలియని రంగాల్లో ఉండబోతున్నాయి. విద్యా విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలి" అని సూచించారు.

యువతకు జవాబు చెప్పేందుకే..

"చాలామంది యువత ఉన్నత విద్య పూర్తి చేసి, బయటకొచ్చినప్పుడు గందరగోళంలో ఉంటున్నారు. విద్యార్థులు, యువత ప్రశ్నలకు జవాబు చెప్పేందుకే సవాళ్లతో కూడిన విద్యాశాఖ తీసుకున్నా. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు.. ఒక కీలక రాజకీయ ప్రముఖుడు హెచ్‌ఆర్‌డీ శాఖ చేపట్టడం మొదటిసారి చూశానన్నారు. ఏపీలో విద్యారంగ అభివృద్ధిపై మాకున్న నిబద్ధతకు ఇదే నిదర్శనం. పాతకాలపు పాఠాలు బోధించడాన్ని కొనసాగిస్తే సమయాన్ని వృథా చేయడమే కాదు.. పిల్లలకు ద్రోహం చేసినట్లవుతుంది. బోధనను జీవిత అవసరాలతో అనుసంధానించాలి. వర్సిటీలు విద్య, ఉపాధి మధ్య వారధిగా మారాలి. పరిశోధన వర్సిటీ ఆత్మ. ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పేటెంట్లు, టెక్నాలజీ బదిలీ.. విద్యా వ్యవస్థ విస్తరణకు దోహదపడాలి" అని వెల్లడించారు.

ఐదు అంశాలపై దృష్టి సారించాలి..

విశ్వవిద్యాలయాల బలోపేతానికి ఉన్నత విద్యలో ఐదు అంశాలపై దృష్టి సారించాలని భావిస్తున్నానని మంత్రి తెలిపారు.

★ బోధన, అవసరాల మధ్య వ్యత్యాసం.. ఈ రోజు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు నాణ్యతా ప్రమాణాలు లేని విద్య. డిగ్రీలకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ తక్కువగా ఉంది. కాలానుగుణంగా పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో మార్పులు చేపట్టడంపై వీసీలు దృష్టిపెట్టాలి.

★ ఉద్యోగావకాశాలు లేని డిగ్రీలు.. ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, నియామకాల వ్యవస్థలు లేకపోవడంతో మనమిచ్చే డిగ్రీలకు విశ్వసనీయత తగ్గుతోంది. పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం అంతంతమాత్రంగా ఉండటంతో మరింత కష్టతరంగా మారుతోంది.

★ ప్రయోజనం లేని పరిశోధనలు.. పరిశోధన, ఆవిష్కరణ, జ్ఞాన ప్రభావం మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. మన సంస్థల్లో ఆవిష్కరణలు, స్టార్టప్ ఎకో సిస్టమ్‌లు బలహీనంగా పనిచేస్తున్నాయి

★ అధిక సమయం పరిపాలనా అంశాలపై వెచ్చిస్తున్నారు.. అకడమిక్ ప్రమాణాలపై మరింత సమయం కేటాయించాలి. అధ్యాపకుల సామర్థ్యాన్ని పెంచాలి. నిర్ణయాలు పాత పద్ధతులు అనుసరించి కాకుండా డాటా ఆధారంగా ఉండేలా చూసుకోవాలి.

★ విద్యార్థుల అనుభవంలో సమానత్వం, నిలకడ లోపిస్తోంది.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు మార్గదర్శకత్వం, సంక్షేమం, మానసిక మద్దతులేమి పెద్ద సవాలుగా ఉంది.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

- ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా ఆదేశించారు. పబ్లిక్ పరీక్షలు, ఇంటర్మీడియట్ విద్యలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు రెండు విడతలుగా ప్రయోగ పరీక్షలు జరుగుతాయి. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వీటిని బోర్డులోని కార్యాలయానికి అనుసంధానం చేయాలి. పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వరకు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను పెడతాం. రాష్ట్ర కార్యాలయం నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తాం. ఈసారి మొదటి ఏడాది పరీక్షలు అనేక మార్పులతో జరగనున్నాయి. కొత్త మార్పులను అందరూ జాగ్రత్తగా అర్థం చేసుకొని విధులు నిర్వర్తించాలి" అని సూచించారు.

133 మంది కుక్‌లు, కమాటీల నియామకానికి ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో 133 మంది కుక్‌లు, కమాటీలను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా నియమించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పొరుగు సేవల కింద వీరిని నియమించనున్నారు.



మీ ఎంపికలపై తస్మాత్ జాగ్రత్త

మీరు పుస్తకాలను ఎంచుకొనేటప్పుడు, సోషల్ మీడియాలో ఇతరులను ఫాలో అయ్యే ముందు, కొత్త స్నేహితులను స్వీకరించే సమయంలో ఓ విషయాన్ని గుర్తు పెట్టుకోండి. ఇప్పటి మీ ఎంపికలు భవిష్యత్తులో మీ ఆలోచనలను ప్రభావితం చేయబోతున్నాయని తెలుసుకోండి. మీ భవిత ఉన్నతంగా ఉండాలంటే, ఉన్నతమైన ఆలోచనలకు ప్రేరణనిచ్చే వాటినే ఎంచుకోండి.

– జేమ్స్ క్లియర్, రచయిత

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. పాలకొల్లు దంపతుల దుర్మరణం

- కుమారుడు, కుమార్తెకు తీవ్రగాయాలు
- స్వదేశం వచ్చి తిరిగి వెళ్తుండగా దుర్ఘటన



ఆశ, కృష్ణకిశోర్ దంపతులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కొటికలపూడి కృష్ణకిశోర్(50), ఆశ(45) దంపతులు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వారి కుమారుడు సుధై, కుమార్తె శివాని అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భారత కాలమాన ప్రకారం ఆదివారం ఉదయం ప్రమాదం సంభవించగా అర్ధరాత్రి తమకు సమాచారం అందినట్లు పాలకొల్లులోని కుటుంబసభ్యులు తెలిపారు. గత నెల 24న కృష్ణకిశోర్ కుటుంబ సమేతంగా స్వదేశానికి వచ్చారు. పాలకొల్లులో నాలుగురోజులు ఉన్నారు. నూతన సంవత్సర వేడుకల కోసం 29న దుబాయ్ వెళ్లారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లాల్సి ఉండగా వారు తాము ఎక్కాల్సిన విమానాన్ని అందుకోలేకపోయారు. మరో విమానంలో వాషింగ్టన్ డీసీ వరకు వెళ్లారు. అక్కడి నుంచి ఛార్లెట్‌కు కారులో బయల్దేరగా మధ్యలో ట్రక్కు ఢీకొట్టింది. ట్రక్కు డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని అమెరికా పోలీసులిచ్చిన నివేదికలో నిర్ధారణ అయిందని కృష్ణకిశోర్ సమీప బంధువు కృష్ణ చెప్పారు. బాధిత కుటుంబాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు ఫోన్‌లో పరామర్శించారు. మృతదేహాలను పాలకొల్లు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ద్వారా మంత్రి ప్రయత్నిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన కృష్ణకిశోర్ కుటుంబం సహా 18 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్నారు.

దిల్లీ అల్లర్ల కేసు నిందితులు

ఉమర్, షర్జీల్‌కు బెయిల్ నిరాకరణ

- నేరారోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయి
- తీర్పులో సుప్రీంకోర్టు వెల్లడి
- ఐదుగురికి షరతులతో బెయిల్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ అల్లర్లకు (2020)కు కుట్ర పన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని పేర్కొంటూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్, మరో విద్యార్థి నేత షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. వారి పిటిషన్లను తోసిపుచ్చింది.

ఇదే కేసులో మరో ఐదుగురు నిందితులు... గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్, మహ్మద్ సలీం ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. వీరందరూ ఐదేళ్లుగా జైళ్లలోనే ఉన్నారు. అల్లర్ల వెనుక ఉన్న భారీ కుట్రలో ఉమర్ ఖాలీద్, షర్జీల్ ఇమామ్‌ల పాత్ర 'అత్యంత కీలకం' అని, మిగిలిన నిందితులతో పోలిస్తే వీరిపై ఉన్న ఆరోపణల తీవ్రత వేరని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం తీర్పులో స్పష్టం చేసింది. దిల్లీ అల్లర్ల కేసుకు సంబంధించి డిసెంబర్ 10న ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచి సోమవారం దానిని వెలువరించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపీఏ) వంటి కఠిన చట్టాల కింద కేసులు ఉన్నప్పుడు జైల్లో ఎక్కువ కాలం ఉన్నారనే కారణంతో బెయిల్ ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణలో జాప్యం జరగడాన్ని సాకుగా చూపి చట్టం నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించింది. ప్రాసిక్యూషన్ ఆధారాలపై సంతృప్తి వ్యక్తం చేసింది.

ఉమర్, షర్జీల్‌కు బెయిల్ నిరాకరణపై వివిధ ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం తదితర వామపక్ష పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఐదేళ్లుగా నిందితులకు బెయిల్ నిరాకరించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నాయి. అత్యాచారం కేసులో దోషిగా తేలిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను 15వ సారి పెరోల్‌పై విడుదల చేశారని, ప్రజల హక్కుల కోసం పోరాడిన వారికి బెయిల్ కూడా లభించడంలేదని వివిధ ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి.

గ్రహం అనుగ్రహం

6-1-2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం

తదియ: ఉ. 11-34 తదుపరి చవితి
ఆశ్లేష: సా. 4-12 తదుపరి మఖ
వర్జ్యం: ఉ. 6-49 వరకు
తిరిగి తె. 4-08 నుంచి 5-43 వరకు
అమృత ఘడియలు: మ.2-38 నుంచి 4-12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-48 నుంచి 9-31 వరకు
తిరిగి రా. 10-47 నుంచి 11-39 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.36
సంకట హర చతుర్థి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	25.0
హైదరాబాద్	15.6	27.2
శ్రీకాకుళం	17.0	28.0
రాజమహేంద్రవరం	17.0	33.0
కర్నూలు	17.2	30.7
అనంతపురం	17.2	30.9
కడప	18.0	28.0
గుంటూరు	18.0	29.0
విశాఖపట్నం	18.6	29.0
తిరుపతి	18.6	29.2
తాడేపల్లిగూడెం	19.0	29.0
విజయవాడ	19.8	29.0
ఒంగోలు	20.6	29.7
నరసాపురం	21.2	30.2
నెల్లూరు	21.6	28.2







ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఆకట్టుకున్న కళాకారుల నృత్యప్రదర్శన



చివరి రోజు మహాసభలకు భారీగా హాజరైన భాషాభిమానులు

మాతృభాషలో చదువుకుంటేనే రాణింపు

(మొదటి పేజీ తరువాయి)

సంస్కృతికి వారధి. మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు పెద్దఎత్తున జనం రావడం సంతోషంగా ఉంది. మాతృభాషకు ఇచ్చే గౌరవ వందనమే ఈ సభలు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్ పేరుతో వేదిక ఏర్పాటు చేయడం హర్షణీయం. తెలుగుకు ఘన చరిత్ర ఉంది. వందల భాషలు ఉన్నా మన దేశంలో ఆరింటికి మాత్రమే ప్రాచీన హోదా లభిస్తే, అందులో తెలుగు ఉండటం మనందరికీ గర్వకారణం. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత తెలుగు ఎక్కువగా మాట్లాడుతున్నారు. ప్రపంచంలో పదికోట్ల మంది తెలుగు మాట్లాడుతుంటే, ఈ సభలకు 40 దేశాల నుంచి ప్రతినిధులు రావడం హర్షించదగ్గ విషయం. ఇలాంటి సభలు తెలుగు భాష పరిరక్షణ, గొప్పతనాన్ని చాటేందుకు ఉపయోగ పడతాయి.

తెలుగు వెలుగులకు వారే కారణం

తెలుగు రచనలంటే మనకు గుర్తొచ్చేది ఆదికవి నన్నయ మహాభారతం. కవిత్రయం నుంచి అష్టదిగ్గజాల వరకు గురజాడ నుంచి శ్రీశ్రీ, దాశరథి వరకు ఎందరో మహానుభావులు భాషాభివృద్ధికి కృషి చేశారు. పోతన భాగవతం, శ్రీనాథుడు భీమఖండం.. అన్నమయ్య, రామదాసు, వెంగమాంబ, మొల్ల భక్తిమార్గంలోనూ తెలుగుకు వన్నె తెచ్చి విశ్వవ్యాప్తం చేశారు. విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ.. జ్ఞానపీఠ్ అవార్డులతో ఖ్యాతి పెంచారు. గ్రాంథిక భాషగా ఉన్న తెలుగును వ్యవహారికంగా మార్చిన గిడుగు కృషిని మరువలేం. తెలుగువారిని మదరాసీలని పిలుస్తున్న కాలంలో నేను తెలుగువాణ్ని, నాది తెలుగుదేశం అంటూ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. దేశంలో మొట్టమొదటిసారి భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేందుకు పదవిని త్యాగం చేసిన బూర్గుల కృష్ణారావు ఎప్పుడూ గుర్తుంటారు. 'ఈనాడు' పత్రిక ద్వారా తెలుగుభాష కోసం కృషి చేసిన రామోజీరావును తెలుగుజాతి మరవదు. దేశంలో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన పీవీ నరసింహారావు మన తెలుగువారే. నికోలస్ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని గుర్తించినా, తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి తెలుగు తియ్యదనాన్ని కీర్తించినా అది మన అమ్మభాష ఘనతే. దేశభాషలందు తెలుగు లెస్స అన్న శ్రీకృష్ణదేవరాయలు మాట మనం గుర్తుంచుకోవాలి. తెలుగుభాషా పరిరక్షణతో మన జాతి ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి' అని చంద్రబాబు కోరారు.

ఆయనది ఆత్మగౌరవం.. నాది ఆత్మవిశ్వాసం..

ఎన్టీఆర్ ఆత్మగౌరవాన్ని ప్రబోధిస్తే.. నేను ఆత్మగౌరవంతో సమానంగా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లమని పిలుపునిచ్చా. ఆ ఒక్క పిలుపుతో ఏ రాజకీయ నాయకుడికీ ఇవ్వనంత గౌరవాన్ని నాకు ఇచ్చారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా పనిచేయగలిగా. జీవితాంతం తెలుగువారికి రుణపడి ఉంటా. తెలుగు జాతికి రెండు రాష్ట్రాలు ఉన్నాయి. తెలుగుజాతి అభివృద్ధికి నేను కృషి చేస్తా. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన వ్యక్తి పీవీ నరసింహారావు అయితే.. ఆ రోజుల్లో ఐటీని అందిపుచ్చుకున్న ఘనత తెలుగుజాతిదే. అన్ని దేశాల్లో జనాభా తగ్గి వృద్ధులు పెరుగుతుంటే.. మన దేశంలో 2047 వరకు యువశక్తితో అలరారనుండటం గొప్ప విషయం. భారతదేశం అన్నింటా ముందుండాలన్న విజన్‌తో అడుగేస్తున్న సమర్థ నాయకుడు నరేంద్రమోదీ. ప్రపంచంలో ఎక్కడైనా తెలుగు జాతి నంబర్‌వన్‌గా ఉండాలన్నది నా సంకల్పం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం

తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో తెలుగు చదివే వారున్నారు. మాతృభాష అమ్మతో సమానం. అమ్మభాషలో చదువుకున్న వారు అత్యున్నతంగా రాణిస్తారు. ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై అనేక కార్యక్రమాలు నిర్వహించడం, అవార్డులు ఇవ్వడం శుభపరిణామం. 1911లో చెన్నైలో నాటిన చిన్న విత్తనం ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఇప్పుడు తెలుగు భాషకు, జాతికి చేస్తున్న మేలు అభినందనీయం. 2027 సభలను మారిషస్‌లో పెడుతుండటం గర్వకారణం. దేశంలో జాతీయ భావన పెరగాలి. ఒకరి భాషను మరొకరు గౌరవించాలి. ఇది దేశ ప్రజల మధ్య ఐక్యత తెస్తుంది. ఒక భాష తక్కువ, మరొకటి ఎక్కువ కాదు. పిల్లలకు మాతృభాషపై ఇష్టం, ప్రేమ పెరిగేలా తల్లిదండ్రులు చొరవ చూపితే అప్పుడు ప్రతి ఇంట్లోనూ మన తెలుగు ఉంటుంది. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు పేరిట తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం' అని చెప్పారు.

ఈ సభలకు వచ్చిన వారికి ఓడీ వెసులుబాటు: సీఎం చంద్రబాబు

- ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఓడీ (ఆన్ డ్యూటీ) సౌకర్యం కల్పిస్తాం. ఇలాంటి మంచి కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆన్‌డ్యూటీగా ట్రీట్ చేస్తాం.
- కళాకారులు, రచయితలు ఇలాంటి సభలు, కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశం పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.
- 20 సంవత్సరాలుగా మా కుటుంబమంతా నారావారి పల్లెలో సంక్రాంతి చేసుకుంటున్నాం. సిటీల్లో ఉన్నవాళ్లంతా పల్లెబాట పడతారు. మనం ఆదర్శంగా ఉండాలి. తెలుగు పండుగలు చేసుకోవాలి. కళాకారులను ప్రోత్సహించాలి.
- భారతీయ సంస్కృతి గొప్పది. వేరే దేశాల్లో విడాకులు స్వేచ్ఛగా ఇచ్చుకుంటారు. మనం పెళ్లి స్వర్గంలో నిర్ణయమవుతుంది అనుకుంటాం. విడాకుల మాట రాకూడదనేది భారత సంప్రదాయం. కుటుంబ వ్యవస్థను కాపాడుకునే ఏకైక దేశం భారత్. సంపద అవసరం కానీ అదే సమయంలో విలువలు అవసరం. విలువలు నేర్పేది సంస్కృతి, దానికి భాష మూలం. వీటిని కాపాడుకుందాం.

కలిసి ఎదుగుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ విప్లవం ప్రపంచంలో మన స్థానాన్ని ఎలా నిలబెట్టిందో వివరించారు. తెలుగువారు ప్రపంచంలోనే అగ్రశ్రేణికి ఎదగాలంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎలా సహకరించుకోవాలో దిశానిర్దేశం చేశారు. 'హిందీ తర్వాత రెండు రాష్ట్రాలు ఉన్నది తెలుగువారికే. రెండు రాష్ట్రాలున్నా తెలుగే మనకు మాతృభాష. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లగలం. సాగర్ (కృష్ణా) జలాలు ఉపయోగించుకోవాలని, అటు ఎస్‌ఎల్‌బీసీ, ఇటు ఎస్‌ఆర్‌బీసీ నిర్మాణం చేపట్టి సాగునీటికి దారి చూపిన నాయకుడు ఎన్టీఆర్. ఆ తర్వాత కల్వకుర్తి, ఏఎంఆర్ ఎత్తిపోతల, నెట్టెంపాడు పథకాలు, తెలంగాణలో కృష్ణా నదిపై ప్రాజెక్టులు పూర్తి చేశా. కృష్ణా డెల్టాలో ఆధునికీకరణ చేపట్టి 20 టీఎంసీల నీళ్లు పొదుపు చేసి, వాటిని తెలంగాణకు కేటాయించి బీమా ఎత్తిపోతల పథకం పూర్తి చేశాం. గోదావరిపై తెలంగాణలో గుత్ప, అలీసాగర్, దేవాదుల.. ఆంధ్రప్రదేశ్‌లో పుష్కర, చాగల్నాడు, తాడిపూడి ఎత్తిపోతల పథకాలు నిర్మించాం. 2014లో పట్టిసీమ ఎత్తిపోతలతో కృష్ణా డెల్టాకు నీళ్లు తెచ్చాం. విభజన తర్వాత హైదరాబాద్ తెలంగాణకు వెళ్తే.. ఏపీకి అమరావతి, పోలవరం కట్టుకుంటున్నాం. అమరావతిని ఈ రోజు ప్రజారాజధానిగా మారుస్తాం. ప్రపంచానికే ఒక నమూనాగా తయారు చేద్దాం' అన్నారు.

ఐకమత్యమే బలం కావాలి

'కిందటి ఏడాది కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీలు సముద్రంలో కలిసిపోయాయి. గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. తెలంగాణ రాష్ట్రం వాటిని వాడుకుంటే మేమెప్పుడూ అడ్డు చెప్పలేదు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడూ కాదనలేదు. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా పర్వాలేదు, మన రాష్ట్రానికీ నీళ్లు వస్తాయని ముందుకెళ్లా. గడిచిన 40 సంవత్సరాల్లో ఏటా 3,000 టీఎంసీల నీళ్లు గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లిపోయాయి. పోలవరం పూర్తవుతుంది. కృష్ణా, గోదావరి అనుసంధానం జరుగుతుంది. ఉన్న నీటివనరులను పూర్తిగా వినియోగించుకోని దేశం మనదే. దేశంలో నీటి సమస్య పూర్తిగా పరిష్కారం కావాలనేది నా అభీష్టం. ఇందుకోసం నదుల అనుసంధానం జరగాలని.. గంగా, కావేరి నదులు కలవాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా. ఏపీలో నదులన్నీ కలపాలి. తెలంగాణలో గోదావరి నీళ్లు అవసరమైనన్ని వాడుకోవాలి. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు- ఐకమత్యం అవసరం. ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

2047 నాటికి మనది నం.1 జాతి కావాలి

నా జీవితాశయం ఒక్కటే. నీటి విషయంలో, ఇతరత్రా అంశాల్లో తెలుగువారంతా కలిసి ఉండాలి. ప్రపంచంలో ఎక్కడున్నా మనకు గుర్తింపు తెలుగు భాష ఒక్కటే. ఆ భాష ముందుకెళ్లాలంటే.. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్ కావాలంటే మనకు ఐకమత్యం అవసరం. తెలుగువారికే రెండు రాష్ట్రాలు ఉండటం మనకు గౌరవం. దాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్లాలి. ఇజ్రాయెల్‌లో యూదులు కోటి మంది కూడా లేకపోయినా ప్రపంచంలోనే శక్తిమంతమైన వారిగా ఉన్నారు. 2047 నాటికి వారిని కూడా అధిగమించి తెలుగుజాతి నంబర్ వన్ కావాలనేది నా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు.

ఉంగరాల స్వామీ.. బంగారం ఏదీ!

- ప్రజలను మోసం చేసిన ఆశ్రమం నిర్వాహకులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మీ ఇంట్లో ఉన్న బంగారాన్ని తీసుకొచ్చి పూజలో పెట్టండి.. ఏడాదిలో రెట్టింపు బంగారం కొనుగోలు చేస్తారంటూ ఓ స్వామీజీ చెప్పడంతో ప్రజలు గుడ్డిగా నమ్మారు. పెద్ద సంఖ్యలో బంగారం, నగదు ఆయనకు అందజేశారు. తీరా స్వామీజీ అనారోగ్యంతో కన్నుమూయగా ఆయన కుటుంబ సభ్యులు, మనవడు సొత్తు తీసుకొని ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చోటు చేసుకుంది. మదనపల్లెలోని బసినికొండ గ్రామంలో వెంకటశాస్త్రి అనే వ్యక్తి ఉంగరాల స్వామిగా పేరొందాడు. సొంతంగా కేదారేశ్వర ఆలయాన్ని నిర్మించి అక్కడే ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన మనవడు తరుణ్, మరికొందరు ఈ ఆశ్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా 42 రోజుల పాటు బంగారాన్ని తమ ఆశ్రమంలో ఉంచి పూజలు చేస్తే, ఏడాది తిరిగేసరికి వారు రెట్టింపు బంగారాన్ని కొనగలుగుతారంటూ కొన్నాళ్లుగా వెంకటశాస్త్రి, తరుణ్ ప్రచారం నిర్వహించారు. దీంతో మదనపల్లెతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు 3 కిలోల బంగారం, రూ.కోటి వరకు నగదును ఆశ్రమంలో పెట్టారు. రెండు నెలల క్రితం వెంకటశాస్త్రి (62) అనారోగ్యంతో మృతి చెందారు. అనంతరం స్వామీజీ కుటుంబ సభ్యులు మొత్తం సొమ్ముతో పరారయ్యారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ ధీరజ్‌ను ఆశ్రయించారు. స్వామీజీ పరిచయం చేసిన వారిని నమ్మి 19.40 గ్రాముల బంగారు, రూ.59 వేలు నగదు ఆశ్రమంలో పెట్టామని మదనపల్లె మండలం బసినికొండకు చెందిన లావణ్య విలపించారు. 90 గ్రాముల బంగారు, రూ.70 వేలు నగదు స్వామీజీకి ఇస్తే, కుటుంబ సభ్యులు ఎత్తుకుపోయారని తమిళనాడు రాష్ట్రం పల్లిపట్టుకు చెందిన రామ్మూర్తి వాపోయారు.



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

ఓఎన్‌జీసీ బావిలో భారీ బ్లోఅవుట్



భారీ మంటలకు కాలిపోయిన కొబ్బరి చెట్లు

(మొదటి పేజీ తరువాయి)

గ్యాస్ భారీగా ఎగజిమ్మింది. బ్లోఅవుట్ ప్రివెంటర్(బీవోపీ)ను నియంత్రించే స్థాయిని మించి అది బయటకు రావడంతో సిబ్బంది వెంటనే అక్కడినుంచి బయటకువచ్చేశారు. బీవోపీ వద్ద రాపిడికి అగ్నికీలలు, రెండు సార్లు పేలుళ్లు తోడవడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం భగ్గుమంది. గ్యాస్‌తో పాటు మంటలు ఒకేసారి వ్యాపించి ఉంటే అక్కడ పనిచేస్తున్న వారికి ప్రాణనష్టం జరిగేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు



లక్కవరం ఎంజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు

ఓఎన్‌జీసీ బావి నుంచి గ్యాస్ భారీగా లీకైనప్పుడే అధికారులు అప్రమత్తమయ్యారు. 2100 మంది జనాభా కలిగిన ఇరుసుమండ గ్రామానికి హెచ్చరికలు జారీ చేశారు. ఇళ్లను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అక్కడి పాఠశాలలు మూసివేశారు. లక్కవరంలో మూడుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి భోజన వసతి కల్పించారు. కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా, ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, తెదేపా రాజోలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాత్రి 10 గంటల వరకు కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలానికి సమీపంలోనే ఉండి సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

20 నుంచి 40 వేల క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిల్వలున్నాయ్

'బ్లోఅవుట్ నేపథ్యంలో అందులో గ్యాస్ నిల్వలు 20-40 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఉండవచ్చని సంబంధిత అధికారులు అంచనా వేశారు. 24 గంటల్లోగా మంటలు అదుపులోకి రాకపోతే బావి మూత(వెల్‌క్యాప్) ద్వారా అరికట్టేందుకు సంబంధిత బృందాలు చర్యలకు సిద్ధమవుతాయి. మంటలను ఆర్పేందుకు దగ్గరలో ఉన్న గూడపల్లి-1 కాలువ నుంచి నీటిని మళ్లించేందుకు గుర్తించాం. బ్లోఅవుట్ నియంత్రణలో భాగంగా ఓఎన్‌జీసీకి అన్నివిధాలా సహకారమందిస్తున్నాం. అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నాం' అని కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు.

నష్టం రూ.వందల కోట్లలోనే..

ఇరుసుమండ బ్లోఅవుట్ నష్టం రూ.వందల కోట్లలో ఉండొచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అగ్నికీలల్లో రిగ్, అందులోని లాగింగ్ టూల్, భారీ వాహనాలు కాలి బూడిదయ్యాయి. అవన్నీ డీప్ ఇండస్ట్రీస్‌కు చెందినవే. ఎగసిపడే అగ్ని కీలలతో సమీపంలో సుమారు 500 వరకు కొబ్బరి చెట్లు కాలిపోయాయని.. పంటలు, ఆక్వా సాగుకు భారీగానే నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాతే నష్టంపై స్పష్టత రానుంది.

ఇప్పటికిప్పుడు నియంత్రణ కష్టమే..

గ్యాస్ బావి నుంచి మధ్యాహ్నం ఎగసిపడిన అగ్నికీలలు రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. బావిలో గ్యాస్ పీడన స్థాయి తగ్గే వరకు మంటలను అదుపు చేయడం కష్టమేనని అధికార వర్గాలంటున్నాయి. దీనికి ఎన్నిరోజులు పడుతుందన్నది స్పష్టత రావాల్సి ఉంది.

రంగంలోకి ఓఎన్‌జీసీ, అగ్నిమాపకశాఖ అత్యాధునిక వాహనాలు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే-మామిడికుదురు: ఇరుసమండలో బ్లోఅవుట్ సమాచారం తెలిసిన వెంటనే ఓఎన్‌జీసీతో పాటు అగ్నిమాపకశాఖ అప్రమత్తమయ్యాయి. మంటలు అదుపు చేయడానికి, స్థానికంగా రక్షణ చర్యలకు అగ్నిమాపకశాఖ రెండు అడ్వాన్స్‌డ్ వాటర్ టెండర్లతో సహా మరో నాలుగు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచింది. 8 మంది అధికారులతో కూడిన 50 మంది సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఓఎన్‌జీసీ కూడా అడ్వాన్స్‌డ్ వాటర్ టెండర్, మల్టీపర్పస్ వాటర్ టెండర్, మరో వాహనంతో 20 మంది అధికారులు, 60 మంది ఫైర్ సిబ్బందిని బ్లోఅవుట్ ప్రాంతానికి పంపించింది. వారికి అదనంగా మరో 20 మంది ఇంజినీర్లను నరసాపురం యూనిట్ నుంచి పంపించింది. వీరంతా ఘటనా స్థలంలో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు.

50 డిగ్రీల పైనే వేడి..

బ్లోఅవుట్ ప్రాంతం నుంచి అర కిలోమీటరు వరకు 50 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎప్పుడూ చల్లగా ఉండే కోనసీమ ఒక్కసారిగా వేడి గాలులతో నిండిపోయింది. ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే సమీప గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి అప్రమత్తం చేశారు.

విదేశీ నిపుణుల సాయం

ఇరుసుమండలోని మోరి-5 డ్రిల్లింగ్ బావిలో పరిస్థితిని నియంత్రించేందుకు విపత్తు నిర్వహణ బృందాలను రంగంలోకి దింపినట్లు ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు దిల్లీ నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా అనుభవం ఉన్న నిపుణులతో సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరినీ అక్కడకు రానీయకుండా శీతలీకరణ కార్యకలాపాలు చేపట్టామని వివరించారు.

ప్రమాదంపై సీఎం ఆరా

ఈనాడు, అమరావతి: గ్యాస్ లీకేజీ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, అధికారులతో సీఎం మాట్లాడారు. సమీప గ్రామాలకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా చూడాలని, సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించాలని ఆదేశించారు. మంటలను వెంటనే అదుపులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు, ఓఎన్‌జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.

ప్రజలకు నష్టం లేకుండా చర్యలు: పవన్

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే దేవవరప్రసాద్‌లతో మాట్లాడి ప్రమాద తీవ్రత, సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, సామాజిక మాధ్యమాల్లో వదంతులు రాకుండా కట్టడి చేయాలని, కొబ్బరి తోటల్లోకి మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ సూచించారు. సహాయక శిబిరాల్లో మందులు ఉంచాలని, అందరికీ దుప్పట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.



బ్లోఅవుట్ సమీపంలో కొబ్బరి చెట్లను నీళ్లతో తడుపుతున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

విచారణార్హతే సమస్య

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేసింది. తెలంగాణ రిట్ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జైదీప్ గుప్తా సుదీర్ఘ వాదనలు వినిపించారు. వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వానికి వెళ్లే అంశాన్ని పరిశీలించాలని ఇరు రాష్ట్రాలకు సీజేఐ సూచించారు.

ట్రైబ్యునల్ తీర్పును ఏపీ ఉల్లంఘించింది: సింఘ్వీ

అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ... ''ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి ట్రైబ్యునల్ జరిపిన నీటి కేటాయింపుల్లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 968 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి పరీవాహక ప్రాంతానికి 484.5 టీఎంసీల వాటా దక్కుతుంది. ఆ తీర్పును ఆంధ్రప్రదేశ్ ఉల్లంఘించడంతోపాటు సీడబ్ల్యూసీ, జలశక్తి శాఖల ఆదేశాలను ధిక్కరిస్తూ తనకు హక్కున్న 484.5 టీఎంసీలకు మించి వరద జలాల పేరుతో మరో 200 టీఎంసీలను అదనంగా తరలించే యత్నాలు మొదలుపెట్టింది. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండానే డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచింది. సమస్యపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం జనవరి 2న ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి... 3 నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అప్పటి వరకైనా ఏపీ చర్యలపై స్టే విధించండి" అని కోరారు.



మా అంతర్గత అవసరాలకే ముందుగా ప్రాజెక్టు నివేదిక తయారీ: ముకుల్ రోహత్గీ

సింఘ్వీ వాదనలను ముకుల్ రోహత్గీ తోసిపుచ్చారు. "మా అంతర్గత అవసరాల కోసం 3 నెలలు ముందుగా ప్రాజెక్టు నివేదికను తయారు చేసుకుంటే వారికి అభ్యంతరమెందుకు? కరవుపీడిత ప్రాంతాలకు వరద జలాలను తీసుకెళ్లాలనుకుంటున్నాం. మేం వాళ్ల నీటిని తీసుకోవడం లేదు. నదీ పరీవాహక ప్రాంతంలో దిగువనున్న మాకు వరద నీటిని వాడుకొనే హక్కు ఉంటుంది' ' అని పేర్కొన్నారు. సింఘ్వీ కోర్టుకు సమర్పించిన నోట్ సరిగా లేదని జైదీప్ గుప్తా చెప్పారు. పోలవరం, పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టులు వేర్వేరని, కానీ రెండింటినీ కలిపి చూపుతున్నారన్నారు. ఈ అంశం సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉందని, దానికి ఆమోదముద్ర వేసేంతవరకూ డీపీఆర్ సమర్పించలేమన్నారు. ఏపీ దరఖాస్తును సీడబ్ల్యూసీ తిరస్కరించిందని సుదర్శన్‌రెడ్డి చెప్పగా... అది అవాస్తవమని జైదీప్ గుప్తా పేర్కొన్నారు.


కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీకీ సమస్యలు చెప్పుకోవచ్చు: సీజేఐ

అంతర్రాష్ట్ర జలవివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ దాఖలు చేయడాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. "ఒకటికి మించిన రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదాలు తలెత్తినప్పుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఎలా ఆశ్రయించాలో రాజ్యాంగం చెబుతోంది. అందువల్ల రిట్ పిటిషన్ దాఖలు చేయొచ్చా? లేదా సూట్ దాఖలు చేయాలా? అన్న విషయాన్ని మాత్రమే పరిశీలిస్తున్నాం. ఇలాంటి అంశాల్లో ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హతే పెద్ద సమస్య. దానికి బదులు ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోండి. తెలంగాణకు గోదావరి ట్రైబ్యునల్ కేటాయించిన నీటి వాటాలకు ఇబ్బంది కలిగించకుండా, భవిష్యత్తులో ఎలాంటి అదనపు హక్కులు కోరబోమని చెప్పి ఏపీ కొత్త కాలువ నిర్మించుకుంటే ఏమవుతుంది? ఏపీ తలపెట్టిన కొత్త కాలువ నిర్మాణం కారణంగా తమ వాటా తగ్గిపోయే అవకాశం ఉందని తెలంగాణ వాదిస్తోంది. పోలవరం జాతీయ ప్రాజెక్టు. కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా అందులో మార్పులు, చేర్పులు చేయలేరు కదా! ఇరు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ముందుకెళ్లి మీ(తెలంగాణ) సమస్యలు చెప్పుకోండి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి మించిన మార్గం లేదనుకుంటే సివిల్ సూట్ దాఖలు చేయండి. అవసరమైతే అందులో మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలనూ పార్టీలుగా చేర్చండి" అని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. సింఘ్వీ స్పందిస్తూ... "ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులనూ నిలిపివేయాలంటూ ఆంధ్రప్రదేశ్‌కు సీడబ్ల్యూసీ చెప్పినా ఆపకపోవడం వల్లే ఆర్టికల్ 32 కింద ఈ కోర్టును ఆశ్రయించాం. మా రిట్ పిటిషన్‌లో కేంద్రం, సీడబ్ల్యూసీ ప్రతివాదులుగా ఉన్నాయి. సివిల్ సూట్ దాఖలు చేస్తే... రాష్ట్రాలకు సంబంధించిన విషయంలో మమ్మల్ని ఎలా పార్టీ చేశారని కేంద్రం ప్రశ్నించొచ్చు. ఇప్పుడు మాకు మధ్యంతర రక్షణ కల్పిస్తే... సివిల్ సూట్ వేసే అంశాన్ని పరిశీలిస్తాం" అని అన్నారు. సీజేఐ స్పందిస్తూ... "కేంద్రం వేసిన కమిటీ నిర్ణయాలు, సిఫార్సులు, అనుమతుల కోసం ఎదురుచూడకుండానే ఏపీ ముందుకెళ్లి ప్రజాధనాన్ని వృథా చేసుకుంటే ఎవరేం చేయగలరు? ఈ విషయంలో అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని కమిటీ జోక్యం చేసుకోవచ్చు" అని చెప్పారు. "ఈ విషయంలో సూట్ దాఖలు చేయడమే సరైందని ధర్మాసనం భావిస్తున్నట్లయితే ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేయండి. ఆలోపు మేం ఒక నిర్ణయానికి వస్తాం" అని ధర్మాసనానికి సింఘ్వీ విజ్ఞప్తి చేశారు. దీంతో కేసు విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. అదే సమయంలో వివాద పరిష్కారానికి ఇరు రాష్ట్రాలూ మధ్యవర్తిత్వం గురించి ఎందుకు ఆలోచించకూడదని ఆయన సూచించారు.

ఏపీ చర్యతో పరీవాహక ప్రాంతాలన్నింటిపైనా ప్రభావం: తెలంగాణ అడ్వొకేట్ జనరల్

తెలంగాణ అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ ఏపీ చర్య గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాలన్నింటిపైనా ప్రభావం చూపుతుందని పేర్కొనగా.. "అందుకే ఆర్టికల్ 131 కింద సూట్ దాఖలు చేయడం సరైందని మేం చెబుతున్నాం. ఇది విధానపరమైన వివాదం తప్ప ఏపీ, తెలంగాణలకే పరిమితమైన ప్రయోజనవిరుద్ధమైన వివాదం కాదు" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. ఒకవేళ మేం సూట్‌తో తిరిగివచ్చినా అందులో ఇలాంటి ఫిర్యాదులే ఉంటాయని సింఘ్వీ అనగా... సీజేఐ స్పందిస్తూ "అప్పుడు బహుశా రెండు పరిష్కార మార్గాలు ఉండొచ్చు. అందులో ఒకటి ప్రస్తుతం కేంద్రం వేసిన ఉన్నతస్థాయి కమిటీ తక్షణం ఇరు రాష్ట్రాలను సమావేశానికి పిలిచి నిర్ణయం తీసుకోవాలనడం" అని అన్నారు. వెంటనే పనులు ఆపేలా ఆదేశాలివ్వాలని సింఘ్వీ కోరగా... ఒకవేళ కమిటీ అలా భావిస్తే ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అంతకుముందు ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ... "నదీ పరీవాహక ప్రాంతంలో ఏపీ అందరికంటే దిగువన ఉంది. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటిని వాడుకొనే హక్కు ఉంది. వాటినే కరవు పీడిత రాయలసీమకు తీసుకెళ్లాలనుకుంటున్నాం. ఎవరి హక్కులనూ లాక్కోవడం లేదు" అని అన్నారు. ఒక దశలో ఏపీ ప్రభుత్వ న్యాయవాది జైదీప్ గుప్తా, తెలంగాణ అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఆవేశంగా వాదనలు వినిపించడానికి ప్రయత్నించినప్పుడు... వారిని సీజేఐ శాంతింపజేసే ప్రయత్నం చేశారు. "శీతాకాల సెలవుల తర్వాత వచ్చినందున అందరిలో చాలా శక్తి ఉంటుందని మాకు తెలుసు. నీళ్ల ఇంత శక్తిని ఎక్కడి నుంచి తెస్తున్నాయో" అని నవ్వుతూ అన్నారు.

ఇదీ సంగతి!



ఈనాడు

దేశానికి కృత్రిమ ఎరువుల కాటు

హరిత విప్లవానికి ముందు దేశీయంగా సాగు మొత్తం సంప్రదాయ పద్ధతుల్లోనే సాగేది. పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలు తీర్చే క్రమంలో అత్యధిక ఫలసాయం కోసం కృత్రిమ ఎరువుల వినియోగం అధికమై క్రమేణా విపరీతమైంది. దాంతో పంటపొలాల్లో నేడు సంక్షోభం ముమ్మరిస్తోంది. మానవ ఆరోగ్యానికీ తీవ్రహాని కలుగుతోంది. కృత్రిమ ఎరువులను మితిమీరి వాడుతుండటం వల్ల పంటల్లో ప్రమాదకర రసాయన అవశేషాలు పోగుపడి క్యాన్సర్లు, మూత్రపిండ వ్యాధులు, సంతానసాఫల్య సమస్యలు కోరచాస్తున్నాయని ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ నివేదిక మొన్నామధ్య స్పష్టీకరించింది. సాగు గతితప్పడం వల్ల పర్యావరణానికీ చేటు కలుగుతోందని హెచ్చరించింది. అవగాహన రాహిత్యంతో భారతీయ రైతులు చేలల్లో యూరియాను పరిమితికి మించి చల్లుతున్నారు. తెలంగాణలో చాలాచోట్ల దాని వాడకం 50నుంచి 100శాతం దాకా ఎక్కువగా ఉందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ అల్దాస్ జానయ్య తాజాగా వెల్లడించారు. దానివల్ల భూముల సహజ స్వభావంతో పాటు జలావరణం దెబ్బతింటోందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. రసాయన ఎరువుల వినియోగంలో అప్రమత్తత పాటించకపోతే ప్రజారోగ్యానికీ, రైతాంగ సంక్షేమానికీ ముప్పు తప్పదన్నది వాస్తవం!

కిందటి ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా పొలాల్లో దాదాపు ఏడు కోట్ల టన్నుల ఎరువులు వెదజల్లారు. అందులో సగానికి పైగా వాటా యూరియాదే! రాయితీలకు తోడు తక్కువ ధరకే లభిస్తుండటంతో మన అన్నదాతలు పెద్దమొత్తంలో దాన్ని పంటభూముల్లో గుమ్మరిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం ఇండియాలో యూరియా వినియోగం 2.66 కోట్ల టన్నులుంటే, 2024-25 నాటికి అంతకు 45శాతం మేర పెరిగింది. నిపుణుల సూచనల ప్రకారం ఎకరా జొన్నకు 96 కిలోలకు మించి యూరియా వాడకూడదు. కానీ, ఏపీలో కొన్నిచోట్ల నాలుగొందల నుంచి ఎనిమిది వందల కిలోల దాకా చల్లేస్తున్నట్లు పరిశీలనల్లో తేలింది. హరియాణా, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల్లోనూ ఇలాంటి దుస్థితే నెలకొంది. ఎక్కువ దిగుబడులపై ఆశతో రైతులు విరజిమ్ముతున్న యూరియాలో 35శాతాన్నే పంటలు శోషించుకుంటున్నాయి. మిగిలింది కార్బన్‌డయాక్సైడ్ కన్నా ప్రమాదకరమైన నైట్రస్ ఆక్సైడ్ రూపంలో వాతావరణంలోకి చేరుతోంది. లేదంటే, నేలలోకి ఇంకి భూగర్భ జలాలను విషతుల్యం చేస్తోంది. చుట్టుపక్కల జలవనరుల్లో తిష్ఠవేసి వాటిలోని జీవజాతులకు ప్రాణాంతకమవుతోంది. ఎరువుల విచ్చలవిడి వాడకంతో పంటలకు చీడపీడల తాకిడి అధికమై పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతోంది. సాగుభూమీ నిస్సారంగా మారిపోతోంది. దేశ సౌభాగ్యాన్ని అది నీరుగారుస్తోంది.

స్థానిక గిరాకీని తీర్చడానికి తప్పనిసరి పరిస్థితుల్లో విదేశాల నుంచి ఇండియా ఎరువులను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. గత ఆర్థిక సంవత్సరం అలా 1.60 కోట్ల టన్నుల కృత్రిమ ఎరువులను పరాయి దేశాల నుంచి భారత్ తెప్పించుకుంది. ముఖ్యంగా యూరియా దిగుమతులు ఇటీవల కాలంలో బాగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే 2024-25లో యూరియా రాయితీల కోసం కేంద్రం రూ.1.18 లక్షల కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దేశానికి చెరుపు చేస్తున్న కృత్రిమ ఎరువుల వినియోగాన్ని ప్రభుత్వాలు నిరుత్సాహపరచాలి. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాలను విస్తృతంగా ప్రోత్సహించాలి. సహజ సాగుకు కావాల్సిన జీవ ఎరువులు తదితరాల కొరతను తీర్చాలి. భూసార పరీక్షలను పక్కాగా నిర్వహిస్తూ తగినంత పరిమాణంలోనే ఎరువులు చల్లేలా రైతులను చైతన్యపరచాలి!



నేను నా పిల్లలకు ఏం చెప్పానంటే- తలెత్తి నక్షత్రాలను చూడమన్నాను. పనిచేయడం ఆపవద్దన్నాను. ఎందుకంటే పనే జీవితానికి ప్రయోజనాన్నిస్తుంది. అదృష్టవశాత్తూ మీకు ప్రేమ దొరికితే దాన్ని దూరం చేసుకోవద్దని చెప్పాను. ఎందుకంటే ఈ లోకంలో అత్యంత అరుదైనదీ విలువైనదీ ప్రేమే.

– స్టీఫెన్ హాకింగ్

బుద్ధి... భావం!

కళ్లు చూసే దృశ్యాన్ని, చెవులు వినే మాటని, నాసిక ఆఘ్రాణించే వాసనని, చర్మం పొందే స్పర్శను, నాలుక పొందే రుచినీ మనసు విశ్లేషిస్తుంది. ఒక భావం పురుడుపోసుకుంటుంది. అది ఎలాంటిది అన్నది మనిషి మనసుకు, బుద్ధి ఇచ్చే తర్ఫీదు మీద ఆధారపడి ఉంటుంది. బుద్ధి సవ్యంగా ఉంటే, మనిషి సవ్యంగా ఉన్నట్టే. మోక్షం కోసం ప్రయత్నించేవాళ్లు తపస్సుతో మనసును కట్టడి చేయాలని చూసేది అందుకే. సంకల్పబలానికి మూలం మనసులోని భావమే!

విగ్రహాన్ని దేనితో రూపొందించినా, దేవుడనే భావంతో శ్రద్ధాభక్తులతో సేవిస్తే భగవంతుడి అనుగ్రహం లభిస్తుంది. పరమాత్ముడు మనిషి భావంలోనే కొలువై ఉంటాడు. సిద్ధి పొందడానికి అదే హేతువు అవుతుంది. 'భావములోన బాహ్యమునందున గోవింద, గోవిందయని కొలువవో మనసా' అంటాడు అన్నమయ్య. భగవంతుణ్ని బాహ్యంగానే కాదు అంతరంగంతోనూ ఆరాధించాలి. అప్పుడే మనిషి తన్మయత్వ స్థితికి చేరుకుంటాడు.

కొత్తగా వచ్చిన వ్యక్తి- ఈ ఊరు మంచిదా? చెడ్డదా? అని ఊళ్లోని వ్యక్తిని ప్రశ్నిస్తే 'మీరు మంచివారా? చెడ్డవారా? అన్నదాని మీద అది ఆధారపడి ఉంటుంద'ని జవాబిస్తాడు. ఇది మనందరికీ తెలిసిన కథ. మనిషిని బట్టే సమాజం. సమాజం అంటే మనుషుల సమూహమే కదా! ఒకసారి శ్రీకృష్ణుడు దుర్యోధనుడితో- 'రాజ్యంలో మంచివాళ్లెవరైనా ఉంటే తీసుకురా, వరమిస్తాను' అన్నాడు. దుర్యోధనుడు రోజంతా వెతికి ఒక్కరు కూడా కనిపించకపోవడంతో నిరాశతో తిరిగొచ్చి- ఒక్కరంటే ఒక్కరు కూడా మంచివాళ్లు కనిపించలేదంటూ పెదవి విరుస్తాడు. కృష్ణుడు ధర్మరాజును పిలిచి 'రాజ్యంలో చెడ్డవాళ్లెవరైనా ఉంటే తీసుకురా, నీకు వరమిస్తాను' అన్నాడు. ధర్మరాజు రోజంతా వెతికి రాజ్యంలో ఒక్క చెడ్డవాడు కూడా లేడన్న సంతృప్తితో తిరిగొచ్చి- 'బావా, రాజ్యమంతా వెదికినా ఒక్క చెడ్డవాడూ కనిపించలేదు' అన్నాడు. దుర్యోధన, ధర్మరాజుల మనోభావాల మధ్య ఉన్న వ్యత్యాసమది. అంటే 'యద్భావం తద్భవతి' అన్నట్టు మనిషి మంచివాడయితే లోకం మంచిదవుతుంది. చెడ్డవారికి అందరూ చెడ్డగానే కనిపిస్తారు. ఇది అక్షర సత్యం.





మనుషులు మోసపోవడానికి, మంచి ఫలితాలు పొందడానికి ఎదుటి వ్యక్తి గురించి మనసు వేసే అంచనాలే కారణం. శ్రీరాముణ్ని మనసా, వాచా నమ్మాడు గనకనే ఆంజనేయుడు రామభక్త హనుమాన్‌గా మన్ననలందుకున్నాడు. విభీషణుడు చూడగలిగిన రామయ్యలోని ధర్మమూర్తిని... లంకేశ్వరుడు, అతడి ఇతర సోదరులూ తమ బుద్ధి మాంద్యంతో చూడలేకపోయారు. నేలకూలారు. ఒక్కోసారి మన తప్పుడు అంచనాలను పెద్దల మాటలు సరిచేస్తాయి. గురువులు మనిషి బుద్ధిని సరైన మార్గంలో పెట్టి దిశానిర్దేశం చేస్తారు. ప్రార్థనలు, పుణ్యతీర్థాల్లో మునకలు, గురువుల పట్ల విశ్వాసం, వైద్యులపై నమ్మకం- వీటిలో మనిషి భావమెలా ఉంటే, అలాంటి ఫలితమే దక్కుతుందని కరుణశ్రీ తెలుగుబాల శతకంలో విశదపరిచారు.

మనిషి మనుగడకు భావమే ఆలంబన. అది నిర్మలమైనదైతే, మనిషి స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఈ భువిలో మనగలుగుతాడు. ముక్తిని పొందగలుగుతాడు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కర్బన పన్ను పడుతోంది...!



కర్బన ఉద్గారాలను కట్టడి చేసేందుకు ఐరోపా సమాఖ్య(ఈయూ) నూతన వాణిజ్య పంథాను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా తీసుకొచ్చిన కర్బన సరిహద్దు సర్దుబాటు విధానం(సీబీఏఎం) నూతన సంవత్సరాది నుంచి అమలులోకి వచ్చింది. ఈ విధానం కింద, శిలాజ ఇంధనాలతో తయారై వచ్చే దిగుమతులపై పన్ను విధిస్తారు. అంటే, ఈయూ దేశాలకు ఎగుమతి అయ్యే భారతీయ ఉక్కు, సిమెంటు, అల్యూమినియం, ఎరువులు వంటి ఉత్పత్తులపైనా కర్బన పన్ను పడుతుంది. దీనివల్ల ధరలు పెరిగి మన ఉత్పత్తులకు ఐరోపా మార్కెట్లో గట్టి పోటీ ఎదురవుతుంది. మరి ఈ సంక్షోభాన్ని భారతీయ ఎగుమతిదారులు ఎలా ఎదుర్కోవాలి?

ఐరోపా సమాఖ్య తీసుకొచ్చిన కర్బన సరిహద్దు సర్దుబాటు విధానం(సీబీఏఎం) కింద... ఆక్కడి కంపెనీలు హరిత ఇంధనాలతో ఉత్పత్తిచేసే వస్తువుల తయారీ వ్యయం ఎక్కువగా ఉంటుంది. వీటితో పోలిస్తే శిలాజ ఇంధనాలతో తయారయ్యే ఇతర దేశాల వస్తువుల ధరలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, దిగుమతులపై పన్ను విధించడం ద్వారా ఆ తేడాను సరిచేసుకోవడానికి ఈయూ సీబీఏఎంను తీసుకొచ్చింది. ఇకపై ఈయూకు ఎగుమతి చేసే ఉత్పత్తుల్లో కర్బన ఇంధనాల పాళ్లు ఎంత ఉన్నాయో ప్రకటించాల్సి ఉంటుంది. దాన్నిబట్టి దిగుమతిదారులు సీబీఏఎం సర్టిఫికెట్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఫలితంగా దిగుమతి అయ్యే కొన్ని వస్తువుల ధరలు, ఈయూ కంపెనీల ఉత్పత్తి ధరకు మధ్య సమతుల్యత ఏర్పడుతుంది. ఈయూ దిగుమతిదారులు తమపై పడుతున్న అదనపు భారాన్ని తట్టుకోవడానికి, ధరలు తగ్గించుకోవాల్సిందిగా తమకు వస్తువులను ఎగుమతి చేసే దేశాలను డిమాండ్ చేస్తారు. ఫలితంగా, భారతీయ ఎగుమతిదారులు తమ ధరలను 15-22 శాతం మేర తగ్గించుకోవాల్సి వస్తుంది.

ధరలు తగ్గించక తప్పదా?

బొగ్గును మండించడం ద్వారా తయారుచేసిన ఉక్కును ఈయూకు ఎగుమతిచేసేవారు ఇకపై అధిక పన్ను వల్ల అక్కడి మార్కెట్లో పోటీ పడలేకపోతారు. ఉక్కు కర్మాగారాల్లో వెలువడుతున్న కర్బన ఉద్గారాల గురించి ధ్రువీకరణ సమాచారం అందించలేనివారు ఇంకా ఎక్కువగా ధరలు తగ్గించాల్సి ఉంటుంది. ఇకపై ఈయూలోని దిగుమతిదారులు విదేశాల నుంచి కొనుగోలు చేసే ప్రతి వస్తువు ధరలో ఉద్గారాల స్థాయి ఆధారంగా బేరసారాలు జరుపుతారు. ప్రతి కాంట్రాక్టులో సీబీఏఎం క్లాజులను పొందుపరుస్తారు. తక్కువ శిలాజ ఇంధనాలతో ఉత్పత్తి సాగించేవారికి మాత్రం సీబీఏఎం చాలా లాభదాయకమవుతుంది. కర్బన ఉద్గారాల పాళ్లు ఎక్కువగా ఉండే వస్తువులతో పోలిస్తే వీరి ఉత్పత్తులు ఈయూలో తక్కువ ధరకే లభ్యమవుతాయి. తద్వారా వాటికి గిరాకీ పెరుగుతుంది. తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులను అందించేవారు కూడా 'ఉద్గారాల పరిమితి' వల్ల మార్కెట్ కోల్పోతారు. ఇలా సీబీఏఎం అంతర్జాతీయ మార్కెట్లో పోటీ స్వరూపాన్ని నిర్ణయించనుంది.



ఈయూ దిగుమతిదారులు తాము భారత్ నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల్లో కర్బన ఉద్గారాల పాళ్ల ఆధారంగా సీబీఏఎం ధ్రువీకరణ పత్రాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వాటికయ్యే ఖర్చును భారతీయ ఎగుమతిదారులపైకి నెడతారు. ఆ మేరకు మన వర్తకులు ఉత్పత్తుల ధరలను తగ్గించాల్సి రావచ్చు. అప్పుడు భారతీయ ఉక్కు, అల్యూమినియం ధరలను ఈయూ, ఇతర దేశాల ఉత్పత్తుల ధరలతో పోలుస్తారు. భారతీయ ఉత్పత్తులు గిట్టుబాటు కావనుకుంటే ధరలను ఇంకా తగ్గించాలని పట్టుబడతారు. ఉత్పత్తి ప్రక్రియలో వెలువడిన కర్బన ఉద్గారాలను కచ్చితంగా లెక్కించడం సీబీఏఎం విధానంలో అత్యంత కీలకమవుతుంది. వాటిని కర్మాగార స్థాయిలో గణించి, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఆ పత్రాలను దిగుమతిదారులు ఈయూ అధికారులకు సమర్పించి అనుమతి పొందాలి. కాబట్టి ఉద్గారాల ధ్రువీకరణ చాలా కచ్చితంగా, నమ్మకంగా జరగాలి. బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధన వినియోగ పరిమాణం, వాడిన విద్యుత్తు, ఉద్గారాల స్థాయి, మొత్తం ఉత్పత్తి వివరాలను మూడు నెలలకు ఒకసారి సేకరించాల్సి ఉంటుంది. ఈ వివరాలను ఈయూకు ఆమోదనీయ పద్ధతిలో, ఆడిట్ చేయడానికి వీలుగా సమర్పించాలి. లేదంటే ఎగుమతిదారులు తమ ఉత్పత్తులకు చాలా ఎక్కువగా కర్బన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. భారత్‌లో ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తికి బొగ్గును ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అందువల్ల మన ఎగుమతిదారులకు సీబీఏఎంతో ఎక్కువ నష్టం జరుగుతుంది. దీన్ని నివారించాలంటే పునరుత్పాదక, హరిత ఇంధనాలకు మారడానికి ఇండియాకు కొంత సమయం పడుతుంది. కాబట్టి, ఈలోగా ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా దేశాలకు ఎగుమతులు మళ్లించాలి.

ఎక్కువ నష్టం ఎంఎస్ఎంఈలకే!

భారతీయ ఎగుమతిదారులు జనవరి ఒకటి నుంచే సీబీఏఎం క్లాజులకు అనుగుణంగా ఈయూలోని దిగుమతిదారులతో కాంట్రాక్టులు కుదుర్చుకోవాల్సి ఉంది. కాబట్టి, వర్తకులు తాము ఎగుమతి చేస్తున్న వస్తువులేవో, వాటిలో కర్బన ఉద్గారాల పాళ్లు ఎంతో నిర్ధారించుకోవాలి. ఆ వస్తువుల్లో సీబీఏఎం వేటుపడేవి ఏవో తెల్సుకోవాలి. వాటికి ఈయూ విధించే కర్బన పన్ను ఎంతో అంచనా వేసుకుని, ఆ మేరకు దిగుమతిదారులతో ఒప్పందం కుదుర్చుకోవాలి. సీబీఏఎం ప్రభావం భారతీయ ఎగుమతిదారులపైన, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల)పై ఎక్కువగా ఉంటుంది. ఈయూకు సమర్పించడం కోసం డేటాను సేకరించి ధ్రువీకరణ పొందడానికి సమయం, డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎంఎస్ఎంఈలు తమకు కావాల్సిన ఉక్కు, అల్యూమినియం భారీ పరిశ్రమల నుంచి తెచ్చుకుంటాయి. ఆ భారీ కంపెనీలే తమ ఉద్గారాల సమాచారాన్ని ఎంఎస్ఎంఈలకు ఇవ్వాలి. ఈ వివరాలు లేకుండా ఈయూ మార్కెట్లోకి ప్రవేశించడం కష్టమవుతుంది. ఫలితంగా సీబీఏఎం వల్ల అధికంగా నష్టపోయేది చిన్న, మధ్యతరహా కంపెనీలే. భారత్ వంటి వర్ధమాన దేశాలు ఈయూ సీబీఏఎంను వాణిజ్య రక్షణ ధోరణిగా పరిగణిస్తున్నాయి. కానీ సీబీఏఎం భారత్‌కు హరిత హైడ్రోజన్, సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో అధిక పెట్టుబడులు పెట్టేలా పురిగొల్పుతుందని గ్రహించాలి. దీనికి ప్రభుత్వం నిధులు, వనరులు, విధానాలతో సిద్ధం కావాలి.



అజయ్ శ్రీవాస్తవ
వ్యవస్థాపకులు, గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ)

సభకు నమస్కారం!



నూటికి 99 మంది పిల్లల్లో స్టేజి ఫియర్ ఉంటుంది. పదిమంది ముందూ మాట్లాడాలంటే గొంతులో వణుకు, చెమటలు, గుండె దడ, ఆందోళన. 'ధైర్యవంతులే' అలా మాట్లాడగలరు అనుకుంటారు. అది తప్పు. గొప్ప వక్తలంతా ఒకప్పుడు వేదికను చూసి వణికిపోయినవారే. వారికి సాధ్యమైంది మనకెందుకు కాదు? అవుతుంది. వారి జీవిత పాఠాలను మనం నేర్చుకుంటే.

అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ తొలినాళ్ల ప్రసంగాలు విని అందరూ ఎగతాళి చేసేవారు. దాంతో లింకన్ బాగా సాధన చేశారు. ఫలితంగా ఆయన గెట్స్‌బర్గ్ ఉపన్యాసం ప్రపంచంలో అత్యంత ప్రభావశీల ప్రసంగాల్లో ఒకటైంది. దానిలో కేవలం 272 పదాలు, 2-3 నిమిషాలే మాట్లాడారాయన. ప్రపంచ ధనికుడు ఎలాన్ మస్క్ చిన్నప్పుడు జనంలో కలవాలంటే చాలా ఇబ్బంది పడేవారు. ఇప్పుడాయన అంతర్జాతీయ వేదికల మీద అనర్గళంగా మాట్లాడతారు. అబ్దుల్ కలాం చిన్నతనంలో అందరి ముందు, ముఖ్యంగా ఇంగ్లిషులో మాట్లాడటానికి సిగ్గుపడే వారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బాల్యంలో ఎన్నో అవమానాలు, వివక్ష ఎదుర్కొన్నారు. దాంతో మౌనంగా, భయం భయంగా ఉండేవారు. కానీ లోతైన విషయ పరిజ్ఞానం, సంసిద్ధత, స్పష్టమైన ఆలోచన ఆయనకు మనోబలాన్నిచ్చాయి. పార్లమెంటులో ఆయన ప్రసంగాలు చరిత్రలో నిలిచిపోయాయి.

మరి వీళ్లందరూ గొప్ప వక్తలుగా ఎలా మారారంటే...
1. ధైర్యం వచ్చే వరకూ ఎదురు చూడలేదు. మాట్లాడాకే ధైర్యం వచ్చింది, ముందు కాదు. 2. చిన్నగా ప్రారంభించారు. చిన్న గదులు, చిన్న సమూహాలు, సరళ ప్రసంగాలతో నెమ్మదిగా అలవాటుపడ్డారు. 3. బాగా కసరత్తు చేశారు. సంసిద్ధత భయాన్ని తగ్గించింది. 4. 'నేను' నుంచి 'సందేశం' వైపు దృష్టి మరల్చారు. లక్ష్యం పెరిగినప్పుడు ఆందోళన తగ్గింది. 5. తప్పులకు జడవలేదు. క్రమంగా మెరుగుపడ్డారు.

మంచి వక్తలుగా ఎదగాలంటే రోజూ... ఒక నిమిషం... అద్దం ముందు మాట్లాడండి. ఏదోక అంశంపై మీ అభిప్రాయాలు చెప్పండి. స్వీయ వ్యక్తీకరణ సౌకర్యం పెరుగుతుంది. ఒక నిమిషం... ఓ పుస్తకమో దినపత్రికనో తీసుకుని దాంట్లో ఒక పేరా గట్టిగా చదవండి. స్వర ధైర్యం పెరుగుతుంది. 30 సెకన్లు చిరునవ్వుతో దీర్ఘశ్వాస తీసుకుని 30 సెకన్లు నెమ్మదిగా వదలండి. ఆందోళన తగ్గుతుంది. మనసు ప్రశాంతంగా మారుతుంది. వారానికోసారి మీ ప్రసంగాన్ని రికార్డు చేసుకుని వింటూ ఉండండి. మెరుగుదల మీకే అర్థమవుతుంది.

స్టేజి ఫియర్ బలహీనత కాదు. అభివృద్ధికి సంకేతం. వేదిక సంపూర్ణతను కోరదు... ధైర్యాన్ని ప్రోత్సహిస్తుంది. మాట్లాడండి. గొంతు వణికినా మళ్లీ మళ్లీ మాట్లాడండి. కచ్చితంగా ఒకరోజు భయం మీకు తలొంచుతుంది. దాన్ని మళ్లీ మళ్లీ ఎదుర్కొంటూ ఉంటే ధైర్యం అదే పెరుగుతుంది. ధైర్యాన్ని ఎవరైనా అలవరుచుకోవచ్చు.

ఇక ఉపన్యాసాలివ్వడం ఎందుకు అంటారా? ప్రసంగకళతో చాలా లాభాలున్నాయి. జ్ఞానం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బిడియం పోతుంది. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. నాయకత్వ లక్షణాలు అబ్బుతాయి. భావోద్వేగాలపై అదుపు వస్తుంది. ఇవన్నీ చదువుల్లో, ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో ఎంతగానో తోడ్పడతాయి. తెలివైన మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలంటే అత్యవసరమైన నైపుణ్యాలు ఇవే... కాదంటారా?

– హర్షిత్ జాస్తి

వ్యర్థాల సద్వినియోగం.. సుస్థిరాభివృద్ధి మంత్రం!



ఇంటిగాలే గరళమై...

వంటకు, నిర్మాణాలకు, శుభ్రం చేయడానికి వాడుతున్న సామగ్రి వల్ల ఇంట్లోని గాలీ గరళంగా మారుతోంది. దానివల్ల ఆస్తమా, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటివి కోరచాస్తున్నాయి. ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయి. అత్యంత హానికరంగా మారిన ఇంటి గాలి 2021లో ప్రపంచవ్యాప్తంగా 31 లక్షల మందికి పైగా కబళించింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎక్కువ సమయం ఇంట్లోనే ఉంటారు కాబట్టి వారిపై ప్రభావం ఎక్కువగా ఉంటోంది. 2021లో గృహ వాయు కాలుష్యం వల్ల 5-14 ఏళ్ల వారిలో 11 వేలమందికి పైగా మరణించారు. మిగిలిన వయో వర్గాల్లో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారంటే... (లక్షల్లో)

డెబ్భై ఏళ్లు పైబడినవారు	15.4
50–69 మధ్య వయసువారు	8.71
14–49 ఏళ్లు	1.86
అయిదేళ్ల లోపు వారు	5.07

(ఆధారం: ఐహెచ్ఎంఈ, గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్–2024)

భారతదేశ జీడీపీలో 30శాతం వాటాను ఆక్రమిస్తున్న పారిశ్రామిక రంగం సహజంగానే అత్యధిక ఖనిజ వనరులనూ, ఇంధనాన్నీ ఉపయోగించుకుంటోంది. ఈ క్రమంలో వ్యర్థాలూ ఎక్కువగానే ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా పరిశ్రమల నుంచి పెద్దయెత్తున కార్బన్‌డయాక్సైడ్ వంటి ప్రమాదకర వాయు ఉద్గారాలు వెలువడుతున్నాయి. ప్రపంచంలో అమెరికా, చైనాల తరవాత అత్యధికంగా ఉద్గారాలను విరజిమ్ముతున్నది ఇండియానే. ప్రపంచ ఉద్గారాల్లో 9.2శాతం భారత్ నుంచే వెలువడుతున్నాయి. దేశంలో ఇప్పటికీ బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను పరిశ్రమలతోపాటు మోటారు వాహనాలూ విస్తారంగా వాడుకుంటున్నాయి. అధిక జనాభా, పట్టణాల విస్తరణ కూడా శిలాజ ఇంధనాల వినియోగం పెరగడానికి కారణమవుతున్నాయి. రానున్న దశాబ్దాలలో వనరుల వాడకంతో పాటు కాలుష్యం, కర్బన ఉద్గారాలు కూడా ఎన్నో రెట్లు పెరగనున్నాయి. పారిశ్రామిక, మున్సిపల్ వ్యర్థాలు అంతకంతకు పెరిగి పర్యావరణానికి తీరని నష్టం కలిగించే ప్రమాదముంది. దీనంతటినీ నివారించాలంటే- 'పరిమిత వనరులతో ఎక్కువ ఉత్పత్తి, తక్కువ వ్యర్థాలు' మన తారక మంత్రం కావాలి. అత్యాధునిక సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడంతోపాటు వ్యర్థాలను వినియోగార్హంగా మార్చుకోవాలి.

ఆత్మనిర్భర్ భారత్ సాధనకు సుస్థిరాభివృద్ధి నమూనా ఎంతగానో ఉపకరిస్తుంది. దీన్నే సర్క్యులర్ ఎకానమీగా చెబుతారు. భూమి, నీరు, ఇంధనం, ఖనిజ వనరులు పరిమితంగా ఉన్న భారతదేశం- వాటిని అత్యంత పొదుపుగా, సమర్థంగా వాడుకుంటూ అత్యధిక ఫలితాలు సాధించడానికి సర్క్యులర్ ఎకానమీ దోహదపడుతుంది. వృథాను తగ్గించడం, వ్యర్థాలను పునర్వినియోగార్హంగా మార్చడం దీని ప్రధాన లక్షణం. ఇండియా ఇప్పుడు అనుసరించాల్సింది ఈ ఆర్థిక నమూనానే!



కలిసికట్టుగా కృషి చేస్తేనే...

ప్రస్తుతం ప్రపంచార్థికంలో కేవలం 7.2శాతమే సర్క్యులర్ ఎకానమీకి మారింది. అధునాతన సాంకేతికతలతో ఈ ఆర్థిక నమూనా సాకారమైనప్పుడు పర్యావరణ ప్రయోజనాలతోపాటు సుస్థిరాభివృద్ధి సిద్ధిస్తుంది. 2015లో భారత్ 700 కోట్ల టన్నుల మేర వనరులను ఉపయోగించింది. 2030కల్లా మరో 1,420 కోట్ల టన్నులను ఉపయోగించుకోనుంది. ఇలా వాడిన వనరులలో కేవలం 20శాతాన్నే శుద్ధిచేసి పునర్వినియోగంలో పెడుతున్నారు. అదే ఐరోపా దేశాల్లోనైతే వ్యర్థాల పునర్వినియోగ రేటు ఏకంగా 70శాతం ఉంటోంది. భారత్ కూడా శరవేగంగా సర్క్యులర్ ఎకానమీకి మారి, వ్యర్థాల పునర్వినియోగంతో ఆర్థికాభివృద్ధికి కొత్త ఊతమివ్వాలి. కేంద్ర ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గుర్తించి 2015లో భారతీయ వనరుల సంఘాన్ని(ఐఆర్‌పీ) నెలకొల్పింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల నిరోధశాఖ ఆధ్వర్యంలో ఇది ఒక సలహా సంఘంగా పనిచేస్తుంది. వనరుల విషయంలో భారత దేశ స్వావలంబన కోసం సూచనలు ఇస్తుంది. కేంద్రం 2022లో నీతి ఆయోగ్‌లో అంతర్భాగంగా సర్క్యులర్ ఎకానమీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు 1999లో, థర్మల్ విద్యుత్కేంద్రాలు ఫ్లైయాష్‌ను ఉపయోగించుకోవాలని నోటిఫికేషన్ జారీచేసింది. వ్యవసాయ వ్యర్థాల పునర్వినియోగం కోసం 2023లో నోటిఫికేషన్ ఇచ్చింది. పరిశ్రమలు ఫ్లూ గ్యాస్, జీసల్ఫరైజ్డ్ జిప్సం, ఎర్రని బురదను ఉపయోగించుకోవాలని ఆదేశించింది. అనేక హానికర, సాధారణ వ్యర్థాల శుద్ధి, పునర్వినియోగానికి సంబంధించి నిబంధనలను తీసుకొచ్చింది. పరిశ్రమల వెలుపల ఉత్పన్నమయ్యే వ్యర్థాల శుద్ధి-వినియోగాలకూ మార్గదర్శకాలు జారీచేసింది. వీటి అమలుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాల్సి ఉంది. వ్యర్థాలను పునర్వినియోగించేలా పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వాలి. దేశవ్యాప్తంగా వివిధ పారిశ్రామిక వ్యర్థాలు ఎంత పరిమాణంలో వినియోగమవుతున్నదీ తెలిపే కేంద్రీకృత సమాచార నిధిని(డేటాబేస్) రూపొందించి, అందుబాటులో ఉంచాలి. దేశవ్యాప్తంగా ఏయే పరిశ్రమలు ఎంతమేర వ్యర్థాలను వెదజల్లుతున్నాయో మ్యాపింగ్ చేసుకుంటే, వాటిని సకాలంలో శుద్ధి చేసుకోవడం వీలవుతుంది. వ్యర్థాల నాణ్యత తదితర అంశాలను ధ్రువీకరించే బాధ్యతను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్, సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లకు అప్పగించాలి. విద్యుత్, ఉక్కు, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖలూ ఈ బాధ్యతను స్వీకరించాలి.

సర్క్యులర్ ఎకానమీ సాధనకు...

పూర్తిగా పునరుత్పాదక ఇంధనాలతో తయారైన వస్తువులను హరిత ఉత్పత్తులుగా పరిగణించడం మంచిదే. శుద్ధిచేసిన వ్యర్థాలతో చేపట్టిన ఉత్పత్తులకూ ఈ హోదా ఇవ్వాలి. ఖనిజ వనరులను హరించే ఉత్పత్తి విధానాలను విడనాడాలి. కాలుష్య కారక ఇంధనాల వాడకాన్ని కనీస స్థాయికీ, పునరుత్పాదక ఇంధనాల వినియోగాన్ని గరిష్ఠ స్థాయికీ తీసుకెళ్లాలి. బ్యాటరీ వ్యర్థాల నిభాయింపునకు 2022లో నిబంధనలు జారీ అయ్యాయి. వీటిని ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకంతోపాటు అమలు చేయాలని గనులశాఖ ప్రతిపాదించింది. ఇతర మంత్రిత్వ శాఖలూ ఇలాంటి చర్యలు తీసుకోవాలి. ఒక రంగంలో వెలువడిన వ్యర్థాలను ఇతర రంగాల్లో ఉపయోగించుకునే ఏర్పాట్లు జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా సర్క్యులర్ ఎకానమీ సాధనకు సమకట్టాలి. తద్వారా సుస్థిరాభివృద్ధిని సాకారం చేయాలి.

– ఎ.శ్యామ్‌కుమార్

అమ్మో.. పెద్ద పుస్తకం!



రాము, గోపి.. వాళ్ల స్నేహితులంతా కలిసి ఎప్పటిలా ఆనందయ్య మాస్టారు దగ్గరికి ట్యూషన్‌కి వెళ్లారు. హోంవర్క్ పూర్తవ్వగానే ఆయన.. 'పిల్లలూ! ఈరోజు మీకు సరదాగా ఒక పరీక్ష పెట్టనా?' అన్నారు. 'ఏం పరీక్ష మాస్టారు?' అడిగారు పిల్లలు. 'ఇదిగో ఈ పుస్తకంలో రాసి ఉన్న పేజీలను మొత్తం, మీరు నోట్‌బుక్‌లో రాయాలి. అదీ గంటలోనే పూర్తి చేయాలి' అన్నారు. 'అంత లావుగా ఉన్న పుస్తకం మొత్తం గంటలో ఎలా రాస్తాం మాస్టారూ.. చాలా కష్టం' అన్నారు పిల్లలు. కానీ గోపి.. 'నేను రాస్తాను మాస్టారు' అంటూ ముందుకొచ్చాడు. గంటలో మొత్తం రాసేశాడు. అప్పుడు మాస్టారు.. 'శభాష్ గోపీ! కష్టమని తెలిసినా చేయడానికి ముందుకొచ్చావు' అన్నారు. అప్పుడు పిల్లలంతా.. 'గోపీ! అన్ని పేజీలు గంటలో ఎలా రాశావు? ఏదో ఒకటి రాసి, అయిపోయింది అనిపించావా ఏంటి?' అని అడిగారు. 'లేదు.. సరిగ్గానే రాశాను' అన్నాడు గోపి. 'అదెలా సాధ్యమైంది?' అడిగాడు రాము. 'మాస్టారు అంత పెద్ద పుస్తకం చూపించి రాయమన్నప్పుడే.. ఇందులో ఏదో కిటుకు ఉంది అనిపించింది. తరవాత అదే నిజమైంది. మాస్టారు ఇచ్చిన పుస్తకంలో మొదట రెండు పేజీలు, మధ్యలో రెండు, చివర రెండు పేజీలు మాత్రమే రాసి ఉన్నాయి. మిగతావన్నీ ఖాళీగానే ఉన్నాయి. నేనూ అవే రాశాను. అందుకే తొందరగా పూర్తి చేయగలిగాను' అన్నాడు. అప్పుడు మాస్టారు.. 'పిల్లలూ! నేను పుస్తకం చూపించిన వెంటనే, ఇన్ని పేజీలు ఎలా పూర్తి చేయాలి అని ఆలోచించారు. కానీ అసలు అందులో ఏం ఉంది, ఎన్ని పేజీలు రాసి ఉన్నాయని ఆలోచించకుండా భయపడిపోయి ముందే పక్కకు తప్పుకొన్నారు. అది సరైంది కాదు. ఏ పని అయినా మొదలుపెట్టినప్పుడే అందులోని లోటుపాట్లు తెలుస్తాయి. ఎలా ముందుకెళ్లాలో అర్థమవుతుంది' అని చెప్పారు. దానికి పిల్లలంతా.. 'అలాగే మాస్టారు!' అంటూ ఆడుకోవడానికి వెళ్లిపోయారు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

కుండ	సింహం	మొక్క
గుండె	కుర్చీ	పిల్లి
పక్షి	కుందేలు	ఆవు

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.10.7 లక్షలకు టోకరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'సదఖత్‌ఖాన్ అనే నిందితుడితో కలిసి మీరు మనీలాండరింగ్ నేరం చేశారు. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం...' అంటూ సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధుడిని భయపెట్టి రూ.10.7 లక్షలు కొట్టేశారు. వివరాల్లోకి వెళితే.. రాజీవ్‌నగర్‌కు చెందిన ఒక వృద్ధుడి (73)కి గత నెల 16న టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి అంటూ ఫోన్ వచ్చింది. మీ ఆధార్ కార్డ్, ఫోన్ నంబరును సైబర్ నేరంలో ఉపయోగించారని, సదఖత్‌ఖాన్‌తో కలిసి మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని భయపెట్టారు. దీనికి న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనాలని బెదిరించారు. కొంత డబ్బు జమ చేయాలని, కేసు విచారణ పూర్తయిన తర్వాత డబ్బులు వెనక్కి పంపిస్తామని చెప్పడంతో వారి మాటలు నమ్మాడు. మొదటి విడతలో రూ.8లక్షలు పంపారు. కేసు దర్యాప్తు నిమిత్తం మరో రూ.2.7 లక్షలు పంపాలని చెబితే.. అలాగే చేశారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించి ఈ నెల 2న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గత ఏడాది ఆగస్టు నెలలో...

గతంలో ఇదే తరహా కేసులో 'సదఖత్ ఖాన్' పేరు చెప్పి నేరగాళ్లు డబ్బులు కొట్టేశారు. గత ఏడాది ఆగస్టు 19న పటమటకు చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి (66)ని సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. ఆధార్‌కార్డు, చరవాణి నంబరుతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అరెస్టు చేస్తున్నామని భయపెట్టారు. దీంతో భయపడిన విశ్రాంత ఉద్యోగి సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు రూ.50.7లక్షలు పంపించేశారు. దీనిపై సెప్టెంబరు నెలలో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అర్జీదారులకు ఉపశమనం


రెవెన్యూ క్లినిక్‌లో కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో సోమవారం కొత్తగా రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ నేతృత్వంలో జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు హాజరయ్యారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు కౌంటర్ల (టేబుల్) వారీగా ఫిర్యాదులు స్వీకరించారు. వారికి సలహాలు/సూచనలు అందజేసి ఉపశమనం కలిగించారు. మొత్తం 58 వినతులు స్వీకరించారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ 21, తిరువూరు 19, నందిగామ డివిజన్ 18 చొప్పున వినతులు వచ్చాయి. నందిగామ డివిజన్ పరిధిలో భూసర్వేకు సంబంధించి విస్తీర్ణంలో వ్యత్యాసాలు సవరణకు వినతులు రాగా, మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయాలని మరి కొందరికి సూచించినట్టు ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. తిరువూరు డివిజన్ పరిధిలోని రెడ్డిగూడెం మండలంలో గయాల భూమికి సంబంధించిన సమస్యకు పరిష్కారమార్గాన్ని సూచించినట్టు ఆర్డీవో కె.మాధురి తెలిపారు.



రంగరించిన సంబరం..



పెనుగంచిప్రోలు తిరుపతమ్మ రంగుల మహోత్సవం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గోపయ్య సమేత తిరుపతమ్మవారు, పరివార దేవతల విగ్రహాలను జగ్గయ్యపేటకు తీసుకెళ్లేందుకు అన్నదాతలు ఎడ్ల బండ్లను పుష్పాలతో అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. - పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

తెలుగువీర లేచెరా.. వెలుగుపూలు పూసెరా!


వందనమమ్మా.. తెలుగుతల్లి..


తెలుగు వైభవం చాటి చెప్పేలా...


కోలాటంతో చిన్నారుల సందడి

- కనులపండువగా సాగిన ప్రపంచ తెలుగు మహాసభలు
- సందేశమిచ్చిన సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అమ్మభాషపై అభిమానం ఎగసింది. ఆధునికతను తెలుగు సొగసు మురిసింది. చిన్నా పెద్దా తేడా లేదు, ఊరూ వాడా భేదమూ లేదు... తెలుగు వెలుగుల పూదోటలో మన తరతరాల చరిత్ర కళ్ల ముందు కదలాడింది. ... మొత్తంగా గుంటూరులోని బొమ్మిడాలనగర్‌లో గల సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో మూడు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు సోమవారంతో ముగిశాయి. ... మళ్లీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీ వంశంలో రావాలని కోరుకుంటున్నట్లు గజల్ శ్రీనివాస్ సభాముఖంగా తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో కళాకారులకు రాయితీలు మంజూరు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని సీఎం చంద్రబాబును అభ్యర్థించారు. – ఈనాడు, అమరావతి


ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మహాసభల ప్రాంగణంలోకి ప్రవేశించగానే.. అలనాటి కవులు, రచయితలు, తెలుగుభాషాభివృద్ధికి పాటుపడినవారి చిత్రాలు ఆహ్వానించాయి. ...

కవులు, రచయితలు, కళాకారులు, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన వివిధ సంఘాల ప్రతినిధులను మహాసభల్లో సత్కరించి గౌరవించారు. యువత సైతం భరత నాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో తమ ప్రావీణ్యం ప్రదర్శించారు. నవ రచయితలు.. యువ గాయకులు.. వేదికలపై వారి ప్రతిభను ప్రదర్శించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత సాంఘిక, సామాజిక సమస్యలపై కవితలతో స్పందించారు.

... తెలుగుకు సంబంధించిన అనేక అంశాలను వక్తలు వివరించగా.. సభికులు ఆసక్తితో ఆలకించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు ప్రధాన వేదిక మీద సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేంకటేశ్వర స్వామి నిలువెత్తు ప్రతిమ, తెలుగు తల్లి విగ్రహం తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్టీఆర్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న సినీ నటుడు సాయికుమార్, వైడీ రామారావు(సేవా రంగం), విజయకుమార్(కళారంగం)


సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్న సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె, గాయకుడు మనో (పూర్ణకుంభ పురస్కారం), సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ (సేవా పురస్కారం)

మగ్గంపై... లగ్నం లేఖ



ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణంలోని ప్రత్యేక స్టాల్‌లో ఏర్పాటు చేసిన మగ్గంపై నేసిన లగ్నం లేఖలు అందరినీ ఆకట్టుకున్నాయి. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన రామాంజనేయులు బృందం ... పడుగు, పేకు, జరీలతో పెళ్లిపత్రికలు, ఆహ్వాన పత్రాలు రూపొందించి వాటిపై అక్షరాలను మగ్గంపైనే నేస్తున్నారు. ఇందుకు పూర్తిగా పట్టు దారాన్నే వినియోగిస్తున్నారు. మగ్గంపై నేయడం వల్ల అందంగా.. చూడముచ్చటగా ఉంటున్నాయి. ఒక్కో లేఖకు రూ.2,500 వరకు ఖర్చవుతుందని రామాంజనేయులు చెప్పారు. ఈ శుభలేఖలు చూసేందుకు పలువురు ఆసక్తి కనబర్చారు.


- ఈనాడు, అమరావతి

విలువల మణి.. విజ్ఞాన గని

పుస్తక ప్రియుల పాదయాత్ర నేడు

ఈనాడు, అమరావతి

విజయవాడ 36వ పుస్తక మహోత్సవం సోమవారంతో నాలుగు రోజులు పూర్తి చేసుకుంది. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం (వీబీఎఫ్ఎస్) ఆధ్వర్యంలో జనవరి 2 నుంచి ప్రారంభమైన వేడుకలు ఈ నెల 12 వరకూ 11 రోజులు కొనసాగనున్నాయి. మంగళవారం ఐదో రోజు ప్రదర్శన మధ్యాహ్నం 2గంటలకు తెరుచుకుని రాత్రి 9గంటల వరకు కొనసాగుతుంది. శని, ఆదివారాల్లో కలిపి లక్ష మంది వరకూ పుస్తక ప్రియులొచ్చినట్టు అంచనా. సోమవారం కూడా పెద్ద సంఖ్యలో సాహిత్య అభిమానులు తరలివచ్చారు. ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం మొత్తం వృత్తాకారంలో స్టాళ్లను ఏర్పాటు చేయడంతో ఒక చివరి నుంచి ఆరంభించి మొత్తం ప్రాంగణమంతా చుట్టి వస్తున్నారు. స్టాళ్లలోనే నిలబడి పుస్తకాలను చదువుతూ.. చూస్తూ ముందుకెళ్తున్నారు. సందర్శకులు ఒక్కొక్కరూ కనీసం నాలుగైదు గంటలు అక్కడే గడుపుతుండడం గమనార్హం. ప్రాంగణంలో ఉన్న సాహిత్య వేదికపై పుస్తకావిష్కరణ, భాషా, సాహిత్య సదస్సులు, ప్రతిభా వేదికపై చిన్నపిల్లలకు క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, ఇంద్రజాల ప్రదర్శనలు జరుగుతున్నాయి.


పుస్తకాలను పరిశీలిస్తున్న యువత

పఠనంపై అవగాహన పెంచేందుకు ర్యాలీ..

జనవరి 6న సాయంత్రం 4గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించనున్నారు. సిద్ధార్థ కళాశాల నుంచి ఇందిరాగాంధీ మైదానం వరకూ కొనసాగనుంది. పాదయాత్రను చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోదియా ప్రారంభించనున్నారు. సాహితీ ప్రముఖులు, పుస్తక ప్రియులు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొని జనానికి పుస్తక పఠనంపై అవగాహన పెంచుతారు.



తాళపత్రాలను తలపించేలా.. ఆసక్తిగా చదివించేలా..

తాళపత్రాలను తలపించే విధంగా నేటి చిన్నారులు, యువతను ఆకట్టుకుంటూ ఆసక్తిగా చదివించేలా శ్రీలలితా, విష్ణు సహస్రనామ స్తోత్రాలను రూపొందించి పుస్తక మహోత్సవంలో విక్రయిస్తున్నారు. పుస్తకాల్లా కాకుండా తాళపత్రాల్లా తాడుతో కట్టి ఆకర్షణీయంగా బొమ్మలు, రంగుల చిత్రాలతో వీటిని రూపొందించడంతో శుభకార్యాల్లో బహుమతిగా ఇవ్వడానికి ఉపయోగకరంగా ఉంటాయని చెబుతున్నారు. – ఈనాడు, అమరావతి



యువత అధికంగా తరలివస్తోంది

మొదటిరోజు నుంచి సందర్శకుల రద్దీ అధికంగా ఉంది. శని, ఆదివారాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా వేలాదిగా తరలివచ్చారు. ఆదివారమే 80వేల మందికి పైగా వచ్చారు. కొనుగోళ్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మేం ఊహించినట్టుగానే స్పందన అనూహ్యంగా ఉంది. హైదరాబాద్ పుస్తక మహోత్సవానికి వచ్చిన రద్దీని చూశాక విజయవాడలోనూ అదే కొనసాగుతుందని మేం అంచనా వేశాం. ప్రధానంగా యువత ఈసారి భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. **-టి.మనోహర్ నాయుడు, వీబీఎఫ్ఎస్ అధ్యక్షులు**

మహోత్సవంలో.. 'ఈనాడు'

★ **సాయంత్రం 5.30కు:** మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సభ, **ముఖ్యఅతిథి:** ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్.
★ **7గంటలకు:** తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రచురించిన.. కొసరాజు సాహిత్యం ఆవిష్కరణ. **అతిథులు:** మన్నం వెంకటరాయుడు (మనసు ఫౌండేషన్‌కు చెందిన), తోటకూర ప్రసాద్ (తానా సాహిత్య వేదిక అధ్యక్షులు)

ఆశ పెట్టారు.. పుట్టి ముంచారు

- కొలిక్కి వచ్చిన లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ లెక్కలు
- 1,044 మంది రూ.4.52 కోట్లు నష్టపోయారు

ఈనాడు, అమరావతి

కొందరు డిపాజిటర్లకే ఎక్కువ సొమ్ము వెళ్లడంతో అది సంస్థ ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా ప్రభావం పడింది. ఫలితంగా అది పుట్టి మునిగే వరకు వచ్చింది. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' కేసులో పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సంస్థకు చెందిన కంప్యూటర్లు, హార్డు డిస్కుల్లోని సమాచారాన్ని విశ్లేషించారు. నిర్వాహకులు దుర్గాప్రసాద్, శివాని దంపతులు వసూలు చేసిన సొమ్ములో దాదాపు చెల్లించినట్లు గుర్తించారు.

రూ.21.37కోట్లు వసూలు...

ఆయా జిల్లాల నుంచి వచ్చిన పెట్టుబడులకు 1,760 ఖాతాలు తెరిచినట్లు గుర్తించారు. పలువురు రెండు ఖాతాలు తెరిచి పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తులో తేలింది. మొత్తం రూ.21.37కోట్లు డిపాజిట్లుగా వచ్చాయి. డిపాజిటర్లకు తిరిగి రూ.21.30కోట్లు చెల్లించారు. ఇదీ కొద్దిమందికే అందింది. 716మంది తమకు రావాల్సిన దానికంటే అదనంగా రూ.4.45కోట్లు అయాచితంగా లబ్ధి పొందారు. 1,044 మంది నష్టపోయినట్లు గుర్తించారు. వీరికి రూ.8.26కోట్లు దక్కాయి. ఇంకా రూ.4.52 కోట్లు రావాల్సి ఉంది. నష్టపోయినవారికి న్యాయం చేసేందుకు ఎక్కువ ప్రయోజనం పొందినవారి నుంచి వసూలు చేసి ఆ మొత్తాన్ని నష్టపోయినవారికి ఇప్పించేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

చేతికందని కష్టార్జితం

విస్సన్నపేట కేంద్రంగా 2023 మార్చిలో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సంస్థను ఏర్పాటు చేశారు. దుర్గాప్రసాద్ ఎండీగా, అతని భార్య శివాని సీఈవోగా వ్యవహరించారు. రూ.లక్షకు... నెలకు రూ.10వేలు చొప్పున 25నెలలు ఇస్తామని ప్రచారం చేశారు. ఒకేసారి పెట్టుబడులు పెడితే ప్రతినెలా కొంత చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాల్లో కార్యాలయాలు తెరిచి పెట్టుబడులు స్వీకరించారు. ఆశపడ్డ జనం ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెట్టేశారు. ఆర్థిక క్రమశిక్షణ కొరవడి.. చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోవడంతో డబ్బును రొటేషన్ చేయలేక దుర్గాప్రసాద్ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. చేసేదిలేక గతేడాది అక్టోబరులో పురుగుమందు తాగి తనువు చాలించాడు.

మద్దులపర్వ గ్రామానికి చెందిన తాపీ, కూలి పనులు చేసుకునే ఓ వ్యక్తి భవిష్యత్తు అవసరాలకు పైసాపైసా కూడబెట్టాడు. ఎల్‌బీఎఫ్‌లో రూ.50వేలు పెట్టుబడి పెట్టాడు. అతనికి రూ.9వేలు తిరిగొచ్చాయి. తన కష్టార్జితం కాజేశారని కన్నీరుపెట్టుకున్నాడు.

★ **పిల్లల చదువులకని** ఓ ఆటో డ్రైవర్ రూ.3.50లక్షలు డిపాజిట్ చేశారు. ఇతనికి రూ.2.50లక్షలు వచ్చింది. మిగిలిన రూ.లక్ష తిరిగిరాలేదు. తనకు న్యాయం చేయమని పోలీసులను అభ్యర్థిస్తున్నాడు.

7న సిద్ధార్థ దాతలకు సత్కారం


మాట్లాడుతున్న మలినేని రాజయ్య, పక్కన లక్ష్మణరావు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేసిన ఎనిమిది మంది దాతలను విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 7న నిర్వహించే సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవంలో సత్కరించనున్నట్లు అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్ తెలిపారు. నగరంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. 1975లో అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో 250 మంది దాతలు విజయవాడలో సిద్ధార్థ అకాడమీని నెలకొల్పి.. తొలుత పీబీ సిద్ధార్థ, ఉయ్యూరులోని ఏజీఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం 18 విద్యాసంస్థలు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఆయా విద్యాసంస్థల్లో ఎంతో మంది విద్యార్థులు చదువుకొని దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిర పడ్డారని గుర్తు చేశారు. స్వర్ణోత్సవాలను గతేడాది మార్చి 7న ప్రారంభించామని, అప్పటి నుంచి సదస్సులు, సమావేశాలు, పోటీలు, సినీ సంగీత విభావరి, వైద్య విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలియజేశారు. సమావేశంలో అకాడమీ ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణం, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 596 ప్రత్యేక బస్సులు

మరో 150పైగా పెరిగే అవకాశం ★ హైదరాబాద్‌కు అరకొర సర్వీసులే

ఈనాడు, అమరావతి: సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 596 ప్రత్యేక బస్సులు తిరగనున్నాయి. విజయవాడ, మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులతో పాటు రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చే బస్సులపై ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. జనవరి 8 నుంచి 14 వరకు సర్వీసులు తిప్పనున్నారు. తిరుగు ప్రయాణానికి 17 నుంచి 19వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతారు.

ప్రైవేటు ట్రావెల్స్‌కే పండగ.. ★ జిల్లాకు హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది సంక్రాంతికి వస్తారు. సర్వీసులు మాత్రం ఆ స్థాయిలో లేవు. విజయవాడ-హైదరాబాద్, మచిలీపట్నం-హైదరాబాద్ మధ్య 29 ప్రత్యేక బస్సులు కేటాయించారు. గతేడాది మచిలీపట్నం నుంచే 70 ప్రత్యేక బస్సులు నడిచాయి. విజయవాడ నుంచి వందకు పైగా తిరిగాయి. ★ ఈసారి స్త్రీశక్తికి బస్సుల కేటాయింపుతో ఇబ్బంది కలిగినట్లు తెలుస్తోంది. పరిస్థితిని బట్టి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా.. ఇబ్బందులు తప్పవనిపిస్తోంది. విశాఖ నుంచి కూడా ప్రస్తుతానికి 10 సర్వీసులే ఖరారయ్యాయి. కనీసం 30 బస్సులైనా నడపాల్సి ఉంది. ★ అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోకుంటే ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులే పండగ చేసుకుంటారు. రెండు నెలల ముందే ప్రైవేటు వారు ఆర్టీసీ రేటుకు రెండు మూడు రెట్లు అధికంగా పెట్టి దందా మొదలుపెట్టారు. సర్వీసులు పెంచకుంటే రేట్లు మరింత పెంచే అవకాశాలున్నాయి. చెన్నై, బెంగళూరు సర్వీసులపైనా స్పష్టత రావాల్సి ఉంది. ★ 'విజయవాడ నుంచి 200 బస్సులు ఉంచుతాం. డిమాండ్‌ను బట్టి సర్వీసులు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇబ్బంది లేకుండా చూస్తాం' అని పీఎన్‌బీఎస్ డిప్యూటీ సీటీఎం సూర్య పవన్‌కుమార్ తెలిపారు.

వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు..

మార్గం	బస్సులు
హైదరాబాద్	18
వైజాగ్	10
ఒంగోలు	10
కాకినాడ	31
రామచంద్రాపురం	12
రావులపాలెం	34
తాడేపల్లిగూడెం	30
తణుకు	30
అమలాపురం	36
భీమవరం	62
రాజోలు	32
నరసాపురం	19
రాజమహేంద్రవరం	56
తుని	48
కొవ్వూరు	40
గోకవరం	40
నిడదవోలు	40
ఏలేశ్వరం	37
హైదరాబాద్- బందరు	11

దిల్లీ సర్వీస్ దారి మళ్లింపు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పొగ మంచు కారణంగా దిల్లీ సర్వీస్ విమానాన్ని దారి మళ్లించారు. తెల్లవారుజాము నుంచి గన్నవరం విమానాశ్రయ ప్రాంతంలో దట్టమైన పొగ మంచు కురిసింది. దీంతో ఉదయం 8.15 గంటలకు దిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం రన్ వే విజిబులిటీ లేకపోవడంతో సుమారు అరగంట గాలిలో చక్కర్లు కొట్టింది. పొగమంచు తగ్గకపోవడంతో సదరు విమానాన్ని హైదరాబాద్ మళ్లించారు. వాతావరణం అనుకూలించిన తర్వాత ఉదయం 11.10కు ఈ విమానం తిరిగి విమానాశ్రయం చేరుకుంది.

లింగయాస్‌లో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

మాదలవారిగూడెం (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా గన్నవరం మండలం మాదలవారిగూడెం లింగయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనాడు- ఈఎఫ్ఎమ్ 91.9 ఆధ్వర్యంలో సోమవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పండగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై చుక్కల ముగ్గులకు వివిధ రంగులద్ది సందేశాత్మకంగా, కళాత్మకంగా తీర్చిదిద్దారు. ప్రాంగణమంతా సంక్రాంతి ముందే వచ్చిందా? అనేలా వాతావరణం నెలకొంది. తోటి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ విద్యార్థులు సందడి చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.పూజిత, సామినేని వాసవి, వి.పూజితలు నిలవగా.. జి.శ్రీవిద్య, ఎం.హేమంత్, ఎస్.వీష్మాలకు.. లింగయాస్ ప్రతినిధి డా. కేఎన్‌వీ రత్నకుమార్, వై.సురేష్‌బాబు, హెచ్‌వోడీ డా.టి.విద్యులతలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్ట్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజా సుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించారు. పోటీల్లో కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


విజేతలతో ప్రొ.డా.కుమార్, ప్రొ.సురేష్‌బాబు, డైమండ్ నెక్ట్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్

పలు ప్రతిపాదనలకు దుర్గగుడి పాలకమండలి ఆమోదం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పాతబస్తీలోని సీవీ రెడ్డి ఛారిటీస్ స్థలంలో భవిష్యత్‌లో భక్తుల దాహార్తి తీర్చే విధంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం జల ప్రసాదం ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ తెలిపారు. పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని ఇంద్రకీలాద్రి అతిథి గృహంలో సోమవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. 12 అంశాలపై సభ్యులు చర్చించిన అనంతరం రెండు అంశాలను వాయిదా వేసి మిగతా వాటికి ఆమోద ముద్ర వేశారు. ★ దుర్గమ్మ ఆలయానికి నూతన సంవత్సరంలో 12 నెలల కాలపరిమితికి అవసరమైన ఆవు నెయ్యి లోయిస్టు టెండరు ధర కిలో రూ.627.50 చొప్పున సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నుంచి తీసుకునేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. ★ నున్న సమీపంలోని సోలార్ ప్లాంట్‌కు అదనపు 33 కేవీ హెచ్‌టీ స్విచ్ యార్డు ఏర్పాటుకు రూ.85 లక్షలు వెచ్చించాలని తీర్మానించారు. ★ భక్తుల సౌకర్యార్థం రూ.10.25 లక్షలతో కూలింగ్ పెయింట్ వేయించడం. ★ తలనీలాల వేలంలో ఏడాదికి రూ.10.10 కోట్లు చొప్పున చెల్లించే హక్కును పొందిన హెచ్చు పాటదారుడు ఇండియాన్ హెయిర్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగింత. ★ ఆలయ ప్రాంగణంలో భక్తులు సేద తీరేందుకు రూ.42 లక్షలతో స్టీల్ సిటింగ్ బెంచిల ఏర్పాటు. ★ భవానీ దీక్షల విరమణ సమయంలో మిగిలిన 4.61 లక్షల లడ్డూలు ఉచితంగా పంపిణీ.. దేవస్థానం కౌంటరులో రూ.35 చొప్పున కొబ్బరికాయ విక్రయించడం, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాలు, మార్చి 6 నుంచి 8 వరకు మహా కుంభాభిషేకం నిర్వహించే అంశాలపై చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు.


సభ్యులతో చర్చిస్తున్న ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

వాయిదా వేసిన అంశాలు...: పాలకమండలి సమావేశంలో సి.వి.రెడ్డి ఛారిటీస్ స్థలంలో 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించిన అంశం.. భక్తులు సమర్పించిన చీరలు విక్రయించేందుకు అదనపు కౌంటరు చేసేందుకు సంబంధించిన అంశాలను పాలకమండలి వాయిదా వేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శీనానాయక్, పాలకమండలి, సభ్యులు పాల్గొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు ప్రాధాన్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజల సమస్యల పరిష్కారంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు చేసిన సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ పీవీఎస్ రెడ్డి వీసీ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిటిజన్ [illegible] వెనుకబడిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో 130 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. నోడల్ అధికారిణి జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పీజీఆర్ఎస్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

కనులపండువగా రంగుల మహోత్సవం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం సోమవారం కనులపండువగా సాగింది. ప్రతి రెండేళ్లకోసారి అమ్మవారు, పరివార దేవతల విగ్రహాలను రంగులకు [illegible] తరలిస్తుంటారు. ఉదయం 6.10 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతల విగ్రహాలను ప్రత్యేక మందిరం నుంచి బయటకు తీసుకొచ్చారు. వేదమంత్రాలు, భజనలు, పూజలు చేపట్టి ఆలయం చుట్టూ విగ్రహాలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం రజకులు తమ శిరస్సుపై విగ్రహాలను పెట్టుకుని ఊరేగింపుగా రంగుల మండపం వద్దకు తీసుకొచ్చారు. వేలాదిగా మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. డీసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు మంచు రమేష్‌బాబు, డీసీపీ లక్ష్మీనారాయణ, సర్పంచి వేల్పుల పద్మకుమారి, తెదేపా మండల అధ్యక్షుడు చింతల వెంకటసీతారామయ్య, ఆలయ మాజీ ఛైర్మన్లు నూతలపాటి కాశాని శ్రీనివాసరావు, కొల్లా రఘురామయ్య, ఏసీపీ తిలక్, తహసీల్దారు శాంతలక్ష్మి, ఆలయ [illegible], సీఐలు లక్ష్మ[illegible]యుడు, వెంకటేశ్వర్లు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఊరేగింపులో గతానికి భిన్నంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ మాజీ ఛైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు సొంతంగా రూ.5 లక్షలు ఈ కార్యక్రమాలకు వెచ్చించారు. కేరళ, మహారాష్ట్ర బ్యాండ్ బృందాలు, కొమ్ము కూతాలు, సన్నాయి మేళం, మహిళా కోలాటాలు, [illegible] బృందాలు, డప్పు కళాకారులు, వివిధ రకాల వేషాలు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేవాలయ ఉద్యోగుల అలసత్వం వల్ల విగ్రహాల వరుస ప్రకారం బండ్ల సీరియల్ రాలేదని ఆలయ అధికారులను [illegible]. దీనిపై ఆర్డీవో కె.బాలకృష్ణ ఆలయ అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారులు రైతులకు నచ్చచెప్పేందుకు యత్నించినా వినలేదు. మండల తెదేపా అధ్యక్షుడు చింతల వెంకటసీతారామయ్య, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు మంచు రమేష్‌బాబు, తహసీల్దారు శాంతలక్ష్మి రైతులతో ప్రత్యేకంగా మాట్లాడటంతో సీరియల్ ప్రకారం తీసుకెళ్లేందుకు అంగీకరించారు.


పోలీస్ స్టేషన్ సెంటర్‌లో కిక్కిరిసిన భక్తులు


అమ్మవారి ఊరేగింపులో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తదితరులు

చంద్రబాబు విద్యుత్తు సంస్కరణలతో ప్రజలకు ఊరట

పటమట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు చేపట్టిన సంస్కరణలతో వైకాపా ప్రభుత్వం మోపిన విద్యుత్తు ఛార్జీల భారం నుంచి ప్రజలకు ఊరట లభించిందని తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. విద్యుత్తు ఛార్జీల భారం ప్రజలపై పడకుండా సీఎం చంద్రబాబు చేపడుతున్న సంస్కరణలపై సోమవారం ఆమె గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. సూపర్-6 పథకాలు... సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొనకపోయినా ప్రజలపై భారం లేకుండా చేయాలనే ఉద్దేశంతో చంద్రబాబు విద్యుత్తు ఛార్జీలు తగ్గింపు గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. 2019లో జగన్ అధికారం చేపట్టే నాటికి ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా నిలిపిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. వైకాపా పాలనలో జగన్ 9 సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచి, ప్రజలపై సుమారు రూ.32 వేల కోట్ల భారం మోపారని ఆరోపించారు. గత ప్రభుత్వం మిగిల్చిన రూ.వేల కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా, కూటమి ప్రభుత్వం పూర్తిగా భరించిందని స్పష్టం చేశారు. ట్రూడౌన్ అమలుతో యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలు తగ్గించగలిగామని తెలిపారు. గత ప్రభుత్వం యూనిట్ విద్యుత్తును రూ.5.19కు కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వం రూ.4.70కే కొంటోందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇంకా ఛార్జీలు తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న గద్దె అనురాధ

నష్టం లేకుండా భూసేకరణ పరిహారానికి డిమాండ్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జమలయ్య తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎర్రుపాలెం నుంచి అమరావతికి వేసే నూతన రైల్వే లైన్ నిర్మాణానికి ఎన్టీఆర్ జిల్లాలో సేకరిస్తున్న భూములకు సంబంధించి రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పరిహారాన్ని చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యమలమందరావు, ట్రాక్ నిర్మాణ నిర్వాసితుల పోరాట కమిటీ నేత ఎర్రగుంట్ల నరేష్ తదితరులు డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ.. నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ జి.లక్ష్మీశకు వినతి పత్రం సమర్పించారు. జమలయ్య మాట్లాడుతూ.. రైల్వే లైను కోసం ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు, దాములూరు గ్రామాల్లో రెండు పంటలు పండే 77.75 ఎకరాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర పలుకుతుండగా.. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం తక్కువ ధర చెల్లించేందుకు చూస్తున్నారని, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం రెండున్నర రెట్లు చెల్లించాలని కోరారు. లేదా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఏ గ్రామంలో రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా ఉందో దాన్ని పరిగణలోకి తీసుకుని నాలుగున్నర రెట్లు నిర్ణయించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా భూముల్లో ఉన్న షెడ్లు, చెట్లు, పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. బాధిత రైతులు ఎర్రగుంట్ల విశ్వేశ్వరరావు, సుబ్బారావు, ఎ.శేషగిరి, బత్తుల సుజాత, భూపతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దత్తపీఠానికి వచ్చిన మాధవ్

పటమట, న్యూస్‌టుడే: పటమటలోని దత్త పీఠంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న భాగవత పారాయణంలో సోమవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. అనంతరం సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద భారతి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధాని కార్యదర్శి నాగోతు రమేష్, భాజపా నాయకులు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయండి

విజయవాడ (గాంధీ నగర్), న్యూస్‌టుడే : కాలయాపన లేకుండా ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై వివిధ బ్యాంకు యూనియన్లు సోమవారం ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టాయి. ఎన్‌సీబీఈ ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్, ఎస్‌బీఐవోఏ అధ్యక్షుడు వి.విజయశేఖర్ మాట్లాడారు. 12వ ద్వైపాక్షిక ఒప్పందం, ఐబీఏతో కుదిరిన 9న జాయింట్ నోట్‌లో భాగంగా ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. చర్చల సమయంలో స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ.. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానంతో ఉద్యోగుల పనితీరు మెరుగుపడుతుందని, వినియోగదారులకు చక్కని సేవలు అందించవచ్చని చెప్పారు. ఈ నెల 27న బ్యాంకు సేవలు నిలిపివేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల యూనియన్ల నాయకులు జి.కాశీవిశ్వనాథ్, బి.శేషసాయి, ఎస్.వి.రమణ, టి.రఘురామ్, పి.నరసయ్య, వెంకటేష్, జయంతి, వి.ఎస్.ఆర్.శేఖర్, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న చంద్రశేఖర్, విజయశేఖర్, కాశీవిశ్వనాథ్ తదితరులు

ధర వరలు

వంకాయలు-18/24, టమాటా-36, బెండ-30, పచ్చిమిర్చి-34, కాకర-45, బీర-34, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-22, క్యారెట్-36, దొండ-34, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-28, గోరుచిక్కుళ్లు-34, దోస-30/38, సొర-20, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-42, బీట్ రూట్-28, కీరదోస-30, బీన్స్-56, క్యాప్సికమ్-56, చింతకాయలు-60, నిమ్మ (డజను)-22/18, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

సైబర్ నేరాల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా కేసులను త్వరితగతిన ఛేదించేందుకు పోలీసు అధికారులు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సోమవారం సీపీ కార్యాలయంలో తరగతులు ప్రారంభించారు. దిల్లీ నుంచి సైబర్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఫోరెన్సిక్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ పాటిబండ్ల శిక్షణ ఇచ్చారు. సైబర్ నేరాల్లో శిక్షలు పడేందుకు ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు సేకరించాలి? దాడులు నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి డిజిటల్ ఆధారాలు సేకరించడం, సంరక్షించడం, విశ్లేషించడం, భద్రపరచడం, సంఘటనను పునర్నిర్మించడం తదితర అంశాలను కూలంకషంగా వివరించారు. సీపీ మాట్లాడుతూ.. సాంకేతికతను పోలీసులు తమ పని తీరులో సమర్థంగా ఉపయోగించడం ద్వారా ప్రజలను మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. దర్యాప్తులో కీలక ఆధారాలు సేకరించేందుకు అవసరమైన అన్ని విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన అధికారులు, సిబ్బంది తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులను విచారించి త్వరితగతిన ఛేదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు సైతం సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ వాట్సాప్, వీడియో కాల్స్ ద్వారా అరెస్టు చేయరని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షిరీన్‌బేగం, కె.జి.వి.సరిత, తిరుమలేశ్వర్‌రెడ్డి, కృష్ణప్రసన్న, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్ డిజిటల్ ఫోరెన్సిక్ అధికారులు మనీష్‌యాదవ్, కృష్ణకిరణ్, సంజయ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

7న తరుణీ తరంగాల మహిళా ఫెస్ట్

రాఘవయ్య పార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యే తరుణీ తరంగాలు మహిళా ఫెస్ట్‌ను రెండు రోజుల పాటు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు మహిళా ఫెస్ట్ అధ్యక్షురాలు రావి శారద తెలిపారు. సోమవారం బాలోత్సవ భవన్‌లో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఫెస్ట్‌లో భాగంగా విజయసాధనే లక్ష్యంగా పురోగమించే యువతులకు సంబంధించిన కార్యక్రమాలను మూడు వేదికల మీద నిర్వహించనున్నట్లు చెప్పారు. 7వ తేదీన మహిళలు, విద్యార్థినులకు వ్యక్తిగత, బృంద స్థాయిలో శాస్త్రీయ నృత్యాలు, అభ్యుదయ గీతాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 8న పద్య పఠనం, జానపద నృత్యాలు, కోలాటం, వక్తృత్వం, లఘు నాటికలు, ఏకపాత్రాభినయం, వెజిటబుల్ కార్వింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదీ సాయంత్రం మనసులో మాట కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిపుణులైన మహిళలు సవాళ్లనెదుర్కొంటూ ఆయా వృత్తుల్లో సాగిస్తున్న కృషి, భవిష్యత్తు అవగాహనను తెలియజేస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన సంస్థలకు ఓవరాల్ ఛాంపియన్ అందించనున్నట్లు వివరించారు. విద్యాకన్నా, సత్యవతి, వి.కామేశ్వరి, డి.రమాదేవి, కె.శ్రీదేవి, కె.స్వరూపరాణి, అనీషా, పూర్ణిమ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శారద, రమాదేవి తదితరులు

కబడ్డీ సంఘంలో అవకతవకలపై విచారణకు వినతి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా కబడ్డీ సంఘంలో అవకతవకలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆంధ్రా కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కేపీ రావు.. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడిని కోరారు. సోమవారం ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో రవినాయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ బదులిచ్చారు. అనంతరం కేపీ రావు మాట్లాడుతూ.. కొంత మంది వ్యక్తుల కారణంగా కబడ్డీ సంఘం కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ వయసు ధ్రువపత్రాలతో క్రీడాకారుల ఎంపికలు, నిధుల గోల్‌మాల్ వంటి అంశాలపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా సంఘాల పదవుల్లో క్రీడాకారులే ఉండాలని స్పష్టం చేశారు. తనపై కూడా విచారణ చేసి ఆరోపణలు తప్పు అని తేలితే కేసు నమోదు చేయవచ్చని ఆయన తెలిపారు.

ప్రజలపై విద్యుత్తు భారం పడకుండా సీఎం చర్యలు

లబ్బీపేట(విజయవాడ సిటీ): : 2019-2024 మధ్య కాలానికి రూ.4,498 కోట్ల ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసేందుకు ఏపీఈఆర్సీ.. కూటమి ప్రభుత్వానికి లేఖ రాసిందని, ప్రజలపై ఆ భారం పడకుండా ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 2019లో మిగులు విద్యుత్తు రాష్ట్రంగా ఏపీ ఉంటే.. తరువాత వచ్చిన జగన్‌రెడ్డి ఛార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్తు వ్యవస్థను గాడిన పెట్టేందుకు సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ముస్తాక్ అహ్మద్

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 77 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీ ఎం.రాజారావులు ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా భూ, ఆస్తి వివాదాల ఫిర్యాదులు 44, మహిళా నేరాలు 8, కుటుంబ కలహాలు 5, మోసాలు 1, ఇతర ఫిర్యాదులు 19 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి సత్వరమే పరిష్కరించాలని వారు ఆదేశించారు.


వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీపీ రాజారావు

విమానాశ్రయంలో కార్మికుడి మృతి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో ఎయిర్ ఇండియా గ్రౌండ్ హ్యాండిలింగ్ పనుల నిమిత్తం వచ్చిన ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కేరళ రాష్ట్రంలోని కోజికోడు ప్రాంతానికి చెందిన అదిధి ఆనంద్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వాహనం గేర్‌లో ఉండడాన్ని గమనించని ఆనంద్.. ఆగిపోయిన ట్రాక్టర్‌ను సరిచేసే క్రమంలో ఒక్కసారిగా ఇంజిన్ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న స్థానికులు హుటాహుటిన గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

శిక్షణకు కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ప్రత్యేక శిక్షణ కోసం దిల్లీ వెళ్లారు. దాదాపు 20 రోజులపాటు ఆయన శిక్షణలో ఉంటారు. ఐఏఎస్ అధికారులకు ఇచ్చే శిక్షణకు కమిషనర్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. ధ్యానచంద్ర అందుబాటులో లేనందున నగరపాలక సంస్థ అదనపు కమిషనర్(పి) డి.చంద్రశేఖర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

వివాహిత దారుణ హత్య

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెం మండలం రాఘవాపురంలో నిద్రిస్తున్న వివాహిత సంగెపు సంధ్యా శ్రావణి (28) దారుణహత్యకు గురైంది. ఆదివారం రాత్రి తన ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఆమె సోమవారం తెల్లవారుజామున విగతజీవిగా పడి ఉన్న విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మైలవరం సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమె కొన్నాళ్లుగా విస్సన్నపేటలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేసేది. ఆమె మామ అనారోగ్యానికి గురి కావడంతో భర్త నాగరాజు తండ్రిని తీసుకొని 20 రోజుల క్రితం గుంటూరు వెళ్లి అక్కడ ఆసుపత్రిలో చేర్పించి.. అక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి శ్రావణి ఇద్దరు పిల్లలు వారి వెనక ఇంట్లోని నానమ్మ వద్ద నిద్రించగా శ్రావణి ఒక్కతే గదిలో ఉంది. ఆధారాల సేకరణకు క్లూస్, ఎఫ్ఎస్ఎల్ బృందాలు వచ్చాయి. మృతురాలి తండ్రి తానోళ్ల వీర వెంకయ్య తన కుమార్తెను గుర్తు తెలియని వ్యక్తులు చంపారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.


సంధ్యా శ్రావణి (పాతచిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

రోడ్డెక్కిన బూడిద లారీల యజమానులు

కొండపల్లి, న్యూస్‌టుడే : స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వకుండా గుత్తేదారు వాహనాలకే బూడిద లోడింగ్ చేయడంపై ఇబ్రహీంపట్నం బూడిద లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు నుంచి తమకు ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో వారు కొంత కాలం నిరసనలు వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కొన్ని హామీలు ఇవ్వగా ఆందోళన విరమించారు. అయితే అవి నెరవేరలేదని సోమవారం బ్రిక్స్ కంపెనీలకు వెళుతున్న బూడిద లారీలను అడ్డుకున్నారు. ఈ వివాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి లారీ, టిప్పర్ యజమానులకు సర్ది చెప్పి లారీలను పంపించారు. హామీలు అమలు కాకపోతే మళ్లీ లారీలను అడ్డుకుంటామని వారు పేర్కొనడం గమనార్హం.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఆసుపత్రిలో వైద్యసేవలపై కలెక్టర్ ఆరా

మైలవరం, న్యూస్‌టుడే : కలెక్టర్ లక్ష్మీశా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్థానికంగా ఉన్న ఆయన కార్యాలయంలో అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గవ్యాప్తంగా 1485 మందికి రూ.12.29 కోట్ల చెక్కులను, ఎల్‌ఓసీలను అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపరూ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : నూజివీడు- గంపలగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో నూజివీడు ఆర్టీసీ డిపో నుంచి వయా రెడ్డిగూడెం నుంచి నెమలి, ఉమ్మడి దేవరపల్లి వరకు ఉదయం, సాయంత్రం బస్సులు నడిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులే తిరగక రెడ్డిగూడెం మండలంలోని గ్రామాలతో పాటు ఎ.కొండూరు, గంపలగూడెం గ్రామాల ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా ఇక్కట్లు పడుతున్నారు. రెడ్డిగూడెం మండలంలోని గ్రామాలు, ఎ.కొండూరు మండలంలో ప్రజలు ప్రముఖ పుణ్యక్షేత్రం నెమలి వేణుగోపాలస్వామి దర్శనానికి ఆటోల్లో వెళుతున్నారు. గంపలగూడెం మండల ప్రజలు ఈ మండలాలకు రావాలన్నా అదే పరిస్థితులు. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి బస్సుల సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభ చూపారు.. బహుమతులు సాధించారు



విజేతలతో శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ మేడా మోహన్‌రావు, ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ జైపాల్ రెడ్డి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన వెలికి తీయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఛైర్మన్ మేడా మోహన్‌రావు అన్నారు. జనరల్ నాలెడ్జి, సమకాలీన అంశాలపై సోమవారం విస్సన్నపేట డీఈఎస్‌పీ కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కె.బిందు మౌనిక, పి.సాయి కీర్తన, ఆర్.రేష్మ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కళాశాల ఛైర్మన్ మేడా మోహన్‌రావు, ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మేడా శ్రీహర్ష, దీప్తి, ఏవో కె.శ్రీనివాస్, పర్యవేక్షకుడు జి.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వగ్రామంపై మమకారం అభినందనీయం



హనిమిరెడ్డి కుటుంబ సభ్యులతో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

వెల్వడం (మైలవరం), న్యూస్‌టుడే : విదేశాల్లో డబ్బు సంపాదించి.. స్వగ్రామంపై మమకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్వడంలో ప్రవాస భారతీయుడు లకిరెడ్డి హనిమిరెడ్డి, విజయలక్ష్మి, కుటుంబ సభ్యుల సొంత నిధులతో గ్రామంలోని వరవకట్ట మీదుగా తోలుకోడు వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధిగా చేశారు. దాత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే రోడ్డు ప్రారంభించి దాత స్ఫూర్తిని కొనియాడారు. తెదేపా రాష్ట్ర నాయకుడు కోమటి సుధాకర్‌రావు, జయప్రకాశ్‌రెడ్డి, నిర్వత రావు, అక్కల గాంధీ, సర్పంచి ధర్మతేజ పాల్గొన్నారు.

దాత స్ఫూర్తి ప్రేరణగా నిలవాలి

హనిమిరెడ్డి స్ఫూర్తిని ప్రేరణగా తీసుకొని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వెల్వడంలో హనిమిరెడ్డి ఏర్పాటు చేసిన రహదారిని కలెక్టర్ సందర్శించి... సేవలను ప్రశంసించి.. పీ4 ధ్రువపత్రాన్ని అందజేశారు.

తోటలో వికసించి.. మార్కెట్లో వాడి..



కోయకుండా వదిలేసిన పూలు

కాగడా మల్లె.. పూల మాలల్లో, అలంకరణల్లో ప్రధానపాత్ర పోషించే పువ్వు. గత నెల వరకు కిలో రూ.1200 పలికింది. నేడు కిలో రూ. 50 లోపు పడిపోగా కోత కూలి రాదని రైతులు తోటల్లో వదిలేశారు. పెద్ద మొత్తంలో ధరలు చూసిన రైతులు ఇప్పుడు నష్టాలకు జడిసి కోయకుండా వదిలేశారు. మండలంలోని చంద్రగూడెంలో 30 ఎకరాల వరకు తోటలు సాగవుతుండగా ఏ తోటలో చూసినా విచ్చుకున్న పువ్వులు కనిపిస్తున్నాయి. దీంతో జాతీయ రహదారి పక్కన మాల కట్టి అమ్ముకునే చిరు వ్యాపారులు కోసుకుని, కనకాంబరాలతో కలిసి కట్టి విక్రయిస్తున్నారు. రైతులు శుభ ముహూర్తాల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. – న్యూస్‌టుడే, మైలవరం

మళ్లీ అవే తప్పులు

☆ పట్టాదారు పాసు పుస్తకాల జారీలో సిత్రాలు ☆ రీ సర్వే చేసినా అదే తీరు



దాసుళ్లపాలెంలో తప్పులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

మైలవరం, న్యూస్‌టుడే

మైలవరం మండలం దాసుళ్లపాలేనికి చెందిన అప్పిడి మధుసూదనరెడ్డి కొంత భూమిని తన కుటుంబ సభ్యులతో కలిసి భాగ విభజన చేసుకున్నారు. గతంలో ఆ గ్రామంలో రీసర్వే చేసి, అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ముద్రించిన జాయింట్ ఎల్‌పీఎం అంటూ పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చారు. దీనికి రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ఒప్పుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే చేసి.. మళ్లీ పాసు పుస్తకం అందజేసింది. అందులోనూ భూమిని జాయింట్‌గా పేర్కొన్నారు. అధికారులకు చెప్పగా పుస్తకం మార్పు కోసం ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోమని సూచించారు. ఇది.. ఆ ఒక్క రైతు పరిస్థితి కాదు. రీసర్వే చేసిన గ్రామాల్లో చాలామంది పాసు పుస్తకాల్లో ఇలాగే తప్పులు దొర్లాయి.

❖ గత వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరిట జరిగిన తప్పులతో రైతుల తలలు బొప్పి కట్టాయి. సంయుక్త ఖాతాలు, కొలతల్లో తేడాలు.. ఇలా కుప్పలుగా తప్పులు దొర్లితే రైతులకు నేటికీ పొలాలపై రుణాలందని దుస్థితి. వాటిని సవరించి, పుస్తకాలను అందించాలని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కానీ మళ్లీ అవే తప్పులు ఎదురవుతుంటే రైతులు అయోమయానికి గురవుతున్నారు.

షరా మామూలే

గతంలో సర్వే చేసిన అధికారుల తీరుతో దాసుళ్లపాలెంలో చాలామంది రైతులకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎంల పేరిట పాసు పుస్తకాలను జగన్ చిత్రంతో పంపిణీ చేశారు. తీరా వాటితో రుణం తీసుకోవటానికి బ్యాంకులకు వెళ్తే తిరస్కరించారు. చివరికి ఈ క్రాప్ బుకింగ్ కూడా జరగకుండా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ గ్రామంలో మొత్తం 2,200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని రీసర్వే చేసి, 519 ఎల్‌పీఎంలను కేటాయించారు. వాటి సవరణలో భాగంగా సోమవారం గ్రామంలో నిర్వహించిన సభలో 318 పాసు పుస్తకాలను అందజేశారు. అందులో తప్పులు చూసి అక్కడే ఉన్న అధికారులతో రైతులు మొర పెట్టుకున్నారు. ఇలా 25 మందికి పైగా ఇంకా ఇబ్బందులు తొలగలేదని చెప్పారు.

పరిశీలించి.. దృష్టి సారిస్తాం

భాగ విభజన చేశాక.. ఉమ్మడి ఎల్‌పీఎంగా పుస్తకం వస్తే గ్రామ సచివాలయాల్లో పుస్తకం మార్చేందుకు దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తాం. కొలతల్లో తేడాలను సర్వే ద్వారా పరిశీలిస్తాం. పక్క రైతుల చేలల్లో భూమి విస్తీర్ణం ఉన్నట్లు తేలితే తొలగించి.. రైతుల పాసు పుస్తకాల్లో నమోదు చేస్తాం.

-అబ్దుల్ దరియా, తహసీల్దార్, మైలవరం

క్రీడల్లో కూడా ప్రతిభ చాటండి

జి.కొండూరు, న్యూస్‌టుడే : విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కోరారు. మండలంలోని కుంటముక్కల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సోమవారం ఆయన సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.లక్ష విలువ చేసే క్రీడా సామగ్రిని విద్యార్థినులకు బహూకరించారు. ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల లోటు లేకుండా చేసి, వారిని భవిష్యత్తుతో ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ బ్యూలా, కూటమి నాయకులు అక్కల రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన దారి.. ఆనవాళ్లు చెదిరి..



పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లే దారి పెద్ద గుంతలతో ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గం పూర్తిగా దెబ్బతింది. బస్టాండ్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, విద్యార్థులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పి కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తిరువూరు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై సతీష్‌కుమార్, పద్మ, గిరిజామణి తదితరులు

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించి మెరుగైన ఫలితాలు సాధించాలని జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని వెలగలేరు చనుమోలు ఫకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసగించారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడపరాదని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని సూచించారు. పోక్సో చట్టం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై గిరిజామణి, ప్రధానోపాధ్యాయిని కె.పద్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రంగారావు

పైతాన్ ఫుల్‌స్టాక్‌పై కార్యశాల

మైలవరం, న్యూస్‌టుడే : పీఎం ఉషా పథకం కింద స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎక్సెల్లర్ సంస్థ సహకారంతో సర్టిఫికేషన్ కోర్సులపై కార్యశాలను ప్రిన్సిపల్ పి.రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైతాన్ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవగాహన, నైపుణ్యాల పెంపు నిమిత్తం కార్యశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి వెంకటాద్రి ప్రోగ్రామింగ్‌లో పైతాన్ కీలకపాత్ర వహిస్తోందని, విద్యార్థులు చక్కగా నేర్చుకోవాలని సూచించారు. అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన

మైలవరం: మండలంలోని వెల్వడంలో నూతనంగా నిర్మించిన రెండు వెల్‌నెస్ కేంద్ర, భవనాల నిర్మాణానికి స్థానిక శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో వైద్యసేవల బలోపేతానికి ప్రభుత్వం రూ.9.35 కోట్లు కేటాయించినట్లు ఆయన చెప్పారు. అనంతరం వీబీ జీ రామ్ జీ గ్రామసభలో పాల్గొని పథకంపై వివరించారు.

నేడు రహదారుల అభివృద్ధికి.. నియోజకవర్గంలోని పలు రహదారుల అభివృద్ధికి 6న మధ్యాహ్నం 3 గంటల తర్వాత మంత్రి బీసీ జనార్దనరెడ్డితో కలిసి స్థానిక శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. జి.కొండూరు మండలం కందులపాడు వద్ద విజయవాడ, విస్సన్నపేట రహదారికి, మండలంలోని గణపవరం అడ్డరోడ్డు వద్ద గణపవరం, మద్దుల పర్వ వరకు రహదారి అభివృద్ధి పనులకు, మైలవరం-నూజివీడు మార్గంలోని రెండో విడత అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొంది.

మధిర కెనాల్‌కు నిలిచిన సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : వారబందీ పద్ధతి అమల్లో భాగంగా ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు సోమవారం నుంచి సాగర్ జలాల సరఫరా ఆపినట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. 12 నుంచి కాల్వలకు మళ్లీ సరఫరా చేస్తారని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? పుత్రేలలో మందుల దుకాణాల్లో అధిక ధరలకు మందులను విక్రయిస్తున్నారు. **-స్థానికులు** ✔ మందుల దుకాణాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. **-కె.లక్ష్మీ కల్యాణి, తహసీల్దార్, విస్సన్నపేట** – న్యూస్‌టుడే, విస్సన్నపేట

? కొండపల్లి ఖిల్లా రోడ్డు పాయింట్ జాతీయ రహదారిపై వీధి దీపాలు వెలగడం లేదు. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ వారికి సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. **-శాంతాలాల్, కొండపల్లి**
✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వెంకటరత్నం, పురపాలిక సంఘ కమిషనర్** – న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం.. ✦ పట్టణంలోని 9వ వార్డులో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుని.. మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని ప్రవీణ్‌కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ పారిశుద్ధ్య విభాగ అధికారి సంతోష్ సిబ్బంది పంపి కాలువల్లో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు

గ్రామసభలను అడ్డుకోవాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : 20 ఏళ్లుగా దేశవ్యాప్తంగా చట్టరీత్యా అమల్లో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి తిలోదకాలు ఇచ్చేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన వి.బి.జి.రాంజీ పథకాన్ని ఆమోదింప చేసుకునేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను అడ్డుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రంగాపురం గ్రామ సచివాలయం గ్రామ సభ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా నాయకుడు బి.రమేష్ ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, నాయకులు ఎ.సుబ్బారావు, సోమయ్య, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పుత్రేల ఎస్సీకాలనీలో ఇటీవల మృతి చెందిన తెదేపా అభిమాని కొలికపోగు భాస్కరరావు కుటుంబానికి తెదేపా మండల కోశాధికారి గాదె వెంకటేశ్వరరావు రూ.పదివేలు, బియ్యం సాయంగా అందజేశారు. నాయకులు కొండా భాస్కరరావు, కొలికపోగు శీను, దుబ్బాక యోహాను పాల్గొన్నారు.

ఎన్నెస్పీ కాలువలో పడి ఒకరి మృతి

తిరువూరు న్యూస్‌టుడే : పట్టణంలోని సుగాలి కాలనీకి చెందిన బాణావత్ మణిరామ్ (62) ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాలువలోకి జారిపడి మృతి చెందాడు. ఇతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మతి స్థిమితం సరిగా లేదు. సోమవారం ఎన్నెస్పీ కాలువ వద్దకు వెళ్లినపుడు ఫిట్స్ వచ్చి కాలువలోకి జారి నీటిలో పడి.. ఊపిరాడక మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కాల్వ నుంచి మృతదేహాన్ని వెలికి తీసి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోదకుల తప్పిదాలే ప్రమాదాలకు కారణం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై జూపూడి వద్ద సోమవారం ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు రహదారి భద్రత, శిరస్త్రాణం వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు మాట్లాడుతూ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధికం చోదకుల తప్పిదాల వల్ల జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి వాహన చోదకుడు తన భద్రతతో పాటు ఇతర వాహనాల చోదకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనం నడపాలని సూచించారు. శిరస్త్రాణం ధరించడం వల్ల ప్రమాదాల నుంచి స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడవచ్చన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ప్రాణనష్టం జరుగుతుందని ఇటీవల జరిగిన ప్రమాదాలను విశ్లేషించి వివరించారు.

చీరల దొంగల ముఠా అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రెండో పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో చీరల దొంగల ముఠాను అరెస్టు చేశామని డీఎస్పీ రఘువీర్ విష్ణు సోమవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన మేచారపు రజని, పొన్న చుక్కమ్మ, మైలవరం దేవుడు చెరువుకు చెందిన పొన్నూరు మల్లి, మేచారపు లక్ష్మి ఆదివారం భీమవరంలోని వస్త్ర దుకాణానికి వెళ్లారు. దుకాణంలో రద్దీగా ఉండగా రూ.80 వేలు విలువైన 5 చీరలు అపహరించారు. దీనిపై వస్త్ర దుకాణ యజమాని కంభంపాటి ఝాన్సీరాణి ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించగా దొంగతనానికి పాల్పడిన ముఠా గొల్లవానితిప్ప రోడ్డులో పట్టుబడ్డారు. ముఠాలోని కొందరిపై పలు స్టేషన్లలో గతంలో కూడా కేసులు ఉన్నాయి. సీఐ జి.కాళీచరణ్, ఎస్సై ఫజుల్ రెహ్మాన్, సిబ్బంది కేసు వెంటనే ఛేదించారు.



ప్రదర్శనలో కూటమి నాయకులు రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు

ఉపాధికి మెరుగైన హామీ

జి.కొండూరు, న్యూస్‌టుడే : వికసిత్ భారత్- జీ రామ్ జీతో ఉపాధికి మెరుగైన హామీ లభిస్తుందని తెదేపా మండల కార్యదర్శి లంకా నాగేశ్వరరావు అన్నారు. కుంటముక్కల పంచాయతీ ఆవరణలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో కూటమి నాయకులు, పాల కేంద్రం అధ్యక్షుడు లంకా రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరితో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు 125 రోజులు పని లభిస్తుందని అవగాహన కల్పించారు.

మైలవరం, తిరువూరు : వీబీ జీ రామ్ జీ పథకం గ్రామసభలు సోమవారం మండలవ్యాప్తంగా 13 పంచాయతీల్లో నిర్వహించారు. మార్పులను వివరించారు. తిరువూరు మండలం ఆంజనేయపురంలో గ్రామసభ నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.

దాసుళ్లపాలెం (మైలవరం) : నేలను నమ్ముకుని జీవించే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దాసుళ్లపాలెం పాఠశాలలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన పుస్తకాలను రైతులకు ఆయన అందించారు. తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి, నాయకులు అక్కల గాంధీ, రాఘవరెడ్డి, సురేష్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా అభివృద్ధికి కృషి చేయాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తెదేపా ఎన్టీఆర్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎంపికైన ఆకుల రాధాకృష్ణ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్‌ను విజయవాడ ఎంపీ కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణకు ఎంపీ అభినందనలు తెలిపి తెదేపా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు నెక్కళపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయ నిర్మాణం చంద్రబాబు ఘనతే



షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ముక్తియార్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి సవిత



బెస్త కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మంత్రి సవిత, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : భోగాపురం విమానాశ్రయం నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఏపీ షేక్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వి.ఎస్.ముక్తియార్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గొల్లపూడిలోని బీసీభవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయ నిర్మాణం, రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోవటంపై చర్చించేందుకు వైకాపా అధినేత జగన్ శాసనసభకు రావాలని పేర్కొన్నారు. భోగాపురంలో విమానం ల్యాండ్ కావటంతో ప్రజల కళ్లలో ఆనందం వెల్లివిరిసిందని తెలిపారు. మరో ఆరునెలల్లో విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని పేర్కొన్నారు. ముక్తియార్‌తో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు : దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన బొమ్మన శ్రీధర్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎన్టీఆర్ జిలాల గొల్లపూడిలోని బీసీ భవన్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పరిపాలన సాగిస్తున్నట్లు వెల్లడించారు. బాపట్ల శాసనసభ్యుడు వేగేశ్న నరేంద్ర వర్మ మాట్లాడుతూ తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అందించిన స్ఫూర్తితో బీసీలకు పార్టీలో ప్రత్యేక స్థానం లభిస్తుందని తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు కొల్లు పెద్దిరాజు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలతో త్వరలో చెత్త తొలగింపు

గొల్లపూడి, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఆధునిక యంత్రాల ద్వారా చెత్త తొలగించేందుకు చర్యలు త్వరలో చేపడతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. గొల్లపూడిలో నిర్వహించిన స్వచ్ఛ గ్రామ పంచాయతీ సభలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, మార్పు తీసుకు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంకల్పమని తెలిపారు. మండలానికి ఒక అత్యాధునిక యంత్రాన్ని అందించాలనే ఆలోచన చేస్తున్నట్లుగా వెల్లడించారు. మొదటగా నియోజకవర్గానికి యంత్రం అందిస్తామని పేర్కొన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం.. ఇబ్రహీంపట్నం గ్రామీణం: తుమ్మలపాలెం, ఈలప్రోలులో సోమవారం స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామసభలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. గ్రామస్థులకు వికసిత భారత్ జీ రాంజీ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి రంగయ్య, ఎంపీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలు, కాలనీ గృహాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గతంలో స్థలాలు, గృహాల కోసం పేదలు అందించిన అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా అని అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం రెట్టింపు చేయాలని నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు టి.కృష్ణయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్‌కే నాగుల్ మీరా, జి.రామకృష్ణ తదితరులు రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు సమస్యపై వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కొండపల్లి మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు డీపీవీ స్కూలు, కొత్తగేటు, అంబేడ్కర్‌నగర్, వడ్డేనగర్, చైతన్య నగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో 500 మంది వరకు నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరుతూ.. కౌన్సిలర్ మామిళ్లపల్లి చైతన్య స్రవంతి నేతృత్వంలో కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పలువురికి ఇళ్ల స్థలాలు ఉన్నా, రెవెన్యూ శాఖ నుంచి పొజిషన్ పత్రం ఇవ్వడం లేదని తెలిపారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై చర్యలు కోరుతూ.. మైలవరం మండలం చంద్రగూడెంలో తనకు విక్రయించిన భూమినే, మరొకరి అమ్మేసి డబుల్ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన రియల్ ఎస్టేట్ సంస్థ/ దానికి సంబంధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడ గ్రామీణ మండలం గొల్లపూడి, రామరాజ్యనగర్‌కు చెందిన మామిడి దుర్గారావు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.



గోసవీడు సంతాన వేణుగోపాల స్వామి గుడిలో మూలవిరాట్

వైభవంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని వైష్ణవాలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే గోదాదేవి తిరుప్పావై పాశురాలు అర్చకులతో కలిసి భక్తులు పఠించారు. నెమలి, గోసవీడు, వినగడపలోని వేణుగోపాలస్వామి, గంపలగూడెం, ఊటుకూరులోని సీతారామచంద్రస్వామి, పెనుగొలను రంగనాథస్వామి ఆలయాల్లో గోదా రంగనాథులకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

శివాలయాల్లో అభిషేకాలు



కొత్తపల్లి : శంకరుని గుడిలో శివలింగం అలంకరణ

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, గంపలగూడెం, పెనుగొలను, మేడూరు, పెనుగొలను, ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయాల్లో సోమవారం శివలింగాలకు అర్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

రూ.4 దొంగతనం.. 51 ఏళ్ల తర్వాత నిర్దోషిగా తీర్పు

• ఇన్నేళ్లు పరారీలోనే నిందితుడు



గడియారంతోపాటు 4 రూపాయలు, వేటి రుమాలు దొంగతనం చేసిన కేసులో నిందితుడిని 51 ఏళ్ల తర్వాత నిర్దోషిగా ప్రకటిస్తూ మహారాష్ట్రలోని పుణె కోర్టు తీర్పు ఇచ్చింది. 1974లో నమోదైన ఆ దొంగతనం కేసులో సరైన ఆధారాలు లేకపోవడంతో నిందితుడిని నిర్దోషిగా విడుదల చేసింది. 1974లో పుణెలోని బండ్ గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదైంది. గులాబ్ సాహు జాదవ్, ముకుంద కెర్బా వాగ్మారే, రాజారాం తుకారాం కాలేపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఆ తర్వాత గులాబ్ సాహు జాదవ్, ముకుంద కెర్బా వాగ్మారే నేరం అంగీకరించడంతో 1975 ఏప్రిల్ 10న దోషులుగా నిర్ధారించారు. కానీ రాజారాం కాలే అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. 51 సంవత్సరాలుగా పరారీలో ఉన్నప్పటికీ కచ్చితమైన ఆధారాలు లేకపోవడంతో.. పుణె కోర్టు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్‌జే చవాన్ 2025 డిసెంబరు 26వ తేదీన రాజారాం కాలేపై ఉన్న అన్ని వారెంట్లను రద్దు చేశారు. ఆ తర్వాత ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

శరీర బరువు సమస్యలపై యువతలో తీవ్ర ఆందోళనలు

• ఎయిమ్స్ తాజా అధ్యయనంలో వెల్లడి



దిల్లీ: శరీర బరువు సమస్యల గురించి యువత తీవ్రంగా ఆందోళన చెందుతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. తక్కువ బరువు, ఊబకాయం కలిగిన యువత స్వీయ స్పృహ గురించి బాధపడటం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొంది. 1,000 మంది యువతను దిల్లీ ఎయిమ్స్ తమ సర్వేలో భాగం చేయగా.. అందులో దాదాపు సగం మంది తమ శరీర బరువు సంబంధిత సమస్యలతో ఆందోళన చెందుతున్నట్లు వెల్లడించారు. తమ శరీర బరువుపై ఇతరుల మాటల ద్వారా ఇబ్బందులు పడుతున్నామని 37.5 శాతం మంది పేర్కొనగా, తమ బరువుపై తాము దిగులు చెందుతున్నట్లు 24.5 శాతం మంది చెప్పారు. ఈ వివరాలు ఎడ్యుకేషన్, హెల్త్ ప్రమోషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. యువతలో మానసిక శ్రేయస్సును ప్రభావితం చేయడంలో శరీర బరువు ఒక కీలకాంశమని, వారిలో బరువు సంబంధిత ఆందోళనలను పరిష్కరించడంలో సమగ్ర ఆరోగ్య విధానాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని అధ్యయనంలో పాలుపంచుకున్న వైద్య నిపుణులు పేర్కొన్నారు.

గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు కన్నేశారు?

వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించి అనూహ్యంగా అమెరికాకు తీసుకుపోయిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- ఇప్పుడు గ్రీన్‌లాండ్ విషయంలో కఠినంగా మాట్లాడుతుండడం ఐరోపా దేశం డెన్మార్క్‌లో గుబులు రేపుతోంది. అమెరికాకు రక్షణపరంగా ఎంతో కీలకమని భావిస్తున్న గ్రీన్‌లాండ్‌ను గుప్పిటపట్టే దిశగా ఆయన పావులు కదుపుతున్నారు. గ్రీన్‌లాండ్ చాలా కీలకమని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ఇప్పుడే కొత్త కాదు. అధ్యక్షుడిగా తన తొలి పదవీ కాలంలోనే ఆయన ఈ అంశంపై మాట్లాడారు. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదని అప్పట్లో ట్రంప్ ప్రతిపాదనను డెన్మార్క్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఈ ద్వీపం విషయంలో ట్రంప్ దూకుడు మరింత పెరిగింది. ఇంతకీ ఈ ద్వీపంపై ట్రంప్ ఎందుకు కన్నేశారు?



అత్యంత కీలక ప్రాంతం..

గ్రీన్‌లాండ్.. ప్రపంచంలోనే అతి పెద్ద ద్వీపం. జనాభా కేవలం 57 వేలు. దాదాపు 80 శాతం భూమి మంచుతోనే ఉంటుంది. భౌగోళికంగా అమెరికాకు దగ్గరగా ఉన్నా.. ఇది డెన్మార్క్ దేశంలో భాగం. 1979లో జరిగిన రెఫరెండంలో ఈ ద్వీపానికి స్వతంత్ర ప్రతిపత్తి లభించింది. విదేశీ వ్యవహారాలు, రక్షణ అంశాలను మాత్రమే డెన్మార్క్ పర్యవేక్షిస్తుంది. భౌగోళికంగా ఈ ద్వీపం కీలక ప్రాంతంలో ఉంది. రష్యా, బ్రిటన్, అమెరికా, ఐరోపా యూనియన్‌కు మధ్యలో ఉంది. అందుకే గ్రీన్‌లాండ్ తమకు చాలా కీలకమని అగ్రరాజ్యం చెబుతోంది.

రక్షణ కోసమేనా..!

భద్రతా పరంగా గ్రీన్‌లాండ్ తమకు వ్యూహాత్మక ప్రాంతమని ట్రంప్ చెబుతున్నారు. అయితే. . రక్షణ అవసరాల పరంగా ఎప్పటి నుంచో ఆ ద్వీపం అమెరికాకు అండగానే నిలుస్తోంది. 1950 ల్లోనే డెన్మార్క్, అమెరికాల మధ్య సైనికపరమైన ఒప్పందం కుదిరింది. ఫలితంగా ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అగ్రరాజ్యం.. గ్రీన్‌లాండ్‌లో అనేక సైనిక స్థావరాలను నిర్మించింది. తర్వాత వాటిలో చాలా స్థావరాలను మూసివేసింది. ఇప్పుడు కొత్త వాటిని నిర్మించుకుంటామంటే.. డెన్మార్క్ తిరస్కరించే అవకాశాలు లేవు. ఎందుకంటే నాటోలో అమెరికా, డెన్మార్క్ సభ్యదేశాలు. ఇరు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అయినా గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకోవడం ఖాయమన్న రీతిలో ట్రంప్ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే.. ఇది కేవలం రక్షణ అవసరాల కోసం మాత్రమే కాదన్న విషయం స్పష్టమవుతోంది. గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలని గతంలోనూ అమెరికా ప్రయత్నించింది. 1946లో 100 మిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని ఇస్తామని డెన్మార్క్‌కు ఆశచూపింది. దాన్ని ఆ దేశం తిరస్కరించింది.

అరుదైన ఖనిజాలపై కన్ను!

వెనెజువెలా అధ్యక్షుడు మదురోను నిర్బంధించడానికి మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఓ కారణమని ట్రంప్ చెప్పుకొచ్చారు. అయితే దక్షిణ అమెరికా, కరీబియన్ దీవుల్లో వెనెజువెలాను మించి భారీస్థాయిలో డ్రగ్స్ రవాణా చేస్తున్న దేశాలు ఉన్నాయి. అయినా వెనెజువెలాపైనే ట్రంప్ దూకుడుగా వ్యవహరించటానికి అక్కడి చమురు నిక్షేపాలే కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పుడు గ్రీన్‌లాండ్ విషయంలోనూ అదే జరగనుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ పరంగా గ్రీన్‌లాండ్ తమకు అవసరమని ట్రంప్ చెబుతున్నా.. ఆ దేశంలోని దొరికే అరుదైన ఖనిజాలపైనే ఆయన గురి ఉందన్నది బహిరంగ రహస్యం. గ్రీన్‌లాండ్‌లో బంగారం, నికెల్, కోబాల్ట్ నిక్షేపాలు కూడా భారీస్థాయిలో ఉన్నాయి. వాటిపై అమెరికాలోని చాలా మైనింగ్ సంస్థలు కన్నేసి పావులు కదుపుతున్నాయి.

చైనా భయం కూడా!

అమెరికా ఆర్థిక వ్యవస్థకు గట్టి పోటీ ఇస్తున్న చైనా.. గ్రీన్‌లాండ్‌లోనూ భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్‌లో క్రియాశీలకంగా ఉంది. ఈ రంగంలో చైనా వాటా దాదాపు 11 శాతంగా ఉంది. డ్రాగన్ కేవలం గనులకే పరిమితం కాలేదు. ఆర్కిటిక్ ప్రాంతంలో కొత్త సముద్ర మార్గాల అన్వేషణలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. భూఉష్ణోగ్రత పెరగడంతో ఆర్కిటిక్‌లో మంచు కరిగి కొత్త మార్గాలు ఏర్పాటవుతున్నాయి. దీన్ని చైనా తనకు అనుకూలంగా మార్చుకుంటోంది. 2018లో చైనా తన ఆర్కిటిక్ విధానాన్ని ప్రకటిస్తూ.. కొత్త సముద్ర మార్గాలకు అత్యంత ప్రాధాన్యమివ్వబోతున్నామని పేర్కొంది. ఇది కూడా ట్రంప్ గుబులుకు కారణం కావొచ్చు. గ్రీన్‌లాండ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకుంటే.. చైనా, రష్యా లాంటి దేశాలకు చెక్ పెట్టొచ్చన్నది ట్రంప్ వ్యూహంగా ఉంది.

- నేషనల్ డెస్క్

మేం నిర్దోషులం

• అమెరికా కోర్టులో మదురో దంపతుల వాదన



మదురోను కోర్టు హౌస్ విచారణకు తీసుకెళ్తున్న అమెరికా అధికారులు

న్యూయార్క్, కారకాస్: ఆకస్మికంగా దాడులు చేసి తమ దేశానికి తీసుకొచ్చిన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను అమెరికా ప్రభుత్వం సోమవారం కోర్టులో ప్రవేశపెట్టింది. విచారణ సందర్భంగా.. తాము నిర్దోషులమని మదురో దంపతులు వాదించారు. తాను ఒక దేశానికి అధ్యక్షుడినని మదురో స్పష్టంచేశారు. వాదనల అనంతరం తదుపరి విచారణను కోర్టు మార్చి నెలకు వాయిదా వేసింది. మరోవైపు వెనెజువెలా జాతీయ అసెంబ్లీ సమావేశమై.. దాని కాలపరిమితిని ఐదేళ్లకు పొడిగించుకుంది. ఉపాధ్యక్షురాలైన డెల్సీ రోడ్రిగ్జ్.. వెనెజువెలా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. తొలుత జాతీయ అసెంబ్లీ స్పీకర్ ప్రమాణం తర్వాత, అధ్యక్షురాలిగా డెల్సీ ప్రమాణం చేశారు. ఇటు ఐరాస భద్రతా మండలి సమావేశమై వెనెజువెలాపై దాడుల గురించి చర్చించింది.

హెలికాప్టర్‌లో..

మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌లపై డ్రగ్ ట్రాఫికింగ్, అక్రమంగా ఆయుధాలను కలిగి ఉన్నారన్న అభియోగాలను మోపిన అమెరికా.. సోమవారం పొద్దున్నే బ్రూక్లిన్ జైలు నుంచి మన్‌హటన్ ఫెడరల్ కోర్టుకు తరలించింది.

■ ఉదయం 7.15 గంటల సమయంలో మదురో దంపతులను బ్రూక్లిన్ జైలు నుంచి సమీపంలోని క్రీడా మైదానంలో ఉన్న హెలికాప్టర్ వద్దకు తరలించారు. వారు హెలికాప్టర్ ఎక్కాక.. అది న్యూయార్క్ హార్బర్ మీదుగా మన్‌హటన్ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి సాయుధ శకటంలో మదురో దంపతులను కోర్టు వద్దకు తరలించారు.

■ వాస్తవానికి మదురో దంపతుల విచారణ మధ్యాహ్నం ప్రారంభమైంది. అంతకుముందు సుదీర్ఘ న్యాయ ప్రక్రియను పూర్తి చేయడానికి వారిని ముందుగానే తరలించారు.

■ అమెరికాలో సాధారణ పౌరులకు వర్తించే విచారణ విధానమే మదురో దంపతులకు వర్తిస్తుంది. జ్యూరీయే విచారణ జరుపుతుంది.

■ సార్వభౌమ దేశానికి అధినేతగా మదురోకు అరెస్టు నుంచి రక్షణ ఉంటుందని ఆయన తరఫు న్యాయవాదులు వాదించనున్నారు. 1990లో అప్పటి పనామా అధినేత నోరీగా మాదిరిగానే మదురోకు చుక్కెదురయ్యే అవకాశముంది.

■ కోర్టు సమీపంలో కొంత మంది అమెరికాకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసేందుకు వచ్చారు. పోలీసులు వారిని నిలువరించారు.

తప్పు చేయలేదు: మదురో

తాను ఏ తప్పూ చేయలేదని కోర్టులో మదురో వాదించారు. డ్రగ్స్ రవాణాకు పాల్పడలేదని న్యాయమూర్తి ఎదుట చెప్పారు. తాను గౌరవనీయ వ్యక్తినని వివరించారు. దేశానికి అధ్యక్షుడినని పేర్కొన్నారు. తనను బంధించారని తెలిపారు. ఆయన భార్య సిలియా కూడా తాను నిర్దోషినని స్పష్టంచేశారు.




గుమ్మడికాయ.. ఆరోగ్యానికి మేలయా!

క్వినోవాలో కన్నా ఎక్కువ ఫైబర్, అరటి పండులో కన్నా ఎక్కువ పొటాషియం ఉండే గుమ్మడికాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీని గుజ్జులో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. గుమ్మడికాయతో చేసిన పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోండి.

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

ఈపీఎఫ్ వేతన పరిమితి సవరణను పరిశీలించండి

• నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోండి: సుప్రీంకోర్టు




దిల్లీ: నెలకు రూ.15,000 వేతనం మించినవారిని కూడా 'ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)' పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత 11 ఏళ్లుగా పరిమితిని సవరించలేదని, అందువల్ల రూ.15,000 కంటే ఎక్కువ వేతనం ఉన్నవారు ఈ పథకం కింద సామాజిక భద్రత ప్రయోజనాలు పొందలేకపోతున్నారని నవీన్ ప్రకాశ్ నౌతియాల్ అనే ఉద్యమకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎ.సి. చందూర్కర్‌ల ధర్మాసనం సోమవారం దీనిపై విచారణ చేపట్టి ఆదేశాలు వెలువరించింది. "చాలాఏళ్లుగా వేతన పరిమితిని పెంచలేదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస వేతనాలు రూ.15,000 కంటే ఎక్కువే ఉన్నాయి. దీంతో చాలామందికి ఈపీఎఫ్‌వో లబ్ధి లభించడం లేదు" అని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధి లేకుండా పరిమితిని అప్పుడప్పుడు సవరిస్తున్నారని, ఒక్కోసారి 13-14 ఏళ్లు పడుతోందని చెప్పారు. సమానత్వ హక్కులకు అనేకమంది దూరమవుతున్నారని చెప్పారు. తమ ఉత్తర్వుతో కలిపి ఈ అంశాన్ని పిటిషనర్ రెండువారాల్లో కేంద్రానికి విన్నవించాలని, దానిపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని ధర్మాసనం పేర్కొంది.

వాన్స్ నివాసంలో చొరబాటుకు యత్నం

సిన్సినాటి: ఒహాయోలోని సిన్సినాటిలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నివాస భవనంలో చొరబడేందుకు ఆదివారం అర్ధరాత్రి ఓ ఆగంతుకుడు విఫలయత్నం చేశాడు. వాన్స్, ఆయన కుటుంబం ఆదివారం మధ్యాహ్నం వరకు అందులోనే ఉండి ఆ తర్వాత వాషింగ్టన్‌కు చేరుకుంది. నివాసంలో పెద్ద శబ్దం రావడంతో సీక్రెట్ సర్వీస్ అధికారులు వెళ్లి పరిశీలించారు. ఓ వ్యక్తి అక్కడి కిటికీల అద్దాలను సుత్తితో పగులగొట్టినట్లు బయటపడింది. ఓ కిటికీ ద్వారా ఇంట్లోకి చొరబడే ప్రయత్నంలో ఆ వ్యక్తి ఉండగా నిర్బంధించారు. అక్కడే ఉన్న సీక్రెట్ సర్వీస్ వాహనాన్ని కూడా ఆ వ్యక్తి ధ్వంసం చేశాడని అధికారులు తెలిపారు.

పశ్చిమార్ధ గోళంలో మరింత విస్తరిస్తాం: ట్రంప్



అమెరికా శక్తిని పశ్చిమార్ధ గోళంలో మరింతగా విస్తరించాలని భావిస్తున్నామని అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఒక రోగి అని, కొకైన్ తయారు చేయడాన్ని, అమ్మడాన్ని ఆయన ఇష్టపడతారని వ్యాఖ్యానించారు. ఆయన ఎంతో కాలం కొనసాగబోరని స్పష్టం చేశారు. వెనెజువెలాపై ఆధిపత్యానికి రోడ్రిగ్జ్ అవకాశం ఇవ్వాలని, లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉత్తమ వైద్యులుగా రాణించాలి



విద్యార్థినికి డాక్టరేట్ బహూకరిస్తున్న ఉపకులపతి చంద్రశేఖర్, రాజయ్య, డీజీ నాగేశ్వరరావు, సాయి, రామోజీరావు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి వైద్య విద్యార్థి సమాజంలో ఉత్తమ వైద్యుడిగా ఎదుగుతూ ప్రజలకు సేవలందించడంలో ముందుండాలని డా.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.పి.చంద్రశేఖర్ అన్నారు. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లిలోని డాక్టర్ సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలోని బీడీఎస్-2020, ఎండీఎస్-2022 విద్యార్థుల స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య ఇతర ప్రతినిధులు, వైద్య కళాశాల డైరెక్టర్ జనరల్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ రామోజీరావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ భగవంతుడి తర్వాత భగవంతుడిగా ప్రజలు విశ్వసించేంత గొప్ప అదృష్టం ఒక్క వైద్యులకే దక్కిందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అతిథులు సత్కరించి బహుమతులు అందజేశారు. కళాశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు సందడి చేశారు. ఏవో పి.మధుసూదనరావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నగరంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారిగా సి.శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి తదితరులు అభినందించారు.

'ఆవకాయ్' కార్యక్రమానికి భద్రత కట్టుదిట్టం



పున్నమిఘాట్ వద్ద చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, తదితరులు

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానది ఒడ్డున భవానీపురం పున్నమిఘాట్ వద్ద నిర్వహించనున్న 'ఆవకాయ్' కార్యక్రమానికి భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్, సీపీ సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పున్నమిఘాట్ వద్ద భద్రత పరంగా ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దంత వైద్య కళాశాలకు చెవిరెడ్డి

కుటుంబ సభ్యులతో గడిపిన భాస్కర్‌రెడ్డి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ దంత వైద్య కళాశాలకు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సోమవారం జిల్లా జైలు అధికారులు తీసుకొచ్చారు. పంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు ఆయన జైలు అధికారులకు చెప్పగా, వారు వైద్య సహాయం నిమిత్తం తీసుకొచ్చారు. దంత వైద్యులు ఆయనకు సుమారు మూడు గంటల పాటు చికిత్స చేసి మందులు ఇచ్చి పంపించారు. ఆయన్ని కుటుంబ సభ్యులు కలిశారు. వారిని పోలీసులు యథేచ్ఛగా అనుమతించారు. సుమారు రెండు గంటల పాటు ఆయన, కుటుంబ సభ్యులు మాట్లాడుకున్నారు. దంత వైద్య కళాశాలకు నాలుగు సార్లు, ప్రభుత్వ ఆసుపత్రికి అనేకమార్లు భాస్కర్‌రెడ్డి ఏదో ఒక అనారోగ్య సమస్య చెప్పి వస్తున్నారు. వైద్యులు ఆయన బాగానే ఉన్నట్టు చెబుతున్నారు.

నవీన్‌కృష్ణ మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో మధ్యంతర బెయిల్ కోసం నిందితుడు నవీన్‌కృష్ణ సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. తన భార్య గర్భవతి అని, ఈ నేపథ్యంలో ఆమె దగ్గర ఉండాలని, నెల రోజులు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. తనకు వేడి నీరు కావాలని ఇదే కేసులో మరో నిందితుడు అనిల్‌చోక్రా వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని జైలు అధికారులను న్యాయాధికారి ఆదేశించారు.

విజ్ఞానం.. శాఖోపశాఖలై!

ఆకట్టుకుంటున్న ప్రభుత్వ విభాగాల స్టాళ్లు



ఈగల్ విభాగం స్టాల్..



విద్యాశాఖ, సమగ్ర శిక్షా విభాగాలు..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ శిబిరం

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రభుత్వ రంగ స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. ఏపీ పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా సహా అనేక ప్రభుత్వ విభాగాలు తమ స్టాళ్లను ఏర్పాటు చేసి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ, ఈగల్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ, ఈగల్.. లాంటి విభాగాలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఆయా సంస్థలకు సంబంధించిన నిత్య కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

• పుస్తక మహోత్సవ ప్రాంగణం మధ్యలో.. ప్రధాన సాహిత్య వేదికకు సమీపంలో విద్యాశాఖ, సమగ్రశిక్షకు చెందిన అతిపెద్ద స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు, ప్రభుత్వ బడుల్లోని క్రీడాపరికరాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్(ఏటీఎల్)తో కలిగే ఉపయోగాల గురించి వివరించే నమూనాలను ఈ స్టాల్‌లో ఉంచారు. ప్రధానంగా డిజిటల్ సాంకేతికతతో ప్రతి విద్యార్థి పాఠాలు నేర్చుకునేలా ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్స్, అభ్యసన లోపాలను గుర్తించడం లాంటివి ఈ స్టాల్‌లో వివరిస్తున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత పాఠాలను కేవలం పుస్తకాల్లోనే కాకుండా ప్రాక్టికల్‌గా అర్థం చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమ్ ల్యాబ్స్, వృత్తి విద్యా ల్యాబ్స్ గురించి ఇందులో వివరిస్తున్నారు.

మత్తుకు దూరంగా ఉండాలంటూ..

రేపటి తరం కోసం గంజాయి రహిత సమాజమే ధ్యేయంగా.. 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ ఈగల్ విభాగం వినూత్న తరహాలో ప్రచారం చేస్తూ ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంటోంది. ఈగల్ ఆధ్వర్యంలో.. మత్తు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ఏమేం చేస్తున్నారనే దానిపై అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. ఈగల్ క్లబ్స్ విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఎలా చేపడుతున్నారో తెలియజేసేలా పోస్టర్లు, చిత్రాలను ఏర్పాటు చేశారు.

• హెచ్ఐవీ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది తెలియజేస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీఎస్ఏసీఎస్) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేశారు. • ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మరో స్టాల్‌ను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను డిజిటల్ తెరలపై వివరిస్తున్నారు.


బందీలు కారు.. పుస్తక ప్రియులు

చూసేందుకు జైలులా కనిపిస్తోంది కదూ! కానీ ఇది జైలు కాదు. ఇంత మందిని ఇలా ఓ గదిలో ఊచల వెనుక బంధించిన ఘనత.. పుస్తకానికి దక్కుతుంది. వీరంతా మనిషి జీవన గమనానికి, తెలివికి, పరిపూర్ణత్వానికి కారణమైన పుస్తకం కోసం అన్వేషిస్తున్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఎమెస్కో బుక్‌స్టాల్‌ను ఇలా నాలుగు వైపులా గ్రిల్స్‌తో ఏర్పాటు చేశారు. పుస్తక ప్రియులు భారీగా తరలివచ్చి తమకు కావాల్సిన పుస్తకాలను వెతుకుతున్నారిలా. ఆధునిక కాలంలో సెల్‌ఫోనే సర్వస్వమై.. సోషల్‌మీడియా బాటలో నడుస్తున్న ఈ కాలంలోనూ పుస్తకానికి బందీలు అయిన ప్రజలే పుస్తక మహోత్సవాలు విజయవంతంగా జరగడానికి కారణమని ఈ చిత్రం తెలియచేస్తుంది.



- ఈనాడు, అమరావతి

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



ప్రసంగిస్తున్న ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: యువత మత్తుమందుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు సూచించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న 36వ విజయవాడ పుస్తక మహోత్సవానికి సోమవారం ఆయన విచ్చేశారు. ఈగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి.. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10వేల ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారు. ప్రభుత్వం, పోలీసులు తీసుకున్న చర్యలతో గంజాయి సాగును సున్నాకు తీసుకొచ్చారు. పుస్తక ప్రదర్శనకు భారీగా ప్రజలు వస్తుంటారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వారికి వివరిస్తే.. వారు ఎంతో మందికి అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుంది. డ్రగ్స్‌ను సమూలంగా రూపుమాపాలనే ఉద్దేశంతో ఈగల్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆపరేషన్ గరుడ, సేఫ్ క్యాంపస్‌తో పాటు ఎన్నో ఆపరేషన్స్ నిర్వహించాం. ఒడిశా నుంచి వచ్చే రైళ్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. సేఫ్ క్యాంపస్ ఆపరేషన్‌లో.. విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు సిగరెట్, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే జరిమానాలు విధిస్తున్నాం. రూ.75లక్షల జరిమానాలు విధించాం. బస్సులు, రైళ్లలో జరుగుతున్న డ్రగ్స్ రవాణాను.. ఆకస్మిక తనిఖీలు చేసి అరికడుతున్నాం' అని పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ పుస్తక మహోత్సవం నాలుగో రోజు సోమవారం జయంత్ విష్ణు నార్లిక్ వేదికపై చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విశ్రాంత మిలటరీ మేజర్ అశోక్ చిన్నారులను రెండు బృందాలుగా ఏర్పాటు చేసి.. ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జవాబులు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు.

సమాజ చైతన్యానికి దోహదం



పుస్తకాలు పరిశీలిస్తున్న రామకృష్ణ, మనోహర్ నాయుడు

విజయవాడ సాంస్కృతికం: నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం సందర్శించారు. వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు మనోహర్ నాయుడితో కలిసి వివిధ స్టాళ్లను పరిశీలించారు. పుస్తక ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడంపై రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. సమాజాన్ని చైతన్యవంతంగా ఉంచడంలో ఇలాంటి పుస్తక మహోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు.

నిరసనలు.. విమర్శల సాధనం కవిత్వం



మాట్లాడుతున్న ఇంతియాజ్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : నిరసనలు, విమర్శలకు ప్రతిస్పందనగా కవిత్వం ఇప్పటికీ ప్రభావితమైన సాధనంగా కొనసాగుతోందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.ఎం.డి. ఇంతియాజ్ అన్నారు. 36వ పుస్తక మహోత్సవం నాలుగో రోజు సోమవారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంలో భాగంగా 'పాతికేళ్ల కవిత' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో వస్తున్న మార్పుల వెనక దాగిన హృదయ వేదనను కవిత్వం మాత్రమే సమర్థంగా ప్రతిబింబిస్తుందని చెప్పారు. అభ్యుదయ కవిత్వం బడుగు జీవుల స్వరంగా నిలుస్తూ, గత పాతికేళ్లుగా సమాజంలోని అసమానతలను విభిన్న రూపాల్లో వెలికి తీసిందన్నారు. శ్రీశ్రీ సంధ్యా సమస్యలు కవితను ఉదహరిస్తూ.. అసమానతలు కాలానుగుణంగా మారకపోవడం దురదృష్టకరమన్నారు. సాహితీ స్రవంతి సత్యాజీ అధ్యక్షత వహించారు. కవయిత్రి కడలి సత్యనారాయణ, రచయిత అనిల్ డ్యానీ, ప్రముఖ రచయిత ఖాదర్ మొహియుద్దీన్‌లు పాల్గొని మాట్లాడారు. మాధ్యమాలు మారినా కవిత్వం జీవంతో కొనసాగుతోందని, సామాజిక భూకంపాలను పట్టి చెప్పే శక్తి కవిత్వానికే ఉందని వక్తలు పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

బిడ్డ పుట్టిన 14 రోజులకే ఆమె జీవన పోరాటం మొదలైంది. సహాయం చేయలేని స్థితిలో తల్లిదండ్రులు... భారమంటూ వదిలేసి వెళ్లిపోయిన భర్త... ఈ సంఘర్షణలతో కుమిలిపోలేదామె. పరిస్థితులతో పోరాడటం నేర్చుకుంది. తన కాళ్ల మీద తను నిలబడటమే కాకుండా... తనలాంటి నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తోంది కారుణ్య గుణవతి. ఆమె గురించి తెలియాలంటే...


కారుణ్య

వాళ్ల కోసం.. రెట్టింపు శ్రమిస్తున్నా!



సమస్యల నుంచే చాలాసార్లు పాఠాలు నేర్చుకుంటాం. అవే భవిష్యత్తులో మన తీరు తెన్నులు ఎలా ఉండాలో నిర్దేశిస్తాయి. నా విషయంలోనూ అదే జరిగింది. మాది తెన్‌కాశీ జిల్లాలోని పెరుమాళ్‌పట్టి గ్రామం. నాన్న కరుణాకర్ పౌన్‌రాజ్... ఓ వర్క్‌షాప్‌లో పనిచేసేవారు. అమ్మ దేవా అన్బు భాగ్యసెల్వి. మేము ఇద్దరం పిల్లలం. నాన్న జీతంతోనే ఇల్లు గడిచేది. దాంతో చదువుకోవడానికీ కష్టమైంది. పదో తరగతి పూర్తవుతూనే నేను పార్ట్ టైమ్ ఉద్యోగాల కోసం వెతకడం మొదలుపెట్టా. కానీ మేము ఉండే ప్రాంతంలో ఉద్యోగావకాశాలు చాలా తక్కువ. ఆడపిల్లల్ని చేర్చుకోవడమూ అరుదే. అందుకే ట్యూషన్లు చెబుతూ చదువుకునేదాన్ని. అలా బీఈ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేశా. ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రెజెంటేషన్ డిజైనర్‌గా ఉద్యోగం సంపాదించా. కెరియర్‌లో వృద్ధి కోసం దూరవిద్యలో ఎంబీఏ కూడా పూర్తిచేశా.

అంకుర స్థాపన...

పని, చదువు ఇవే లోకంగా గడిపా. అంతలోనే పెళ్లి అన్నారు. బాధ్యత అంటున్నారు కదా అని పెళ్లికి ఒప్పుకొన్నా. అది మొదలు అన్నీ సమస్యలే. ఆయనకీ నాకూ పొసగలేదు. గర్భిణిగా ఉన్నప్పుడే వదిలేసి వెళ్లిపోయారు. ఆర్థికంగా ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నా. అమ్మానాన్నలు కూడా సపోర్ట్ చేసే పరిస్థితుల్లో లేకపోవడంతో... ప్రసవమైన 14 రోజులకే ఉద్యోగ వేటలో పడ్డాను. అన్నీ విఫలయత్నాలే. అయినా పట్టుదలగా 2021లో 'రఫేల్ క్రియేటివ్స్' అంకురాన్ని స్థాపించి... సంస్థలు, ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్, ప్రొడక్ట్ రీచ్ వంటి వాటిల్లో సేవలందించడం మొదలుపెట్టా. రెండు సెకండ్ హ్యాండ్ ల్యాప్‌టాప్‌లతో, ఇద్దరు వినియోగదార్లతో మొదలైంది నా ప్రయాణం. శారీరకంగా, మానసికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, నా బిడ్డ భవిష్యత్తు బాగుండాలనే తపనతో కష్టపడ్డాను. ఏడాది గడవకముందే విదేశీ క్లయింట్లను సంపాదించుకునే స్థాయికి చేరుకున్నా. ఇప్పుడు నెలకు రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నా. ప్రస్తుతం రఫేల్ క్రియేటివ్స్‌కి 500మంది స్థిర వినియోగదార్లు ఉన్నారు. 15మందికి ఉపాధీ కల్పిస్తున్నా.

ఊహించని మలుపు...

మా చుట్టుపక్కల గ్రామాల్లో ఉపాధి కోసం బీడీ చుట్టే మహిళలు ఎక్కువ. మా పిన్ని కూడా ఆ పనే చేసేవారు. టీబీ సోకి చాలా ఇబ్బందులు పడ్డారామె. దాంతో ఈ రంగంలో ఉన్న మహిళలకు సహాయం చేయాలని నిశ్చయించుకున్నా. వాళ్లకి అవగాహన కల్పించడానికి వాయిస్ ఆఫ్ తెన్‌కాశీ అనే సంస్థలో భాగమయ్యా. దీనిద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం మొదలుపెట్టా. అయితే, ఈ పని వాళ్లకి ఉపాధి, మరో ప్రత్యామ్నాయం చూపిస్తేనే కదా... వాళ్లూ చేయకుండా ఉండేది. అందుకే 2023 నుంచి స్థానిక మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. 'కొట్రవై' అనే సంస్థను స్థాపించి దాని ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు చేయడం మొదలుపెట్టాం. ఇది నాకు అదనపు భారం అవుతుందని తెలుసు! కానీ మహిళలు, అమ్మాయిలు ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో పనిచేయడం మొదలుపెట్టా. ఓ రకంగా మల్టీ టాస్కింగ్ కూడా కాదు. అంతకన్నా ఎక్కువగానే పనిచేశా.

శిక్షణలోనూ స్టైపెండ్ రూపంలో కొంత మొత్తం ఇస్తున్నాం. దాంతో మహిళలకు ఆర్థిక భారం తగ్గి దీనిపై దృష్టి కేంద్రీకరించగలుగుతున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో టెంకాయ చిప్పలతో గృహాలంకరణ వస్తువులు, టెర్రాకోట నగలు, హెల్త్ మిక్స్ లాంటి ఆహార ఉత్పత్తులు, అద్దాల ఫ్రేమ్‌లు, వాటర్ బాటిళ్లు వంటివి తయారుచేస్తున్నారు. వీటన్నింటినీ మా వెబ్‌సైట్ ద్వారా అమ్ముతున్నాం. విదేశాలకీ ఎగుమతులు చేస్తున్నాం. ఈ సేవల్ని ఇంకా విస్తరించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నా.

– ఆళ్ల లక్ష్మీహరికృష్ణ, చెన్నై

విధి, అనారోగ్యం... ఈ రెండింటితో అడుగడుగునా పోరాడుతూనే ఉన్నారామె. అయినా వెనుదిరగలేదు. పైగా దేశవిదేశాల్లో తన లాంటి వాళ్లలో స్ఫూర్తినీ ధైర్యాన్నీ నింపుతున్నారు... మినాతి బోర్‌ఠాకూర్! ఇంతకీ ఎవరీమె? ఆమె ప్రయాణమేంటో చదివేయండి...

ఆమె జీవితం ఓ యుద్ధమే!


మినాతి

కడుపులో నొప్పి. మొదట మామూలుగానే మొదలైంది. తరవాత తీవ్రమైంది. కానీ రిసెర్చ్ కారణంగా చికిత్సకు సమయం కేటాయించలేని పరిస్థితి మినాతిది. ఒకానొకరోజు తట్టుకోలేకపోయారు. అప్పుడు ఆసుపత్రికి వెళ్తే... క్యాన్సర్ అని తేలింది. అది కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్‌కీ పాకింది. దీంతో ముంబయిలోని టాటా హాస్పిటల్‌లో చేర్చారు. బతకడం కష్టమే అన్నారు వైద్యులు. కానీ ఆమె మనసులో ఒకే ప్రశ్న! 'ఇలా వదిలేసి ఊరుకోవడమేనా?' అని. దీంతో తనవంతుగా బతకడానికే ప్రయత్నించాలి అనుకున్నారామె. దానికితోడు భర్త నికుంజ్ బిహారి బోర్‌ఠాకూర్ కూడా ఆమెతో క్యాన్సర్‌ని జయించిన వారి జీవితాల పుస్తకాలను చదివించేవారు. వాళ్ల స్ఫూర్తితో పట్టుదలగా ప్రయత్నించారామె. సర్జరీ, రేడియేషన్ల కారణంగా జుట్టు ఊడిపోయింది, రోజంతా వాంతులు, విరేచనాలు... బక్కచిక్కిపోయారు. అయినా పోషకాహారం తీసుకుంటూ యోగా, ప్రాణాయామం వంటివి చేస్తూ మానసికంగా దృఢంగా మారారు. ఆమె ధైర్యానికి క్యాన్సర్ తలవంచక తప్పలేదు. ఇదంతా 1994 నాటి మాట!

పిల్లలను కోల్పోయి...

మినాతిది అసోంలోని గువాహటి. విధితో పోరాటం ఆమెకు కొత్తేమీ కాదు. చిన్న వయసులోనే పెళ్లి, ముగ్గురు పిల్లలు. కానీ ఆర్‌హెచ్ డిసీజ్ కారణంగా వెంటవెంటనే చనిపోయారు. ఆ బాధ తట్టుకోవడం ఆమెకు చాలా కష్టమైంది. దాన్నుంచి బయటపడటానికి చదువు మీద దృష్టిపెట్టారు. చదువుకున్న కాటన్ కాలేజీలోనే ప్రొఫెసర్‌గా చేసి, ఫిలాసఫీ విభాగానికి హెడ్ స్థాయికి ఎదిగారు. ఈక్రమంలోనే ఎన్నో రిసెర్చ్ పేపర్లూ రాశారామె. క్యాన్సర్ నుంచి బయటపడ్డాక అదెంత కష్టమో తెలిసిందామెకు. ఉద్యోగం కొనసాగిస్తూనే క్యాన్సర్ బాధితులకు ఉచితంగా కౌన్సెలింగ్, ఇతర సాయాలు చేయడం మొదలుపెట్టారు. కౌన్సెలింగ్, మెడిటేషన్ సెంటర్‌నీ ఏర్పాటు చేశారు. తన ఏడాది క్యాన్సర్ చికిత్స అనుభవాలను 'మోర్ ఒఘాకోర్ ఎబోసర్: ఎజోన్ క్యాన్సర్ రోగిర్ ఒబిగోటా' (రోగిగా ఏడాది: క్యాన్సర్ బాధితురాలిగా నా అనుభవాలు) అనే పుస్తక రూపంలో తీసుకొచ్చారు.

రెండో యుద్ధం...

2009... అనారోగ్యానికి గురైన భర్తకి సేవలు చేస్తున్నారు మినాతి. విపరీతమైన నడుము నొప్పి. పరీక్ష చేయించుకుంటే క్యాన్సర్ తిరగబెట్టిందన్నారు... ఈసారి పెల్విక్, వెన్నెముక ప్రాంతాల్లో వచ్చింది. మినాతి భయపడలేదు. కానీ ఆమె భర్త ఒత్తిడికి గురయ్యారు. దాంతో గుండెపోటుకు గురై మరణించారు. అప్పుడు డీలాపడ్డారు మినాతి. ఆయన లేని లోటును తట్టుకోలేకపోయారు. తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. అప్పుడు తనలాంటి వాళ్ల గురించి ఆలోచించిన మినాతి తిరిగి పోరాటం మొదలుపెట్టారు. ఈసారీ గెలిచారు. ఆ ప్రయాణాన్ని 'కొలిజా కైతే బిందిలే జి చోరాయే గాన్ గాయే' (హృదయానికి ముల్లు గుచ్చుకున్న పక్షి పాడే పాట) పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. క్యాన్సర్ బాధితులకు డైట్, న్యూట్రిషన్, ప్రాణాయామం, ధైర్యంగా సమస్యతో పోరాడటం... ఇలా ఎన్నో అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన సేవల్ని శ్రీలంక, అమెరికా, ఆస్ట్రేలియా సహా 24 దేశాలకు విస్తరించారు.

'క్యాన్సర్ గురించి చాలామందికి తెలుసు. కానీ మనకు రాదులే అనుకుంటారు. అదే పొరపాటు. ప్రతిఒక్కరూ తరచూ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. ముందే గమనించుకుంటే దీన్ని ఎదుర్కోవడం సులువే. తరవాతి స్టేజ్‌ల్లో అయినా ధైర్యంగా ఉంటూ పోరాడొచ్చు' అనే మినాతి తన శరీరాన్ని గువాహటి మెడికల్ కాలేజీకి క్యాన్సర్ పరిశోధనకి రాసిచ్చారు. అన్నట్టూ ఆమె మాత్రమే కాదు, తను రాసిన పుస్తకాలూ ఎన్నో భాషల్లోకి తర్జుమా అయ్యి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బాధితుల్లో ధైర్యాన్ని నింపుతున్నాయి. ఎన్ని కష్టాలు, ఎంత నరకం... వాటన్నింటినీ దాటి ఇంత మందికి సాయపడుతున్నారు 79 ఏళ్ల మినాతి. ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

నష్టజాతకురాలు అంటున్నారు!

నా పెళ్లయిన నెలకి మా ఆడపడుచుని ఆమె భర్త చంపేశాడు. నేను ఇంట్లో అడుగుపెట్టడం వల్లనే వాళ్ల కూతురు చనిపోయిందని మూడేళ్లుగా టార్చర్ చేస్తున్నారు. నన్ను నష్ట జాతకురాలు అంటున్నారు. డబ్బు పిచ్చితో అదనపు కట్నం తెమ్మని వేధిస్తున్నారు. ఇవన్నీ భరించలేక చనిపోవాలనిపిస్తుంది. ఏం చేయాలి? – ఓ సోదరి

ముందు మీరు ఆత్మహత్య ఆలోచనలు మానండి. మీ పెళ్లికీ మీ ఆడపడుచు చావుకీ సంబంధం లేదు. చావు దురదృష్టకరమైన సంఘటన. దానికి బాధ్యుడు వాళ్ల అల్లుడు అయితే, మీరెలా కారణం అవుతారు. మీరు కట్నం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆడవాళ్లు డబ్బులు తెచ్చే యంత్రాలు కాదు. మీ అత్తింటివాళ్ల మీద వరకట్న వేధింపులు, గృహహింస కేసులు పెట్టొచ్చు. ముందుగా మీకు దగ్గర్లో ఉన్న ప్రొటెక్షన్ ఆఫీసర్లకి మీరు పడుతున్న మానసిక, శారీరక హింస గురించి ఫిర్యాదు చేయండి. వాళ్లు పిలిచి కౌన్సెలింగ్ చేస్తారు. అప్పటికీ మీ వాళ్లలో ఏమీ మార్పు రాకపోతే సంబంధిత కోర్టుకి ఆ కేసుని రిఫర్ చేస్తారు. అక్కడ మీరు గృహహింస చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం రక్షణ కోరవచ్చు. అప్పుడు కోర్టు ఆర్డరు ఇస్తే ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను మీకు తోడుగా నియమిస్తారు. ఆ పోలీస్ రోజూ వచ్చి మీ గురించి వాకబు చేస్తూ ఉంటారు. ఇక, సెక్షన్ 19 కింద ఇంట్లో ఉండే హక్కు, సెక్షన్ 20 కింద నెలకు పోషణ, ఖర్చులు, సెక్షన్ 22 కింద శాశ్వత పరిహారం కూడా పొందవచ్చు. వివాహబంధం వద్దు అనుకుంటే హిందూ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 13(1)కింద విడాకులు కోరండి. మీకు దగ్గర్లోని పోలీసు స్టేషన్‌లో మీరు పడుతున్న బాధల గురించి కంప్లయింట్ చేస్తే వారు సెక్షన్ 498ఎ కింద విడాకుల వేధింపుల కింద కేసు బుక్ చేస్తారు. నిర్ణయం మీదే.

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

పిల్లలకు ఇంకా డైరీ కొనలేదా!

కొత్త సంవత్సరం అనగానే గుర్తొచ్చే అంశాల్లో డైరీ ఒకటి. పెద్దవాళ్లకే కాదు, పిల్లలకూ ఇది ముఖ్యమే. మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోతున్న ఈరోజుల్లో ఇది ఇంకా అవసరం.

చిన్నప్పట్నుంచే డైరీ రాయడం అలవాటు చేసుకుంటే... తమ ఆలోచనలూ, భావనల్ని వ్యక్తపరచడం పిల్లలకు తెలుస్తుంది. కొద్దిసేపు కుదురుగా కూర్చోవడం, ఆలోచనలపైన ధ్యాస పెట్టడంవల్ల ఇది ధ్యానంలా పనిచేస్తుంది. రాతవల్ల ఆలోచనల సరళి మెరుగవుతుంది. అనుభవం నుంచి నేర్చుకోవడం, లక్ష్యం నిర్దేశించుకోవడం, ఆత్మశోధన... ఇవన్నీ సాధ్యమవుతాయి. చేతిరాత మెరుగవుతుంది. ఇది బాగుంటే చదువుల్లోనూ ముందుంటారు. అందుకోసం మీరేం చేయాలంటే...



- ఒక ఆకర్షణీయమైన నోట్ బుక్, లెదర్ బౌండ్ డైరీ... పిల్లలకు నచ్చింది ఏదైనా ఎంచుకోనివ్వండి. దానివల్ల డైరీ రాయడంలో కుతూహలాన్ని చూపుతారు.
- పిల్లలు ఏం రాస్తారనుకోవద్దు... స్కూల్ సంగతులు, ఆహారం, ఆటలు, అనుభవాలు... ఇలా వాళ్ల దైనందిన జీవితంలోనూ ఎన్నో చోటుచేసుకుంటాయి. వాటిలో నచ్చినవి రాయమనండి.
- డైరీ ఫార్మాట్‌లో ఉన్న 'ది డైరీ ఆఫ్ ఎ వింపీ కిడ్' లాంటి పుస్తకాలను వాళ్లకు పరిచయం చేయండి. జాతీయ నాయకుల డైరీల గురించి చెప్పండి.
- రాయడానికి ఏమీ లేదనపిస్తే... పండగలూ, జాతీయ నాయకులు, క్రీడాకారులు... ఏదైనా అంశంపైన కొన్ని వాక్యాలు రాయమని చెప్పండి.
- నోట్‌బుక్ లాంటివాటిలో రాస్తుంటే... తేదీ, సమయం కచ్చితంగా ఉండాలి. దీనివల్ల సంఘటనల్ని వరుస క్రమంలో ఆలోచించడం తెలుస్తుంది.
- 'ఈరోజు నేను ఎందరో మిత్రుల్ని కలుసుకున్నాను. రోజంతా నాకు సంతోషంగా గడిచింది'... ఇలా ఫస్ట్ పర్సన్‌లో రాయమనండి.
- కేవలం ఆరోజు జరిగిన సంఘటనల్నే కాకుండా, అన్నిరకాల ఆలోచనల్నీ రాసేలా ప్రోత్సహించాలి. పుట్టినరోజుకు ఎలాంటి ఏర్పాట్లు ఉండాలి, నచ్చిన కార్టూన్ క్యారెక్టర్, భవిష్యత్తులో ఏం అవ్వాలనుకుంటున్నారు... ఇలా ఏదైనా.
- రాతలో చిన్న చిన్న తప్పులు దొర్లడం సహజం. అంతమాత్రాన కంగారు పెట్టొద్దు. క్రమంగా మెరుగుపడేలా ప్రోత్సహించాలి.
- సెలవుల్లో తమతోపాటు డైరీనీ తీసుకువెళ్లమని చెప్పండి. రొటీన్‌కి భిన్నంగా రోజు గడిచినప్పుడే రాయడానికి అంశాలూ దొరుకుతాయి.

మనసులోని మాట చెప్పే ఏకైక ప్రదేశం డైరీ. చిట్టిబుర్రలో భవిష్యత్తు రచయిత ఉన్నా ఉండొచ్చు! కాబట్టి వెంటనే పిల్లలకు డైరీ కొనివ్వండి. జీవితంలో వాళ్లు పొందే అత్యుత్తమ బహుమతి ఇదే అవుతుంది.

పతకం తెచ్చిన అందం!





నగా నట్రా







పండుగ వచ్చిందంటే చాలు... సంప్రదాయంగా మెరిసిపోవాలనుకుంటాం. దుస్తుల సంగతి పక్కనపెడితే నగలూ ప్రత్యేకంగా కనిపించాలని కోరుకుంటాం. అలాగని ఏ పెళ్లిళ్లకో వేసుకున్నట్లు హెవీగా వేసుకోవడం కాస్త కష్టమే అనేవారూ చాలామందే. అలాంటివారికోసమే ఒకప్పటి పతకం చైన్ మళ్లీ సరికొత్తగా వచ్చేసింది. పొడవాటి బంగారు గొలుసుకు కాస్త హెవీగా ఉండే రాళ్ల పతకమే ఇది. దక్షిణ భారతదేశ సంప్రదాయ ఆభరణాల్లో దీనిది ప్రత్యేక స్థానం. కాలక్రమంలో కొన్నాళ్లు కాస్త వెనక్కి తగ్గినా ఈ డిజైన్ ఇప్పుడు అందరినీ మెప్పిస్తోంది. మినిమలిస్టిక్ ట్విస్ట్‌లతో, ఫ్లోరల్ డిజైన్లు, జియోమెట్రిక్ ఆకారాల్లో కళతెస్తోంది. లక్ష్మీదేవి, హంసలు, నెమళ్లు, ఏనుగులు... వంటివాటితో టెంపుల్ స్టైల్‌లో ఈ పెండెంట్లను తీర్చిదిద్దుతున్నారు. నిజానికి పూర్వం ఈ తరహా డిజైన్‌తో చేసిన గొలుసుల్ని దేవతా విగ్రహాలకు అలంకరించేవారట. తర్వాత కాలంలో రాజకుటుంబాల వారు అనుకరించారట. నృత్యకారిణులు వేసుకున్న ఈ నగలు తర్వాత కాలంలో సామాన్యులనూ మెప్పించాయి. ఇప్పుడు మినిమలిజాన్ని కోరుకునే జెన్‌జీలకు నచ్చడంతో మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చాయి. అయితే, బంగారం ధర ఎక్కువ కావడంతో వీటిల్లో లైట్‌వెయిట్, మైక్రోగోల్డ్ ప్లేటెడ్ రకాల్లోనూ రూపొందిస్తున్నారు. మీకేది కావాలో ఎంచుకోవడమే మిగిలి ఉంది.


ఆహ్వానం



సంక్రాంతి ముచ్చట్లు

తెల్లని మేఘాల్లా కమ్మిన పొగమంచు... వణికించే చలి... దాన్ని తప్పించుకోవడానికి కాగే చలిమంటలు... వాటి చుట్టూ పోగుపడే కబుర్లు... ఎన్నో సంప్రదాయాలు, మరెన్నో ఆత్మీయతలు... సంక్రాంతి చుట్టూ అల్లుకునే జ్ఞాపకాలు ఎన్నెన్నో! మారుతున్న కాలానికి తగ్గట్టుగా కొన్ని కొనసాగినా, కనుమరుగైనవే ఎక్కువ. ఒకసారి ఆ జ్ఞాపకాల దొంతరని తట్టి లేపండి. సంక్రాంతికి మీ ప్రాంతానికే పరిమితమైన సంప్రదాయాల్నీ, మర్చిపోలేని అనుభూతుల్నీ మా 'వసుంధర'తో పంచుకోండి. పేరు, ఊరు వివరాలతోపాటు ఫొటోలనూ పంపడం మర్చిపోవద్దు మరి!

నాకు ఏదీ లేదే!



ఎవరు కలిసినా... 'ఈ ఏడాది ఏం రెజల్యూషన్ తీసుకున్నావ్?' అన్న మాటే కదా! పెట్టుకుని ఉంటే ఫలానా అని చెబుతాం. గత ఏడాది 'బరువు తగ్గాలి, వ్యాయామం చేయాలి... అంటూ బోలెడు పెట్టుకున్నా. ఏవీ చేయలేదు. అంతకుముందూ అంతే! అలాంటప్పుడు మళ్లీ ఏం పెట్టుకోను?' అనిపిస్తుంది. ఒక్కోసారి ఫలానా చేయాలన్న ఆసక్తే అనిపించదు. ఇవేమో బయటికి పంచుకోలేం. పోనీ ఏదో ఒకటి అని చెప్పడానికీ లేదు. చిన్న ప్రశ్నే కానీ ఎంతమందిలో ఒత్తిడి పెంచుతోందో కదా?

'బ్లాంక్‌గా ఇయర్‌ని ప్రారంభించడం...' ఏ తీర్మానమూ లేకుండా ఏడాదిని మొదలు పెట్టడాన్ని ఇలాగే చెబుతున్నారంతా. అలాగని ఇదేమీ పొరపాటు కాదు. మీ పరిస్థితేంటో మీకు కచ్చితంగా తెలిసి ఉంటుంది అందుకే ఇలా ఆలోచిస్తున్నారనీ అంటున్నారు నిపుణులు. కాబట్టి, దీన్నీ సానుకూలంగా తీసుకోవచ్చు. 'ఇది చేయాలి, దాన్ని సాధించాలి' అన్న వాక్యాలు బోర్ కూడా కొట్టుండొచ్చు. కాబట్టి, ఈ ఏడాది నా జీవితంలో ఒత్తిడి, పోలికలు, తొందరపెట్టడం... ఇలా ఇవి వద్దు అన్నవి ఏమున్నాయో ఆలోచించండి. అలాగే విశ్రాంతి, స్పష్టత, ఆదా... ఇలా ఇంకొంచెం పెరిగితే బాగుండు అనుకున్నవేవో కూడా రాసి పెట్టుకోండి. వాటిని సాధించడానికి ఏం చేయాలో ఆలోచించుకోండి. దానికి తగ్గట్టుగా ఆరోజు ఏం చేయాలి అనిపిస్తే దాన్ని చేసుకుంటూ వెళితే సరి. అయినా ఏడాది మొత్తం ఏం చేయాలో జనవరిలోనే నిర్ణయించుకోవాలా ఏంటి? ఫలానా రోజు, నెలలోనే జరగాలన డానికి ఇదేమీ పరీక్షా కాదు. కాబట్టి, 'నా మనసు మాట వింటూ, నచ్చింది చేసుకుంటూ వెళతా' అనుకుంటూ సాగండి. ఎవరైనా వాకింగ్‌కి వెళదాం అన్నారను కోండి... వెళ్లాలనిపిస్తే వెళ్లండి. నెలయ్యాక ఇదేం నచ్చట్లేదు అనిపించిందా... వేరే దానికి మళ్లండి. నిజానికి ఇంటి పనులతో ముడిపడినవే మనకు అన్నీనూ. తీరా ఏ బాధ్యత కారణంగానైనా కొనసాగించలేకపోతే అనవసర బాధ. వాటికి దూరంగా ఈ తీరు బాగుంది కదూ! అనవసర లక్ష్యాలు ఉండవు, మనసు మీదా భారముండదు. ఇంకేం, తీర్మానం చేసుకోలేదన్న ఒత్తిడి మాని నచ్చింది చేసుకుంటూ సాగండి.


బంగారం - వెండి

5న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,40,340	1,26,350	2,44,991
విజయవాడ	1,35,410	1,25,950	2,44,700
ప్రొద్దుటూరు	1,40,500	1,29,260	2,45,000
రాజమహేంద్రవరం	1,37,400	1,25,950	2,65,000
విశాఖపట్నం	1,37,400	1,25,950	2,45,000
తమిళనాడు	-----	1,27,600	2,66,000

రంగవల్లిక

17 చుక్కలు 7 వరుసలు 7 వచ్చేవరకూ






కోనేరు భవిష్య
హైదరాబాద్

15 చుక్కలు 1 వచ్చేవరకూ




మాద్దుల శశికళ
గోరంట్ల, అనంతపురం జిల్లా




బి.వి. గాయత్రి
హైదరాబాద్

21 చుక్కలు 11 వచ్చేవరకూ మధ్య చుక్క

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512. Email:vasundhara@eenadu.in

మది నిండిపోయింది.. మాతృభాష ఔన్నత్యం తెలుసుకుని మనసు పులకరించింది.. 42 దేశాలకు చెందిన ప్రతినిధులు, 56 తెలుగు సంఘాలతో సహా కవులు, కళాకారులు, గాయకులు, తెలుగు భాషాభిమానుల సందడితో గుంటూరు పరవశించింది.. అమరావతి వేదికగా తొలిసారి జరిగిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో మన సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం అడుగడుగునా ఉట్టిపడ్డాయి. ఐదు వేదికలపై ఆకట్టుకునే కార్యక్రమాలతో 72 గంటలపాటు సాగిన సాహితీ యజ్ఞం అందరినీ ఆలోచింపజేసింది.

పరిమళించె తెలుగు పరవశించె మనసు



ఆనాటి గురుతులు.. ఈ నాణేలు





రాజుల కాలం నాటి కళా సాంస్కృతిక వైభవాన్ని అంచనా వేయాలంటే నాణేలు ఒక ఆధారం. గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో తాడిపత్రికి చెందిన విష్ణుభగవాన్ అలాంటి ప్రాచీన నాణేలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. పాతికేళ్లుగా 300కు పైగా పురాతన నాణేలను సేకరించానని, వాటి గొప్పతనాన్ని తెలియజెప్పాలనే ఉద్దేశంతో ఇలా ప్రదర్శన ఏర్పాటు చేశానని చెప్పారు.



– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

పదహారణాల తెలుగుకు.. 16 సూత్రాలతో పట్టం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రతిపాదన
- తెలుగుపై ఆత్మన్యూనత, ఆంగ్లంపై మోజు వీడాలని పిలుపు



వెంకయ్యనాయుడికి జ్ఞాపిక అందజేస్తున్న శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ, గజల్ శ్రీనివాస్, పోతుల బాలకోటయ్య, సినీ నటుడు సాయికుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: 'అమ్మ ఒడిలో, చదువుల బడిలో, బతుకు మడిలో, సంస్కార గుడిలో, గుండె తడిలో.. తెలుగు నుడి మన శ్వాస కావాలి. అమ్మభాష ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తద్వారా విశిష్ట భారతం ఆవిర్భవిస్తుంద'ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో ఆయన ప్రసంగించారు. మన ఆటలు, పాటలు, మాటలు, సంగీతం, కళలు, పండగలు, సామాజిక కార్యక్రమాలు, వ్యాపార సంబంధాలన్నీ భాషతోనే ముడిపడి ఉన్నాయని, సమాజాన్ని సృష్టించేదే భాషేనని పేర్కొన్నారు. 'మనిషి నుంచి ప్రాణం తీసి వేరుచేస్తే ఎలా ఉంటుందో, సమాజం నుంచి భాషను విడదీసి చూడడం అలాగే ఉంటుంది. ఒక భాష ఉనికి కోల్పోతే దానితోబాటు ఉన్న చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కూడా తెరమరుగవుతాయి. ఆ పరిస్థితి రాకుండా తెలుగువారు జాగ్రత్త పడాల'ని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పదహారణాల తెలుగు భాష పరిరక్షణకు ఈ 16 సూత్రాలను మనమంతా జీవితంలో భాగం చేసుకోవాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

1. తెలుగు వారసత్వం, సాహిత్యం, సంప్రదాయాలు, జానపద సంస్కృతిని చిన్నారులకు చూపాలి. మన పద్యం, గేయం, కథ, చరిత్ర, సామెతలు, చతురోక్తులు, నానుడులు, జానపద గీతాలు, సాహిత్య సొగసులను భాష ద్వారానే తెలుసుకోగలం. తెలుగు మాధ్యమ విద్యార్థులకు సమాదరణ దక్కాలి.
2. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన జరగాలి. తెలుగులో శాస్త్రగ్రంథాలు తగినన్ని రావాలి. శాస్త్రీయ, సాంకేతిక పదాలను అర్థం చేసుకోగల ప్రామాణిక నిఘంటువులు తయారుచేయాలి.
3. తెలుగులో మాట్లాడడం ఆత్మన్యూనతగా భావించవద్దు. మన ఇళ్లలో మాతృభాషలో మాట్లాడుకుంటేనే తెలుగు సజీవంగా ఉంటుంది. ఇద్దరు తెలుగువారు తెలుగులోనే మాట్లాడుకోవాలి. ఆంగ్లం నేర్చుకున్నా, తెలుగును నిరాదరించకూడదు. అలాగని భాషా ద్వేషం అనర్థదాయకం.
4. ప్రజల భాష, ప్రభుత్వ భాష ఒక్కటే కావాలి. న్యాయస్థానాల కార్యకలాపాలు, తీర్పులు మాతృభాషలో అందించేందుకు ప్రయత్నించాలి. ప్రభుత్వ పథకాలకు స్థానిక భాషలో పేర్లు పెట్టాలి.
5. తెలుగులో ఇమిడిపోయిన అన్యభాషా పదాలను వ్యతిరేకించకూడదు. కొత్త పదాల సృష్టికి ప్రయత్నించాలి కానీ, పసిగట్టని గ్రాంథికం వాడొద్దు. భాష.. స్థిర బిందువు కాదు. అనేక నదీనదాలు కలిసిన అంతఃసింధువు.
6. తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి, ఇతర భాషల సాహిత్యం తెలుగులోకి అనువాదమయ్యేలా చొరవ చూపాలి. ప్రాంతీయ భాషల మనుగడకు అనువాదం అవసరం.
7. కంప్యూటర్లలో తెలుగు వినియోగాన్ని పెంచి, యువతకు తెలుగుపై ఆసక్తి కలిగించాలి. అందమైన తెలుగు ఖతుల (ఫాంట్స్) వినియోగానికి చొరవ తీసుకోవాలి.
8. వినోదానికి ఆదివారాన్ని కేటాయించుకున్నట్టుగా.. వారంలో ఒక రోజును మాతృభాష కోసం కేటాయించుకోవాలి. ఆనాడు తెలుగు రోజు అని కుటుంబమంతా అనుకొని ఆచరిస్తే, భాష బతుకుతుంది.
9. ఇళ్లలో తెలుగు నిఘంటువు ఉంచి, పదాలకు అర్థాలు తెలుసుకునేలా పిల్లలకు అలవాటు చేయాలి. వారికి రోజూ కథలు చెబుతూ, పద్యాలు నేర్పిస్తూ, వారితో ప్రశ్నలడిగించాలి. సందేహాలను ప్రోత్సహించాలి. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రత్యేకతలను వివరించాలి.
10. వార్తా పత్రికలు, పిల్లల పత్రికలు, బొమ్మల రామాయణం, భారతాలను విద్యార్థులతో చదివించాలి. తెలుగు మహనీయుల జీవితాలను పరిచయం చేయాలి.
11. శుభలేఖల్లో మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలి. పెళ్లిళ్లు, శుభకార్యాల్లో పుస్తకాలను బహుమతులుగా ఇవ్వడాన్ని సంప్రదాయంగా మార్చాలి. జన్మదిన వేడుకలను మన సంప్రదాయంలో జరుపుకోవాలి.
12. గ్రంథాలయ సంస్కృతిని ఇళ్లలోకి విస్తరించి, తెలుగు పుస్తకాలను సమకూర్చుకోవాలి.
13. ఇతర ప్రాంతాల్లోని తెలుగువారు సందర్శించే ఆలయాల్లో తెలుగు వినియోగం పెరగాలి. మన పండగలు, వ్రతాలు, పేరంటాలను నలుగురితో పంచాలి.
14. మన వంటకాలు, పచ్చళ్లు, ఆహార అలవాట్లను కొనసాగించాలి. భోజనం, ఫలహారాల పేర్లు నేటి తరానికి తెలియాలి.
15. మన కట్టుబొట్టు కొత్త తరానికి అందించాలి. వస్త్రధారణ ఎలా ఉన్నా.. ఇళ్లలో, పండగల్లో తెలుగుతనం కన్పించాలి.
16. చదువంటే ఆంగ్లమేనన్న అభిప్రాయం పోవాలి. ఇంగ్లిష్ రాకపోతే మనుగడే లేదనే భావదాస్యం పనికిరాదు.

భాష రక్షణకు పోరుబాట

- ప్రపంచీకరణ పేరుతో ఆంగ్లభాష ప్రవేశం
- మాతృభాషపై విద్య, పారిశ్రామిక, వ్యాపార శక్తుల దాడి
- వీటి నుంచి విముక్తి చేయకపోతే మళ్లీ బానిసలయిపోతాం
- ప్రపంచ తెలుగు మహాసభల్లో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ

ఈనాడు, అమరావతి: తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ప్రజాభిమానులు, భాషాభిమానులు రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ స్పష్టం చేశారు. 'ప్రపంచీకరణ, గేట్ ఒప్పందాల పేరుతో మళ్లీ దేశంలోకి ఆంగ్ల భాష ప్రవేశిస్తోంది. విద్య, వ్యాపార, కార్మిక రంగాల్లో శక్తులన్నింటినీ ఇది ఎంతో ప్రభావితం చేస్తోంది. మాతృభాషలో చదువుకోలేని దుస్థితి తెలుగు రాష్ట్రాల్లో ఉంది. ఆంగ్ల భాష ప్రభావంతో మన దేశాన్ని మార్కెట్‌గా మార్చి దోచుకుంటున్నారు. వీటి నుంచి విముక్తి చేయకపోతే మనం మళ్లీ బానిసలైపోయే ప్రమాదం ఉంది. దీనిపై దీర్ఘకాలికంగా పోరాటం చేయాలి. రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలి. మేం ఏ భాషకూ వ్యతిరేకం కాదు. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిది. బడుగు, బలహీనవర్గాలకు, కులాలు, మతాలు ప్రాంతాలకు వ్యతిరేకం కాదు. తెలుగు భాష గొప్పదనాన్ని మాత్రమే కాపాడమని కోరుతున్నా' అని పేర్కొన్నారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

జీవో 85తో తెలుగుకు దూరమయ్యే పరిస్థితి

'రాష్ట్రంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 85 ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషలో చదువుకోవడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. దీనిపై అప్పటి ప్రభుత్వం వేసిన అప్పీలు సుప్రీంకోర్టులో ఉంది. దీన్ని ఉపసంహరించుకోవాలని రెండేళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఇంతవరకు కార్యాచరణ లేదు. ఈ పిటిషన్ వెనక్కి తీసుకుంటే తెలుగు భాషకు ఎంతో మేలు చేసిన వారవుతారు. తెలుగు భాషలో చదువుకుంటే ఉద్యోగాలు రావనే విషప్రచారాన్ని ప్రజల మెదళ్లలో నుంచి తీసివేయడంలో విఫలమయ్యాం. ఇది తొలగిపోయేలా వారిని మరింత చైతన్యపరచాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జపాన్, చైనా, రష్యా, జర్మనీ తదితర దేశాలు తయారు చేస్తున్న యంత్ర సామగ్రిపైన ఆ దేశ భాషే ఉంటుంది. ఇలా తప్పనిసరిగా ఆ దేశ భాషను నేర్చుకునే పరిస్థితి కల్పించారు.



ఆంగ్లభాషలోకి ప్రవేశించడమంటే పరాయీకరణకు గురవుతున్నట్లే..

భాషకు భావ వ్యక్తీకరణే కాదు.. సామాజిక స్వరూపం, సాంస్కృతిక ప్రాభవం ఉన్నాయి. మనిషికి భాషతో జీవిస్తున్న ప్రాంతానికి, సమాజానికి సజీవమైన సంబంధాలున్నాయి. వీటికి సంబంధం లేని పరాయి భాష (ఆంగ్లం)లో ప్రవేశించడమంటే తెలియకుండానే మనం పరాయీకరణకు గురవుతున్నట్లు. మాతృభాష లేని జాతి ఎక్కడా ఉండదు. భాష అంతరిస్తే జాతి అంతరించినట్టే. మన భాషను మనం ప్రేమించడం మౌలిక బాధ్యత. ప్రజలు మాట్లాడే తెలుగు భాషను పనిగట్టుకుని బతికించాల్సిన అవసరం లేదు. ప్రస్తుత విద్యావిధానం, పారిశ్రామిక, వ్యాపార రంగంలోని శక్తులు భాషపై దాడి చేస్తున్నాయనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలి

ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే జరగాలి. పాఠశాల విద్యలో తప్పనిసరిగా తెలుగు మాధ్యమం ఉండాలి. తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రథమ ప్రాధాన్యమివ్వాలి' అని జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కార్యాచరణ

తెలుగు భాష పరిరక్షణకు జస్టిస్ ఎన్.వి.రమణ ప్రకటించిన కార్యాచరణ ప్రతిని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు త్రివిక్రమరావుకు వేదికపై అందజేశారు. అందులోని ముఖ్యాంశాలు..

- ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో భాష, సాహిత్యం, సంస్కృతి పట్ల అవగాహన, ఆసక్తి కలిగేలా చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో భాషాపండితుల పోస్టుల్ని తక్షణమే భర్తీ చేయాలి.
- ఉన్నత పాఠశాల స్థాయిలో పద్యాలు, ఇతిహాస కథల్ని పాఠ్యాంశాలుగా చేర్చాలి.
- ఇంటర్, డిగ్రీల్లో ప్రథమ భాషగా తెలుగును తప్పనిసరి చేయాలి. అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో తెలుగు, భాష శాఖలను తప్పనిసరి చేయాలి.
- పరిపాలనలో ప్రజలకు అందించే ప్రతి సమాచారం మాతృభాషలోనే ఉండాలి.
- తెలుగు భాషా పరిరక్షణ శాఖ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలి.
- మాతృభాషను చులకన చేయడాన్ని తప్పిదంగా గుర్తించేలా చట్టాన్ని రూపొందించాలి.
- అధికార భాషా సంఘాన్ని, సాంస్కృతికశాఖను ప్రభావవంతంగా మార్చాలి.

మది నిండుగా.. మన పండుగ

- గుంటూరులో ఘనంగా ముగిసిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు
- ఆకట్టుకున్న ప్రముఖుల ప్రసంగాలు
- అలరించిన సాహితీ సదస్సులు

ఈనాడు – అమరావతి

గుంటూరులో శనివారం ప్రారంభమైన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు సోమవారం ఘనంగా ముగిశాయి. తొలిరోజు వేడుకలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ప్రారంభించారు. నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ పూర్వ డైరెక్టర్ జస్టిస్ రఘురాం, ఆధ్యాత్మిక యోగి విశ్వంజీ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, తదితరులు హాజరై తెలుగు పరిరక్షణకు నడుం కట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. 1,500 మంది కవులతో అమరావతికి దివ్య నీరాజనం సమర్పించారు.



'మాతృభాష కోసం తరలిరండి' రూపకంలో శ్రీకృష్ణదేవరాయలకు స్వాగతం పలుకుతూ నృత్యం చేస్తున్న కళాకారులు

మారిషస్ అధ్యక్షుడి రాకతో ప్రత్యేకం

ఆదివారం జరిగిన సభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మారిషస్‌లో తెలుగుకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. నాలుగో మహాసభలు మారిషస్‌లో 2027 జనవరి 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మూడు రోజుల కార్యక్రమాల్లో ఒడిశా, త్రిపుర, గోవా గవర్నర్లు కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి, పూసపాటి అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. చివరి రోజు వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ హాజరై తెలుగు గొప్పతనాన్ని, కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

అడుగడుగునా ఉట్టిపడిన తెలుగుదనం

- మూడు రోజుల కార్యక్రమాల్లో అడుగడుగునా తెలుగుదనం ఉట్టిపడింది. సంప్రదాయ వస్త్రధారణలతో భాషాభిమానులు సందడి చేశారు.
- శ్రీ తూము నరసింహదాసు, శ్రీ నారాయణతీర్థుల ఆధ్యాత్మిక వేదికపై దేవతామూర్తుల కల్యాణోత్సవాలు, సహస్రనామ పారాయణ సంకీర్తనలతో ఆధ్యాత్మిక వైభవాన్ని కళ్లకు కట్టారు.
- శ్రీనాథ కవి సదస్సుల వేదిక వద్ద వివిధ సాహిత్య సదస్సులు, అష్టావధానం, తెలుగు గజల్ సదస్సులు ఆకట్టుకున్నాయి.
- శ్రీ జాషువా, కరుణశ్రీ కవి సమ్మేళన వేదిక వద్ద పలువురు కవులు కవి సమ్మేళనాలు నిర్వహించారు.
- డాక్టర్ ఘంటసాల, డాక్టర్ బాలు పాడనా తెలుగుపాట వేదికపై గాయనీ గాయకులు పాత చలనచిత్రాల్లోని గీతాలు, తెలుగు సాహిత్యంపై గీతాలాపన చేశారు.
- మహాసభల్లో రామోజీరావు హస్తకళల ప్రదర్శనల ప్రాంగణం ఆకట్టుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన చిత్రకారులు, కళాకారుల స్టాళ్లు ఇక్కడ కనువిందు చేశాయి. కొయ్యబొమ్మలు నైపుణ్యాన్ని ప్రస్ఫుటించాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన రామోజీరావు విగ్రహం వద్ద చిత్రాలు దిగేందుకు పలువురు ఉత్సాహం చూపారు.



గజల్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు



తెలంగాణలోని బోధన్‌కు చెందిన హీబా ఫాతిమా ఐదు భాషల్లో రచించిన భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు



విజయదుర్గ

జౌళి సంచులపై భళా చిత్రకళ

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో జూట్ బ్యాగుల వాడకం బాగా పెరిగింది. సాధారణంగా కాకుండా.. వాటిపై మిషన్ ఎంబ్రాయిడరీతో వివిధ ఆకృతులు సృష్టిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు విజయవాడ దగ్గర్లోని సూరంపల్లికి చెందిన విజయదుర్గ. జూట్ క్లాత్‌పై వివిధ దేవతామూర్తులు, ప్రకృతి సోయగాలు, తమ వారి ఫొటోలను అల్లుతూ వాటిని విక్రయిస్తున్నారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు మహాసభల్లో స్టాల్ ఏర్పాటు చేశారు. రూ.40 నుంచి రూ.9 వేల వరకు ధరల్లో అందుబాటులో ఉన్నాయని, చాలామంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపించారని ఆమె తెలిపారు.

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

రూ.100 కోట్లు కోరాం

– విల్సన్ శరత్‌చంద్ర, తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షుడు

మన దేశంలో 450 భాషలు యాసతో, 250 లిపి తయారు చేసుకుని మాట్లాడుతున్నారు. తెలుగు భాషతో సమానమైన సాహిత్యం ప్రపంచంలోనే లేదు. 45 దేశాల్లో ఉన్న తమిళ ప్రజలకు వారి మాతృభాష వ్యాప్తికి వర్చువల్ అకాడమీ పెట్టారు. అలా మనకూ తెలుగుపరంగా పెట్టాలంటూ ముఖ్యమంత్రికి ఇటీవల లేఖ రాశా. రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరాం. తెలుగు అకాడమీ రాబోయే రోజుల్లో తెలుగు మాసపత్రిక తీసుకురాబోతోంది.

పటిష్ఠ కార్యాచరణతో ముందడుగేయాలి

– పి.త్రివిక్రమరావు, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం



ముప్పై శాతం కంటే తక్కువ ప్రజలు మాట్లాడితే ఆ భాష అంతరిస్తుందని యునిసెఫ్ చెప్పింది. ఏదో ఒక రంగంలో తెలుగు వాడకను పెంచడం కాకుండా ప్రతి రంగంలోనూ అభివృద్ధి చేసుకోవాలి. దీన్ని పటిష్ఠ కార్యాచరణతో ముందుకు తీసుకెళ్లాలి. ప్రభుత్వ వ్యవహారాల్లో, శాసన, న్యాయ వ్యవస్థల్లో తెలుగు వినియోగం పెరగాలి. అధికారులు సామాన్యులను కలిసినప్పుడు తెలుగులో మాట్లాడాలి. బ్యాంకుల్లో పే స్లిప్పులు, డీడీలు కూడా తెలుగులో ఉండాలి.

ఆర్జిత సేవల పేర్లు ఆంగ్లంలో ఎందుకు?

– యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



దిల్లీలో న్యాయమూర్తిగా అడుగు పెట్టాక తెలుగు నామఫలకం పెట్టిన తొలి వ్యక్తి జస్టిస్ ఎన్.వి.రమణ. న్యాయవ్యవస్థలో వాదనలు, తీర్పులు తెలుగులో ఉండాలని విజయవాడలో ప్రత్యేకంగా సదస్సు పెట్టి దిశానిర్దేశమూ చేశారు. ప్రతి పాఠశాలలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా ఉంచాలి. 'ఈనాడు'లో కొత్త పదాలను సృష్టించి రామోజీరావు భాషా పరిరక్షణలో తనదైన పాత్ర పోషించారు. ప్రముఖుల పేర్లతో పెట్టిన రోడ్లను, ఆఖరికి తిరుమలలో ఆర్జిత సేవల పేర్లను కూడా ఆంగ్లంలో పొట్టిగా పలకడం శోచనీయం.

పిల్లలతో పత్రికలు చదివించండి

– పల్లా శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు



ఈ సభల్లో చేసిన తీర్మానాలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కార్యరూపంలోకి తెచ్చేందుకు నా వంతు సహకరిస్తాను. ఇంటి పేర్ల మీద, గోత్రాలు, సహగోత్రాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. ఐదో తరగతి వరకు తెలుగులోనే బోధన చేయాలనే వాదనతో ఏకీభవిస్తున్నాం. పిల్లలతో తెలుగు పత్రికలు చదివించండి.


తెలుగును ప్రేమిద్దాం

– పి.గౌతంరెడ్డి, వైకాపా నాయకుడు

తెలుగు ఒక భాష కాదు.. ఇదొక గౌరవం, గర్వం. దీన్ని భవిష్యత్తు తరాలకు అందించాలి. తెలుగును ప్రేమిద్దాం. పరిరక్షించుకుందాం.

తెలుగు భాష మన ప్రాచీన సంపద

– కూన రవికుమార్, ఎమ్మెల్యే



తెలుగు భాష అనేది ప్రాచీన సంపద. పక్క రాష్ట్రాల వాళ్లు మాతృభాష కోసం పరితపిస్తుంటే మనం మాత్రం ఆంగ్లంపై వ్యామోహపడుతుండటం బాధాకరం. జీవో నంబర్ 85 ఉపసంహరించే విధంగా శాసనసభలో గళం వినిపిస్తాను.

తెలుగుకు గుంటూరు గుండె


– డొక్కా మాణిక్యవరప్రసాద్



తెలుగుభాషకు గుండె వంటి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం చాలా సంతోషం. తెలుగు పాట, పద్యం ప్రజల్లో ఎంత విస్తృతంగా ఉంటే అంతలా తెలుగు బతుకుతుంది. తెలంగాణ జానపదం వల్ల అక్కడి పరిస్థితులే మారిపోయాయి.

మార్పు మొదలవుతోంది..

– దినకర్, 20 సూత్రాల కార్యక్రమాలు అమలు కమిటీ ఛైర్మన్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో మాతృభాషలో బోధనకు పెద్దపీట వేస్తున్నాయి. రాష్ట్రంలో సగానికి పైగా జిల్లాల అధికారులు తెలుగులో సమీక్షల వివరాలు పంపడం మార్పునకు ఉదాహరణ.

గొప్ప సభలు ఇవి

– మనో, సినీ గాయకులు



తెలుగు భాష పరిరక్షణ కోసం గజల్ శ్రీనివాస్ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంత పెద్ద బాధ్యతను ఆయన ఆంజనేయుడిలా భుజాలపై వేసుకుని జయప్రదం చేయడం చాలా ఆనందంగా ఉంది.

తెలుగులోనే మాట్లాడాలని నాన్న నిబంధన


– ఆర్.పి.పట్నాయక్, నటుడు, సంగీత దర్శకుడు



బయట ఒడియా మాట్లాడుకోవచ్చు. కానీ ఇంట్లో మాత్రం తెలుగులోనే మాట్లాడాలని మా నాన్న నిబంధన పెట్టారు. 'ఈనాడు' పత్రిక ప్రధాన పేజీ నాతో పూర్తిగా చదివించేవారు. ఆ పునాదే ఈ రోజున తెలుగు వేదికపై నన్ను నిలబెట్టింది.

తెలుగును బతికించండి


– కుంచె రఘు, సంగీత దర్శకుడు



తెలుగును బతికిస్తే అది మనల్ని బతికిస్తుంది. తెలుగులో మాట్లాడండి. మాట్లాడించండి. అమ్మ, అమ్మభాష రెండూ చాలా ముఖ్యం.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తెలుగు సబ్జెక్టుగా ఉండాలి

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి



తెలుగు భాషా ఉద్యమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లడంలో కమ్యూనిస్టు పార్టీ ఎంతో కృషి చేసింది. చైనీస్, జపనీస్ వంటి భాషల్లో కోడింగ్ ఉంది కానీ తెలుగుకు కోడింగ్ లేదు. ఇది వస్తే అందరూ తెలుగు నేర్చుకుంటారు. తెలుగులో సరైన సాంకేతిక పదాలు లేవు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తెలుగు సబ్జెక్టుగా ఉండాలి.

ఈ వేదికపై నుంచి రెండు విజ్ఞప్తులు

– భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా అధ్యక్షుడు



తెలుగు సమాజాన్ని విస్తరించి, అభివృద్ధి చేయాలి. విజయనగరంలో గురజాడ ఇంటిని ఆధునికీకరించి, ఆయన సాహిత్యాన్ని డిజిటలైజ్ చేయాలని, ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ఈ వేదికపై నుంచి కోరుతున్నా.


రూ.2 కోట్ల బంగారు భగవద్గీత

ఉడుపిలో గురువారం ఆవిష్కరణ



ఉడుపి, న్యూస్‌టుడే: ఉడుపి పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థకు దిల్లీకి చెందిన ఒక భక్తుడు బంగారు రేకులపై ముద్రించిన (ఎంబోజ్) భగవద్గీతను అందజేశారు. దీని విలువ సుమారు రూ.2 కోట్లు. గీతలోని 700 శ్లోకాలు ఇందులో ఉన్నాయని సుగుణేంద్ర తీర్థ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఈ పుస్తకాన్ని బంగారు రథంపై ఊరేగించి శ్రీకృష్ణుని ముందు ఆవిష్కరిస్తామని తెలిపారు.

బాగుంది బ్రదర్.. ఈ చెక్కు ఉంచండి!



Nemmakur,
5th May 55.

It is a pleasure for me to meet the enthusiastic friends working for the promotion of "ANDHRA GRANDHALAYAM" Purushottamapatnam. It is really a proud occassion for me to know their splendid work they are doing towards that cultural institution.


Wishing them all success,
[signature]

ఆంధ్ర గ్రంథాలయం నిర్వాహకులను అభినందిస్తూ ఎన్టీఆర్ స్వదస్తూరితో రాసిన లేఖ

తెలుగు భాషను ఎన్టీఆర్ ఎంత గౌరవించేవారనడానికి ఉదాహరణగా నిలుస్తాయి ఈ లేఖలు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం పురుషోత్తపట్నంలోని 'ఆంధ్ర గ్రంథాలయం' ప్రచారం కోసం పనిచేస్తున్న కొందరు 1955లో ఆయనను కలిశారు. వారి సేవల గురించి తెలుసుకుని ప్రోత్సహిస్తూ ఎన్టీఆర్ స్వదస్తూరితో అభినందన లేఖ రాశారు. అనంతరం 1957 సెప్టెంబరు 16న గ్రంథాలయ సేవలను మెచ్చుకుంటూ రూ.100 చెక్కు ఇస్తున్నానని మద్రాసు నుంచి మరో లేఖ పంపించారు. ఎన్టీఆర్ సంతకంతో ఉన్న ఈ లేఖలను, పుస్తకాలను విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయం ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచారు. – ఈనాడు, అమరావతి



ఎన్టీఆర్ లేఖలను స్టాల్‌లో ఆసక్తిగా చూస్తున్న సందర్శకులు



N. T. RAMA RAO. B.A.
CINE ARTISTE
53-A, Basullah Road,
MADRAS-17.

16th September 1957.

Dear Shri Venkataratnam Garu,

I could know the progress of your ANDHRA GRANDHALAYAM thro' our friends here. I wish you to keep-up the ideals and the cultural aspirations with which the Library was started and with which it is continuing now.

I am here-with enclosing a Cheque for Rs.100/- (Rupees One Hundred only) drawn in the favour of the Library which please receive.

Thanking you,

Yours faithfully,
[signature]


Encl: Che on The Andhra Bank, T-Nagar Madras for Rs.100/-
No.492670.

రూ.100 చెక్కు పంపుతున్నానని చెబుతూ 1957లో ఎన్టీఆర్ పంపిన లేఖ

అమ్మ గర్భంలో నేర్చుకున్న అమృతం తెలుగు

- మాతృభాష పరిరక్షణకు ప్రతినబూనుదామన్న వక్తలు
- భావితరాలకు వారసత్వంగా అందిద్దామని పిలుపు

అమ్మ గర్భంలో నేర్చుకున్న అమృతం తెలుగు. అలాంటి మాతృభాషను పరిరక్షించి, భావితరాలకు వారసత్వంగా అందించేందుకు ప్రతినబూనుదామని వక్తలు పిలుపునిచ్చారు. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో చివరి రోజైన సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు ముఖ్యులు హాజరయ్యారు. తెలుగు భాషపై వారికున్న మమకారం, ముందుతరాలు అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.



భాష, సంస్కృతి ముందు తరాలకూ అందాలి

– పూసపాటి అశోక్‌గజపతి రాజు, గోవా గవర్నర్

మన మన చరిత్ర, మానవ విలువలను భావితరాలకు అందించడంలో విఫలమవుతున్నామన్న అనుమానం ఉంది. తెలుగు భాష, సంస్కృతిని మన ముందు తరాలకూ అందాలి. అది ఏఐ కార్యాచరణలోకి తీసుకురావాల్సిన మనందరి ముందున్న ప్రశ్న. ఇది ఏ ఒక్కరికో అప్పజెప్పడం కాదు, మనందరి పాత్ర ఉండాలి. అది సమర్థంగా పోషించినప్పుడే న్యాయం చేయగలం. ఆధునిక తరం సెల్‌ఫోన్లు వాడటం మానేయమంటే మానేయరు. అలాగని విలువలు లేకుండా, తెలియకుండా పెరిగినా అదీ విషాదమే. విలువలతో వస్తే మన ముందుతరాలు భారతదేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళతాయి



తెలుగును మరిచిపోవడం తప్పే

– పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి

తెలుగు భాష కేవలం సంభాషణ మాధ్యమమే కాదు. శతాబ్దాలుగా ప్రతిధ్వనిస్తున్న మన పూర్వీకుల స్వరం. వేల సంవత్సరాలకు పైగా సాహిత్య సంప్రదాయాన్ని నింపుకొన్న ఒక మహా సముద్రం. అన్నమాచార్యుల కీర్తనల నుంచి శ్రీశ్రీ విప్లవ కవిత్వం వరకు.. నన్నయ మహాభారతం నుంచి విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం వరకు తెలుగు ప్రపంచానికి వినోదాన్ని, విజ్ఞానాన్ని, విప్లవాన్ని అందించిన భాష. తెలుగు నేర్చుకోవడం ద్వారా అది మనల్ని మన మూలాలతో కలుపుతుంది. కుటుంబ బంధాలను బలపరుస్తుంది. నేను 25 ఏళ్లుగా అమెరికాలో ఉన్నా.. ఈ రోజు మీ అందరితో కలిసి ఉన్నానంటే కారణం తెలుగు భాష. దానిపై ఉన్న మమకారం. పద్య పఠనం, చిన్నప్పుడు మా తల్లిదండ్రులు మాకు చందమామ కథలు, సామెతలు చెప్పి పెంచారు. కాబట్టే మీ ముందు మాట్లాడగలుగుతున్నా. ప్రస్తుతం పిల్లల్లో తెలుగు చదవడం, మాట్లాడటం, రాయడం, సొంతభాషపై అభిమానం లేకపోవడం ప్రధాన సమస్యఉంది. భాష చనిపోతే సంస్కృతి చనిపోతుంది. సంస్కృతి చనిపోతే మన గుర్తింపు మాయమవుతుందని అంతా గ్రహించాలి. ఇంగ్లిషు నేర్చుకోవడం తప్పుకాదు కానీ తెలుగు మరచిపోవడం తప్పే. ఇంట్లో అందరూ తెలుగులో మాట్లాడాలి. నేనూ అమెరికాలోని మా పిల్లలతో ఎప్పుడూ తెలుగులో మాట్లాడతా.



తెలుగుపై అసెంబ్లీలోనూ చర్చిస్తాం

– అయ్యన్నపాత్రుడు, ఏపీ శాసన సభాపతి

మహాసభల వేదికకు ఎన్టీఆర్ పేరు పెట్టడం మంచి నిర్ణయం. రాజకీయ పార్టీ పేరులో తెలుగు భాష పేరు ఉండేలా చేసిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగుభాష కాకుండా పిల్లలు వేరే భాష మాట్లాడుతున్నారంటే తప్పు ఎవరిది. మమ్మీ డాడీ కన్నా అమ్మా నాన్న అంటే అందులో ఎంతో మాధుర్యం ఉంది. మా మనవడు గ్రాండ్‌పా అంటే నేను మాట్లాడనని చెప్పా. అప్పటి నుంచి తాతయ్య అని పిలుస్తున్నాడు. రాష్ట్రంలో చాలా ప్రాచీన కళలు ఉన్నాయి. పద్యాలు, పద్య నాటకాలు వంటివి కనిపించడం లేదు. ఉగాది గ్రామాల్లో పట్టించుకునే వారు లేరు. 60 శాతం గ్రామాల్లో శ్రీరామనవమి చేసుకోవడం లేదు. కొత్త సంవత్సరాది తెలుగుదనం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి మారాలి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలు తెలుగు భాష గొప్పతనాన్ని, కాపాడాల్సిన అవసరాన్ని స్పష్టం చేశాయి. ఇక్కడ చేసిన తీర్మానాలను త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చిస్తాం. ఎమ్మెల్యేలందరూ ఇదే అంశంపై మాట్లాడతారు. వారి అభిప్రాయాలను రికార్డు చేసి, వాటిపై తీర్మానాలు చేసి సీఎంకు పంపుతాం.



మూలాలు దెబ్బతింటే తెలుగుభాష ఉనికికి ముప్పు

– జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి


తెలుగు భాష ఔన్నత్యాన్ని, పరిరక్షించుకునే మార్గాల్ని చాలామంది ఈ వేదిక ద్వారా సూచించారు. తెలుగునాట పుట్టడం, తెలుగును మాతృభాషగా పొందడం మన అదృష్టమని అప్పయ్య దీక్షితులు చెప్పారు. కంచి పరమాచార్య ప్రసంగంలో తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగువారి అదృష్టాన్ని ప్రశంసించారు. ఇది మధురమైన భాష. మన జీవన శ్వాస. మూడు వేల ఏళ్లనాటి ఈ ప్రాచీనభాష ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నా వటవృక్షంలా నిలిచింది. తమిళ కవి భారతీయార్ తెలుగు మాధుర్యాన్ని వర్ణిస్తూ సుందర్ తెలుంగ్ అని చెప్పారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్నా, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా గుర్తించినా అది మన భాషకే చెల్లింది. మన జీవన విధానాన్ని, శైలిని మాతృభాష తెలియజేస్తుంది. వేర్లు తెగిపోతే ఎంత పెద్ద వృక్షమైనా ఎలా కూలిపోతుందో.. అలాగే, మూలాలు దెబ్బతింటే తెలుగుభాషకు, మన సంస్కృతికి ఆధారం ఉండదు. అందుకే దీనిని పరిరక్షించుకోవాలి. ఎందరో మహానుభావులు తెలుగుభాష కోసం ఎనలేని కృషి చేశారు. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులో మాట్లాడడం.. ఏ పాఠశాలలో, మాధ్యమంలో చదువుకున్నా తప్పనిసరిగా తెలుగును చదవడం, రాయడం వల్ల పరిరక్షించుకోవచ్చు. ప్రస్తుతం పిల్లలు స్టేట్, సెంట్రల్, ఎన్‌సీఈఆర్టీ ఇలా.. ఎన్నో రకాల సిలబస్‌లు చదువుతున్నా.. తప్పనిసరిగా ద్వితీయ భాషగా తెలుగు ఉండాలి. భాషా పండితులు సిలబస్‌ను రూపొందించాలి. విద్యాలయాల్లో నిష్ణాతులైన తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలి. ఇంజినీరింగ్, మెడిసిన్ మాత్రమే కాదు.. ఏ కోర్సు చదివినా, ఏ భాషలో చదివినా ఉన్నత అవకాశాలు వస్తాయనే భావన విద్యార్థులకు కలగజేయాలి.



తెలుగు వైభవం అద్వితీయం

– నిమ్మల రామానాయుడు, మంత్రి

దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు శ్రీకృష్ణదేవరాయలు. 1420లోనే ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్‌గా కితాబు అందుకున్న భాష మనది. ఏళ్ల చరిత్ర కలిగిన మన అమ్మభాష తెలుగు వైభవం అద్వితీయం. ఈ భాష గొప్పతనాన్ని చాటి చెప్పడమే కాకుండా ఉనికిని కాపాడటానికి ఇలాంటి మహాసభలు ఎంతో అవసరం. తెలుగువారి ఆత్మ విశ్వాసాన్ని చంద్రబాబు ప్రపంచానికి చాటి చెబుతుండటం గొప్ప విషయం.



ఐదో తరగతి వరకు తెలుగు తప్పనిసరి

– గజల్ శ్రీనివాస్, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు

42 దేశాలకు చెందిన ప్రతినిధులు.. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో సంగమం ఈ ప్రపంచ తెలుగు మహాసభలు. 2027లో మారిషస్‌లో 4వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనుండటం చాలా ఆనందంగా ఉంది. ఐదో తరగతి వరకు తెలుగును తప్పనిసరిగా ఉంచండి. అప్పుడే మన మాతృభాష పరిరక్షణ పూర్తిస్థాయిలో సాకారమవుతుంది. ఈ సభలకు వచ్చిన తెలుగు ఉపాధ్యాయులకు ఓడీలు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతున్నా.



తల్లి గర్భం నుంచే మాతృభాష అలవడుతుంది

– జస్టిస్ బులుసు శివశంకరరావు, ఛైర్మన్, తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ, తెలంగాణ

సంస్కృతంతో అనుసంధానమైన అతి పురాతన భాష తెలుగు. తమిళం కంటే పూర్వం నుంచి తెలుగు ఉంది. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర శాసనాల్లో, సాహిత్యంలో సజీవంగా తెలుగు ఉంది. మాతృభాష ప్రాముఖ్యం ఉపనిషత్తుల్లోనూ చాలా స్పష్టంగా ఉంది. తల్లి గర్భం నుంచే మాతృభాష పిల్లలకు అలవడుతుంది. కాబట్టి అమ్మభాషను మరచిపోకూడదు.

ఐటీ అనగానే మీరే గుర్తుకొస్తారు

చంద్రబాబుతో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్



మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'ఇండియా వచ్చినప్పుడు మీ పేరు వస్తోంది. ఐటీ అనగానే మీరే గుర్తుకొస్తారు' అని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్... ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు గుంటూరుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రింగ్‌రోడ్డులోని వెల్కమ్ హోటల్‌లో బస చేసిన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వారిద్దరూ 30 నిమిషాలకు పైగానే వివిధ అంశాలపై చర్చించుకున్నారు. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధి, ప్రస్తుతం ఏపీ రాజధాని అమరావతితో పాటు వైజాగ్, రాయలసీమలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు.. మారిషస్ అధ్యక్షుడికి వివరించారు. అమరావతిలో నెలకొల్పుతున్న క్వాంటమ్ కంప్యూటింగ్, వైజాగ్‌లో ఏర్పాటు చేస్తున్న గూగుల్ డేటా సెంటర్ గురించి తెలియజేశారు. చంద్రబాబు గతంలో మారిషస్‌లో పర్యటించిన రోజులను ధరమ్ బీర్ గోకుల్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బెజవాడ కనకదుర్గమ్మను మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు.

పిఠాపురంలో సంక్రాంతి వేడుకలకు పవన్‌కల్యాణ్

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు సొంత నియోజకవర్గానికి రానున్నారు. ఇప్పటికే కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మూడు రోజులపాటు ఇక్కడ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సంక్రాంతి సంబరాలను పవన్‌కల్యాణ్ ఈ నెల 9న ప్రారంభించనున్నారు. ఈ వేడుకల ద్వారా జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ పాఠశాల(ఓబీఎస్) క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. అదే రోజు నియోజకవర్గంలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాసరావు, పురపాలిక కమిషనర్ కనకారావు ఆదివారం పిఠాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పట్టణంలో పాదగయ కూడలి నుంచి అగ్రహారం వరకు నాలుగు కిలోమీటర్ల మెయిన్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పట్టణంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయి

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్థిరంగా నిలబడాలి. కూటమిలో సర్దుబాటు కోసం కొందరు త్యాగాలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు నేను కూడా ఒక ఉదాహరణ. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వ్యక్తిగతంగా కోల్పోయినవి మరెన్నో ఉన్నాయి' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. ఆయన సోమవారం ఎన్‌ఆర్‌ఐ జనసేన శ్రేణులతో వర్చువల్‌గా సమావేశమై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ కొంత ఆలస్యంగానైనా అవకాశాలు వస్తాయన్నారు. దేశంలో గతంలో 24వ స్థానంలో ఉన్న పంచాయతీరాజ్‌శాఖను తీసుకున్న పవన్‌కల్యాణ్ ఏడాదిన్నర కాలంలోనే మొదటి స్థానానికి తీసుకువచ్చారని వివరించారు.



మీకు దక్కని వాటి గురించి చింతించొద్దు

మనకు దక్కని హోదాలు, పూర్తి చేయలేకపోయిన లక్ష్యాలు, మనకు ప్రాముఖ్యత ఇవ్వని మనుషులు.. ఇలాంటి వాటి గురించే మనం ఎక్కువగా ఆలోచిస్తూ బాధపడుతుంటాం. వీటి గురించి చింతించడం మానేసి, మనకు దక్కిన ఆరోగ్యకర జీవితం, మన క్షేమం కోరే వ్యక్తులు, మనం నేర్చుకున్న నైపుణ్యాలు.. వీటిపై దృష్టి పెడితే జీవితం సంతృప్తికరంగా ఉంటుంది.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

తమిళనాడులో గరిట తిప్పిన అమిత్ షా



పొంగల్ తయారీలో అమిత్‌షా. చిత్రంలో భాజపా తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తదితరులు

రెండ్రోజుల పర్యటనలో భాగంగా తమిళనాడు విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం భాజపా నిర్వహించిన 'నమ్మ ఊరు మోదీ పొంగల్' కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుచ్చి మన్నార్‌పురంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన ఆయన.. పొంగల్ తయారీలో పాల్గొని గరిట తిప్పారు. అంతకుముందు తిరుచ్చిలో కూటమి నేతలతో అమిత్ షా సమావేశమయ్యారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో సీట్ల పంపకాలు, కూటమి గెలుపునకు సంబంధించిన వ్యూహాలపై చర్చించారు.

- న్యూస్‌టుడే, చెన్నై(ఆర్కేనగర్)

మిల్లర్లు దోపిడీ చేస్తే ఫిర్యాదు ఇవ్వండి

మంత్రి నాదెండ్ల మనోహర్



రామచంద్రపురం వద్ద మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్. చిత్రంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధికారులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, శ్రీకాకుళం గ్రామీణం, గార, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లు అదనపు తూకం పేరిట దోపిడీకి పాల్పడితే రైతులు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా సోమవారం శ్రీకాకుళం నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. గార మండలం రామచంద్రపురం వద్ద ఓ మిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణపై వివరాలు ఆరా తీశారు. రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన సభలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతుల్ని ఇబ్బందులకు గురి చేసిందని.. రూ.1,674 కోట్ల మేర బకాయిలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని చెల్లించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.9,300 కోట్లు జమ చేశామన్నారు. పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో కిలో గోధుమ పిండి రూ.20కే అందిస్తున్నామని.. వీలైనంత త్వరగా ప్రతి గ్రామంలోనూ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మిల్లు నిర్వహణపై సమగ్ర విచారణకు ఆదేశం

శ్రీకాకుళం గ్రామీణ మండలం చింతాడ గ్రామంలో చిట్టెమ్మ రైస్‌మిల్లును మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించి ట్రక్ షీట్ల కంటే ధాన్యం తక్కువ ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మిల్లు నిర్వహణలో లోపాలను గమనించి యాజమాన్యంపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. మిల్లును సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు తదితరులు ఉన్నారు.

7న సిద్ధార్థ స్వర్ణోత్సవాలకు సీఎం చంద్రబాబు

విజయవాడ సిటీ, గుంటూరు కలెక్టరేట్, మండపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 7, 8, 9 తేదీల్లో వివిధ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన పర్యటన ఖరారైంది. విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 7న నిర్వహించే సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవానికి హాజరుకానున్నారు. గుంటూరు నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో 8 నుంచి జరగనున్న అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రారంభోత్సవానికి సీఎం రానున్నారు. ఈ ప్రదర్శన 18 వరకు జరగనుంది. 9న తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరం మండలంలో పర్యటించనున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలను చంద్రబాబు రైతులకు పంపిణీ చేయనున్నారు.

బీసీ కులగణనపై కమిషన్ వేశారా?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

ఈనాడు, అమరావతి: బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్ ఏమైనా ఏర్పాటు చేశారా లేదా చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వెనుకబడిన తరగతుల (బీసీ) జాబితాను ప్రభుత్వం సిద్ధం చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ దాఖలైన వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఈ ఉత్తర్వులిచ్చారు. బీసీ గణనను పూర్తి చేసి విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలంటూ అఖిల భారత బీసీ సమాఖ్య ఏపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని అధికరణ 342ఏ(3) ప్రకారం బీసీల జాబితాను రూపొందించాకే రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఒకే వ్యాజ్యంలో విద్య, ఉద్యోగ, ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని మూడు అంశాలను లేవనెత్తడంపై న్యాయమూర్తి అభ్యంతరం తెలిపారు. పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. ఈ వ్యాజ్యంలో స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల అంశానికే పరిమితమవుతున్నట్లు స్పష్టత ఇచ్చారు.

అర్జీలిచ్చేందుకు.. అంతదూరం వెళ్లక్కర్లే!

- చేరువైన జిల్లా కేంద్రాలు..
- ఫిర్యాదుదారులతో కొత్త కలెక్టరేట్లు కళకళ



మార్కాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబు



రంపచోడవరంలో విజ్ఞప్తులు తీసుకుంటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ దినేశ్‌కుమార్



మదనపల్లెలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఈనాడు-రాజమహేంద్రవరం, అన్నమయ్య, మార్కాపురం-న్యూస్‌టుడే: మొన్నటి వరకు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం.. ఇప్పుడు చెంతకే వచ్చేసింది. అక్కడి ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. వారానికోసారి రూ.వందలు, వేలల్లో ఖర్చుచేసే పరిస్థితి నుంచి పేదలకు విముక్తి లభించింది. ఎప్పుడో కానీ కన్పించని పాలనా యంత్రాంగం.. ఇప్పుడు సమీపంలోనే కొత్త జిల్లాకేంద్రాల్లో అర్జీలు స్వీకరిస్తోంది. సోమవారం అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలపై విజ్ఞప్తులు అందించారు.

పేదలకు తగ్గిన వ్యయప్రయాసలు: ఎటపాక నుంచి పూర్వపు జిల్లా కేంద్రమైన పాడేరుకు వెళ్లాలంటే సుమారు 350 కిమీ ప్రయాణించాలి. రంపచోడవరం నుంచి తెల్లవారుజామున 5.30కు నర్సీపట్నం వెళ్లే బస్సు ఉండేది. సోమవారం ఉదయం వెళ్తే, మరుసటి రోజు ఇంటికి వచ్చేవాళ్లు.. పది మంది కలిసి వాహనం బుక్ చేసుకుంటే రూ.10 వేల వరకు ఖర్చయ్యేది. ప్రభుత్వం తాజాగా కొత్త జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా రంపచోడవరంలోనే జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడంతో స్థానికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. 12 మండలాల ప్రజలకు పాడేరు వెళ్లాల్సిన బాధతు తప్పాయి. అలాగే, మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్లాలన్నా దూరాభారం తప్పేది కాదు. మదనపల్లె సమీప మండలాల వారిదీ అదే అవస్థ. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడంతో స్థానికులకే కాదు, తంబళ్లపల్లె, పీలేరు ప్రాంత ప్రజలకూ పాలనాకేంద్రం చేరువైంది.

అర్జీలిచ్చేందుకు అధిక సంఖ్యలో..: ■ రంపచోడవరంలో సోమవారం నిర్వహించిన మొదటి పీజీఆర్ఎస్‌కు 145 అర్జీలు అందాయి. ■ మార్కాపురం కలెక్టరేట్‌కు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల నుంచి ప్రజలు పోటెత్తారు. 363 అర్జీలు అందాయి. ■ అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె కలెక్టరేట్‌కూ భారీ సంఖ్యలో అర్జీదారులు వచ్చారు.

రాత్రికి బస్టాండ్‌లోనే ఉండాల్సి వచ్చేది

–కరుణ, గొందివాడ, మారేడుమిల్లి మండలం, రంపచోడవరం జిల్లా

గతంలో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగ ప్రకటన రావడంతో దరఖాస్తు చేసేందుకు పాడేరు వెళ్లా. తిరిగి వచ్చేటప్పుడు బస్సు లేక రాత్రి నర్సీపట్నం బస్టాండులోనే ఉండాల్సి వచ్చింది. మరునాడు సాయంత్రానికి ఇంటికి చేరుకున్నా. జగ్గంపేట, నర్సీపట్నం మీదుగా పాడేరు వెళ్లి వచ్చేందుకు బస్ టికెట్లకే సుమారు రూ.3 వేలు ఖర్చయ్యింది. రంపచోడవరంలోనే కలెక్టరేట్ ఏర్పాటుతో మాకు సౌకర్యంగా ఉంది.

రెండు బస్సులు మారాల్సి వచ్చేది

– రాజేంద్రరెడ్డి, ములకలచెరువు, అన్నమయ్య జిల్లా

ఇదివరకు ములకలచెరువు నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి వెళ్లాలంటే 94 కి.మీ. ప్రయాణించాల్సి ఉండేది. రెండు బస్సులు మారాల్సి వచ్చేది. ఇప్పుడు మదనపల్లె మాకు 42 కి.మీ. మాత్రమే. దూరాభారం, వ్యయ ప్రయాసలు తగ్గాయి.

ఐదేళ్లుగా ఒంగోలుకు తిరుగుతున్నా

–కవలకుంట్ల సాల్మన్, మార్కాపురం

మార్కాపురంలో ఎస్సీ కార్పొరేషన్ అద్దె గదిని గతంలో నాకు కేటాయించారు. దాన్ని మరొకరు ఆక్రమించారు. సమస్య పరిష్కరించాలంటూ ఐదేళ్లుగా ప్రతినెలా రెండు సార్లు ఒంగోలుకు వెళ్లి వస్తున్నా. ఒకసారి వెళ్లి వస్తే రూ.300 ఖర్చయ్యేది. ఇప్పుడు ఆటోలో మార్కాపురం వచ్చేసి అర్జీ ఇచ్చేశా. రూ.50 ఖర్చయింది. శ్రమకూడా తగ్గింది.

ఛాంపియన్

భారత షట్లర్లకు పరీక్ష


సింధు

నేటి నుంచే మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత షట్లర్లకు పరీక్ష. గత ఏడాది ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన మన ప్లేయర్లు.. కొత్త సీజన్‌కు సిద్ధమయ్యారు. మంగళవారం మలేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలో బరిలోకి దిగుతున్నారు. పి.వి.సింధు, లక్ష్యసేన్ ఎలా ఆడతారనేది ఆసక్తికరం. గాయాల కారణంగా గతేడాది అక్టోబర్ నుంచి కోర్టుకు దూరమైన సింధు.. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సంగ్ యున్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది. 2025 సీజన్లో ఒడిశా ఓపెన్ నెగ్గిన ఉన్నతి హుడాకు తొలి రౌండ్లో చెన్ యుఫేయ్ (చైనా) రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురు కానుంది. రచనోక్ ఇంటనాన్ (థాయ్‌లాండ్)తో మాళవిక బన్సోద్ పోటీపడనుంది. పురుషుల సింగిల్స్‌లో జియా హెంగ్ (సింగపూర్)తో పోరుతో లక్ష్యసేన్ టోర్నీని మొదలుపెట్టనున్నాడు. లీ జి జియా (మలేసియా)ను ఆయుష్ శెట్టి ఢీకొట్టనున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట తొలి రౌండ్లో లీ హ్యుయ్-యంగ్ (చైనీస్ తైపీ) జోడీతో తలపడనుండగా.. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం కుసుమ-ట్రియాస్ (ఇండోనేసియా) జోడీతో పోటీపడనుంది.

నేడే బరిలోకి శ్రేయస్

విజయ్ హజారే ట్రోఫీలో ముంబయికి సారథ్యం


శ్రేయస్

ముంబయి

శ్రేయస్ అయ్యర్ వచ్చేస్తున్నాడు. అందరి దృష్టి తనపైనే నిలిచి ఉండగా.. రెండు నెలలకు పైగా విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో మంగళవారం హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో అతడు ముంబయి తరఫున ఆడతాడు. ఈ టోర్నీలో మిగతా మ్యాచ్‌లకు అతడు ముంబయి కెప్టెన్‌గా నియమితుడయ్యాడు కూడా. రెగ్యులర్ కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించడంతో శ్రేయస్‌కు బాధ్యతలు అప్పగించారు. గత అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో శ్రేయస్ తీవ్రంగా గాయపడ్డ సంగతి తెలిసిందే. గాయానికి చికిత్స తీసుకున్నాక.. బెంగళూరులోని సీఓఈలో కొన్ని వారాల పాటు ఉండి కోలుకున్నాడు. తన ఫిట్‌నెస్‌పై సందేహాలు పూర్తిగా తొలగని నేపథ్యంలో శ్రేయస్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం. ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉన్న అతణ్ని న్యూజిలాండ్‌తో ఈ నెల 11న మొదలయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. భారత వన్డే జట్టుకు అతడు వైస్‌కెప్టెన్. ముంబయి జట్టు హిమాచల్‌తో లీగ్ మ్యాచ్ తర్వాత 8న పంజాబ్‌తో తలపడుతుంది. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచిన ముంబయి.. ప్రస్తుతం గ్రూప్-సిలో రెండో స్థానంలో ఉంది. ఆ జట్టు నాకౌట్‌లో స్థానం దాదాపుగా ఖాయమైంది. విజయ్ హజారే ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లు ఈ నెల 12 నుంచి 18 వరకు బెంగళూరులోని సీఓఈలో జరుగుతాయి. మరోవైపు టీమ్ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా దేశవాళీ పునరాగమనం చేస్తున్నాడు. మంగళవారం గోవాతో మ్యాచ్‌లో అతడు పంజాబ్‌కు ఆడనున్నాడు. గిల్ శనివారం సిక్కింతో మ్యాచ్‌లో ఆడాల్సింది. కానీ విషాహారం వల్ల అనారోగ్యానికి గురికావడంతో అతడు ఆ మ్యాచ్‌కు దూరమయ్యాడు. గ్రూప్-సిలో పంజాబ్ అగ్రస్థానంలో ఉంది. విజయ్ హజారేలో ఇప్పటికే రెండు చొప్పున మ్యాచ్‌లు ఆడిన కోహ్లి (దిల్లీ), రోహిత్ (ముంబయి).. ఇక ఈ సీజన్లో బరిలోకి దిగరు. రిషబ్ పంత్, హర్షిత్ రాణా దిల్లీ తరఫున రైల్వేస్‌తో తర్వాతి మ్యాచ్ లోనూ ఆడతారు.


వైభవ్ సూర్యవంశీ

వైభవ్ మెరుపులు

యువ భారత్‌దే సిరీస్

బెనోని: దక్షిణాఫ్రికాతో మూడు యూత్ వన్డేల సిరీస్‌ను భారత అండర్-19 జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. వర్ష ప్రభావిత రెండో మ్యాచ్‌లో భారత్.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 8 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట సఫారీ జట్టు 245 పరుగులకు ఆలౌటైంది. జేసన్ రోల్స్ (114: 113 బంతుల్లో 7×4, 3×6) శతకం సాధించాడు. మిగతా బ్యాటర్లెవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు. కిషన్ సింగ్ (4/46), అంబ్రిష్ (2/47) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అనంతరం వర్షం కారణంగా లక్ష్యాన్ని 27 ఓవర్లలో 174కు సవరించారు. ఆరోన్ జార్జ్ (20)తో కలిసి కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ (68: 24 బంతుల్లో 1×4, 10×6) ఇన్నింగ్స్‌కు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. తొలి ఓవర్ నుంచే అతను సిక్సర్ల వర్షం కురిపించాడు. మజోలా వేసిన 8వ ఓవర్లో వైభవ్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 23 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాతి ఓవర్లోనే అతడు వెనుదిరిగినా.. వేదాంత్ త్రివేది (31 నాటౌట్), అభిజ్ఞాన్ కుందు (48 నాటౌట్) చివరిదాకా నిలిచి జట్టును గెలిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మైకెల్ క్రూస్‌క్యాంప్ (2/23) ఒక్కడే మెరుగ్గా బౌలింగ్ చేశాడు. మెరుపు అర్ధసెంచరీతో పాటు, రెండు క్యాచ్‌లు పట్టిన వైభవ్‌ను 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. చివరిదైన మూడో వన్డే బుధవారం జరగనుంది.

నిఖత్ శుభారంభం

జాతీయ సీనియర్ బాక్సింగ్


నిఖత్

గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ (51 కేజీ) శుభారంభం చేసింది. ఈ రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ సోమవారం మొదటి రౌండ్లో 5-0తో నిధి (చండీగఢ్)పై విజయం సాధించింది. ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా కూడా విజయంతో టోర్నీని ఆరంభించారు. 48 కిలోల విభాగంలో మీనాక్షి 5-0తో లక్షయపై, లవ్లీనా (75కేజీ) 5-0తో కృష వర్మపై నెగ్గారు. పురుషుల విభాగంలో ప్రపంచకప్ పతక విజేత హితేష్ గులియా (70కేజీ), పవన్ బర్త్వాల్ (55కేజీ), అంకుశ్ పంఘాల్ (80 కేజీ) తర్వాతి రౌండ్లో అడుగు పెట్టారు.

రూట్ శతకం

● ఇంగ్లాండ్ 384 ఆలౌట్

ఆస్ట్రేలియాతో యాషెస్ టెస్టు


రూట్

41

టెస్టుల్లో రూట్ శతకాలు. ఈ ఫార్మాట్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో రికీ పాంటింగ్‌తో కలిసి రూట్ మూడో స్థానంలో ఉన్నాడు. కలిస్ (45), సచిన్ (51) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు.

సిడ్నీ: జో రూట్ (160; 242 బంతుల్లో 15×4) అదరగొట్టాడు. గత అయిదు ఇన్నింగ్స్‌ల్లో సత్తా చాటలేకపోయిన ఈ స్టార్ బ్యాటర్.. భారీ సెంచరీ చేయడంతో ఆస్ట్రేలియాతో యాషెస్ అయిదో టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో మెరుగైన స్కోరు చేసింది. ఆ జట్టు 384 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 211/3తో రెండో రోజు, సోమవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్.. ఇంకో 173 పరుగులు జోడించి, మిగతా 7 వికెట్లు కోల్పోయింది. 72 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన రూట్.. భారీ శతకం సాధించి తొమ్మిదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు. హ్యారీ బ్రూక్ (84; 97 బంతుల్లో 6×4, 1×6)తో నాలుగో వికెట్‌కు 169 పరుగులు జోడించిన రూట్.. జేమీ స్మిత్ (46; 76 బంతుల్లో 6×4, 1×6)తో ఆరో వికెట్‌కు 94 పరుగులు జత చేశాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన ఆస్ట్రేలియా.. ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 166/2తో నిలిచింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (91 బ్యాటింగ్; 87 బంతుల్లో 15×4) సెంచరీకి చేరువలో ఉన్నాడు. మార్నస్ లబుషేన్ (48), వెదరాల్డ్ (21) ఔటయ్యారు. హెడ్‌కు తోడుగా నీసర్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

నిలిచిన రూట్: రెండో రోజు ఇంగ్లాండ్.. ఆరంభంలోనే బ్రూక్ వికెట్ కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరుకు అతను 6 పరుగులే జోడించాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (0) కూడా వెంటనే ఔటైపోవడంతో ఆసీస్ 229/6కు చేరుకుంది. ఈ స్థితిలో రూట్.. జేమీ స్మిత్‌తో కలిసి మళ్లీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ క్రమంలోనే రూట్ 146 బంతుల్లో సెంచరీ అందుకున్నాడు. స్మిత్ ఔటయ్యాక విల్ జాక్స్ (26)తో రూట్ మరో భాగస్వామ్యం నెలకొల్పడంతో ఇంగ్లాండ్ 375/7తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ కేవలం 9 పరుగుల తేడాలో 3 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 400 మార్కును కూడా చేరుకోలేకపోయింది. రూట్‌ను నీసర్ అద్భుతమైన రిటర్న్ డైవ్ క్యాచ్‌తో ఔట్ చేశాడు. నీసర్ 4 వికెట్లు తీయగా.. స్టార్క్, బోలాండ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించింది. ఓపెనర్లు హెడ్, వెదరాల్డ్ .. ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. తొలి వికెట్‌కు అర్ధసెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాక వెదరాల్డ్ వెనుదిరిగినా.. లబుషేన్ తోడుగా హెడ్ ఆసీస్‌ను బలమైన స్థితికి చేర్చాడు. ఈ జంట రెండో వికెట్‌కు 105 పరుగులు జత చేసింది. ఆట చివర్లో లబుషేన్ ఔటయ్యాడు. కంగారూ జట్టు కోల్పోయిన రెండు వికెట్లను స్టోక్స్ పడగొట్టాడు. ఆఖర్లో ఆస్ట్రేలియా బ్యాటర్లు వ్యూహాత్మకంగా ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ బెన్ స్టోక్స్.. లబుషేన్‌తో వాగ్వాదం పెట్టుకున్నాడు. తొలి రోజు 45 ఓవర్ల ఆటే సాధ్యమైన సంగతి తెలిసిందే.

సంక్షిప్త స్కోర్లు... ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 384 (రూట్ 160, బ్రూక్ 84, జేమీ స్మిత్ 46; డకెట్ 27, విల్ జాక్స్ 27; నీసర్ 4/60, స్టార్క్ 2/93, బోలాండ్ 2/85); **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 166/2 (ట్రావిస్ హెడ్ 91 బ్యాటింగ్, లబుషేన్ 48, వెదరాల్డ్ 21; స్టోక్స్ 2/30)

డబ్ల్యూపీఎల్-4 సమీపిస్తోంది. ఇప్పటిదాకా మూడు సీజన్లు జరిగితే.. రెండుసార్లు ముంబయి ఇండియన్స్ (2023, 2025) కప్పును ముద్దాడింది. ఒకసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (2024) విజేత అయింది. ఈ మూడుసార్లూ దిల్లీ క్యాపిటల్సే రన్నరప్‌గా నిలిచింది. మరి జనవరి 9న ఆరంభమయ్యే టోర్నీలో కొత్త జట్టుకు కప్ దక్కుతుందా? లేదా మునుపటి విజేతలకే చిక్కుతుందా? ముందుగా దిల్లీ, గుజరాత్ జట్ల గురించి తెలుసుకుందామా!

రాత మారుతుందా!

ఈనాడు క్రీడావిభాగం

జట్టును మార్చి..


ఆష్లీ గార్డ్‌నర్

జట్టులో స్టార్లకు కొదువ లేదు. నైపుణ్యమున్న ప్లేయర్లకు లోటు లేదు.. కానీ డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ గత మూడేళ్లలో కప్ కొట్టలేకపోయింది. తొలి రెండు సీజన్లలో లీగ్ దశలోనే వెనుదిరిగిన ఆ జట్టు.. గతేడాది మెరుగైన ప్రదర్శన చేసి ఎలిమినేటర్‌కు అర్హత సాధించగలిగింది. ఈసారి జట్టులో కొత్త ప్లేయర్లు రావడంతో ఉత్సాహంగా ఉన్న గుజరాత్.. మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటోంది. వేలంలో రూ.2 కోట్లు పెట్టి అనుభవజ్ఞురాలు సోఫీ డివైన్‌ను గుజరాత్ చేజిక్కించుకుంది. రూ.45 లక్షలతో దక్కించుకున్న అనుష్క శర్మ ప్రస్తుతం లీగ్‌లోనే ఖరీదైన అన్ క్యాప్డ్ ప్లేయర్.

కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్, సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్, కిమ్ గార్త్ లాంటి స్టార్ ఆల్‌రౌండర్ల అండ గుజరాత్‌కు ఉంది. ఈ స్టార్లలో ఎవరిని తుది కూర్పులో చేర్చాలన్నది కూడా ఆ జట్టుకు సవాలే. అనుభవజ్ఞురాలు రేణుక సింగ్‌తో పాటు కాశ్వీ గౌతమ్, టిటాస్ సాధులతో గుజరాత్ పేస్ విభాగం బలంగా ఉంది. రాజేశ్వరి గైక్వాడ్, తనూజ కన్వర్‌లతో స్పిన్ విభాగం పర్వాలేదనిపిస్తోంది. ఒక మ్యాచ్‌లో గెలిచినా.. అదే జోరు తర్వాతి మ్యాచ్‌లో చూపించకపోవడం ఆ జట్టు బలహీనత. ఈసారి తప్పులు దిద్దుకుని మెరుగైన ప్రదర్శన చేయాలని గార్డ్‌నర్ బృందం పట్టుదలగా ఉంది. విదేశీ తారలతో పాటు భారత అమ్మాయిలు రాణించగలిగితే గుజరాత్ గత సీజన్‌కు మించిన ప్రదర్శన చేసే అవకాశం ఉంది.

ఉత్తమ ప్రదర్శన: ప్లేఆఫ్స్ (2025)

గుజరాత్ జట్టు... భారత ప్లేయర్లు: యాస్తిక భాటియా, భార్తీ, శివాని సింగ్, కనిక, అనుష్క శర్మ, కాశ్వీ గౌతమ్, రాజేశ్వరి గైక్వాడ్, రేణుక సింగ్, తనూజ కన్వర్, టిటాస్ సాధు, హ్యాపీ కుమారి, ఆయుషి సోని.

విదేశీ క్రికెటర్లు: ఆష్లీ గార్డ్‌నర్ (కెప్టెన్), సోఫీ డివైన్, కిమ్ గార్త్, డానీ వ్యాట్, బెత్ మూనీ, జార్జియా వేర్‌హామ్.


రేణుక సింగ్

దిల్లీ.. ఈసారైనా!



జెమీమా

ఐపీఎల్‌లోనే కాదు డబ్ల్యూపీఎల్‌లోనూ దిల్లీ క్యాపిటల్స్‌కు ఇప్పటి దాకా కప్పు యోగం లేదు. వరుసగా మూడు సీజన్లలోనూ దిల్లీ ఫైనల్‌కు వెళ్లినా.. ఓటమి వైపే నిలిచింది. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న మెగ్ లానింగ్ యూపీ జట్టుకు వెళ్లిపోవడంతో.. భారత స్టార్ జెమీమా రోడ్రిగ్స్ దిల్లీ పగ్గాలు అందుకుంది. మరి ఆమె జట్టు రాత మారుస్తుందో లేదో చూడాలి. కెప్టెన్సీలో అనుభవం ఉన్న లారా వోల్వార్ట్ జట్టులో ఉండడం జెమీమాకు కలిసొచ్చే అంశం. షెఫాలి వర్మ, వోల్వార్ట్, మరిజేన్ కాప్, జెమీమా బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. షెఫాలి-వోల్వార్ట్ ఓపెనింగ్ జోడీపై భారీ అంచనాలే ఉన్నాయి. బౌలింగ్‌లో దిల్లీ ఎక్కువగా పేసర్ కాప్ మీద మీదే ఆధారపడనుంది. నాణ్యమైన దేశీ పేసర్లు లేకపోవడం ఆ జట్టు బలహీనతల్లో ఒకటి. ఇటీవల అంతర్జాతీయ తెరపైకి దూసుకొచ్చిన తెలుగమ్మాయి శ్రీచరణి స్పిన్‌లో కీలకం కానుంది. అలానా కింగ్ రూపంలో మరో మేటి స్పిన్నర్ ఆ జట్టుకు అందుబాటులో ఉంది. షినెలి హెన్రీ, స్నేహ్ రాణా చూడదగ్గ ఆల్‌రౌండర్లు.


ఉత్తమ ప్రదర్శన: 2023, 2024, 2025 రన్నరప్.

దిల్లీ జట్టు... భారత ప్లేయర్లు: జెమీమా (కెప్టెన్), షెఫాలి వర్మ, తానియా భాటియా, దీయా యాదవ్, మమత, నికీ ప్రసాద్, స్నేహ్ రాణా, మిన్ను మణి, శ్రీచరణి, నందని శర్మ

విదేశీ క్రికెటర్లు: లారా వోల్వార్ట్, మరిజేన్ కాప్, అలానా కింగ్, షినెలి హెన్రీ, లిజెలీ లీ, లూసీ హామిల్టన్.


మరిజేన్ కాప్

బిలియర్డ్స్ మాజీ ఛాంప్ మనోజ్ కన్నుమూత


మనోజ్ కొఠారి

టీనగర్, న్యూస్‌టుడే: బిలియర్డ్స్ మాజీ ప్రపంచ ఛాంపియన్, 15 ఏళ్లుగా భారత జట్టు కోచ్‌గా ఉన్న మనోజ్ కొఠారి కన్నుమూశారు. కోల్‌కతాకు చెందిన 67 ఏళ్ల మనోజ్.. సోమవారం తమిళనాడు తిరునెల్వేలిలోని ఓ ఆసుపత్రిలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. "మనోజ్‌కు పది రోజుల కిందట కాలేయ మార్పిడి జరిగింది. కొద్ది రోజుల నుంచి ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతూ.. ఈ రోజు ఉదయం గుండెపోటుకు గురయ్యారు" అని మనోజ్ కుటుంబ సభ్యులొకరు చెప్పారు. మనోజ్ 1990లో ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ గెలిచారు. ఆయన అర్జున అవార్డు అందుకున్నారు. మనోజ్ తనయుడు సౌరభ్ కూడా గత ఏడాది ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్ సాధించడం విశేషం.





గత ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్, అంధుల ప్రపంచకప్, పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్లను సోమవారం ముంబయిలో రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో హర్మన్‌ప్రీత్, దీపికలతో నీతా.. రోహిత్ శర్మతో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండీశ్వరీనాథ్.

వచ్చే నెలలో ధావన్ పెళ్లి!


సోఫీ షైన్, శిఖర్ ధావన్

దిల్లీ: భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నాడు. కొంత కాలంగా ప్రేమలో ఉన్న సోఫీ షైన్‌ను అతను ఫిబ్రవరి మూడో వారంలో మనువాడనున్నట్లు సమాచారం. ఈ వివాహానికి భారత క్రికెటర్లు, బాలీవుడ్ తారలు హాజరు కానున్నట్లు తెలిసింది. 2012లో అయేషా ముఖర్జీని పెళ్లి చేసుకున్న ధావన్.. 2023లో విడాకులు తీసుకున్నాడు. ఈ జంటకు ఒక కుమారుడు ఉన్నాడు.

సూర్యా.. పరుగుల గురించే ఆలోచించు


పాంటింగ్

దుబాయ్: ఔట్ కావడం గురించి కాకుండా పరుగులు చేయడం గురించి ఆలోచించాలని టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ సలహా ఇచ్చాడు. సూర్య పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న నేపథ్యంలో అతడు స్పందించాడు. సూర్య 2025లో 21 టీ20 మ్యాచ్‌ల్లో 13.62 సగటుతో 218 పరుగులు మాత్రమే చేశాడు. "సూర్య ఫామ్ ఆశ్చర్యం కలిగిస్తోంది. అతడు మంచి ఆటగాడు. టీ20 క్రికెట్లో భారత్ జట్టు తరఫున నిలకడగా రాణించాడు. కానీ కొంతకాలంగా ఫామ్‌లో లేడు" అని అన్నాడు. "తన అత్యుత్తమ ఫామ్‌లో సూర్య 8-10 బంతుల్లో ఊపందుకుంటాడు. ట్రావిస్ హెడ్‌లాగే ఔట్ కావడం గురించి భయపడడు" అని పాంటింగ్ చెప్పాడు. "ఔట్ కావడం గురించి కాకుండా పరుగుల గురించి ఆలోచించాలి. సూర్యకు నేనిచ్చే సలహా ఇదే. టీ20 క్రికెట్లో అతడు ఇప్పటికే తనను తాను నిరూపించుకున్నాడు. ఇప్పుడు మరోసారి నిరూపించుకోమని చెబుతున్నా" అని అన్నాడు.

జేఎస్‌డబ్ల్యూతో నీరజ్ బంధానికి తెర


నీరజ్ చోప్రా

దిల్లీ: జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌తో బంధానికి తెరదించాడు. త్వరలో సొంతంగా అథ్లెట్ నిర్వహణ సంస్థను ప్రారంభించనున్నట్లు అతడు ఓ ప్రకటనలో తెలిపాడు. రెండు సార్లు ఒలింపిక్ పతకం సాధించిన ఈ 27 ఏళ్ల అథ్లెట్.. 2016 నుంచి జేఎస్‌డబ్ల్యూతో కొనసాగుతున్నాడు. "జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ నా కెరీర్‌లో కీలక పాత్ర పోషించింది. గత పదేళ్లుగా మా ప్రయాణం ఎదుగుదల, నమ్మకం, విజయాలతో అద్భుతంగా సాగింది. వారిచ్చిన తోడ్పాటుకు ఎప్పటికీ కృతజ్ఞుడినై ఉంటాను. ఇదే విలువల్ని నా జీవితాంతం కొనసాగిస్తాను" అని చోప్రా అన్నాడు. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సీఈఓ దివ్యాంశు సింగ్ మాట్లాడుతూ.. "నీరజ్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. మేము కలిసి సాధించిన వాటికి గర్విస్తున్నాం. అతడి విజయ పరంపర ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించిన చోప్రా.. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు.

ఏపీ, తెలంగాణ ఓటమి

జాతీయ అండర్-14 బాలికల వాలీబాల్

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జాతీయ అండర్-14 బాలికల వాలీబాల్ టోర్నీలో తొలి రోజు తెలుగు రాష్ట్రాల జట్లు నిరాశపరిచాయి. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో సోమవారం ప్రారంభమైన టోర్నీలో ఏపీ 1-3 (9-25, 25-20, 16-25, 26-28)తో ఉత్తర్‌ప్రదేశ్ చేతిలో ఓడింది. తెలంగాణ 0-3 (18-25, 17-25, 19-25)తో కర్ణాటక చేతిలో పరాజయం పాలైంది. ఈ ఓటములతో ఏపీ, తెలంగాణ జట్లకు నాకౌట్ అవకాశాలు సన్నగిల్లాయి.

బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలను ఆ దేశ ప్రభుత్వం నిషేధించింది. తమ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి పంపేసిన నేపథ్యంలో బంగ్లా ఈ నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు నుంచి ముస్తాఫిజుర్‌ను తప్పించడానికి బీసీసీఐ సరైన కారణాలు చెప్పలేదని బంగ్లాదేశ్ సమాచార ప్రసారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. బీసీసీఐ నిర్ణయం బంగ్లా ప్రజలను బాధించిందని చెప్పింది. ఐపీఎల్ మార్చి 26న ఆరంభం కానుంది. ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడడానికి కూడా బంగ్లాదేశ్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని ఆ దేశం కోరింది.

sukhi@eenadu.in

సుఖీభవ



కణితి పేరు వింటేనే బెంబేలెత్తుతాం. అలాంటిది శరీరం మొత్తానికి హెడ్‌మాస్టర్‌లాంటి మెదడులో కణితి (బ్రెయిన్ ట్యూమర్) ఉందంటే చెప్పేదేముంది? నిలువెల్లా భయంతో వణికిపోతాం. అది క్యాన్సరేమో, ఎక్కడికి దారి తీస్తుందోనని ఆందోళన మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నిజానికి మెదడులో తలెత్తేవన్నీ క్యాన్సర్ కణితులు కావు. దాదాపు సగం వరకు మామూలువే. అన్నింటికీ శస్త్రచికిత్స అవసరం లేదు. చిన్న, మామూలు కణితులను ఒకరోజు చికిత్సతోనూ నయం చేయొచ్చు. క్యాన్సర్ కణితులకు ఇప్పుడు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మరెన్నో అధునాతన చికిత్సలూ పురుడు పోసుకుంటున్నాయి.

మెదడులో కణితి కలవరం

మన మెదడు ఓ సజీవ కంప్యూటర్. కేంద్ర నాడీవ్యవస్థలో ఒక భాగమైన ఇది జ్ఞానేంద్రియాల నుంచి సమాచారాన్ని సంగ్రహించి అవయవాలకు, కండరాలకు ఆదేశాలు జారీచేస్తుంది. ఇలా ఒంట్లో అన్ని పనులను పురమాయిస్తుంది, పర్యవేక్షిస్తుంది. మెదడులోని కణాల ఆకృతి, పనితీరు వేర్వేరు. ఉన్నట్టుండి అవన్నీ జన్యుపరమైన డీఎన్‌ఏ ఆదేశాల మేరకు నడుచుకుంటాయి. ఎందుకనో కొన్నిసార్లు ఈ జన్యు పదార్థంలో మార్పులు లేదా తప్పులు సంభవించి కణాల పనితీరు అస్తవ్యస్తమవుతుంది. అసాధారణంగా పెరుగుతూ, విభజన చెందుతూ వచ్చి ఒకచోట గూడుకట్టుకొని, కణితులుగా ఏర్పడతాయి. ఇవి తాము చేయాల్సిన అసలు పనిని 'మరచిపోవటం'తో పాటు చుట్టుపక్కల కణాల పనితీరునూ భంగపరుస్తుంటాయి. సమీపంలోని మెదడు భాగం మీద ఒత్తిడి కలగజేసి, పుర్రె వైపునకు నెట్టొచ్చు. మెదడులో రక్తం, మేరు ద్రవం (సెరిబ్రోస్పైనల్ ఫ్లూయిడ్) ప్రసరణకూ అడ్డుతగలొచ్చు. మేరుద్రవంలోకి విస్తరించి మెదడులో, వెన్నుపాములో మరిన్ని కణితులకూ దారితీయొచ్చు.



డా॥ మానస్ పాణిగ్రాహి
హెచ్‌ఓడీ
న్యూరోసర్జరీ
కిమ్స్ హాస్పిటల్
సికింద్రాబాద్

అన్నీ క్యాన్సర్లు కావు

మెదడు కణితులన్నీ క్యాన్సర్లు కావు. దాదాపు సగం వరకూ మామూలువే (బినైన్) ఉంటాయి. సాధారణంగా మామూలు కణితులు నెమ్మదిగా ఏడాదికి 2 మి.మీ. మాత్రమే పెరుగుతాయి. ఫిట్స్, వినికిడి లోపించటం వంటి లక్షణాలు కనిపించినప్పుడో, ప్రమాదాల్లో గాయపడినప్పుడో స్కాన్ చేసినప్పుడు బయటపడుతుంటాయి. కానీ క్యాన్సర్ కణితులు అలా కాదు. చాలా వేగంగా వృద్ధి చెందుతాయి. చుట్టుపక్కల మెదడు కణజాలను తీవ్రంగా దెబ్బతీస్తూ వస్తుంటాయి.

గామానైఫ్ అద్భుతం

మామూలు (గ్రేడ్ 1) కణితుల సైజు 2.5 సెం.మీ. కన్నా తక్కువగా ఉంటే బయటి నుంచే గామానైఫ్‌తో చికిత్స చేయొచ్చు. పుర్రెకు రంధ్రం పెట్టాల్సిన అవసరముండదు. గామానైఫ్ అనేది రేడియేషన్ పరికరం. ఇది వివిధ కోణాల నుంచి కణితి మీద మాత్రమే రేడియేషన్ వెదజల్లేలా చేయటం ద్వారా కణితిని నిర్మూలిస్తుంది. మామూలు కణజాలానికి ఎలాంటి హాని కలిగించదు. ఇది ఒకరోజులోనే పూర్తయ్యే చికిత్స. ఆసుపత్రిలో చేరాల్సిన అవసరముండదు. పూర్తిగా కోలుకుంటారు. మెదడులో కీలకమైన భాగంలో కణితి ఉన్నప్పుడు, దాన్ని పూర్తిగా బయటకు తీయటం సాధ్యం కానప్పుడూ గామానైఫ్ చికిత్స చేయొచ్చు.

ప్రధాన లక్షణం తలనొప్పి

మెదడులో కణితులు ముందు, వెనక, పైన, కింద, మధ్య భాగాల్లో ఎక్కడైనా ఏర్పడొచ్చు. ఇవి ఉన్న చోటును బట్టి ఆయా లక్షణాలు కనిపిస్తుంటాయి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది తలనొప్పి. ముఖ్యంగా ఉదయం నిద్ర నుంచి లేచిన తర్వాత తలనొప్పి వస్తుంటుంది. పుర్రె ఎముక గట్టిగా దృఢంగా ఉంటుంది. లోపల కణితి పెరుగుతున్నప్పుడు కపాలంలో ఒత్తిడి ఎక్కువై తలనొప్పి పుడుతుంది. వేగంగా పెరిగే క్యాన్సర్ కణితుల్లో వెంటనే తలనొప్పి మొదలవుతుంటుంది. ఈ నొప్పి వస్తూ పోతుంటుంది గానీ పూర్తిగా తగ్గదు. ఎప్పుడూ ఎంతో కొంత తలనొప్పి ఉంటుంది. వాంతి కూడా కావొచ్చు. వాంతి అయిన తర్వాత తలనొప్పి తగ్గినట్టు అనిపించటం మరో ప్రత్యేకత. మళ్లీ కొద్దిసేపట్లోనే తలనొప్పి పెరిగినట్టు అనిపిస్తుంది. ఇలాంటివి గుర్తిస్తే మెదడులో ఏదో సమస్య ఉండొచ్చని అనుమానించాలి.

ఫిట్స్: పిల్లల్లో చాలావరకు ఫిట్స్‌కు కణితులకు సంబంధం ఉండదు. కానీ 20 ఏళ్లు దాటిన తర్వాత ఎవరికైనా ఉన్నట్టుండి ఫిట్స్ మొదలైతే మెదడులో కణితి ఉండొచ్చని అనుమానించాలి.

వినికిడి లోపించటం: రెండు చెవుల్లో వినికిడి తగ్గితే మామూలే అనుకోవచ్చు. కానీ ఒక చెవిలో వినికిడి తగ్గితే శ్రవణ నాడి మీద కణితి ఉండొచ్చని అనుమానించాలి.

చూపు తగ్గటం: కణితుల మూలంగా తలలో ఒత్తిడి పెరిగితే దాని ప్రభావం దృష్టినాడి మీదా పడుతుంది. దీంతో చూపు తగ్గొచ్చు, ఒకటికి రెండు వస్తువులు కనిపించొచ్చు.

మతిమరుపు: సాధారణంగా మతిమరుపును మానసిక ఒత్తిడితో ముడిపెడుతుంటాం. అయితే అప్పటివరకు బాగానే ఉండి, అన్ని పనులు సక్రమంగా చేసుకుంటూ, పరీక్షల్లో బాగా మార్కులు తెచ్చుకుంటున్నవారిలో ఉన్నట్టుండి జ్ఞాపకశక్తి, తెలివితేటలు, ప్రజ్ఞ తగ్గితే మాత్రం అనుమానించాల్సిందే.

ఆయా భాగాలను బట్టి: కొన్ని కణితులతో నడుస్తున్నప్పుడు శరీరం తూలొచ్చు, ఒకవైపునకు ఒరిగిపోవచ్చు. కొందరు బాగానే మాట్లాడుతుంటారు గానీ ఇతరులు చెప్పేది అర్థం కాకపోవచ్చు. కాలు, చేయి నెమ్మదిగా బలహీనం కావటం, చేతి రాత మారటం, చేత్తో పెన్ను పట్టుకోలేకపోవటం, నడుస్తున్నప్పుడు తెలియకుండానే కాలి నుంచి చెప్పు జారిపోవటం వంటివీ కనిపించొచ్చు. ఇలాంటి లక్షణాలు హఠాత్తుగా ఉన్నట్టుండి మొదలై, రెండు మూడు వారాల్లోనే తీవ్రమైతే కణితి కారణం కావొచ్చని అనుమానించాలి.

చికిత్స

కణితి క్యాన్సరా? మామూలుదా? ఏ రకానికి, గ్రేడ్‌కు చెందింది? సైజులో ఎంత ఉంది? మెదడులో ఎక్కడుంది? అనే వాటిని బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. సర్జరీ, రేడియేషన్, కీమోథెరపీల్లో ఎవరికి ఏది అవసరమో నిర్ణయిస్తారు. కొన్ని ఒక్క శస్త్రచికిత్సతోనే నయమైతే కొన్నింటికి రేడియేషన్, కీమో కూడా అవసరమవుతాయి.

● మామూలు కణితిని శస్త్రచికిత్సతో తొలగిస్తే సరిపోతుంది. కణితి సైజును బట్టి పుర్రెకు రంధ్రం చేసి, దాని ద్వారా పూర్తిగా బయటకు తీస్తారు. అదే క్యాన్సర్ కణితులకు శస్త్రచికిత్సతో తొలగించటంతో పాటు రేడియేషన్, కీమోథెరపీలూ అవసరమవుతాయి. శస్త్రచికిత్సకు ముందు ప్రత్యేకమైన ఫంక్షనల్ ఎంఆర్ఐ పరీక్ష చేసి మాటలు, కదలికలు, మింగటం వంటి పనులకు తోడ్పడుతున్న మెదడు భాగాలను గుర్తిస్తారు. అలాగే మెదడులోకి ఫ్లోరసిన్ రంగును ఎక్కిస్తారు. ఇది కణితులకు అంటుకుంటుంది. పుర్రెకు రంధ్రం చేసి లోపలికి చూసినప్పుడు అవి వెలుగుతూ, స్పష్టంగా కనిపిస్తాయి. మైక్రోస్కోప్ ద్వారా లోపలికి చూస్తూ కణితిని జాగ్రత్తగా తొలగిస్తారు.

● గ్రేడ్ 2 కణితులకు శస్త్రచికిత్స అనంతరం ఎన్‌జీఎస్ అనే జన్యు పరీక్ష చేయాల్సి ఉంటుంది. వీరికి రేడియేషన్ చికిత్స వెంటనే చేయాలా? కొద్దిరోజుల తర్వాత చేయాలా? అనేది నిర్ణయించటానికి దీని ఫలితాలు తోడ్పడతాయి.

● గ్రేడ్ 3, 4 అయినట్టయితే రేడియేషన్, కీమోథెరపీ తప్పనిసరి.

● ఒకప్పుడు మెదడు కణితులను తొలగించటానికి పుర్రెకు పెద్ద రంధ్రం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు నావిగేషన్ పద్ధతితో చిన్న రంధ్రంతోనే సాధ్యమవుతోంది. మెదడు ఎంఆర్ఐ, రోగి ముఖం తీరుతెన్నులను సమ్మిళితం చేసి ఎక్కడ రంధ్రం చేయాలో నిర్ణయించటానికిది తోడ్పడుతుంది. అలాగే దగ్గరి దారిలో కణితి ఉన్న చోటుకు కచ్చితంగా తీసుకెళ్తుంది. ఫోన్‌లో జీపీఎస్ మాదిరిగా దారి చూపిస్తుందన్నమాట.

● మెదడులో కీలకమైన భాగాల్లో కణితి ఉన్నప్పుడు తల భాగానికి మాత్రమే మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయొచ్చు. సర్జరీ చేస్తున్నపుడు రోగులు స్పృహలోనే ఉంటారు. వారితో మాట్లాడుతూ.. చేతులు, కాళ్లు కదిలించటానికి ఏయే భాగాలు తోడ్పడుతున్నాయో గుర్తిస్తారు. వాటికి ఎలాంటి హాని కలిగించకుండా కణితిని మాత్రమే తొలగిస్తారు.

రకరకాలు

మెదడు కణితుల్లో చాలారకాలే ఉన్నాయి. అవి ఏర్పడిన చోటు, ఏ కణాలతో ఏర్పడ్డాయో అనే దాన్ని బట్టి రకాలు ఆధారపడి ఉంటుంది. ఇతర అవయవాల్లో తలెత్తే క్యాన్సర్ కణాలు మెదడుకు చేరుకొని, కణితులుగా మారొచ్చు.

గ్లయోమాలు: ఇవి నాడీకణాలను అనుసంధానం చేసే పోచల నుంచి పుట్టుకొస్తాయి. వీటిల్లో ఆస్ట్రోసైటోమా, ఆలిగోడెండ్రోగ్లయోమా, గ్లయో బ్లాస్టోమా మల్టీఫోర్మీ వంటి రకాలూ ఉన్నాయి. ఆలిగోడెండ్రోగయోమాలు సర్జరీ, కీమో, రేడియేషన్ చికిత్సలకు బాగా స్పందిస్తాయి. ఫలితమూ బాగుంటుంది.

గ్యాంగ్లియోన్యూరోమా: వీటిని గ్యాంగ్లియోమా అనీ అంటారు. ఇవి మెదడు లోపల అటనమిక్ నాడీకణాల నుంచి తలెత్తుతాయి. సాధారణంగా పదేళ్ల పైబడ్డవారిలో కనిపిస్తుంటాయి. నెమ్మదిగా పెరిగే ఇవి చాలావరకూ మమూలు కణితులే.

మెనింజియోమా: ఇవి మెదడు చుట్టూ ఉండే పొరల్లో (డ్యూరా) ఏర్పడతాయి. సాధారణంగా మామూలువే అయినా కొన్ని క్యాన్సర్లూ కావొచ్చు.

గ్రంథి కణితులు: మెదడులోని పీనియల్, పీయూష వంటి గ్రంథుల్లో, వాటి చుట్టూరా ఏర్పడతాయి. పిల్లల్లో పీనియల్‌బ్లాస్టోమా ఎక్కువ.

ఆస్టియోమా: వీటిని ఆస్టియోసార్కోమా అనీ అంటారు. ఇవి పుర్రె ఎముక నుంచి పుట్టుకొస్తాయి.

నాడి కణితులు: ఇవి నాడుల్లో లేదా నాడుల మీద ఏర్పడుతుంటాయి. వీటిల్లో ప్రధానమైంది శ్రవణనాడి మీద తలెత్తే అకౌస్టిక్ న్యూరోమా. దీన్నే ష్వానోమా అనీ అంటారు.

ఎందుకొస్తాయి?

మెదడు కణితులకు కచ్చితమైన కారణమంటూ లేదు. కానీ కొందరిలో వంశపారంపర్యంగా రావొచ్చు. దీనికి జన్యువులే కారణం. కొందరు ఎక్కువసేపు మొబైల్ ఫోన్లు మాట్లాడితే మెదడు కణితులు వస్తాయని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కణితులకూ మొబైల్‌ఫోన్ల వాడకానికీ సంబంధం ఉంటున్నట్టు రుజువు కాలేదు. కొందరికి రేడియేషన్ కారణం కావొచ్చు. నోరు, నాలుక, గొంతు వంటి భాగాల్లో తలెత్తిన క్యాన్సర్లకు రేడియేషన్ చికిత్స చేసే సమయంలో కొన్నిసార్లు కొంత రేడియేషన్ ప్రభావం మెదడు మీద పడొచ్చు. దీంతో కొందరిలో ఐదారేళ్ల తర్వాత మెదడు కణితులు ఏర్పడే అవకాశముంది.

నాలుగు గ్రేడులు

మెదడు కణితుల ప్రవర్తన, తీరుతెన్నులను బట్టి 1, 2, 3, 4 గ్రేడులుగా విభజించొచ్చు. సాధారణంగా ఇతరత్రా క్యాన్సర్లు ఒకటో గ్రేడుతో మొదలై క్రమేపీ ముదురుతూ 4వ గ్రేడ్‌కు చేరుతుంటాయి. కానీ మెదడు కణితుల తీరే వేరు. క్రమంగా ఒక దశ నుంచి మరో దశకు వెళ్లటమనేది ఉండదు. కొన్నిసార్లు 3, 4 దశల్లోనే మొదలవ్వొచ్చు. చాలావరకూ గ్రేడ్ 1 కణితులు మామూలువే. శ్రవణ నాడి మీద తలెత్తే కణితులు ఇలాంటివే. గ్రేడ్ 2, 3, 4 చెందినవి క్యాన్సర్ కణితులుగా పరిగణిస్తారు. వీటిల్లోనూ రెండో గ్రేడ్ కణితులు నెమ్మదిగా వృద్ధి చెందుతాయి. వీళ్లు చికిత్సతో 7 నుంచి 12 ఏళ్ల వరకూ బాగానే జీవించగలరు. గ్రేడ్ 3 కణితులు గలవారు 3-5 ఏళ్ల వరకూ సాధారణ జీవితం గడపగలరు. కొందరు ఏడేళ్ల వరకూ జీవించొచ్చు. అదే గ్రేడ్ 4 గలవారు ఎక్కువ కాలం జీవించటం కష్టం.

నిర్ధారణ ఇలా

మెదడు కణితిని అనుమానిస్తే మెదడు సీటీ స్కాన్ లేదా ఎమ్మారై పరీక్ష చేస్తారు. వీటితో కణితులు ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. ఎమ్మారై పరీక్షలోనే అది మామూలుదా? క్యాన్సరా? అనేదీ అంచనా వేయొచ్చు. అయితే అన్నిసార్లూ అది కచ్చితం కాకపోవచ్చు. అందువల్ల శస్త్రచికిత్స చేసి, కణితిని తొలగించాక చిన్న ముక్కను తీసి పరీక్షించి (బయాప్సీ), నిర్ధారిస్తారు.

దీంతో కణితి ఏ గ్రేడ్‌లో ఉందో కూడా తెలుస్తుంది. కణితులు కీలకమైన భాగంలో ఉండి, దాన్ని తొలగిస్తే పక్షవాతం లాంటి దుష్ప్రభావాలు తలెత్తే అవకాశముంటే పుర్రె ఎముకకు 2 మి.మీ. రంధ్రం చేసి.. రోబోటిక్ వ్యవస్థ సాయంతో చిన్న ముక్కను తీసి పరీక్షించొచ్చు (స్టీరియోటాక్టిక్ గైడెడ్ రోబోటిక్ బయాప్సీ).

భవిష్యత్ చికిత్సల ఆశ

● ఇప్పుడు రక్తపరీక్ష ద్వారా కణితి రకాన్ని గుర్తించటం మీద పరీక్ష ప్రయోగాలు నడుస్తున్నాయి. ఇవి విజయవంతమైతే బయాప్సీ అవసరం లేకుండానే క్యాన్సర్ కణితులను గుర్తించొచ్చు. ● క్యాన్సర్ కణితికి లేజర్ ఇంటర్‌స్టీషియల్ థర్మల్ థెరపీ (ఎల్ఐటీటీ) విధానంతో చికిత్స చేసే పద్ధతి కొన్ని దేశాల్లో అందుబాటులో ఉంది. సూది సాయంతో సన్నటి పోచను కణితిలోకి జొప్పించి, లేజర్‌తో దాన్ని మాడ్చేయటం దీని ప్రత్యేకత. ● పుర్రెకు రంధ్రం చేయకుండానే ఎంఆర్ఐ గైడెడ్ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ విధానంతో కణితిని నిర్మూలించటం మీద ప్రయోగపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఐదారేళ్లలో దీనికి అనుమతి లభించొచ్చు. ● క్యాన్సర్ కణితికి సర్జరీ అనంతరం ఆరు వారాల పాటు రేడియేషన్ చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం రోజూ ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. ఇప్పుడు సర్జరీ చేసేటప్పుడే రేడియేషన్ ఇవ్వటం మీద ప్రయోగ పరీక్షలు నడుస్తున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే రోజూ ఆసుపత్రికి రావాల్సిన అవసరముండదు. ఒకసారి రేడియేషన్ ఇస్తే సరిపోతుంది.

కళ్ల దురద, తుమ్ములేల?

సమస్య సలహా

సమస్య: నాకు చలికాలంలో చల్లగాలికి కళ్ల దురద పెడుతున్నాయి. తుమ్ములు కూడా వస్తున్నాయి. ఇదేం సమస్య? దీన్నుంచి ఉపశమనం పొందేదెలా? – మానస జి.

సలహా: మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే సీజనల్ అలర్జిక్ రైనైటిస్ అని అనిపిస్తోంది. అంటే ఆయా కాలాల్లో ఉద్ధృతమయ్యే అలర్జీ అన్నమాట. చలిగాలి ఒక్కటే కాదు.. దుమ్ము, ధూళి, పుప్పొడి, కాలుష్యం, పెంపుడు జంతువుల నూగు, సౌందర్య సాధనాల వంటివేవైనా అలర్జీని ప్రేరేపితం చేయొచ్చు. వీటికి రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించటం వల్ల తుమ్ములు, కళ్ల దురద వంటి లక్షణాలు మొదలవుతాయి. ఇది ఆయా వ్యక్తులను బట్టి ఉంటుంది. కొందరికి చలికాలంలో వస్తే, కొందరికి ఎండాకాలంలో రావొచ్చు. మీ విషయంలో చలిగాలి ఇందుకు కారణమవుతోందని తోస్తోంది. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ముక్కులో జిగురుపొర ప్రేరేపితమై, హిస్టమిన్లు విడుదలవుతాయి. ఇది తుమ్ములు, కళ్ల దురద వంటి వాటికి దారితీస్తుంది. మీరు చలిగాలి తాకకుండా చూసుకోవటం ఉత్తమం. ఎండ మొదలయ్యేంతవరకూ బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. ఒకవేళ చల్లగా ఉన్నప్పుడు బయటకు వెళ్లాల్సి వస్తే మంకీ క్యాప్, మాస్కులాంటివి ధరించాలి. అవసరాన్ని బట్టి అలర్జీని తగ్గించే మందులు వేసుకోవచ్చు. లివోసిట్రిజిన్, ఫెక్సోఫెనడిన్ వంటి మందులు మేలు చేస్తాయి. ఒక మాత్ర వేసుకుంటే 24 గంటల వరకూ లక్షణాల నుంచి ఉపశమనం పొందొచ్చు. ముక్కులో స్ప్రే చేసుకునే ఫ్లూటికసోన్, మొమటసోన్ వంటి మందులూ ఉన్నాయి. వీటిని విడిగా గానీ మాత్రలతో గానీ వాడుకోవచ్చు. కంటి దురద తగ్గటానికి కంట్లో చుక్కల మందులు ఉపయోగపడతాయి. మీరు డాక్టర్‌ను సంప్రదిస్తే తగు చికిత్స సూచిస్తారు.





- డా॥ ఎన్.విష్ణుస్వరూప్ రెడ్డి, ఈఎన్‌టీ సర్జన్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

పరకామణి నిర్వహణ చర్యలపై హైకోర్టుకు తితిదే నివేదిక

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీల నిర్వహణ, తరలింపు, పరకామణిలో కానుకల లెక్కింపు విషయంలో సత్వరం తీసుకోవాల్సిన చర్యలపై తితిదే ఈవో సోమవారం హైకోర్టుకు నివేదిక సమర్పించారు. దానిని పరిశీలించి, తగిన ఉత్తర్వులిస్తామంటూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు పరకామణిలో చోరీ కేసు రాజీ, చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్ ఆస్తులు కూడబెట్టడం, వాటిలో కొన్నింటిని తితిదేకి బదిలీ చేయడం తదితర అంశాలపై కేసు నమోదు చేసే విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలించాలని సీఐడీ, ఏసీబీ డీజీలను ఆదేశించారు. పరకామణిలో కానుకల లెక్కింపులో సంస్కరణలు అవసరమని, దీనికి సత్వర, శాశ్వత చర్యలపై నివేదిక ఇవ్వాలని తితిదే ఈవోను హైకోర్టు ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే.

క్వాంటమ్ మిషన్ డైరెక్టర్‌గా సీవీ శ్రీధర్

ఈనాడు–అమరావతి: ఏపీ స్టేట్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్‌గా సీవీ శ్రీధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏడాది పాటు డిప్యుటేషన్‌పై ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. క్వాంటమ్ టెక్నాలజీ అంశాలపై ప్రభుత్వానికి సలహాదారుగా కూడా వ్యవహరిస్తారని తెలిపింది.

కారవాన్ ఎక్కేయ్.. ఆంధ్రాను చుట్టేయ్!

- 4 మార్గాల్లో సరికొత్త పర్యాటక వాహనాలు
- ప్యాకేజీలు ప్రకటించిన పర్యాటక శాఖ

ఈనాడు, అమరావతి: పర్యాటకులకు సరికొత్త అనుభూతులు అందించే కారవాన్ వాహనాలు రాష్ట్రంలో మొదటిసారి అందుబాటులోకి వచ్చాయి. వీటిని తొలుత నాలుగు మార్గాల్లో నడపనున్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) పోర్టల్ ద్వారా వాహనాలు బుక్ చేసుకోవచ్చు. ప్రభుత్వం ఎంప్యానల్ చేసిన రెండు సంస్థలు ప్రస్తుతానికి నాలుగు కారవాన్‌లు తిప్పనున్నాయి. కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలో పర్యాటకుల కోసం పెద్దఎత్తున నడుపుతున్న కారవాన్‌లను ఏపీలోనూ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానం తీసుకొచ్చింది. దీనిపై పలు ప్రైవేట్ సంస్థలు ఆసక్తి చూపాయి. వీటిలో ఓజీ డ్రీమ్ లైనర్స్, ఇండియా లక్షీ కారవాన్ ఎల్ఎల్‌పీ సంస్థలను ఏపీటీడీసీ.. ఎంప్యానల్ చేసింది. 10-12 సీట్లు, 5-6 సీట్లు కలిగిన రెండు రకాల వాహనాలను ఈ సంస్థలు నడపనున్నాయి.

నాలుగు రూట్లు ఇవే..

1.మార్గం: విశాఖపట్నం–అరకు, లంబసింగి (ఒకటిన్నర రోజు)
ధర: రూ. 42,500 (10-12 సీట్ల కారవాన్)
రూ. 31,500 (5-6 సీట్లు)

2.మార్గం: విశాఖపట్నం నుంచి సింహాచలం, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం మీదుగా వాడపల్లి (ఒకటిన్నర రోజు)
ధర: రూ. 42,500 (10-12 సీట్లు)
రూ. 31,500 (5-6 సీట్లు)

3.మార్గం: హైదరాబాద్–గండికోట (రెండు రోజులు)
ధర: రూ. 85,000 (10-12 సీట్లు)
రూ. 64,000 (5-6 సీట్లు)

4.మార్గం: హైదరాబాద్–సూర్యలంక (రెండు రోజులు)
ధర: రూ. 85,000 (10-12 సీట్లు)
రూ. 64,000 (5-6 సీట్లు)



కారవాన్

సంక్రాంతికి 6 రోజుల ప్యాకేజీ

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి భీమవరం, దిండి వరకు ప్రత్యేకంగా ఆరు రోజుల ప్యాకేజీతో కారవాన్ నడపనున్నారు. ధర రూ.3.50 లక్షలు. ఈనెల 10, 11, 12 తేదీలకు బుక్ చేసుకోవచ్చు. ఆ రోజు నుంచి ఆరు రోజులపాటు ప్యాకేజీ అమలులో ఉంటుంది. ఈ మూడు తేదీల్లో హైదరాబాద్ నుంచి నాలుగు కారవాన్‌లు నడపనున్నారు.

◆ ఆహారం కోసం పర్యాటకుల కోరిక మేరకు మార్గ మధ్యలో ఎక్కడైనా హోటళ్ల వద్ద ఆపుతారు. భోజన ఖర్చులు పర్యాటకులవే. రాత్రిపూట పర్యాటక శాఖకు చెందిన హోటళ్ల ప్రాంగణాల్లో వాహనం పార్కింగ్ చేస్తారు. ఈ హోటళ్లు లేనిచోట.. భద్రత దృష్ట్యా సమీప ప్రభుత్వ కార్యాలయాలు లేదా పోలీస్ స్టేషన్ పరిసరాల్లో నిలుపుతారు.

◆ పగలు వివిధ ప్రాంతాలను సందర్శించాక పర్యాటకులు రాత్రుల్లో కారవాన్‌లోనే నిద్రపోయేలా వసతులు ఉంటాయి. కూర్చొనే సీట్లనే నిద్రపోయేందుకు వీలుగా మార్చుకోవచ్చు. వాహనంలో టీవీ, ఫ్రిజ్, వాష్‌రూం సదుపాయాలున్నాయి.

తితిదే ఆలయాలకు వైకుంఠ శోభ

- దేశవ్యాప్తంగా శ్రీవారి సేవలో తరించిన భక్తులు
- ఏకాదశి రోజు 12.47 లక్షల మంది దర్శనం

ఈనాడు డిజిటల్, తిరుపతి: సప్తగిరుల నుంచి సాగర తీరాల వరకు.. భాగ్యనగరం నుంచి దేశ రాజధాని వరకు.. అలిపిరి నుంచి కశ్మీర్ లోయల దాకా.. ఎక్కడ చూసినా గోవింద నామమే మార్మోగింది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన వైకుంఠ ద్వార దర్శనానికి భక్తజనం ఉవ్వెత్తున తరలివచ్చారు. తిరుమల ప్రధాన ఆలయంతో పాటు తితిదే ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక, అనుబంధ ఆలయాలన్నీ భక్తజన సంద్రాలయ్యాయి. గతేడాది డిసెంబర్ 30న ఏకాదశి రోజున రికార్డు స్థాయిలో 12.47 లక్షల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. క్రితంసారి 2025 జనవరి 10న ఈ వేడుక రాగా, అప్పుడు 8.89 లక్షల మంది దర్శించుకున్నట్లు తితిదే వివరించింది. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ఆలయంలో 58,743 మంది, జూబ్లీహిల్స్ ఆలయంలో 54,243, చెన్నైలోని టి.నగర్ ఆలయానికి 59,896, చెన్నై పద్మావతి ఆలయంలో 20 వేల మంది, బెంగళూరులోని ఎస్వీ ఆలయాన్ని 64,173 మంది, న్యూదిల్లీ ఆలయాన్ని 27,480 మంది దర్శించుకున్నట్లు తితిదే వివరించింది. ◆ తిరుపతి సమీప ఆలయాల్లోనూ ఈసారి భక్తుల రద్దీ ఎక్కువగా కన్పించింది. తిరుచానూరులోని శ్రీపద్మావతి ఆలయం, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం ఆలయాలను 30 వేలకు మించి భక్తులు సందర్శించారు. ఒంటిమిట్ట కోదండ రాముడిని గతంలో 18 వేల మంది దర్శించుకోగా, ఈసారి ఆ సంఖ్య 51,219కు పెరిగింది. విశాఖపట్నం ఎస్వీ ఆలయంలో 51 వేలు, దేవుని గడపలో 48 వేలు, నందలూరులో 35 వేల మంది స్వామివారి సేవలో తరించారు. రద్దీ దృష్ట్యా తితిదే యంత్రాంగం క్యూలైన్ల నిర్వహణ, ప్రసాద వితరణ, తాగునీటి సౌకర్యం తదితరాల్లో లోటురాకుండా విస్తృత ఏర్పాట్లు చేసిందని అధికారులు తెలిపారు.



దిల్లీలోని తితిదే ఆలయంలో భక్తుల రద్దీ

ఏడో రోజు సాధారణ రద్దీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి ఏడో రోజు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం సాయంత్రం భక్తులను కృష్ణతేజ కూడలి నుంచి క్యూలైన్‌లోకి అనుమతించారు. రద్దీకి అనుగుణంగా తితిదే అధికారులు ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రతి మూడు గంటలకోసారి సమాచారం విడుదల చేస్తున్నారు. ఆదివారం 85,179 మంది భక్తులు దర్శించుకోగా, సోమవారం సాయంత్రానికి 51,763 మంది స్వామివారి సేవలో తరించారు. వీరికి 12 గంటల్లో దర్శనం పూర్తయినట్లు తితిదే ప్రకటించింది. పరిమిత సంఖ్యలో ప్రత్యేక ప్రవేశదర్శనం (రూ.300), శ్రీవాణి (రూ.10 వేలు), స్వయంగా వచ్చే వీఐపీలకు బ్రేక్ దర్శనం టికెట్లు జారీ చేస్తోంది.

వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు దరఖాస్తుల ఆహ్వానం

- నిపుణుల కమిటీ పరిశీలనలో ఎంపికైతే కేంద్ర ప్రభుత్వ సాయం

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రైతులకు, ఆయా రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచన మీలో ఉందా? అయితే దాన్ని కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, శిక్షణ సాయం అందించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ప్రయోజిత అగ్రి బిజినెస్ ఇంక్యుబేషన్ ప్రాజెక్టులో భాగంగా తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో 2020లో ప్రారంభమైన అగ్రి పోషణ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఔత్సాహికుల నుంచి 9వ విడత శిక్షణ కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఔత్సాహికులు జనవరి 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు www.angraurabitpt.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని పరిశోధన స్థానం ఏడీఆర్ డా.వి.సుమతి, అగ్రి అంకుర ఆవిష్కరణల కేంద్రం సీఈవో డా.కదిరి మోహన్ కోరుతున్నారు.

మూడు విభాగాల్లో అవకాశం..

అగ్రి యోచ్: వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని సమస్యల పరిష్కారం కోసం, ఆయా రంగాల అభివృద్ధి కోసం వినూత్న ఆలోచనలు కలిగి ఉన్న ఔత్సాహికులు ఈ విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఔత్సాహికుల ఆలోచనలను నిపుణుల కమిటీ పరిశీలించి ఎంపికైన వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు రూ.10 వేల ఉపకారవేతనంతో కూడిన నెలరోజుల శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి అవసరమైన ప్రయోగశాలలు, నిపుణులను అనుసంధానం చేయడంతో పాటు కార్యాలయం నిర్వహణకు సహకారం అందిస్తారు. ఆలోచనను ఆవిష్కరణగా మార్చేందుకు రూ.5 లక్షల వరకు గ్రాంట్ మంజూరు చేస్తారు.

అగ్రి ఇన్నో: ఆవిష్కరణలను విపణిలోకి తెచ్చేందుకు ఈ విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులకు ఉపయోగపడే వస్తువులు, సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు, ఇతర సేవలను.. ఆచరణకు అనువుగా మార్చేందుకు నెల రోజుల పాటు నిపుణులతో శిక్షణ ఇస్తారు. 15 రోజుల కార్యశిబిరం తర్వాత ఇతర సౌకర్యాల కల్పనతో పాటు రూ.25 లక్షల వరకు గ్రాంట్ మంజూరు చేస్తారు. గ్రామీణ మహిళల స్టార్టప్‌లకు ఈ ఏడాది నుంచి అదనంగా 10 శాతం ఆర్థిక సహకారం అమలు చేస్తున్నారు.

మెరిస్టెమ్: ఈ విభాగం ప్రత్యేకించి విద్యార్థుల కోసం రూపొందించారు. చదువుకుంటూనే వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తే రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తారు. విద్యార్థుల ఆలోచనను ఆవిష్కరణలుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ, ప్రయోగశాలలు, నిపుణుల సహకారం సమకూర్చుతారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఆ విద్యార్థి తమ ఆవిష్కరణలను అభివృద్ధి చేసుకోవచ్చు.

◆ ఈ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 57 స్టార్టప్‌లు ఏర్పాటు కాగా.. వాటి కోసం రూ.7 కోట్ల గ్రాంట్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.4.7 కోట్లు విడుదల చేసింది.

కోనసీమ గుండెపై నిప్పులకొలిమి

- తరచూ భయపెడుతున్న బ్లోఅవుట్‌లు

మామిడికుదురు, న్యూస్‌టుడే: చమురు, సహజ వాయు నిక్షేపాల అన్వేషణ, ఉత్పత్తిలో భాగంగా అనూహ్యంగా జరుగుతున్న పరిణామాలు పచ్చని కోనసీమను నిప్పుల కొలిమిగా మారుస్తున్నాయి. ఎక్కడ చిన్న గ్యాస్ లీకేజీ జరిగినా స్థానికుల గుండెలు అదిరిపోతున్నాయి. తాజాగా మలికిపురం మండలం ఇరుసుమండలో బ్లోఅవుట్ స్థానికులను భయకంపితులను చేస్తోంది. గతంలో జరిగిన ఇలాంటి ఘటనలు వారి కళ్ల ముందు కదలాడుతున్నాయి.

1993లో కొమరాడలో..

రాజోలు మండలం కడలి పరిధి తూర్పుపాలెంలోని కొమరాడ-1 డ్రిల్లింగ్ సైట్‌లో 1993 మార్చి 20న బ్లోఅవుట్ జరిగింది. దీని నుంచి ఎగజిమ్మిన చమురు స్థానిక కడలి డ్రెయిన్‌లో కలిసి పలుచోట్ల మంటలు అంటుకోవడంతో వేల కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. 26 రోజుల అనంతరం వెల్ కిల్లింగ్ ఆపరేషన్‌తో బావిని శాశ్వతంగా మూసివేశారు.

1995లో పాశర్లపూడి-19లో..

అల్లవరం మండలం దేవరలంకలోని పాశర్లపూడి-19 బావిలో 1995 జనవరి 8న డ్రిల్లింగ్ సమయంలో బ్లోఅవుట్ సంభవించి 65 రోజుల పాటు అగ్నికీలలు ఏకబిగిన ఎగసిపడటంతో అంతా ఠారెత్తిపోయారు. బీవోపీ మూసివేసి మంటలను అదుపులోకి తెచ్చారు.

1997లో దేవరపల్లిలో..

రావులపాలెం సమీపంలోని దేవరపల్లిలో 1997 ఫిబ్రవరి 19న డ్రిల్లింగ్ సైట్‌లో గ్యాస్ బ్లోఅవుట్ జరిగింది. విపరీతమైన ధ్వనితో గ్యాస్, చమురు చుట్టుపక్కల నివాస ప్రాంతాల వరకు వ్యాపించడంతో అంతా ఆందోళన చెందారు. ఫిబ్రవరి 24న దీనిని అదుపులోకి తెచ్చారు.

2020లో ఉప్పూడిలో పేలుడు

కాట్రేనికోన మండలం ఉప్పూడిలో 2020 ఫిబ్రవరి 2న డ్రిల్లింగ్ సైట్‌లో గ్యాస్ పేలుడు సంభవించింది. జనం ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. ఓఎన్జీసీ నిపుణుల బృందం మూడు రోజుల పాటు శ్రమించి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది.



2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరంలోని గెయిల్ ట్రంక్ లైన్ విస్ఫోటం

2014లో గెయిల్ విస్ఫోటంలో 22 మంది మృత్యువాత

మామిడికుదురు మండలం నగరంలోని గెయిల్‌కు చెందిన ట్రంక్ లైన్ 2014 జూన్ 27న విస్ఫోటంతో 22 మంది మంటల్లో మాడిపోయి మృత్యువాత పడ్డారు. 18 మంది తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. పెద్ద ఎత్తున ఆస్తినష్టం సంభవించింది. ఈ దుర్ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది.

సాంకేతికత పెరిగినా.. ఇంకా సమస్యగానే



అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సహజ వాయువైతే ఉత్పత్తి మన అదుపులోనే ఉంటుంది. ఎప్పుడైతే అదుపుతప్పి గొట్టాల నుంచి బయటకు వచ్చి వేడికి మండుతుందో దాన్నే బ్లోఅవుట్ అంటారు. గతంలో పాశర్లపూడి వద్ద జరిగిన బ్లోఅవుట్ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీన్ని ఆర్పేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ఎంతో నష్టానికి గురయ్యాయి. దీన్ని ఒక అనుభవంగా తీసుకుని కొన్నింటిని అదుపు చేసేందుకు అధికారులు కొంత విజయం సాధించారు. సాంకేతికత ఎంత పెరిగినా వీటిని పూర్తిస్థాయిలో అదుపు చేయడం సమస్యగానే ఉంటోంది. పాశర్లపూడి బ్లోఅవుట్ ఆర్పడానికి మూడు నెలల సమయం పట్టింది. అమెరికా నుంచి నిపుణులు వచ్చి విశ్వప్రయత్నాలు చేశారు. ఆ వేడికి చుట్టుపక్కల చెట్లు సహా పశువులు, మనుషులకు తీవ్ర నష్టం జరిగింది. భయంకర శబ్దాలకు దూరంలో ఉండే అమలాపురం పట్టణంలో కూడా ఇళ్ల కిటికీల తలుపులు కొట్టుకోవడం జరిగింది. ఆ రోజున ప్రకృతి విజృంభణకు బెంబేలెత్తిపోయారు.

– డాక్టర్ సి.వి.సర్వేశ్వరశర్మ, కోనసీమ సైన్స్ పరిషత్తు అధ్యక్షుడు, శాస్త్రవేత్త



వెంకయ్యనాయుడిని సత్కరించిన యడ్లపల్లి వెంకటేశ్వరరావు. చిత్రంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

రైతు వ్యాపారిగా మారితేనే ఆదాయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 'రైతు నేస్తం' ఫౌండేషన్ దశమ వార్షికోత్సవం

వట్టిచెరుకూరు, కాకుమాను, న్యూస్‌టుడే: 'పంటలను ఉత్పత్తి చేయడంతోనే రైతులు ఆగిపోకూడదు. వాటిని తగిన విధంగా విక్రయించి వ్యాపారులుగా ఎదిగితేనే ఆదాయం పొందగలరు' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో సోమవారం నిర్వహించిన 'రైతు నేస్తం' ఫౌండేషన్ దశమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ సంస్థ నివేదిక ప్రకారం కేవలం పంటలపై ఆధారపడిన రైతుల్లో ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయి. సాగుతోపాటు పాడి పరిశ్రమ ఉన్నవారు నష్టాలబారిన పడకుండా నిలదొక్కుకోగలిగారు. అందువల్ల కోళ్లు, పాడి పరిశ్రమలపైనా దృష్టి సారించాలి' అని వెంకయ్యనాయుడు చెప్పారు. సాంకేతికత, ప్రకృతి విధానాలను మేళవించి అన్నదాతలను ప్రోత్సహించేందుకు 'రైతు నేస్తం' ఫౌండేషన్‌ను స్థాపించి.. ఒంటరి పోరాటం చేస్తున్న యడ్లపల్లి వెంకటేశ్వరరావులాంటి వారికి ప్రభుత్వాలు సహకారం అందించాలని సూచించారు. తొలుత ప్రకృతి పంటలు, చిరుధాన్యాల తినుబండారాలను వెంకయ్యనాయుడు పరిశీలించారు. గోశాలను సందర్శించి గో తులాభారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీలు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, యలమంచిలి శివాజీ, నాబార్డు చీఫ్ మేనేజర్ ఎంజీ గోపాల్, మిద్దెతోట నిపుణులు, రైతులు పాల్గొన్నారు. హాజరైన అన్నదాతలకు ఉచితంగా చిరుధాన్యాల విత్తనాలు, ఔషధ మొక్కలను అందించారు. ప్రకృతి సాగులో రాణిస్తున్న వారిని.. ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు.

ఏఎస్‌జీగా బాధ్యతలు స్వీకరించిన కనకమేడల రవీంద్రకుమార్



వెంకటరమణికి శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న కనకమేడల రవీంద్రకుమార్

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)గా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలను మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల శ్రీవారి ప్రసాదం, స్వామివారి శేషవస్త్రం సమర్పించిన తర్వాత నూతన బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

అథ్లెట్ జ్యోతి యర్రాజికి రూ.30 లక్షల ఆర్థిక సాయం

- ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ




అథ్లెట్ జ్యోతి యర్రాజికి రూ.30.35 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖకు చెందిన అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.30.35 లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అందజేశారు. కామన్‌వెల్త్, ఆసియా క్రీడలకు సిద్ధమవుతున్న ఆమెకు శాప్ తరపున ఈ మొత్తాన్ని చెక్ రూపంలో అందించారు. జ్యోతి తన కుటుంబ సభ్యులు, శాప్ ఛైర్మన్ రవినాయుడితో పాటు ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను సోమవారం కలిశారు. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న ఆమెను మంత్రి అభినందించారు. 'అంతర్జాతీయ వేదికలపై భారత కీర్తి ప్రతిష్ఠల్ని పెంచారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేయండి. ప్రభుత్వం తరపున అన్నివిధాలా అండగా ఉంటాం" అని ఆమెకు భరోసా ఇచ్చారు.

లోకేశ్‌ను కలిసిన వెయిట్ లిఫ్టర్ చంద్రిక: ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను మంగళగిరికి చెందిన వెయిట్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక సోమవారం కలిశారు. ఇటీవల ఇస్తాంబుల్‌లో జరిగిన ఆసియా ఓపెన్ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన ఆమెను మంత్రి అభినందించారు.

మీ మిసోగి ఛాలెంజ్ ఏంటి?



జపాన్‌లో మిసోగి అనే ఓ సంప్రదాయం ఉంది. ప్రతి సంవత్సరంలో ఒకరోజు తమకు ఏ మాత్రం పరిచయం లేని పనిని చేయడానికి ప్రయత్నించడం ద్వారా తమకు తామే సవాల్ విసురుకోవడం దీని ఉద్దేశం. పియానో వాయించడం, పర్వతారోహణ, విదేశీ భాష నేర్చుకోవడం.. ఇలా ఓ కొత్త అంశాన్ని ప్రయత్నిస్తే, దానిపై అనురక్తి పెరిగి మున్ముందు దాన్ని కొనసాగించొచ్చన్నది దీని వెనుకున్న పరమార్థం. మరి ఈ ఏడాదిలో మీ మిసోగి ఛాలెంజ్ ఏంటి?

– షాన్ పురి, ఆంత్రప్రెన్యూర్

నైతికత లేని పార్టీ భారాస

- నాది ఆస్తి పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పోరాటం
- తెలంగాణ శాసనమండలిలో కవిత భావోద్వేగ ప్రసంగం



ఈనాడు, హైదరాబాద్: "భారాస 8 పేజీల రాజ్యాంగం ఒక పెద్ద జోక్. ఆ పార్టీలో రాజ్యాంగ స్ఫూర్తి లేదు. నన్ను సస్పెండ్ చేయడానికి రాత్రికి రాత్రే క్రమశిక్షణ చర్యల కమిటీ పుట్టుకొచ్చింది. నైతికత లేని పార్టీలో నేను ఉండను. ఇది ఆస్తుల పంచాయితీ అని కాంగ్రెస్ అంటోంది. మా కులదైవం లక్ష్మీనరసింహస్వామి, నా ఇద్దరు కుమారులపై ప్రమాణం చేసి చెబుతున్నా. నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పోరాటం. ఇక్కడి నుంచి వ్యక్తిగా వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా చట్టసభకు తిరిగివస్తా. వచ్చే ఎన్నికల నాటికి 'తెలంగాణ జాగృతి' రాజకీయ పార్టీగా ఎదుగుతుంది. ఒక ఆడబిడ్డగా ముందడుగు వేస్తున్నా.. ఆశీర్వదించండి" అని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శాసనమండలిలో సోమవారం కవిత భావోద్వేగంగా మాట్లాడారు. ఒక దశలో కంటతడి పెట్టారు. తన రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కవిత కోరగా.. భావోద్వేగాలతో తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.

కోర్టుతో ఘర్షణ పెట్టుకోవాలని భావిస్తున్నారా?

- మిమ్మల్ని ఎలా డీల్ చేయాలో మాకు తెలుసు
- కేజీబీవీ టీచర్ల పోస్టింగ్‌పై విచారణలో.. విద్యాశాఖాధికారులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ఎస్ఎస్ఏ పీడీపై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు



ఈనాడు, అమరావతి: 'ఈ ప్రభుత్వంలో అధికారులు న్యాయస్థానంతో ఘర్షణ పెట్టుకోవాలని భావిస్తున్నారా? అదే మీ ఆలోచన అయితే, మిమ్మల్ని ఎలా డీల్ చేయాలో మాకు బాగా తెలుసు' అని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది. కోర్టు ఉత్తర్వుల అమల్లో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కోర్టు ఆదేశాలకు కనీస మర్యాద ఇవ్వడం లేదని ఆగ్రహించింది. శక్తిమంతమైన వ్యక్తి కింద పని చేస్తున్నందున తమను ఎవరూ ఏమి చేయలేరనే ఉద్దేశంతో ఉన్నట్లు కన్పిస్తోందని వ్యాఖ్యానించింది. విద్యాశాఖలో ఏదో తప్పు జరుగుతోందని, కోర్టు ఆదేశాలు, ఉన్నతాధికారులు కోర్టుకిచ్చిన హామీలను దిగువస్థాయి సిబ్బంది తేలిగ్గా తీసుకుంటున్నారని ఆక్షేపించింది. సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) బి.శ్రీనివాసరావుపై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. నోటీసులు జారీచేస్తూ, ఫిబ్రవరి 4న స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

విజయనగరం ఏపీడీ చర్యల ఫలితం

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ)గా పని చేస్తున్న తమను తొలగించడాన్ని సవాలు చేస్తూ పలువురు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆ టీచర్లను తొలగించిన స్థానంలోనే తిరిగి కొనసాగించాలని ఆదేశించారు. ఒప్పందం ముగిశాక కూడా వారిని పీజీటీలుగా కొనసాగించడంపై పరిశీలించాలని 2023 డిసెంబర్‌లో ఉత్తర్వులిచ్చారు. ఈ తీర్పును సవాలుచేస్తూ అధికారులు అప్పీల్ వేశారు. సోమవారం జరిగిన విచారణలో పీజీటీల తరపు న్యాయవాది జై భీమారావు వాదిస్తూ, 'సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామని ఇటీవల జరిగిన విచారణలో ప్రభుత్వ న్యాయవాది (జీపీ) ఇదే ధర్మాసనం ముందు హామీ ఇచ్చారు. అందుకు భిన్నంగా విజయనగరం అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ వ్యవహరించారు. పీజీటీలను వేర్వేరు స్థానాలకు బదిలీ చేశారు. నిర్దిష్ట వేతనం ఇవ్వకుండా గంటల చొప్పున జీతం నిర్ణయించారు' అని పేర్కొన్నారు. విద్యాశాఖ జీపీ గుర్రం రామచంద్రరావు స్పందిస్తూ, 'కోర్టు ఆదేశాలను యథాతథంగా అమలు చేయాలని సర్వశిక్షా అభియాన్ పీడీ శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు. విజయనగరం అదనపు పీడీ చర్యలకు.. రాష్ట్ర పీడీని బాధ్యుడిని చేయడం సరికాదు' అని పేర్కొన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఆదేశాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, అవి అమలయ్యేలా చూడాల్సింది రాష్ట్ర పీడీయేనని స్పష్టం చేసింది. సుమోటోగా అతనిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి నోటీసులిచ్చింది.

ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి... ఎయిర్‌బస్ అవసరమా అన్న జగన్‌రెడ్డి

మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: 'ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్ అవసరమా?' అని గతంలో అన్న వైకాపా అధినేత జగన్‌రెడ్డి...ఇప్పుడు భోగాపురం విమానాశ్రయాన్ని తానే తెచ్చినట్టు చెబుతున్నారని మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కర్త, కర్మ, క్రియ సీఎం చంద్రబాబేనని తెలిపారు. ఇతరులు చేసిన మంచిని తన ఖాతాలో వేసుకొనే క్రెడిట్ చోర్ జగన్‌రెడ్డి అని విరుచుకుపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అనుమతులు లేవని 2020లో జాతీయ హరిత ట్రైబ్యునల్ నిలిపేస్తే కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు ఏం సంబంధమని? వైకాపా నేతల్ని నిలదీశారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్ అండ్‌బీ ప్రత్యేక ప్రధానకార్యదర్శి కృష్ణబాబుతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "విశాఖ విమానాశ్రయంలోనే ఈగలు తోలుకుంటుంటే భోగాపురంలో మరో విమానాశ్రయం అవసరమా? ఎలాగైనా దీని నిర్మాణాన్ని అడ్డుకుందాం"అని రైతుల్ని రెచ్చగొట్టేలా 2014-19 మధ్య జగన్ చేసిన వ్యాఖ్యల్ని గుర్తుచేశారు. దీనికి సంబంధించిన వీడియోల్ని మీడియాకు ప్రదర్శించారు.

వాళ్ల రాష్ట్రంలో గొప్ప చెప్పుకోవడానికి మాట్లాడితే మాకేం సంబంధం

"రాయలసీమ ఎత్తిపోతల పథకానికి జగన్ చేసింది తక్కువ..ప్రచారం ఎక్కువ. ఎలాంటి అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారు. దాన్ని ఎన్జీటీ అడ్డుకుంది. దానికి చంద్రబాబును ఎలా విమర్శిస్తారు. కొందరు వాళ్ల రాష్ట్రంలో గొప్పలు చెప్పుకోవడానికి మాట్లాడితే మమ్మల్ని ఎలా తప్పు పడతారు? రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడటంలో చంద్రబాబును మించినవారు లేరు" అని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. "భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019 మే నాటికే 2,500 ఎకరాల భూసేకరణ పూర్తయ్యింది. రూ.670 కోట్లు ఖర్చు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్....ఎక్కడ చంద్రబాబుకు మంచి పేరు వస్తోందో అని నాలుగేళ్లు విమానాశ్రయం గురించి పట్టించుకోలేదు. ఉత్తరాంధ్ర ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో రెండోసారి శంకుస్థాపన చేసి హడావుడి చేశారు" అని బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుటే నరికేశారు

- వివాహేతర సంబంధమే కారణం
- శ్రీసత్యసాయి జిల్లా తనకల్లులో ఘటన



మృతుడు ఈశ్వరప్ప

తనకల్లు, న్యూస్‌టుడే: మాయమాటలు చెప్పి తన భార్యను తీసుకుపోయాడన్న కోపంతో ఒక వ్యక్తి తన సోదరుడి సాయంతో పోలీస్ స్టేషన్ ఎదుటే అతడిని దారుణంగా నరికి చంపాడు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనకల్లు మండలం తవళం పంచాయతీకి చెందిన ఎర్రి హరి, నాగశిరీషలకు వ్యవసాయమే జీవనాధారం. వారికి సంతానం లేదు. ఆమెకు ఇటీవల తనకల్లు మండలంలోని రాగినేపల్లికి చెందిన ఈశ్వరప్పతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతడు మదనపల్లి జిల్లా ములకలచెరువులో హోటల్ నిర్వహిస్తున్నాడు. భార్య ఇరవై రోజుల కిందట మృతిచెందింది. ఇటీవల నాగశిరీష కనిపించకుండా పోవడంతో ఎర్రి హరి గత నెల 31న తనకల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో ఉన్నట్లు తెలుసుకున్నారు. డ్రైవర్ గంగులప్ప కారులో హరితోపాటు ఇద్దరు పోలీసులు ఆదివారం అక్కడికి వెళ్లారు. ఈశ్వరప్పతోపాటు నాగశిరీషను అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు తనకల్లు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు.

పథకం ప్రకారం..

అప్పటికే హరి ఈ విషయాన్ని తన సోదరుడు చిన్నప్పకు ఫోన్‌లో తెలిపి, వేటకొడవళ్లను సిద్ధం చేయించుకున్నాడు. ఈశ్వరప్ప కారు దిగి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తుండగా హరి, చిన్నప్ప దాడి చేసి వేటకొడవళ్లతో నరకడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన నాగశిరీష అక్కడి నుంచి పరారైంది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని పుట్టపర్తి తరలించారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నాగేంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం బృందం ఆధారాలు సేకరించారు. పోలీసులు హరి, చిన్నప్పతోపాటు కారు డ్రైవర్ గంగులప్ప, సహకరించిన శంకర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనతా వారధి'

- భాజపా నేతృత్వంలో శ్రీకారం: మాధవ్

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనతా వారధి' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద సోమవారం ప్రారంభించినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన జనతా వారధిలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వినతులను స్వీకరించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాధవ్ మీడియాతో మాట్లాడారు. 'తొలిరోజు విజయవాడ నగర పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి, అధికారులకు అందజేశాం. 1987లో ఎన్టీఆర్ హయాంలో ఇళ్ల పట్టాలిచ్చినా, వాటికి రిజిస్ట్రేషన్లు లేవని చిట్టినగర్ వాసులు మా దృష్టికి తెచ్చారు. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో సుబాబుల్, జామాయిల్ రైతులు గిట్టుబాటు ధరల కోసం విన్నవించారు. విజయవాడలో దోమల బెడద, కాలుష్యం, కృష్ణా నదికి రిటైనింగ్ వాల్, స్వర్గపురి దారిలో సబ్‌వే నిర్మాణం తదితరాలపై స్థానికులు వినతులు సమర్పించార'ని మాధవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ముళ్లపూడి రేణుక, యామిని శర్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, కార్యక్రమ సమన్వయకర్త పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ తదితరులు

✦ భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుమారుడు హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా 'డ్రగ్స్ వాడకం, రవాణాతో యువత పెడదారి పడుతోంది. అన్నివర్గాలకు చెందిన వారూ దీనికి బలి అవుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తెస్తున్నాం. వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తున్నప్పటికీ, ఉపేక్షించేది లేదు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామ'ని మాధవ్ స్పందించారు.

అమెరికాలో తెలుగు యువతి దారుణ హత్య

- మాజీ రూంమేటే హంతకుడు!

హైదరాబాద్, న్యూస్‌టుడే: భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికాకు వెళ్లిన హైదరాబాద్ నగరానికి చెందిన ఓ యువతి అక్కడ దారుణంగా హత్యకు గురయ్యారు. కొద్దిరోజుల క్రితమే ఆనందంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పిన ఆమె ఇకలేదని తెలిసి ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ విజయపురి కాలనీకి చెందిన ఆనంద్ కుమార్తె నిఖిత గొడిశాల(27) ఎంఎస్ చదివేందుకు నాలుగేళ్ల కిందట అమెరికాకు వెళ్లారు. మేరీల్యాండ్‌లోని కొలంబియాలో ఉంటూ చదువుతూ ఉద్యోగం చేసేవారు. డిసెంబరు 31న కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి న్యూఇయర్ విషెస్ తెలిపారు. అనంతరం ఆమె ఫోన్ కలవలేదు. నిఖిత కనిపించడం లేదంటూ ఆమె మాజీ రూంమేట్ అర్జున్‌శర్మ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసి భారత్‌కు వచ్చేశాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు జనవరి 3న అతని అపార్టుమెంట్‌లో పరిశీలించగా నిఖిత మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అమెరికా పోలీసులు తెలిపారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి 7 గంటల తర్వాత నిఖితను అర్జున్‌శర్మ హత్యచేసి ఉండవచ్చని వారు భావిస్తున్నారు. చెన్నైకి చెందిన అర్జున్ శర్మను తమిళనాడులో ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా స్పందించింది. నిఖిత కుటుంబ సభ్యులతో సంప్రదిస్తున్నామని.. వారికి అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. విజయపురి కాలనీలో నిఖిత కుటుంబం నివాసం ఉంటోంది. తండ్రి ఆనంద్ మార్కెటింగ్ రంగంలో, తల్లి స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె నిఖిత. రెండో కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు.



నిఖిత

నా కుమార్తెను అర్జున్ హత్యచేశాడు: ఆనంద్

అందరి దగ్గర అప్పులు చేసి పారిపోతున్నాడని తెలిసి.. తన కుమార్తె ఫోన్‌చేస్తే డబ్బులిస్తానని ఇంటికి పిలిచి ఆమెను అర్జున్ శర్మ హత్యచేసి పారిపోయి వచ్చాడని నిఖిత తండ్రి ఆనంద్ పేర్కొన్నారు. అర్జున్ శర్మ గతంలో నిఖితకు రూంమేట్ మాత్రమేనని బాయ్‌ఫ్రెండ్ కాదని తెలిపారు. అతన్ని కఠినంగా శిక్షించాలని, నిఖిత మృతదేహాన్ని అప్పగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకుంటున్నామన్నారు.



పవిత్ర సంగమం వద్ద బోట్‌హౌస్‌లు

లాహిరి లాహిరి లాహిరిలో..!

రాత్రి వేళ.. వెన్నెల కింద.. బోటులో విహరిస్తే..? ఆ ఊహే ఆహ్లాదంగా ఉంది కదూ..! ఈ అనుభూతి పొందాలంటే ఎక్కువ మంది చూసేది కేరళ వైపే. ఇక అంత ప్రయాస పడాల్సిన అవసరం లేకుండా కృష్ణా నదిలో బోట్‌హౌస్‌లు అందుబాటులోకి రానున్నాయి. వీటిల్లో పర్యాటకులు బ్యాక్ వాటర్ ప్రయాణం, రాత్రిపూట బసను ఆస్వాదించవచ్చు. కుటుంబం అంతా కలిసి సమయం గడపడానికి, పార్టీలు చేసుకోవడానికి అనువుగా డిజైన్ చేశారు. ఏసీ, టీవీ సహా అన్ని సదుపాయాలూ ఉంటాయి. పీపీపీ విధానంలో తయారు చేసిన మూడు రకాల బోటుహౌస్‌లు ప్రస్తుతం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం ప్రాంతంలో ట్రయల్ రన్ వేస్తున్నాయి. మరో రెండు రోజుల్లో విజయవాడ పున్నమిఘాట్ వద్ద సీఎం చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నారు. – ఈనాడు, అమరావతి



బోట్ లోపల వసతులు ఇలా..



EENADU Vol: 52, Issue: 147 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

జోరుగా మెగా 158 సన్నాహాలు


చిరంజీవి

ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు చిరంజీవి. అయితే ఈ చిత్ర హడావుడి పూర్తయిన వెంటనే చిరు తదుపరి సినిమాని పట్టాలెక్కించేందుకు తెర వెనుక సన్నాహాలు మొదలైపోయాయి. 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత ఈ ఇద్దరి కాంబో నుంచి రానున్న కొత్త సినిమా ఇది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలతో మొదలు కానుందని సమాచారం. చిరంజీవి మార్చి నుంచి సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారని తెలిసింది. ఇది పూర్తిగా యాక్షన్ ప్రాధాన్యమున్న కథతో ముస్తాబు కానుందని.. చిరు మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. దీంట్లో ఆయనతో పాటు మరో స్టార్ కూడా తెర పంచుకునే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

● అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' ప్రీ రిలీజ్ వేడుకని ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చిత్రవర్గాలు సోమవారం ప్రకటించాయి.

శరవేగంగా జీవిత కథ


శ్రద్ధా కపూర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో జానపద నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగావ్కర్ జీవితాధారంగా.. దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఓ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని కారణాలతో ఆగిపోయిన ఈ సినిమా చిత్రీకరణ తాజాగా మళ్లీ మొదలైనట్లు సమాచారం. 'ఈ జీవిత కథలో శ్రద్ధ పోషిస్తున్న పాత్ర కోసం శారీరకంగా, భావోద్వేగ పరంగానూ చాలా కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ మధ్య ఒక నృత్య సన్నివేశంలో ఆమె గాయపడటంతో సినిమా చిత్రీకరణ కొంతకాలం ఆగిపోయింది. కానీ, అది షెడ్యూల్ మొత్తాన్ని ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. శ్రద్ధ అనుకున్న సమయానికే సినిమా షెడ్యూల్స్‌ని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది. నిర్మాతలు మార్చి నెల నాటికి చిత్రీకరణ ముగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె ఈ సినిమా తర్వాత ఏప్రిల్‌లో హై కాన్సెప్ట్ ఫాంటసీ చిత్రం 'నాగిన్'లో నటించేందుకు సన్నద్ధమవుతోంద''ని బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.

ఓటీటీలో ఈ వారం

మరో వారం వచ్చేసింది.. కొత్త కథల సంగతులేంటో తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు సినీప్రియులు. వారి కోసం ఎప్పటిలాగే అదిరిపోయే కంటెంట్‌తో వినోదాలు పంచడానికి సిద్ధంగా ఉన్నాయి ఓటీటీలు. సీటు అంచున కూర్చోబెట్టే సిరీస్‌లు, థ్రిల్ పంచే సినిమాల్ని అందుబాటులోకి తీసుకొచ్చాయి.

జిగ్రీస్ (చిత్రం)	మంగళవారం	సన్‌నెక్స్ట్
కానిస్టేబుల్ కనకం 2 (సిరీస్)	గురువారం	ఈటీవీ విన్
వెపన్స్ (చిత్రం)	గురువారం	జియోహాట్‌స్టార్
హిజ్ అండ్ హర్స్ (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ది పిట్ 2 (సిరీస్)	గురువారం	జియోహాట్‌స్టార్
ఏ థౌజెండ్ బ్లోస్ 2 (సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
పీపుల్ వి మీట్ ఆన్ వెకేషన్ (చిత్రం)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

తప్పక తెలుసుకోవాల్సిన చరిత్ర



స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయో చూపించడానికి సిద్ధమైంది 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ సీజన్ 2' సిరీస్. నిఖిల్ అడ్వాణీ దర్శకత్వం వహించారు. సిద్ధాంత్ గుప్తా, చిరాగ్ వోరా, రాజేంద్ర చావ్లా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ శుక్రవారం నుంచి సోనీ లివ్ వేదికగా అందుబాటులో ఉండనుంది. మీకు తెలియని.. తప్పక తెలుసుకోవాల్సిన చరిత్ర.. అంటూ ఈ సిరీస్ నుంచి విడుదలైన టీజర్ సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంది.

ఫ్యామిలీ మ్యాన్ నిర్మాతలతో సల్మాన్?


సల్మాన్ ఖాన్

'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమా చిత్రీకరణతో బిజీగా గడుపుతూనే.. మరోవైపు తన రాబోయే ప్రాజెక్టుల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్ ఖాన్. ఆయన.. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ', 'సిటాడెల్: హనీ బన్నీ' లాంటి కథలతో అలరించిన దర్శక ద్వయం రాజ్ అండ్ డీకేతో ఓ సినిమా కోసం చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. "ఇంకా ప్రారంభ దశలోనే ఉన్న ఈ ప్రాజెక్టును యాక్షన్ కామెడీ నేపథ్యంలో తీర్చిదిద్దాలనుకుంటున్నారు. సల్మాన్.. కథను విన్నారు. కానీ ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో ఈ సినిమాపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది"ని సల్మాన్ సన్నిహిత వర్గాలు చెప్పినట్లు సమాచారం.

అమ్మవారి మహిమలతో 'దక్షిణ కాళి'

సుబ్బు, ప్రియాంక జంటగా తోట కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'దక్షిణ కాళి'. సత్యవాణి నిర్మించారు. అర్చన అమ్మవారిగా ప్రత్యేక పాత్రలో నటించారు. ఆజాద్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ.. ''అమ్మవారి మహిమలు తెలిపేలా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''నేను అమ్మవారి భక్తురాల్ని. ఆమే నాతో ఈ చిత్రం నిర్మించిందని నమ్ముతున్నా. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాత సత్యవాణి. ఈ కార్యక్రమంలో ప్రియాంక, అఫ్సర్ ఆజాద్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చేలా ది రాజాసాబ్


మాళవిక, రిద్ధి కుమార్, బొమన్ ఇరాని, టీజీ విశ్వప్రసాద్, జరీనా వహాబ్, నిధి అగర్వాల్

"ప్రభాస్ 'బాహుబలి'కి ముందు ఎలా కనిపించేవారో 'ది రాజాసాబ్' చిత్రంలో అలా కనిపిస్తార"న్నారు నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. ఈ సినిమాలోని కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఫాంటసీ అంశాలు అందర్నీ అలరిస్తాయని తెలిపారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని ''నాచే నాచే..'' గీతాన్ని సోమవారం ముంబయిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం రొమాంటిక్ హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందింది. ఇది భారతీయ సినిమాకి కొత్త జానర్" అన్నారు. సీనియర్ నటి జరీనా వహాబ్ మాట్లాడుతూ.. "హిందీలో కుటుంబ కథలు పూర్తిగా కనుమరుగైపోయాయి. కానీ దక్షిణాదిలో అలాంటి కథలు బాగా వస్తున్నాయి. ఈ సినిమా ప్రభాస్‌ది అని చెప్పగానే నటించడానికి ఓకే చెప్పేశాను'' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. "మా చిత్రం కోసం భారతీయ చిత్రసీమలో ఎప్పుడూ చేయనంత పెద్ద ఇండోర్ సెట్ వేశాం. వీఎఫ్ఎక్స్ కూడా చాలా గొప్పగా ఉంటాయి" అన్నారు. "పిల్లలకీ.. పెద్దలకీ నచ్చే చిత్రమిది. దీంట్లో ప్రభాస్‌తో కలిసి నటించడం మర్చిపోలేన'న్నారు నటి మాళవిక. ఈ కార్యక్రమంలో బోమన్ ఇరానీ, రిద్ధి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నావా బంగారం!


అఖిల్, భాగ్యశ్రీ

"కట్టుకోబోయేటోడికి కళ్లతో మాట్లాడినా ఇనపడతాదంట. ఏంది ఇన్నావా.. బంగారం'' అంటూ అఖిల్‌ని ప్రేమగా ప్రశ్నిస్తోంది భాగ్యశ్రీ బోర్సే. ఇప్పుడీ ఇద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. ''హే ఇన్నావా ఇన్నావా.. కన్నెపిల్లేమందో ఇన్నావా'' అంటూ సాగిన ఈ మెలోడీ పాటకు తమన్ స్వరాలు సమకూర్చగా.. అనంత శ్రీరామ్ సాహిత్యమందించారు. శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ ఆలపించారు. ఇది రాయలసీమలోని గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది. ఇప్పటికే 70శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: లియోన్ బ్రిట్టో.

కొత్త ప్రతిభ కోసం.... దీపిక 'ది ఆన్ సెట్'

"నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాను''టూ బాలీవుడ్ నటి దీపికా పదుకొణె 'ది ఆన్‌సెట్ ప్రోగామ్'ను ప్రకటించింది. వినోద పరిశ్రమలో తెరవెనుక పనిచేసే.. సృజనాత్మకత కలిగిన యువ ప్రతిభావంతులకు మద్దతుతో కూడిన శిక్షణ లక్ష్యంగా క్రియేట్ విత్ మీ ప్లాట్‌ఫామ్‌లో భాగంగా దీనిని ప్రారంభించినట్లు వెల్లడించింది. సోమవారం ఆమె 40వ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని ఇన్‌స్టాలో ఓ వీడియో ద్వారా వెల్లడించింది. ఇందులో 'దేశ వ్యాప్తంగా ఉన్న అద్భుతమైన సృజనాత్మక ప్రతిభను గుర్తించడానికి ఒక వేదికను సృష్టించాలని గతేడాది చాలా బలంగా అనుకున్నాను. ఇప్పుడు నాకెంతో ఇష్టమైన ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది" అని పంచుకుంది. "భారతీయ చలనచిత్ర, టెలివిజన్, ప్రకటనలలో కెరీర్‌ను నిర్మించుకోవాలనుకునే వివిధ విభాగాలలోని సాంకేతిక నిపుణుల కోసం.. అనుభవాలతో కూడిన శిక్షణ కార్యక్రమమే 'ది ఆన్ సెట్'. 'ఆన్‌సెట్‌ప్రోగ్రామ్.ఇన్ వెబ్‌సైట్‌ని సందర్శించండి. మీ వివరాలు, పనిని మాకు తెలియజేయండి. అత్యుత్తమమైన వ్యక్తులతో కలిసి పనిని సృష్టించుకునే అవకాశం పొందండి" అనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ కార్యక్రమం ద్వారా సినీ పరిశ్రమలో ప్రతిభ ఉన్న వారికి శిక్షణ అవకాశాలను అందిస్తారు. ఇందులో రచన, దర్శకత్వం, కెమెరా, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్స్, మేకప్, చిత్ర నిర్మాణానికి అవసరమైన ఇతర సాంకేతిక విభాగాలన్నింటిలోనూ వారికి అవకాశాలు కల్పించనున్నట్లు దీపిక పేర్కొంది.


దీపిక

శక్తి ప్రేమది... గన్‌పౌడర్‌ది కాదు


విపుల్

"కొంత మంది దానిని కేవలం కథ అని అన్నారు. దాన్ని అణచివేయడానికి కూడా ప్రయత్నించారు. అపఖ్యాతిపాలు చేయాలనుకున్నారు. కానీ నిజం ఆగలేదు. ఎందుకంటే కొన్ని కథలు ముగియవు.. ఈసారి అది ఇంకా లోతుగా వెళ్తుంది. మరింత బాధిస్తుంది'' అంటూ 'బియాండ్ ది కేరళ స్టోరీ' చిత్రాన్ని ప్రకటించింది చిత్రబృందం. ఎన్నో వివాదాలు, విమర్శల మధ్య విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా వస్తున్న చిత్రమిది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత. తాజాగా ఈ సీక్వెల్ ఫిబ్రవరి 27న రాబోతున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు నిర్మాత. 'ప్రేమలో ఉన్న శక్తి గన్‌పౌడర్‌లో కనిపించదు' అంటూ ఆసక్తికరంగా సాగుతోందీ వీడియో. నిజ జీవిత కథలతో దీన్ని తీర్చిదిద్దుతున్నారని, త్వరలో నటీనటుల వివరాల్ని వెల్లడించనున్నారని చిత్ర వర్గాలు తెలిపాయి.

క్రేజీ పెళ్లిలో


అనుపమ

గతేడాది 'కిష్కింధపురి' చిత్రంతో తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది నటి అనుపమ పరమేశ్వరన్. తనిప్పుడు 'క్రేజీ కళ్యాణం' అనే మరో తెలుగు సినిమాలో భాగమైంది. ఆమె.. నరేశ్ వీకే, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బద్రప్ప గాజుల తెరకెక్కిస్తున్నారు. బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సోమవారం అధికారికంగా ప్రకటించారు. "పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో రూపొందిన వినోదాత్మక చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ చేశాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సురేశ్ బొబ్బిలి, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.

ఈ పరిస్థితుల్లో ఆ విషయాన్ని ఏ నిర్మాత చెప్పలేరు

"థియేటర్లలో కూర్చున్నంత సేపూ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించే సినిమా 'నారీ నారీ నడుమ మురారి' అన్నారు నిర్మాత అనిల్ సుంకర. ఆయన నిర్మాణంలో శర్వానంద్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అనిల్ సుంకర.


అనిల్ సుంకర

"ఇది సంక్రాంతికి సరిగ్గా సరిపోయే పండగ సినిమా. ఒకే ఆఫీస్‌లో ఇటు ప్రేయసికి.. అటు మాజీ ప్రేయసికి మధ్య నలిగిపోయే కుర్రాడి కథ ఇది. దర్శకుడు రామ్ అబ్బరాజు గత చిత్రం 'సామజవరగమన' ఓ పంథాలో సాగితే.. ఈ కథ మరో కోణంలో సాగుతుంది. ఆ చిత్రానికి రెండు రెట్ల వినోదంతో ఇది ముస్తాబైంది. శర్వానంద్ దీంట్లో కొత్తగా కనిపిస్తారు. శ్రీవిష్ణుకీ ఓ మంచి పాత్ర పడింది. ఆ పాత్ర వచ్చినప్పుడు థియేటర్లలో అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇది బాలకృష్ణ టైటిల్‌తో వస్తున్న సినిమా కాబట్టే ఆ పేరుని స్వయంగా ఆయనతోనే ఆవిష్కరించాం".

❏ "మేము సంక్రాంతికి వస్తామని రెండు నెలల క్రితమే ప్రకటించాం. కానీ, చాలా మంది నమ్మలేదు. ఇదే విషయాన్ని చాలా మంది ఫోన్లు చేసి మరీ అడిగారు. కానీ, మేము చెప్పినట్లే పండక్కే వస్తున్నాం. ప్రతి సంక్రాంతి సీజన్‌లోనూ నాలుగైదు సినిమాలు రావడమనేది సహజమే. పండక్కి వచ్చిన అన్ని చిత్రాలు విజయవంతమైన సందర్భాలూ ఉన్నాయి. మన కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే నమ్మకంతో బరిలో దిగాం. అయితే ఓ చిత్రానికి ఎన్ని థియేటర్లు దొరుకుతాయన్నది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ నిర్మాత కూడా చెప్పలేరు''.

❏ ''మేము ఎక్కువగా మహేశ్‌బాబుతో సినిమాలు చేశాం. ప్రస్తుతం కొన్ని చిన్న, పెద్ద చిత్రాలు నిర్మిస్తున్నాం. ప్రయోగాలు ఎందుకనే ఉద్దేశంతో మాకు బాగా కలిసొచ్చిన ఎంటర్‌టైన్‌మెంట్ జానర్‌లోనే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాం. 'ఏజెంట్' చిత్రం తర్వాత నుంచి కథల ఎంపికలో మా ఆలోచనలు మారాయి. మంచి స్క్రిప్ట్‌తో వస్తేనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్‌తో ఓ చిత్ర విషయమై చర్చిస్తున్నాం. తేజ సజ్జాతో ఓ సినిమా చేయనున్నాం. అడివి శేష్‌తో చేస్తున్న 'జీ2' త్వరలో విడుదల కానుంది''.

'ప్రేమలు' తర్వాత...!


మమితా బైజు

దక్షిణాదిలో అగ్ర తారల సరసన వరుస అవకాశాలతో జోరుమీదుందీ మలయాళ నటి మమితా బైజు. ఇటు యువకథానాయకులతోనూ రొమాంటిక్ కామెడీ చిత్రాలను చేస్తూ.. కుర్రకారు మనసుల్ని దోచుకుంటుందీ భామ. తను నటించిన 'ప్రేమలు' చిత్ర దర్శకుడు గిరీష్ ఏడీతో కలిసి మరోసారి పనిచేయనుంది మమిత. 'బెత్లెహెం కుడుంబ యూనిట్' పేరుతో వస్తోన్న ఈ చిత్రంలో నివిన్ పౌలీ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభించినట్లు తెలిపింది చిత్రబృందం. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఇన్‌స్టాలో ఓ వీడియోను పంచుకుంది. ''భావన స్టూడియోస్ నివిన్, మమితా ప్రధాన పాత్రల్లో రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని రూపొందిస్తుంది. నూతన సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభిస్తూ.. ఈ సినిమా చిత్రీకరణను మొదలుపెట్టామ''ని వ్యాఖ్యల్ని జోడించింది. ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ, శ్యామ్ మోహన్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం మమిత నటుడు సూర్య, విజయ్ దళపతి సహా పలువురు యువ హీరోల చిత్రాలలో నటిస్తోంది. ఇటీవలే విడుదలైన 'సర్వంమాయ' చిత్రంతో నివిన్ ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తున్నాడు. ఆయన తదుపరి 'బెంజ్' చిత్రంలో విలన్‌గా కనిపించనున్నాడు.

నిబంధనల అమలుకే బోర్డులు

● సంస్థల అభివృద్ధిపై నిరాసక్తత ● 17% కంపెనీల్లోనే క్రియాశీలకం ● ఐఎస్‌బీ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: 'దేశ కార్పొరేట్ రంగంలో, అగ్రశ్రేణి సంస్థల బోర్డులు నిబంధనల అమలుకే పరిమితం అవుతున్నాయి. కంపెనీల భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యూహ రచనల్లో చురుకైన పాత్ర పోషించడం లేదు' అని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నివేదిక వెల్లడించింది. 'ది బోర్డ్ లుకింగ్ గ్లాస్' పేరుతో విడుదల చేసిన కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు 2025 ప్రకారం.. 17% బోర్డులు మాత్రమే కంపెనీ వ్యూహాలను రూపొందించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. మిగిలిన 83% బోర్డులు.. కంపెనీ నిర్వహణలో చురుకైన పాత్ర పోషించకుండా, నిష్క్రియగా ఉండిపోతున్నాయని స్పష్టం చేసింది. బీఎస్ఈ 500 కంపెనీల్లోని 200 మందికి పైగా డైరెక్టర్ల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదిక రూపొందించినట్లు ఐఎస్‌బీ వెల్లడించింది. ప్రొఫెసర్లు సంజయ్ కల్లాపూర్, నిర్మాల్య కుమార్, హరీష్ రాయ్ చందానీ సారథ్యంలో ఈ అధ్యయనం జరిగింది.

సమీక్షించడంతోనే సరి..



ఈ నివేదిక ప్రకారం 98% మంది డైరెక్టర్లు తమ బోర్డులు నిబంధనలను పాటించడంలో పరిణతి సాధించాయని భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి, వ్యూహాత్మక మార్గదర్శకత్వం చేయడంలో మాత్రం బోర్డులు వెనకబడి ఉన్నాయి. యాజమాన్యం సిద్ధం చేసిన ప్రణాళికలను సమీక్షించడం మినహా, తాము అందించే సూచనలు చాలా పరిమితంగానే ఉన్నాయని 36% మంది డైరెక్టర్లు అంగీకరించారు. బోర్డులో పని అంటే.. సమావేశాలకు హాజరవ్వడం మాత్రమే కాదని, నిర్మాణాత్మక చర్చలు, స్వతంత్ర ఆలోచనలకు వేదిక కావాలని నిర్మాల్య కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమర్థ పర్యవేక్షణ నిమిత్తం, డైరెక్టర్లు ముందస్తు జాగ్రత్తలతో రిస్కులను అంచనా వేయాలని సంజయ్ కల్లాపూర్ సూచించారు.

స్పష్టత లోపిస్తోంది

బోర్డు సభ్యులు - కంపెనీ సీఈఓ మధ్య ఉండాల్సిన స్పష్టత, నిజాయతీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సీఈఓలకు నచ్చని అభిప్రాయాలను వెల్లడించేందుకు డైరెక్టర్లు వెనకాడుతున్నారు. 38% మంది మాత్రమే ఈ విషయంలో స్పందిస్తున్నారు. సంస్థల్లో పారదర్శకతకు ఆధారమైన ప్రజావేగు, విజిల్ యంత్రాంగాల విషయంలో 22% బోర్డులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనల అమలు కోసం చేసే ప్రక్రియలుగానే చూస్తున్నారు మినహా, నమ్మకాన్ని పెంపొందించే సాధనాలుగా వీటిని పరిగణించడం లేదు. భారతీయ కార్పొరేట్ బోర్డుల్లోని స్వతంత్ర డైరెక్టర్లు తమ పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకుడు హరీష్ రాయ్ చందానీ పేర్కొన్నారు.

నివేదికలోని ఇతర అంశాలేమిటంటే..

✦ ప్రతి ముగ్గురు డైరెక్టర్లలో ఒకరు బోర్డు సమావేశాలకు తగినంత సిద్ధం కావడం లేదు.
✦ అయిదుగురు డైరెక్టర్లలో ఇద్దరికి కంపెనీ లక్ష్యాలపై సరైన అవగాహన లేదు.
✦ ఆరుగురు డైరెక్టర్లలో ఒక్కరు మాత్రమే బయట జరిగే పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, చర్చల్లో వినిపిస్తున్నారు.

ఈనాడు బిజినెస్

హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో ఆర్‌యూఎఫ్



హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), తన విశాఖపట్నం రిఫైనరీలో అవశేషాల అప్‌గ్రేడేషన్ కేంద్రాన్ని (ఆర్‌యూఎఫ్) ప్రారంభించింది. ఫలితంగా ప్లాంటు డీ-కన్వర్షన్ సామర్థ్యం, డిస్టిలేట్ ఉత్పత్తి, లాభదాయకత గణనీయంగా పెరిగాయని తెలిపింది. డిస్టిలేట్ ఉత్పాదకత 10% అధికమవుతుందని పేర్కొంది. ఏటా 3.55 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంటులో దేశంలోనే తొలి అతి పెద్ద హైడ్రోక్రాకింగ్ యూనిట్, ప్రపంచంలోనే తొలి ఎల్‌సీ-మ్యాక్స్ యూనిట్ ఉన్నాయి. ముడి చమురులో తక్కువ విలువైన భాగాన్ని కూడా, 93% అధిక విలువైన పెట్రోలియం ఉత్పత్తులుగా ఇవి మార్చగలవని సంస్థ వివరించింది. చమురు శుద్ధి సంక్లిష్టతను మెరుగుపరచడంలో, దిగుమతి చేసుకున్న ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన అడుగు అని తెలిపింది.

నవ లిమిటెడ్‌కు రూ.450 కోట్ల నిధులు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక రంగంలోని నవ లిమిటెడ్, సింగపూర్‌లోని తన పూర్తిస్థాయి అనుబంధ సంస్థ నవ గ్లోబల్ నుంచి సుమారు రూ.450 కోట్ల (50 మిలియన్ డాలర్ల) నిధులు పొందనుంది. సోమవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో నవ గ్లోబల్ సమర్పించిన షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ వ్యూహాత్మక చర్య ద్వారా మాతృ సంస్థ నవ లిమిటెడ్, తన పెట్టుబడులను పాక్షికంగా నగదు రూపంలోకి మార్చుకోనుంది. ఇందులో భాగంగా నవ లిమిటెడ్ నుంచి 99.20లక్షల ఈక్విటీ షేర్లను (3.97% వాటా) ఒక్కోటి 5.04 డాలర్ల చొప్పున నవ గ్లోబల్ వెనక్కి తీసుకోనుంది. ఈ నిధులను భవిష్యత్తులో చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులు, ఇతర కంపెనీల కొనుగోళ్లు, గ్రూపు రుణాల సర్దుబాటుకు వినియోగించనున్నట్లు నవ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ దేవినేని వెల్లడించారు.

బొండాడకు రూ.627 కోట్ల ఏపీ ట్రాన్స్‌కో ఆర్డర్

ఈనాడు, హైదరాబాద్: బొండాడ ఇంజినీరింగ్‌కు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) నుంచి భారీ ప్రాజెక్టు దక్కింది. ఏపీలోని హిందూపురంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద 225 మెగావాట్/450 మెగావాట్ అవర్ సామర్థ్యం గల స్టాండలోన్ బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) అభివృద్ధికి రూ.627 కోట్ల విలువైన ఆర్డరు లభించింది. 18 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటితో కలిపి తమ బ్యాటరీ స్టోరేజ్ పోర్ట్‌ఫోలియో 1 గిగావాట్ అవర్‌కు చేరిందని సంస్థ వివరించింది.

అవాంఛిత కాల్స్ ఎందుకు ఆపలేదు?



టెలికాం ఆపరేటర్లపై రూ.150 కోట్ల జరిమానా

అవాంఛిత (స్పామ్) కాల్స్, మెసేజ్‌లను నియంత్రించడంలో విఫలమైన టెలికాం ఆపరేటర్లపై నియంత్రణ సంస్థ ట్రాయ్ రూ.150 కోట్ల జరిమానా విధించింది. 2020 నుంచి మూడు సంవత్సరాల కాలానికి విధించిన ఈ జరిమానాను, టెలికాం ఆపరేటర్లు సవాల్ చేశారు. స్పామ్ కాల్స్‌పై వినియోగదారులు ఫిర్యాదు చేసినా.. ఏం చర్య తీసుకున్నారు, పరిష్కరించారా వంటివి తెలపకుండానే, ఆయా ఫిర్యాదులను సంస్థలు తప్పుగా మూసివేసినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం స్పామ్ కాల్స్/మెసేజ్‌లు వచ్చిన టెలికాం కనెక్షన్లపై కంపెనీలు చర్యలు తీసుకోనందునే, వాటిపై ట్రాయ్ జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

✦ గత ఏడాది కాలంలో 21 లక్షలకు పైగా స్పామర్ల కనెక్షన్‌లను ట్రాయ్ తొలగించింది. లక్షకు పైగా సంస్థలను బ్లాక్‌లిస్ట్ చేసింది.


సాధారణ మొబైల్ నంబర్ల నుంచి వస్తున్నాయ్: మొబైల్‌లో ఏ నెట్‌వర్క్ వినియోగదారు అయినా అవాంఛిత కాల్స్/ఎస్ఎంఎస్‌లను వద్దనుకుంటే, డీఎన్‌డీ యాప్‌లో నమోదవ్వాలి. ట్రాయ్ వద్ద నమోదైన టెలీమార్కెటింగ్ సంస్థలు ఈ విషయంలో నిబంధనలను పాటిస్తున్నా, నమోదు కాని పలు సంస్థలు, వ్యక్తులు.. 10 అంకెల సాధారణ మొబైల్ నంబర్ల నుంచి ఇటువంటి కాల్స్, మెసేజ్‌లు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఇలాంటి కాల్స్/ఎస్ఎంఎస్ వచ్చిన 7 రోజుల లోపు కూడా ట్రాయ్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఒకే నంబర్‌పై 10 రోజుల్లోపు 5 ఫిర్యాదులొస్తే, ఆ నంబరుపై చర్యలను టెలికాం సంస్థలు ప్రారంభించాలి.

గుర్తించాల్సిన అంశాలివీ..: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల నుంచి కాల్స్, లావాదేవీ మెసేజ్‌లు కూడా 1600తో ప్రారంభమయ్యే నంబర్ల నుంచే రావాలి.

✦ వాణిజ్య ప్రచారం కోసం వాడే సందేశాలకు ముందు పి, లావాదేవీ సందేశాలు అయితే టీ, సేవకు సంబంధించింది అయితే ఎస్, ప్రభుత్వ సందేశం అయితే జీ అనే అక్షరంతో ప్రారంభం కావాలి.

ఎయిరిండియా సీఈఓ విల్సన్‌కు 'టాటా'!

కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ కోసం వెతుకులాట



ఎయిరిండియాకు కొత్త సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణాధికారి) రాబోతున్నారు. ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్‌కు టాటా సన్స్ ఉద్వాసన చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈయన పదవీకాలం 2027 జూన్ వరకు ఉంది. ఎయిరిండియాకు కొత్త సీఈఓను ఎంపిక చేసేందుకే, ఇద్దరు బ్రిటన్, అమెరికా విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ చర్చలు జరిపినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఎయిరిండియా వృద్ధి పనులపై చంద్రశేఖరన్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన, తదనంతర పరిణామాలపైనా టాటా గ్రూప్ అసహనంగా ఉందని సమాచారం. అలాగే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఎండీ అలోక్ సింగ్ స్థానంలో కొత్తవారి కోసం వెతుకుతున్నట్లు సమాచారం. ఈయన పదవీ కాలమూ 2027 వరకు ఉంది.

శీతల ప్రాంత చేపలు మన దగ్గర

రూ.50 కోట్లతో 'రెయిన్‌బో ట్రౌట్' సాగు కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: శీతల ప్రాంతాల్లో పెరిగే 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను సాగు చేసేందుకు, అంకుర సంస్థ స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో దీన్ని రెండెకరాల విస్తీర్ణంలో, రూ.50 కోట్లతో నిర్మించింది. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఈ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి, మాట్లాడుతూ.. అంకుర వ్యవస్థాపకులు ముందుకు వస్తే, మత్స్య శాఖ నుంచి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ వేడి వాతావరణం ఉన్న ప్రాంతాల్లోనూ ఇలాంటి ఖరీదైన చేప జాతులను పెంచొచ్చని ఈ అంకురం నిరూపిస్తోందన్నారు. ఏడాదికి 360 టన్నుల చేపలతో ప్రారంభించి, క్రమంగా 1,200 టన్నులకు చేరతామని స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య రిత్విక్ నర్రా తెలిపారు. 200 మందికి పైగా ఉపాధి కల్పిస్తామని, 12 లక్షలకు పైగా చేపపిల్లలను ఉత్పత్తి చేయనున్నట్లు వివరించారు.



చేపలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మహీంద్రా ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ

ధరల శ్రేణి రూ.13.66–24.11 లక్షలు



మహీంద్రా అండ్ మహీంద్రా, కొత్తగా ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ ఎస్‌యూవీని సోమవారం ఆవిష్కరించింది. ఏఎక్స్, ఏఎక్స్3, ఏఎక్స్5, ఏఎక్స్7, ఏఎక్స్7టీ, ఏఎక్స్7ఎల్ వేరియంట్లలో ఈ వాహనం లభ్యం కానుంది. తొలుత ఏఎక్స్7, ఏఎక్స్7టీ, ఏఎక్స్7ఎల్ వేరియంట్లను డెలివరీ చేయనున్నారు. కొత్త ఎస్‌యూవీకి ఈ నెల 8 నుంచి టెస్ట్ డ్రైవ్‌లు, 14 నుంచి బుకింగ్‌లు/డెలివరీలు మొదలవుతాయి. 2026 ఏప్రిల్ నుంచి లోయర్ ట్రిమ్‌లైన ఏఎక్స్, ఏఎక్స్3, ఏఎక్స్5లను డెలివరీ చేస్తారు. ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.13.66 లక్షలు (ఎక్స్-షోరూమ్). డీజిల్ మోడల్ ధర రూ.14.96 లక్షలు (ఎక్స్-షోరూమ్). టాప్ ఎండ్ ఏఎక్స్7ఎల్ డీజిల్ ఇంజిన్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ప్రారంభ (ఎక్స్‌షోరూమ్) ధర రూ.22.47 లక్షలు. తొలి 40,000 మంది వినియోగదార్లకు మాత్రమే ఈ ధర వర్తిస్తుంది. ఏఎక్స్7ఎల్ డీజిల్ ఆటోమేటిక్ వేరియంట్ ధర రూ.24.11 లక్షలు (ఎక్స్-షోరూమ్).

హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాల లీజింగ్ పెరిగింది



హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాల నికర లీజింగ్ గత ఏడాదిలో 91 లక్షల చదరపు అడుగులకు చేరినట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తన తాజా నివేదికలో తెలిపింది. 2024లోని నికర లీజ్ 79 లక్షల చదరపు అడుగులతో పోలిస్తే ఇది 15% ఎక్కువ. హైదరాబాద్ సహా 8 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల నికర లీజింగ్ 2024లో 491 లక్షల చ.అ. కాగా, 2025లో 25% వృద్ధితో 614 లక్షల చ.అ.లకు చేరిందని వెల్లడించింది. దేశీయ కంపెనీలతో పాటు విదేశీ సంస్థల నుంచి జీసీసీ కార్యాలయ స్థలాలకు గిరాకీ పెరగడం దీనికి కారణం అని పేర్కొంది.

✦ కార్యాలయ స్థలాల నికర లీజింగ్ హైదరాబాద్, బెంగళూరు, పుణె, దిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నైల్లో పెరగ్గా.. ముంబయి, కోల్‌కతా, అహ్మదాబాద్‌లలో క్షీణించినట్లు తెలిపింది.

✦ కొత్త కార్యాలయ స్థలాల సరఫరా 2025లో 17% పెరిగి సుమారుగా 530 లక్షల చ.అ.లకు చేరింది.

కోడి గుడ్లు

6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	580
వరంగల్	582
విజయవాడ	620
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	585
చిత్తూరు	663

ఈథేన్ సరఫరా కంపెనీల్లో ఓఎన్‌జీసీకి వాటా

దిల్లీ: ఈథేన్‌ను రవాణా చేసే అతిపెద్ద నౌకలను నిర్వహించే కంపెనీలతో ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం జపాన్‌కు చెందిన మిత్సుయి ఓఎస్‌కే లైన్స్‌తో ఓఎన్‌జీసీ జట్టుకట్టింది. భారత్ ఈథేన్ వన్ ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ ఈథేన్ టు ఐఎఫ్ఎస్‌సీ ప్రైవేట్ లిమిటెడ్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ భాగస్వామ్యం ఉపకరిస్తుంది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న ఈ రెండు సంస్థల్లో మిత్సుయికి 100% వాటా ఉండగా.. ఓఎన్‌జీసీ ఈ రెండింటిలోనూ 50% చొప్పున వాటాలు సొంతం చేసుకోనుంది. తద్వారా ఏర్పడే సంయుక్త సంస్థ(జేవీ)లకు ఒకటి చొప్పున భారీ ఈథేన్ ఓడ(వీఎల్ఈసీ)లు ఉంటాయి. ఇకపై భారత జెండాతో వీటిని మిత్సుయి నిర్వహిస్తుంది. అమెరికా నుంచి ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ లిమిటెడ్(ఓపీఏఎల్)కు ఈథేన్‌ను ఈ ఓడలు సరఫరా చేస్తాయి.

✦ ఒప్పందం కింద ప్రతీ జేవీలో 2 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కోటీ రూ.100 చొప్పున ఓఎన్‌జీసీ సబ్‌స్క్రైబ్ చేస్తుంది. ఈక్విటీ సబ్‌స్క్రిప్షన్ అనంతరం జేవీల్లో ఓఎన్‌జీసీకి 50% వాటా దక్కుతుంది. మిగతా 50% మిత్సుయికి ఉంటుంది.

ప్రయోజనం ఇలా: ఈ భాగస్వామ్యం ద్వారా మిత్సుయికున్న అంతర్జాతీయ షిప్పింగ్ అనుభవం, ఓఎన్‌జీసీకున్న మార్కెట్ పరిధి కలిసి.. ఈ రంగంలో మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది.

✦ 370 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3330 కోట్ల) అంచనా వ్యయంతో ఈథేన్ సరఫరా కోసం ప్రత్యేక నౌకలను కొరియా షిప్‌యార్డ్స్‌లలో నిర్మించనున్నారు.

రూ.11.72 లక్షల కోట్లకు ఫార్మా రంగం

2030పై ఫార్మెగ్జిల్ ప్రణాళికలు



ఈనాడు, హైదరాబాద్: భారతీయ జనరిక్ ఔషధాల ఎగుమతులను అంతర్జాతీయ మార్కెట్లో మరింత బలోపేతం చేసేందుకు ఫార్మాస్యూటికల్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెగ్జిల్) ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందుకోసం పలువురు ఉన్నతాధికారులతో ఫార్మెగ్జిల్ ప్రతినిధి బృందం ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించింది. ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి, ఐఫెక్స్ 2026 ఛైర్మన్ నిపుణ్ జైన్, డైరెక్టర్ జనరల్ రాజా భానులతో కూడిన బృందం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను కలిసి దేశీయ ఫార్మా ఎగుమతుల తీరును వివరించింది. 2024-25లో దేశీయ ఫార్మా ఎగుమతులు 9.4% వృద్ధితో సుమారు రూ.2.45 లక్షల కోట్ల (30.47 బిలియన్ డాలర్ల)కు చేరుకున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా పెరుగుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ఎగుమతుల ప్రోత్సాహక మండళ్లలో, ఫార్మెగ్జిల్ నాలుగో స్థానంలో నిలిచిందని వివరించారు. ఔషధ శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, సంయుక్త కార్యదర్శి సత్య ప్రకాష్‌తో జరిగిన సమావేశంలో ఫార్మా రంగ భవిష్యత్తు అంచనాలను ప్రతినిధి బృందం వివరించింది. ప్రస్తుతం రూ.5.41 లక్షల కోట్లు (60 బిలియన్ డాలర్లు)గా ఉన్న ఫార్మా మార్కెట్ 2030కి రూ.11.72 లక్షల కోట్ల (130 బి.డాలర్ల) స్థాయికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

ఐడీ ఫ్రెష్ ఫుడ్స్‌కు రూ.1,500 కోట్ల పెట్టుబడి

ఇడ్లీ, దోశె పిండి, చట్నీ, సాంబార్, డెయిరీ ఉత్పత్తులను విక్రయ సంస్థలకు అమ్మే ఐడీ ఫ్రెష్ ఫుడ్స్‌లో రూ.1,500 కోట్లు పెట్టుబడిగా పెట్టి, స్వల్ప వాటాను విదేశీ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అపెక్స్ పార్ట్‌నర్స్ దక్కించుకుంది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించిన ఈ సంస్థ, ప్రస్తుతం భారత్‌తో పాటు గల్ఫ్ దేశాల్లో 50కి పైగ నగరాలకు విస్తరించింది. 2,400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

పదేళ్లలో 10 కోట్ల ఉద్యోగాలు సృష్టిద్దాం

పరిశ్రమ ప్రముఖుల సన్నాహాలు



రాబోయే పదేళ్లలో మనదేశంలో 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో 'హండ్రెడ్ మిలియన్ జాబ్స్' పేరిట ఓ కార్యక్రమాన్ని పరిశ్రమ ప్రముఖులు కొందరు ప్రారంభించారు. దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంత వృద్ధిని సాధిస్తున్నప్పటికీ.. ఉద్యోగ కల్పన ఆశించిన స్థాయిలో లేని నేపథ్యంలో, దీనికి శ్రీకారం చుట్టారు. ఐటీ పరిశ్రమ సంఘమైన నాస్కామ్ సహ-వ్యవస్థాపకుల్లో ఒకరైన హరీశ్ మెహతా, ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీఐఈ) వ్యవస్థాపకుడు ఏజే పటేల్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ పాలసీ (సీఐపీపీ) వ్యవస్థాపకుడు కె యతీశ్ రజావత్ ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. దేశంలో ఏటా పని వయస్సుకు చేరుతున్న వారి సంఖ్య సుమారు 1.2 కోట్లుగా ఉంటోంది. సాధారణంగా ఉద్యోగ కల్పన ఎక్కువగా ఉండే తయారీ లాంటి రంగాలు కూడా, ఇప్పుడు ఉద్యోగాలను సృష్టించడంలో ఇబ్బంది పడుతున్నాయి. అందువల్ల భవిష్యత్తులో కొత్తగా పనివయస్సుకు చేరే వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలంటే ఏటా 80-90 లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని వాళ్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి మధ్య అంతరం పెరుగుతుండటం ఆందోళనకర పరిణామమని వాళ్లు అభిప్రాయపడ్డారు. వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈలు, యాజమాన్యాలు లాంటి ఉద్యోగ సృష్టికర్తలను బలోపేతం చేయడమే హండ్రెడ్ మిలియన్ జాబ్స్ కార్యక్రమం ఉద్దేశమని హరీశ్ మెహతా తెలిపారు. వ్యాపారదక్షతా సామర్థ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ ప్రోత్సాహక సంస్థల అభివృద్ధి తదితరాలపై ఇది దృష్టి పెడుతుందని అన్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్.ఆర్.నారాయణమూర్తి, నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ లాంటివాళ్లు దీనికి సహకరించనున్నారు.

జూన్ కల్లా బ్యారెల్ చమురు ధర 50 డాలర్లకు!



ఈ ఏడాది జూన్ నాటికి చమురు ధరలు బాగా తగ్గి బ్యారెల్ ధర 50 డాలర్లకు చేరొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంటోంది. చమురు ధరలు బాగా తగ్గితే 2026-27లో దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.4% దిగువకు చేరొచ్చని అంచనా వేస్తోంది. వార్షిక జీడీపీ వృద్ధి 10-15 బేసిస్ పాయింట్ల మేర పెరగొచ్చనీ అంటోంది. వెనెజువెలా పరిణామాలు చమురు ధరను పెంచలేవనీ స్పష్టం చేసింది.

పెరిగిన బంగారం, వెండి ధరలు: వెనెజువెలా అధ్యక్షుణ్ని అమెరికా బంధించడాన్ని, చైనా సహా పలు దేశాలు తప్పుపడుతున్న నేపథ్యంలో.. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతాయన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఫలితంగా సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించే బంగారం, వెండిపైకి నిధులు తరలివచ్చాయి. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 115 డాలర్లు, వెండి ధర 4 డాలర్లు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రి 11.30 గంటల సమయానికి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,40,800కు, కిలో వెండి ధర రూ.2,46,800కు చేరింది.

50 నగరాల్లో స్విగ్గీ ఈట్‌రైట్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించే వారి కోసం 50 పైగా నగరాల్లో ఈట్‌రైట్ సేవను ప్రారంభించినట్లు, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విగ్గీ ప్రకటించింది. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలు, చక్కెర లేని ఆహారాన్ని ఎంపిక చేసుకునే అవకాశాన్ని ఈ సేవలో కల్పించినట్లు తెలిపింది. 2 లక్షలకు పైగా రెస్టారెంట్ల నుంచి 18 లక్షలకు పైగా వంటకాలు ఈట్‌రైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించింది. తన ప్లాట్‌ఫాంలో నమోదైన ఆర్డర్ల ఆధారంగా.. సంవత్సరం వారీగా ఆరోగ్యకర ఆహారాన్ని ఆర్డర్ పెడుతున్న వారి సంఖ్య మెట్రో నగరాలతో పోలిస్తే రెండో అంచె నగరాల్లో రెండింతలు పెరిగినట్లు వెల్లడించింది. చండీగఢ్, గువాహతి, లుధియానా, భువనేశ్వర్ ఇందులో ముందున్నాయి.

సరికొత్త టాటా పంచ్ 13న విడుదల

ధరల శ్రేణి అంచనా రూ.5.75-10 లక్షలు



దేశంలో 6 లక్షల విక్రయాల మైలురాయిని అత్యంత వేగంగా అందుకున్న స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) టాటా పంచ్‌ని, మరింతగా నవీకరించి 13న విడుదల చేయబోతున్నారు. టర్బో-పెట్రోల్ పవర్‌ట్రెయిన్‌తో ఈ కారును టాటా మోటార్స్ తీసుకువస్తోంది. టాటా మోటార్స్ విడుదల చేసిన వివరాల ప్రకారం.. నెక్సాన్, కర్వ్, హ్యారియర్, సఫారీ వంటి పెద్ద ఎస్‌యూవీల తరహాలో, పంచ్ ముందు భాగాన్ని రీడిజైన్ చేసినట్లు తెలుస్తోంది. కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్‌యాంప్స్‌ను వెనుకవైపు ఇవ్వనున్నట్లు సమాచారం. కొత్త అల్లాయ్స్ ఉండనున్నాయి. ప్రస్తుత పంచ్ వాహనాల ధరలు రూ.5.5-9.30 లక్షల (ఎక్స్-షోరూమ్) మధ్య ఉండగా, సరికొత్త పంచ్ ధర రూ.5.75-10 లక్షల (ఎక్స్-షోరూమ్) మధ్య ఉండొచ్చని అంచనా.

రూ.4.50 లక్షల కోట్ల ఐఫోన్ ఎగుమతులు




దేశీయంగా స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద కార్యకలాపాలు చేపట్టిన నాలుగేళ్లలోనే రూ.4.50 లక్షల కోట్ల (50 బిలియన్ డాలర్ల) విలువైన ఐఫోన్లను యాపిల్ సంస్థ ఎగుమతి చేసింది. 2021-22లో ఈ పథకంలో యాపిల్ చేరగా, 2025 డిసెంబరు కల్లా ఇంతమేర ఎగుమతులు చేసింది. 2025-26లో ఇప్పటికే 16 బి.డా. (సుమారు రూ.1.44 లక్షల కోట్ల) ఎగుమతులు చేసింది. 2020-21 నుంచి 2024-25 వరకు శామ్‌సంగ్ 17 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.53 లక్షల కోట్ల) విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. దేశీయ మొబైల్ ఎగుమతుల్లో ఐఫోన్ల వాటాయే 75 శాతానికి చేరింది. ఈ ఏడాది మార్చి కల్లా మొబైల్ తయారీకి పీఎల్ఐ పథకం నిలిచిపోవాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మరికొంత కాలం ఈ సాయాన్ని పొడిగిస్తారనే అధికారులు చెబుతున్నారు.

బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు

భారత్‌పై సుంకాలు పెంచుతామన్న ట్రంప్ హెచ్చరికల ప్రభావం

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.36.25 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు.. రూ.1764.07 కోట్లు

సెన్సెక్స్ ▼ 322	నిఫ్టీ ▼ 78
85440	26250



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాంటి బ్లూచిప్ షేర్లు సహా ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురవ్వడంతో, దేశీయ సూచీలు సోమవారం నష్టపోయాయి. భారత్‌పై సుంకాలు మరింత పెంచుతామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా హెచ్చరించడమే ఇందుకు నేపథ్యం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 10 పైసలు తగ్గి 90.30 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.72% పెరిగి 61.19 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ మినహా మిగతా దేశాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.44,000 కోట్లు తగ్గి రూ.480.80 లక్షల కోట్ల (5.33 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

రికార్డు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,762.01) స్వల్ప నష్టాలతో 85,640.05 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత లాభాల్లోకి వెళ్లినా, వెంటనే నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 85,315.33 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసినా, చివరకు 322.39 పాయింట్లు కోల్పోయి 85,439.62 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ ఇంట్రాడేలో 26,373.20 వద్ద తాజా జీవన కాల గరిష్ఠాన్ని తాకింది. అయితే ఈ స్థాయిలో మదుపర్లు లాభాలు స్వీకరించడంతో, క్రమంగా నష్టాల్లోకి వెళ్లిన సూచీ.. చివరకు 78.25 పాయింట్ల నష్టంతో 26,250.30 వద్ద ముగిసింది.

14 షేర్లు నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 16 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.35%, ఇన్ఫోసిస్ 2.09%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2%, బజాజ్ ఫైనాన్స్ 1.21%, టీసీఎస్ 1.09%, టెక్ మహీంద్రా 1.04%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.94% తగ్గాయి. భెల్ 2.65%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.57%, టాటా స్టీల్ 1.56%, హిందుస్థాన్ యునిలీవర్ 1.53%, ఏషియన్ పెయింట్స్ 1.52%, యాక్సిస్ బ్యాంక్ 1.45% లాభపడ్డాయి.

✦ **రూ.12,000 కోట్ల సమీకరణ:** **టొరెంట్ ఫార్మా** ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో సెక్యూరిటీల జారీ ద్వారా రూ.12,500 కోట్లు సమీకరించేందుకు **టొరెంట్ ఫార్మాస్యూటికల్స్** డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

✦ చలనచిత్రాల నిర్మాణ సంస్థ **ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్‌**లో 30% వాటా కొనుగోలు చేయనున్నట్లు **యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా** తెలిపింది. రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ స్థాపించిన ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ విలువను రూ.2,400 కోట్లుగా పరిగణించి ఈ లావాదేవీని చేపడుతున్నట్లు పేర్కొంది.

ఐపీఓ సమాచారం

✦ కోల్ ఇండియాకు చెందిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు ధరల శ్రేణిగా రూ.21-23ను నిర్ణయించారు. ఈ ఐపీఓ 9న ప్రారంభమై 13న ముగియనుంది. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,071 కోట్లను కంపెనీ సమీకరించనుంది. 16న ఈ షేర్లు స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదవుతాయి.

✦ జెనరిక్ ఔషధాల తయారీ సంస్థ **హిందుస్థాన్ లేబొరేటరీస్** పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ, ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది. ప్రతిపాదిత ఐపీఓలో భాగంగా 50 లక్షల తాజా షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లకు చెందిన 91 లక్షల షేర్లను కంపెనీ విక్రయించనుంది.

కరెంట్ అఫైర్స్



■ 2025, అక్టోబరు 29న తమ దేశంలో ఎవరి పర్యటన సందర్భంగా ఆయనకు దక్షిణ కొరియా దేశ అత్యున్నత జాతీయ పురస్కారమైన

మాదిరి ప్రశ్నలు

గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వాను ఆ దేశం ప్రదానం చేసింది?

జ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (పురస్కారంతోపాటు చియోన్‌మాచాంగ్ బంగారు కిరీటం ప్రతిరూపాన్ని కూడా ట్రంప్‌నకు దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యుంగ్ ప్రదానం చేశారు.)

■ ఇంగ్లండ్‌కు చెందిన ఏ దిగ్గజ ఫాస్ట్ బౌలర్‌కు ఇటీవల బ్రిటన్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నైట్‌హుడ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది?

జ: జేమ్స్ ఆండర్సన్ (క్రికెట్‌కు ఈయన చేసిన సేవలకు గుర్తుగా ప్రిన్సెస్ ఆన్నే ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.)

■ 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైనెస్ట్ సైబర్ క్రైమ్' పై ఏ నగరంలో జరిగిన సమావేశంలో ఇటీవల 72 దేశాలు సంతకాలు చేశాయి? (ఈ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును ఎదుర్కోవడానికి ప్రపంచంలోనే మొదటి సార్వత్రిక ఒప్పందంగా గుర్తింపు పొందింది.)

జ: వియత్నాం రాజధాని హనోయ్

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

☛ ఎయిమ్స్, నాగ్‌పుర్‌లో 86 సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు
చివరి తేదీ: 07.01.2026.

☛ రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 550 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీలు
చివరి తేదీ: 07.01.2026.

సీనియర్ ఇంటర్ రసాయన శాస్త్రం
రసాయన గతిక శాస్త్రం

2 మార్కులు

1. రసాయన చర్యరేటు యూనిట్లు తెలపండి.

జ: చర్యరేటు ప్రమాణాలు (యూనిట్లు) = Moles/Lit × sec
= $Moles.Lit^{-1}. sec^{-1}$

2. ఒక చర్య, చర్యాక్రమాంకాన్ని నిర్వచించండి. మీ సమాధానాన్ని ఉదాహరణతో తెలపండి.

జ: చర్యాక్రమాంకం: ఒక చర్య రేటు సమీకరణంలో వివిధ గాఢత పదాల ఘాతాల మొత్తాన్ని ఆ చర్యకు చెందిన చర్యా క్రమాంకం అంటారు.

ఉదా: $N_2O_{5(వా)} \rightarrow N_2O_{4(వా)} + 12\ O_{2(వా)}$

రేటు సమీకరణం $V = K[N_2O_5]^1$

◆ చర్య క్రమాంకం = 1

◆ ఇచ్చిన చర్య ప్రథమ క్రమాంక చర్య

3. శూన్య క్రమాంక చర్యలకు రెండు ఉదాహరణలు ఇవ్వండి.

జ: 1) $2NH_{3(వా)} \xrightarrow[1130\ K]{Pt} N_{2(వా)} + 3H_{2(వా)}$

2) $2HI_{(వా)} \xrightarrow[\Delta]{gold} H_2(వా) + I_{2(వా)}$

4 మార్కులు

1. చర్య అణుత అంటే ఏమిటి? దీనికి చర్యా క్రమాంకానికి ఉన్న భేదం ఏమిటి? ద్విఅణుత, త్రిక అణుత వాయు చర్యలను తెలపండి.

జ: చర్య అణుత: "ఏక కాలంలో తాడనాలు చేసి రసాయన చర్యను జరపడానికి దోహదం చేసే ఈ ప్రాథమిక చర్యలో పాల్గొనే క్రియాజనక పరమాణువులు లేదా అయాన్లు లేదా అణువుల సంఖ్యను ఆ ప్రాథమిక చర్య అణుత అంటారు".

ఉదా: $2\ N_2O_5 \rightarrow N_2O_4 + O_2$

చర్యా విధానం: $N_2O_5 \rightarrow N_2O_4 + (O)$

$(O) + (O) \rightarrow O_2$

నిదానంగా జరిగే చర్య మాత్రమే చర్య రేటును నిర్ణయిస్తుంది. ఈ చర్యలో ఒక మోల్ N_2O_5 పాల్గొంది.

✦ కాబట్టి ఇచ్చిన చర్య అణుత = 1

✦ అణుత కేవలం పూర్ణ విలువలను కలిగి ఉంటుంది, సున్నా కాదు. కానీ చర్యక్రమాంక 0, 1, 2, 3,..... భిన్నంగా కూడా ఉంటుంది.

✦ అణుత చర్యా విధానాన్ని బట్టి నిర్ణయిస్తారు. చర్య క్రమాంకం ప్రయోగాత్మకంగా నిర్ణయిస్తారు.

ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు

ద్వి అణుత వాయు చర్య:

$2HI_{(వా)} \rightarrow H_{2(వా)} + I_{2(వా)}$

త్రిక అణుత వాయు చర్య:

$2NO_{(వా)} + O_{2(వా)} \rightarrow 2NO_{2(వా)}$

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: డాక్టర్. పి.త్రినాథ రాజ

రాజ్యాంగ ఔన్నత్యానికి రక్షణ కవచం!

భారత ప్రజాస్వామ్యానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడు ప్రధాన మూల స్తంభాలు. వాటి మధ్య సమతౌల్యత దెబ్బతిన్నప్పుడు లేదా ఒక వ్యవస్థ తన పరిధిని అతిక్రమించి వ్యవహరించినప్పుడు ప్రయోగించే శక్తిమంతమైన రాజ్యాంగ అస్త్రమే న్యాయసమీక్ష. ఇది చట్టాల రాజ్యాంగబద్ధతను పరీక్షించే ప్రక్రియ మాత్రమే కాదు. పౌరుల స్వేచ్ఛకు రక్షణ కవచం. పార్లమెంటు సార్వభౌమత్వానికి, రాజ్యాంగ ఔన్నత్యానికి మధ్య సాగే నిరంతర సంవాదంలో న్యాయసమీక్ష ఒక త్రాసు మాదిరి పనిచేస్తుంది. అధికారం నియంతృత్వంగా మారకుండా అడ్డుకుంటుంది. చట్టాని కంటే ఎవరూ అధికులు కారనే సత్యాన్ని చాటే రాజ్యాంగ నైతికతకు అద్దం పట్టే న్యాయసమీక్ష గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులు విని యోగిస్తున్న ఆ విశిష్టాధికారం అవసరాన్ని, ప్రయోజనాలను, సంబంధిత కీలక తీర్పులన్నింటినీ అర్థం చేసుకుని, గుర్తుంచుకోవాలి.



AI

జనరల్ స్టడీస్ ఇండియన్ పాలిటీ


న్యాయసమీక్షాధికారం

శాసనసభ రూపొందించే శాసనాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న పరిపాలనా విధానాలు రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అని సమీక్షించి, అవి రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే చెల్లవు అని న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వడాన్ని 'న్యాయసమీక్షాధికారం'గా పేర్కొంటారు. న్యాయస్థానం న్యాయసమీక్షాధికారాన్ని వినియోగించి ఇచ్చే తీర్పులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.


1) ఇంట్రావైర్స్: శాసనశాఖ రూపొందించిన శాసనాలు, ప్రభుత్వ పరిపాలనా విధానాలు రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా ఉంటే అవి చెల్లుబాటు అవుతాయని తీర్పు ఇవ్వడం.

2) అల్ట్రావైర్స్: శాసనశాఖ శాసనాలు, ప్రభుత్వం పరిపాలనా విధానాలు, రాజ్యాంగ వ్యతిరేకంగా ఉంటే అవి చెల్లుబాటు కావని తీర్పు ఇవ్వడం.

న్యాయసమీక్ష నేపథ్యం: జాన్ మార్షల్ ఇచ్చిన తీర్పు ద్వారా 'న్యాయసమీక్ష' భావనకు శ్రీకారం చుట్టారు. ❖ న్యాయసమీక్షాధికారం భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని 1980లో మినర్వామిల్స్ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.



జాన్ మార్షల్



శంకరీ ప్రసాద్

❖ సుప్రీంకోర్టు 1951లో తొలిసారిగా శంకరీప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో న్యాయసమీక్షాధికారాన్ని వినియోగించింది.

న్యాయసమీక్ష - సుప్రీంకోర్టు కీలక తీర్పులు



సజ్జన్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ కేసు (1964): ఈ కేసులో రాజస్థాన్‌కి సంబంధించిన 'భూసంస్కరణల చట్టాన్ని' 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి పార్లమెంటు రూపొందించిన 17వ రాజ్యాంగ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేసింది. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

గోలక్‌నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసు (1967): ఆర్టికల్ 368 ప్రకారం పార్లమెంటు జరిపే రాజ్యాంగసవరణ కూడా ఆర్టికల్ 13(2)లో పేర్కొన్న 'చట్టం' అనే పదం పరిధిలోకి వస్తుంది. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఏదైనా చట్టం చేస్తే అది చెల్లదని, రాజ్యాంగసవరణ ద్వారా ప్రాథమికహక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది.

కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు (1973): గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 1971లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగ సవరణపై అపరిమితమైన అధికారాలు లభించాయి. ఆర్టికల్ 13లో ఉన్న అంశాలు ఆర్టికల్ 368కి వర్తించకుండా, రాజ్యాంగ సవరణను న్యాయసమీక్ష పరిధిలోకి రాకుండా చేశారు. ★ ఈ కేసులో జస్టిస్ ఎస్.ఎం.సిక్రీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలగకుండా ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని పేర్కొంది. కేశవానంద భారతి కేసును 'రాజ్యాంగ మౌలికస్వరూప సిద్ధాంతం కేసు'గా పేర్కొంటారు. ఇందులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని చేసి రెండు అంశాలను ఆర్టికల్ 368కి చేర్చారు. అవి- 1) ఆర్టికల్ 368(4) ప్రకారం రాజ్యాంగ సవరణలను న్యాయస్థానాల్లో సవాలు చేయకూడదు. 2) ఆర్టికల్ 368 (5) ప్రకారం పార్లమెంటు రాజ్యాంగ సవరణ అధికారంపై ఎలాంటి పరిమితులు ఉండకూడదు.



మినర్వామిల్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1980): ఈ కేసులో సుప్రీం కోర్టు 'న్యాయసమీక్ష' రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని, 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆర్టికల్ 368కి చేర్చిన ఆర్టికల్స్ 368(4), 368(5)లు చెల్లవని పేర్కొంది.

కామన్‌కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (2017): 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాల రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ 'కామన్‌కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంను ఆశ్రయించింది. ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలు కూడా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తాయని, రాజ్యాంగ మౌలిక స్వరూపంలో న్యాయసమీక్ష అంతర్భాగమని పేర్కొంది.

న్యాయసమీక్షాధికారం-ప్రాముఖ్యత

✦ రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడటం. ✦ పరిపాలనాపరమైన సమాఖ్య సమతౌల్యతను రక్షించడం. ✦ శాసన, కార్యనిర్వాహక శాఖల పనితీరును నియంత్రించడం. ✦ పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడం. ✦ న్యాయశాఖ స్వయం ప్రతిపత్తిని కాపాడటం.

న్యాయసమీక్ష పరిధిలోకి వచ్చే అంశాలు

● ఆర్టికల్ 13 ప్రకారం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలు. ● ఆర్టికల్ 246 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాసన పరిధి. ● ఆర్టికల్ 248 ప్రకారం అవశిష్టాధికారాలు. ● ఆర్టికల్ 372 ప్రకారం రాజ్యాంగం అమల్లోకి రాకముందు రూపొందించిన చట్టాలు. ● 7వ షెడ్యూల్‌లో పేర్కొన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న అధికారాల విభజన. ● ఆర్టికల్ 256, 257 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం. జారీ చేసే పరిపాలనాపరమైన ఆదేశాలు.

న్యాయసమీక్షకు అవకాశం లేని అంశాలు

✤ రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న జీతభత్యాలు. ✤ తొమ్మిదో షెడ్యూల్‌లో పొందుపరిచిన భూసంస్కరణలు, కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రిజర్వేషన్లు. ✤ నాలుగో షెడ్యూల్ ప్రకారం రాజ్యసభలో రాష్ట్రాలకు కల్పిస్తున్న ప్రాతినిధ్యం. ✤ ఆర్టికల్ 53 ప్రకారం దేశ పరిపాలన రాష్ట్రపతి పేరు మీదుగా నిర్వహించడం. ✤ ఆర్టికల్ 74(1) మేరకు ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి రాష్ట్రపతికి ఇచ్చే సలహా, సిఫార్సులు. ✤ ఆర్టికల్ 105ను అనుసరించి పార్లమెంటు సభ్యులకు, పార్లమెంటు ఉభయ సభలకు కల్పించిన ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు. ✤ ఆర్టికల్ 122 పేర్కొంటున్న పార్లమెంటులో జరిగే కార్యక్రమాలు, చర్చలు. ✤ ఆర్టికల్ 166 వివరించిన రాష్ట్రాల పరిపాలన గవర్నర్ల పేరు మీదుగా నిర్వహించే అంశాలు. ✤ రాష్ట్రాల శాసనసభలకు, శాసనసభ్యులకు ఆర్టికల్ 194 కల్పించిన ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు. ✤ ఆర్టికల్ 212 మేరకు రాష్ట్రాల శాసనసభల్లో జరిగే కార్యక్రమాలు, చర్చలు. ✤ ఆర్టికల్ 163(1) అనుసరించి ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రిమండలి రాష్ట్ర పరిపాలనకు సంబంధించి గవర్నర్‌కు ఇచ్చే సలహాలు, సిఫార్సులు. ✤ ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లకు కల్పించిన ప్రత్యేక రక్షణలు, మినహాయింపులు.

రచయిత: బంగారు సత్యనారాయణ

ధాన్యాల్లో థయామిన్.. ఆకుకూరల్లో నియాసిన్!

జనరల్ స్టడీస్-బయాలజీ


మానవ శరీరానికి కావాల్సిన సూక్ష్మపోషకాల్లో ముఖ్యమైనవి విటమిన్లు. జీవక్రియలు సరిగా సాగడానికి, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ఇవి తగిన మోతాదులో అవసరం. శరీరానికి పిండిపదార్థాలు, కొవ్వులు శక్తినిస్తే, ఆ శక్తి వినియోగం పద్ధతిగా జరగడానికి విటమిన్లు దోహదపడతాయి. కణాల రక్షణ, కంటి చూపు, జ్ఞాపకశక్తి, రక్తం గడ్డ కట్టడం, ఎముకల దృఢత్వం తదితర ఎన్నో రకాల ప్రయోజనాలను విటమిన్లు అందిస్తాయి. అందుకే ఆ సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండే పాలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, మాంసం మొదలైనవన్నీ ఆహారంలో భాగంగా ఉండాలి. సమతుల ఆహారంలో అత్యంత ప్రధానమైన వివిధ రకాల విటమిన్లు, వాటి ప్రయోజనాలు, లభించే ఆహారపదార్థాలు, అవి లోపిస్తే వచ్చే వ్యాధులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. విటమిన్ల రసాయనిక నామాలు, వాడుక భాషలో వాటికి ఉన్న పేర్లనూ గుర్తుంచుకోవాలి.



విటమిన్‌లు

1. కింది వాటిలో విటమిన్‌లకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) విటమిన్‌లు సూక్ష్మపోషకాలకు ఉదాహరణ.
బి) ఇవి ఎలాంటి శక్తిని ఇవ్వవు.
సి) ఇవి ఎంజైముల్లో భాగంగా ఉంటాయి.
డి) జంతుకణాలు విటమిన్‌లను తయారు చేసుకోలేవు.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) సి, డి 4) ఎ, డి


2. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
ఎ) ఫంక్ అనే శాస్త్రవేత్తను 'విటమిన్‌ల శాస్త్ర పితామహుడు' అంటారు.
బి) విటమిన్ A, C Eలు యాంటీ ఆక్సిడెంట్‌లుగా పనిచేస్తాయి.



1) ఎ సరైంది, బి సరికాదు.
2) ఎ సరికాదు, బి సరైంది.
3) ఎ, బి సరైనవి.
4) ఎ, బి సరికావు.

3. విటమిన్లపై పరిశోధన చేసిన కాసిమర్ ఫంక్ అనే శాస్త్రవేత్తకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) విటమిన్‌లకు పేరుపెట్టిన శాస్త్రవేత్త ఫంక్.
బి) విటమిన్‌లను వర్గీకరించిన శాస్త్రవేత్త ఫంక్.
సి) మొదటిసారిగా B1 విటమిన్‌ను పరిశుద్ధ స్థితిలో వేరు చేశారు.
1) ఎ, సి 2) ఎ, బి, సి 3) సి 4) ఎ, బి

4. కింది వాక్యాలను పరిశీలించి, సరైనవి గుర్తించండి.
ఎ) విటమిన్‌లు మన శరీరంలో వివిధ జీవక్రియలకు తోడ్పడతాయి.




బి) మొలకెత్తే గింజల్లో విటమిన్‌లు ఎక్కువగా ఉంటాయి.
సి) కాలేయం, మూత్రపిండం లాంటివాటిలో విటమిన్‌లు నిల్వ ఉంటాయి.
డి) మానవ శరీరం విటమిన్ - C, B12, K లను తయారు చేసుకుంటుంది.
1) ఎ 2) ఎ, బి, సి 3) సి, డి 4) డి

5. కింది వాటిని జతపరచండి.

ఎ) B, C విటమిన్‌లు	1) కొవ్వులో కరిగేవి
బి) A, D విటమిన్‌లు	2) పేగులోని బ్యాక్టీరియాలు తయారుచేస్తాయి.
సి) B12, K విటమిన్‌లు	3) కాలేయంలో నిల్వ ఉంటాయి.
డి) A, D, E, K	4) నీటిలో కరిగేవి విటమిన్‌లు

1) ఎ-2, బి-3, సి-4, డి-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-3, సి-2, డి-4
4) ఎ-3, బి-2, సి-1, డి-4

6. కింది వాటిలో సరికాని వాటిని గుర్తించండి.
ఎ) ఆహారం ద్వారా ఎక్కువగా తీసుకునే విటమిన్ B, C లు మూత్రం ద్వారా విసర్జితమవుతాయి.
బి) నీటిలో కరిగే విటమిన్‌లకు ఉదాహరణ B, C.
సి) విటమిన్ - C కాలేయంలో నిల్వ ఉంటుంది.
డి) విటమిన్ - B12 కాలేయంలో నిల్వ ఉంటుంది.
ఇ) పాలలో అధికంగా ఉండే విటమిన్ - C.



1) సి, ఇ 2) ఎ, బి 3) బి, డి 4) ఏదీకాదు

7. కింది వాటిని జతపరచండి.

B – విటమిన్‌లు	రసాయనిక నామాలు
ఎ) B1	1) సైనకోబాలమిన్
బి) B2	2) థయామిన్
సి) B3	3) రైబోఫ్లావిన్
డి) B5	4) నియాసిన్
ఇ) B7	5) బయోటిన్
ఎఫ్) B9	6) పాంటోథెనిక్ ఆమ్లం
జి) B12	7) ఫోలిక్ ఆమ్లం

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-6, ఎఫ్-7, జి-5
2) ఎ-2, బి-3, సి-4, డి-6, ఇ-5, ఎఫ్-7, జి-1
3) ఎ-7, బి-4, సి-3, డి-1, ఇ-5, ఎఫ్-6, జి-2
4) ఎ-1, బి-3, సి-2, డి-4, ఇ-5, ఎఫ్-6, జి-7

8. B1 విటమిన్‌కు సంబంధించి కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) దీని రసాయనిక నామం - థయామిన్
బి) ఈ విటమిన్ లోపంతో కలిగే వ్యాధి - బెరి బెరి
సి) బెరి బెరి వ్యాధిని తడి బెరి బెరి, పొడి బెరి బెరి, చిన్న పిల్లల్లో కలిగే బెరిబెరి అనే రకాలుగా విభజించారు.
డి) ఈ విటమిన్ లోపంతో పక్షుల్లో పాలిన్యూరైటిస్ అనే వ్యాధి కలుగుతుంది.
ఇ) B1 విటమిన్ అధికంగా పూర్తి గోధుమలతో చేసిన బ్రెడ్‌లో ఉంటుంది.
1) బి, సి, డి 2) సి, డి, బి
3) ఎ, బి, సి, డి, ఇ 4) ఎ, బి

9. కింది వాటిని జతపరచండి.

విటమిన్	మారు పేరు
ఎ) థయామిన్	1) ఎర్రరక్తకణాల అభివృద్ధి కారకం
బి) రైబోఫ్లావిన్	2) యాంటీపెల్లగ్రా కారకం
సి) నియాసిన్	3) యాంటీకెలోసిస్ కారకం
డి) పైరిడాక్సిన్	4) యాంటీడెర్మటైటిస్ కారకం
ఇ) సైనకోబాలమిన్	5) యాంటీ బెరి బెరి కారకం

1) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
3) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5
4) ఎ-3, బి-1, సి-2, డి-4, ఇ-5

10. కింది వాటిలో రైబోఫ్లావిన్ విటమిన్ లోపం వల్ల కలగని వ్యాధులు?
ఎ) కిలోసిస్ బి) గ్లాసైటిస్
సి) డెర్మటైటిస్ డి) సెబోరిక్ డెర్మటైటిస్
ఇ) రక్తహీనత
1) ఎ, బి, సి 2) సి, డి, ఇ
3) బి, సి 4) సి, ఇ

11. విటమిన్–B2ను ఏ ఇతర పేర్లతో పిలుస్తారు?
ఎ) లాక్టోఫ్లావిన్ బి) ఓవోఫ్లావిన్
సి) హెపటోఫ్లావిన్ డి) విటమిన్ - G
1) ఎ 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) ఎ, బి

12. కింది వాటిని జతపరచండి.

విటమిన్లు	లభించే పదార్థాలు
ఎ) థయామిన్	1) పాలు
బి) రైబోఫ్లావిన్	2) ధాన్యాలు
సి) నియాసిన్	3) పాలు, గుడ్డు, మాంసం
డి) సైనకోబాలమిన్	4) ఆకుకూరలు, బఠాని, టమాటా
ఇ) ఫోలిక్ ఆమ్లం	5) పాలకూర, క్యాబేజి

1) ఎ-5, బి-4, సి-3, డి-2, ఇ-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
3) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5
4) ఎ-4, బి-2, సి-3, డి-5, ఇ-1

13. B–3 విటమిన్ గురించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) దీని రసాయనిక నామం నియాసిన్.
బి) దీని లోపం వల్ల కలిగే వ్యాధి పెల్లగ్రా.
సి) ఇది ధాన్యాలు, ఆకుకూరలు, బఠానీ లాంటి వాటిలో ఉంటుంది.
డి) ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని భావిస్తున్నారు.
1) ఎ, సి 2) బి, డి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

14. పైరిడాక్సిన్ విటమిన్ లోపంతో ఏ రకమైన వ్యాధులు, శారీరక ఇబ్బందులు కలుగుతాయి?
ఎ) డెర్మటైటిస్ బి) ఎనీమియా
సి) నాడీ కణాల క్షీణత డి) డయేరియా
1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) బి, డి 4) ఏ ఇబ్బందులు కలగవు

15. కింది జతల్లో తప్పుగా జతపరచిన వాటిని గుర్తించండి.
ఎ) థయామిన్ లోపం వల్ల - పక్షుల్లో పాలిన్యూ రైటిస్ వ్యాధి
బి) నియాసిన్ లోపం వల్ల - కుక్కల్లో నల్ల నాలుక వ్యాధి



సి) విటమిన్ B12 లోపం వల్ల - స్కర్వీ వ్యాధి కలుగుతుంది.
డి) రైబోఫ్లావిన్ లోపం వల్ల - పెరి సేషియస్ ఎనీమియా కలుగుతుంది.
1) ఎ, డి 2) బి, సి
3) సి, డి 4) ఎ, సి

16. కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) కీలోసిస్ వ్యాధిలో నోటి మూలలు పగులుతాయి.
బి) గ్లాసైటిస్ వ్యాధిలో నాలుకపై పొక్కులు వస్తాయి.
సి) పెల్లగ్రా వ్యాధిని - 3D వ్యాధి అంటారు.
డి) పైరిడాక్సిన్ లోపం కార్పెల్ టన్నెల్ సిండ్రోమ్ వస్తుంది.
1) ఎ, బి, సి, డి 2) బి, సి
3) సి, డి 4) ఎ, డి

17. విటమిన్ – B12కు సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) దీని రసాయనిక నామం సైనకోబాలమిన్ లేదా మిథైల్ కోబాలమిన్
బి) ఇది శాఖాహారం నుంచి మాత్రమే మనకు లభ్యమవుతుంది.
సి) దీని లోపం వల్ల పెరినేషియస్ ఎనీమియా అనే వ్యాధి కలుగుతుంది.
డి) ఇది తెల్ల రక్తకణాలు, రక్తఫలకికల ఉత్పత్తిని పెంచుతుంది.
1) ఎ, సి 2) బి, డి
3) సి, డి 4) ఎ, డి

18. పాంటోథెనిక్ ఆమ్లాలను ఏ పేరుతో పిలుస్తారు?
ఎ) యాంటీస్ట్రెస్ విటమిన్ బి) ఈస్ట్ కారకం
సి) యాంటీ గ్రేయింగ్ ఆఫ్ హెయిర్ కారకం
1) ఎ 2) బి
3) సి 4) ఎ, బి, సి

19. విటమిన్‌లు అత్యధికంగా లభించే ఆహార పదార్థాలను జతపరచండి.

ఎ) థయామిన్	1) పాలు, గుడ్డు, మాంసం
బి) సైనకోబాలమిన్	2) ధాన్యాల పైపొర
సి) రైబోఫ్లావిన్	3) పాలు
డి) విటమిన్ - సి	4) క్యారెట్
ఇ) విటమిన్ - ఎ	5) ఉసిరి

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-2, బి-3, సి-1, డి-4, ఇ-5
3) ఎ-2, బి-1, సి-3, డి-5, ఇ-4
4) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4

20. కింది వాటిలో సరైన వాక్యాలను ఎన్నుకోండి.
ఎ) విటమిన్ - B12 ఎర్రరక్త కణాల అభివృద్ధికి అవసరం.
బి) కోబాల్ట్ అంతర్భాగంగా ఉండే విటమిన్ - B12.
సి) పాంటోథెనిక్ ఆమ్ల లోపం వల్ల అరికాళ్లలో మంటలు, కండరాల నొప్పులు కలుగుతాయి.
డి) విటమిన్ - B12ను పేగులోని బ్యాక్టీరియా తయారు చేస్తుంది.
1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) బి, డి
4) ఎ, సి, డి



రచయిత: డాక్టర్ బి.నరేష్

సమాధానాలు

1-1; 2-3; 3-2; 4-4; 5-2; 6-1; 7-2; 8-3; 9-1; 10-4; 11-2; 12-3; 13-4; 14-1; 15-3; 16-1; 17-2; 18-4; 19-3; 20-1.

ఆ ఉష్ణోగ్రత వద్ద.. అన్ని అణువులు నిశ్చలం!

వేడి వస్తువుల నుంచి చల్లని వస్తువులకు ప్రవహించే శక్తి రూపాన్ని ఉష్ణం అంటారు. దీన్ని Q అనే అక్షరంతో సూచిస్తారు. పదార్థాల వెచ్చదనం లేదా చల్లదనం స్థాయిని తెలిపేది ఉష్ణోగ్రత. దీన్ని Tతో సూచిస్తారు. ఘన, ద్రవ, వాయు పదార్థాలు ఉష్ణాన్ని గ్రహించి వ్యాకోచిస్తాయి. ఉష్ణోగ్రతను కొలవడానికి వివిధ రకాల ఉష్ణమాపకాలు, వివిధ కొలమానాలు ఉన్నప్పటికీ వాస్తవ జీవితంలో ఎక్కువగా సెల్సియస్ స్కేలు, ఫారెన్‌హీట్ స్కేలును ఉపయోగిస్తారు. ఉష్ణం - ఉష్ణోగ్రతకు సంబంధించి పోటీపరీక్షార్థులు బాయిల్, చార్లెస్ నియమాలు, వాయువుల గతి సిద్ధాంతం తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఉష్ణం - ఉష్ణోగ్రత

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

వాయువుల గతి సిద్ధాంతం

వాయువుల ధర్మాలను అర్థం చేసుకోడానికి సెల్సియస్, బోల్ట్జ్‌మన్, మాక్స్‌వెల్ అనే శాస్త్రవేత్తలు గతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

ప్రతిపాదనలు: వాయువులు అతిచిన్న కణాలైన అణువులను కలిగి ఉంటాయి.

- ఇవి అధిక మొత్తంలో ఉంటాయి.
- ఒక నిర్దిష్ట వాయువులో అణువులన్నీ ఒకేలా ఉంటాయి. వాటి ద్రవ్యరాశి, ఘనపరిమాణం మొదలైన అంశాలు ఒకే రకంగా ఉంటాయి.
- అణువులు సరళరేఖల వెంట వేర్వేరు వేగాలతో వేర్వేరు దిశల్లో యాదృచ్ఛికంగా కదులుతుంటాయి.
- చలనంలో ఉన్న అణువులు పక్క అణువులతో, పాత్ర గోడలతో నిరంతరం తాడనాలు (ఢీ కొట్టడం) చేస్తుంటాయి.
- ఇతర అణువులతో తాడనం చేసే ప్రయత్నంలో ఒక అణువు ప్రయాణించిన దూరాన్ని స్వేచ్ఛా పథం అంటారు.

అణువుల చలనం - ఉష్ణోగ్రత

వాయువుల గతి సిద్ధాంతం ఫలితాలను పరిశీలిస్తే వాయువు అణువుల సరాసరి గతిశక్తి పరమ ఉష్ణోగ్రతకు అనులోమానుపాతంలో ఉంటుంది. అంటే ఉష్ణోగ్రత పెరిగితే వాయు అణువుల గతిశక్తి పెరుగుతుంది, ఉష్ణోగ్రత తగ్గితే తగ్గుతుంది.

పరమ ఉష్ణోగ్రత: వాయువు లేదా ఇతర పదార్థాలు చేరుకోగలిగే అత్యల్ప ఉష్ణోగ్రతను పరమ ఉష్ణోగ్రత అంటారు. ఈ ఉష్ణోగ్రత వద్ద పదార్థంలోని అన్ని అణువులు నిశ్చలంగా ఉంటాయి.

0 (సున్నా) K = $-273.15^\circ C$ (లేదా) $-459.67^\circ F$

బాయిల్ నియమం


ఈ నియమాన్ని రాబర్ట్ బాయిల్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు.

- ఇది వాయువుల పీడనానికి, ఘనపరిమాణానికి మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేస్తుంది.
- స్థిర ఉష్ణోగ్రత వద్ద నియమిత ద్రవ్యరాశి ఉన్న వాయువు పీడనం (P), దాని ఘనపరిమాణం (V)కి విలోమానుపాతంలో ఉంటుంది.
- స్థిర ఉష్ణోగ్రత వద్ద $\Rightarrow P \propto \frac{1}{V}$

$\Rightarrow P = K\frac{1}{V}$, (K = స్థిరాంకం)

లేదా PV = స్థిరాంకం, లేదా PV = స్థిరం


- సాధారణంగా వాయువుల్లో పీడనం (P), ఘనపరిమాణం (V)ల మధ్య గ్రాఫ్ గీస్తే పక్క పటంలో మాదిరిగా విలోమానుపాతంలో ఉంటుంది.



- స్థిర ఉష్ణోగ్రత వద్ద నిర్దిష్ట ద్రవ్యరాశి ఉన్న వాయువు ఆక్రమించే ఘనపరిమాణం, పీడనాల లబ్ధం ఎల్లప్పుడు స్థిరంగా ఉంటుంది. ఈ దృగ్విషయాన్ని కూడా బాయిల్ నియమం అంటారు.
- బాయిల్ నియమానికి సంబంధించిన సమస్యలను సాధించేటప్పుడు, PV = స్థిరాంకం (లేదా) $P_1V_1 = P_2V_2$ సూత్రాలను ఉపయోగిస్తారు.

చార్లెస్ నియమం

వాయువు ఘనపరిమాణంపై ఉష్ణోగ్రత ప్రభావాన్ని చార్లెస్ నియమం తెలియజేస్తుంది. 1787లో జాక్వెస్ చార్లెస్ అనే శాస్త్రవేత్త ఈ నియమాన్ని ప్రతిపాదించారు.



- ఒక ఖాళీ సీసాను తీసుకుని, దాని మూతికి ఒక రబ్బరు బెలూన్‌ను తొడిగి, దారంతో గట్టిగా బిగించాలి. సీసాను వేడినీరు ఉన్న ఒక పాత్రలో ఉంచి, అవసరం అనుకుంటే మరికొంతసేపు వేడి చేయాలి. వేడి నీటి నుంచి ఉష్ణాన్ని గ్రహించిన సీసాలోని గాలి వ్యాకోచం చెంది కొంత సమయం తర్వాత సీసాలో నుంచి బెలూన్‌కు చేరడంతో అది ఉబ్బుతుంది. దీని ఆధారంగా ఉష్ణోగ్రత పెరిగితే వాయువుల ఘనపరిమాణం పెరుగుతుందని గ్రహించవచ్చు.

నియమం: స్థిర పీడనం వద్ద నిర్దిష్ట ద్రవ్యరాశి ఉన్న వాయువు ఘనపరిమాణం (V) ఉష్ణోగ్రత పెరుగుదలకు (T) అనులోమానుపాతంలో ఉంటుంది.

- ఈ పెరుగుదల ఉష్ణోగ్రత ప్రతి డిగ్రీ పెరుగుదలకు $0^\circ C$ వద్ద ఉన్న ఘనపరిమాణంలో $\frac{1}{273}$ వ వంతు పెరుగుతుంది.

$V \propto T$ (లేదా) $\frac{V}{T}$ = స్థిరం

$$\frac{V_1}{T_1} = \frac{V_2}{T_2}$$

గెలుసాక్ నియమం

ఈ నియమం ప్రకారం స్థిర ఘనపరిమాణం కలిగిన ఒక వాయువు పీడనం (P), దాని పరమ ఉష్ణోగ్రత (T)కు అనులోమానుపాతంలో ఉంటుంది.

$P \propto T$

$\frac{P}{T}$ = స్థిరాంకం

కెలోరిమితి

ఉష్ణం కొలతలకు సంబంధించిన భౌతికశాస్త్ర విభాగాన్ని కెలోరిమితి అంటారు. దీని ద్వారా ఉష్ణం, ఉష్ణ సంబంధ రాశుల్ని కొలవచ్చు.


ఉష్ణ సమతాస్థితి

ఉష్ణం వేడి వస్తువుల నుంచి చల్లని వస్తువులకు ప్రవహించేటప్పుడు ఆ రెండింటి ఉష్ణోగ్రత సమానమయ్యే వరకు ప్రవహిస్తుంది. ఎప్పుడైతే రెండు వస్తువుల ఉష్ణోగ్రతలు సమానమవుతాయో అప్పుడు ఉష్ణ సమతాస్థితి నెలకొంటుంది.

కెలోరిమీటర్


ఉష్ణరాశులను కొలవడానికి వినియోగించే పరికరాన్నే కెలోరిమీటర్ అంటారు. ఇందులో అధిక నునుపు కలిగిన ఒక స్తూపాకార రాగి పాత్ర ఉంటుంది. పాత్రలోని వస్తువులను, నీటిని కలపడానికి ఒక కడ్డీ ఉంటుంది. ఉష్ణోగ్రతలను కొలిచేందుకు ఒక థర్మామీటరు ఉంటుంది.

W = చెక్కపెట్టె
F = ఉష్ణఅవాహక పదార్థం
C = రాగి పాత్ర
L = మూత
T = ఉష్ణమాపకం
S = కదిపే కడ్డీ
H = పట్టకారు



- రాగి పాత్ర నుంచి ఉష్ణ నష్టం జరగకుండా దాన్ని ఒక చెక్కపెట్టెలో పొట్టు లేదా దూది మధ్యలో పెట్టి, చెక్కపెట్టెపై ఒక చెక్కమూత ఉంచుతారు.
- ఉష్ణ నష్టం నివారించడానికి అన్ని ఏర్పాట్లు ఉండటంతో ఉష్ణ సంబంధిత ప్రయోగాలకు దీన్ని ఉపయోగించవచ్చు.
- సాధారణంగా కెలోరిమీటర్‌ను ఉపయోగిస్తూ మిశ్రమాల పద్ధతిలో ఘనపదార్థాల విశిష్టోష్ణం కనుక్కుంటారు.

కెలోరిమితి ప్రాథమిక సూత్రం: వేడి వస్తువులు కోల్పోయిన ఉష్ణం = చల్లని వస్తువులు గ్రహించిన ఉష్ణం



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

883 Word of the Day

Declivity

Telugu meaning: తగ్గుదల, ఏటవాలు

English meaning: The word declivity (డిక్లివిటీ) is a noun that refers to a downward slope or descending surface of land.

Synonyms: Slope, Descent; ***Antonyms:*** Acclivity, Ascent

Usage: **1.** The hikers slowed their pace as they navigated the steep declivity, careful not to lose their footing.

2. Rainwater flowed rapidly down the declivity, carving small channels into the loose soil.

Current Affairs



Venezuela's executive vice president Delcy Rodríguez has emerged as the country's acting President after President Nicolás Maduro was captured during a US military operation.

✦ Rodríguez is a Caracas native born on May 18, 1969. She is the daughter of Jorge Antonio Rodríguez, a left-wing guerrilla fighter who founded the revolutionary Liga Socialista party in the 1970s.



India has become the world's largest producer of rice, surpassing China. This was stated by Union Agriculture Minister Shivraj Singh Chouhan in New Delhi. He said India's rice production has reached 150.18 million tonnes, compared to China's 145.28 million tonnes.

Union Minister for Chemicals and Fertilizers JP Nadda has inaugurated the e-Bill System that will enable the government to process the fertilizer subsidies amounting to approximately 2 lakh crore rupees. The Minister said this online system would play a significant role in strengthening transparent, efficient and technology-driven governance.

Bulgaria joined the eurozone and adopted the euro as its official currency, becoming the 21st member of the euro area. To ensure a smooth transition, the Bulgarian Lev will remain in circulation alongside the euro throughout January. From February 1, the euro will become the country's sole legal tender.

The Chinese People's Liberation Army (PLA) Navy has officially commissioned a new Type 052D guided-missile destroyer, featuring upgraded radar, weapon systems, and network architecture designed to enhance air defense, sea strike, and task force command capabilities.


✦ The new destroyer, named Loudi and bearing hull number 176, was officially put into service.

For more Current Affairs: Scan QR code

గ్రెగర్ జోహాన్ మెండల్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ప్రపంచ ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త, క్రైస్తవ మత గురువు. సంతానానికి వంశానుగతంగా శారీరక లక్షణాలు ఎలా సంక్రమిస్తాయనే దానిపై మొదటిసారిగా ప్రయోగాలు నిర్వహించింది ఈయనే. వంశపారంపర్య నియమాలను ప్రతిపాదించారు కూడా. తన పరిశోధనల కోసం ముందుగా ఆయన మొక్కలనే ఎంచుకున్నారు. ముఖ్యంగా బఠానీ మొక్కలపై ప్రయోగాల ద్వారా అనువంశిక సూత్రాలను (Mendel's laws of inheritance) కనుక్కున్నారు. వారసత్వ లక్షణాలు ఒక తరం నుంచి మరో తరానికి ఎలా సంక్రమిస్తాయో ఇవి వివరించాయి. జన్యుశాస్త్ర అభివృద్ధిలో ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. అందుకే మెండల్‌ను 'జన్యుశాస్త్ర పితామహుడిగా (Father of Genetics)' పేర్కొంటారు. జనవరి 6న మెండల్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం - సన్యాసి జీవితం

జోహాన్ మెండల్ 1822, జులై 20న నాటి ఆస్ట్రియాలో అంతర్భాగమైన మొరాబియాలో (ప్రస్తుతం చెకోస్లొవేకియాలో ఉంది) జన్మించారు. ప్రాథమిక విద్యను స్థానిక పాఠశాలలో పూర్తి చేశారు. సెకండరీ విద్య కోసం 1834లో ట్రోప్పా (ప్రస్తుతం చెక్ రిపబ్లిక్‌లో ఉంది)లోని జిమ్నాసియంకు వెళ్లారు.

- మెండల్ 1843లో బోర్నోలోని సెయింట్ థామస్ అగస్టీనియన్ అబ్బేలో చేరారు. అక్కడే గ్రెగర్ అనే పేరు స్వీకరించి, సన్యాసి జీవితంలో స్థిరపడ్డారు. ఆయన వేదాంతం, సైన్స్, సాహిత్యం నేర్చుకున్నారు. జన్యుశాస్త్ర రంగంలో పరిశోధనలకు అక్కడే పునాది పడింది. చదువు పూర్తయ్యాక మెండల్ ఆ మఠంలోనే ఉపాధ్యాయుడిగా చేరారు. తోట నిర్వహణ సహా వివిధ బాధ్యతలు స్వీకరించారు.

మెండల్ బఠానీ మొక్కలపై చేసిన ప్రయోగాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు



దేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయి. రుణం లేని ఆర్థిక వనరులను అందించడం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ఉపాధి అవకాశాల పెరుగుదల లాంటివి ఎఫ్‌డీఐల వల్ల కలిగే ప్రయోజనాలు. అందుకే భారత ప్రభుత్వం పన్నులు, ప్రత్యేక పెట్టుబడి ప్రోత్సాహకాల ద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. విదేశీ మూలధనం - ఆవశ్యకత, రకాలు; ఎఫ్‌డీఐలను అనుమతించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.

విదేశీ మూలధనం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పారిశ్రామికీకరణ వేగంగా జరగాలంటే తొలిదశలో యంత్రాలు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ముడిపదార్థాలు మొదలైనవి దిగుమతి చేసుకోవాలి. ఇందుకోసం విదేశీ మారక ద్రవ్యం కావాలి.

రకాలు

విదేశీ మూలధనం ఆరు రకాలు. అవి:

1. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
2. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు
3. భాగస్వామ్యం
4. ప్రభుత్వాల మధ్య రుణాలు
5. అంతర్జాతీయ విత్తసంస్థల నుంచి రుణాలు
6. విదేశీ బ్యాంకుల నుంచి రుణాలు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్

విదేశీ పెట్టుబడి అభివృద్ధి మండలి (ఎఫ్ఐపీబీ) స్థానంలో 2017, జూన్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్‌ను నెలకొల్పారు.

అనుమతి విధానాలు

భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించేందుకు ప్రభుత్వం రెండు విధానాలను అనుసరిస్తుంది. అవి: స్వయంచాలక మార్గం, ఆమోద మార్గం.

1991 నూతన పారిశ్రామిక విధానం - విదేశీ పెట్టుబడి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2.0 మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Graduate Apprentice Posts

EdCIL (India) Limited, New Delhi, is inviting online applications for Graduate Apprentice posts. The total no. of posts is 15. Eligible candidates can apply online before 19 January 2026.

Research Associate Posts

Banaras Hindu University (BHU), Varanasi, is inviting applications for Research Associate positions on a temporary basis. The last date for online applications is 24 January 2026.

Internship Posts

The National Dope Testing Laboratory (NDTL) is inviting applications to fill internship posts. The total no. of posts is 10. Eligible candidates can apply online before 7 January 2026.

Did You Apply..?

Today (January 6) is the last date for the following Jobs

☛ 100 Senior Resident posts at AIIMS Raipur.
Eligibility: Diploma/MD/MS/DNB.

☛ 93 Jobs at Reserve Bank of India.
Eligibility: BBA, BSc, B.Tech/BE, LLB, CA, LLM, MSc.

☛ 44 Junior Engineer posts in MECON Limited.
Eligibility: Diploma, BBA/Degree.

☛ 17 Assistant Professor Jobs at IIIT Pune.
Eligibility: M.Tech/PhD (Humanities).

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Circles - II

1. The radius of two circles is 7 cm and 5 cm respectively. The distance between the centres of the circle is 14 cm. What is the ratio of the length of direct common tangent to the length of the transverse common tangent?
A) $\sqrt{13} : 4\sqrt{3}$ B) $\sqrt{3} : \sqrt{13}$
C) $4\sqrt{3} : \sqrt{13}$ D) $\sqrt{13} : \sqrt{3}$
E) $\sqrt{7} : \sqrt{3}$

2. The ratio of the areas of two circles is 36 : 25. What is the ratio of their circumferences?
A) 5 : 6 B) 6 : 5 C) 5 : 7
D) 7 : 5 E) 1 : 5

3. The radii of three concentric circles are in the ratio 2 : 3 : 5. Find the ratio of the area between the two inner circles to that between the two outer circles?
A) 5 : 16 B) 5 : 8 C) 16 : 5
D) 7 : 10 E) 11 : 7

4. The circumference of two circles are 198 meters and 154 meters respectively. What is the difference between the area of the larger circle and the smaller circle?
A) 1332 sqm B) 1223 sqm
C) 1323 sqm D) 1232 sqm
E) None of the above

5. The magnitude of the area of a circle is twelve times that of its circumference. What is the circumference of the circle?
A) $150\frac{6}{7}$ sq units B) $150\frac{2}{7}$ sq units
C) $150\frac{5}{7}$ sq units D) $150\frac{3}{7}$ sq units
E) None of the above

6. The diameter of a circular field is 168 meters. How long will it take for a man walking at a speed of 5 meters per second to complete one round?
A) 1 min 54.6 seconds
B) 1 min 45.6 seconds
C) 1 min 45 seconds
D) 1 min 44.6 seconds
E) 1 min 55.8 seconds

7. The sum of the diameter of a circle and the radius of a semi circle is 49 cm. The circumference of another circle whose radius is R cm is 50% more than the sum of circumference of the given circle and the length of the arc of the semi circle. Find the value of R.
A) $35\frac{3}{4}$ cm B) $36\frac{1}{4}$ cm
C) 36 cm D) $36\frac{3}{4}$ cm E) $35\frac{7}{9}$ cm

8. The radius of a semi circle is four times the diameter of a circle whose area is $248\frac{1}{16}\pi$ sqm. What is the perimeter of the semi circle?
A) 748 m B) 784 m C) 648 m
D) 684 m E) 891 m

9. The radii of two circles be 7 cm and 5 cm and the length of the transverse tangent be 9 cm, then the distance between the two centres is:
A) 12 cm B) 15 cm C) 16 cm
D) 14 cm E) 13 cm

10. A tangent is drawn to a circle of radius 7 cm from a point situated at a distance 12 cm from the centre of the circle. The length of the tangent will be:
A) $\sqrt{95}$ cm B) $\sqrt{193}$ cm
C) 25 cm D) 85 cm E) 19 cm

11. Find the distance of a perpendicular from centre of a circle to the chord, if the diameter of the circle is 40 cm and its chord is 32 cm.
A) 18 cm B) 36 cm C) 12 cm
D) 8 cm E) 11 cm

12. A circular pathway runs around a circular garden. If the difference between the circumference of the outer circle and the inner circle is $28\frac{2}{7}$ meters, then find the width of the pathway.
A) $4\frac{2}{3}$ m B) $4\frac{1}{3}$ m C) $4\frac{2}{7}$ m
D) $4\frac{1}{2}$ m E) $5\frac{1}{3}$ m

13. The diameters of two concentric circles are 15 cm and 12 cm. The area of the region between there is:
A) 180 sqcm B) 81π sqcm
C) 90 sqcm D) 90π sqcm
E) 81 sqcm

14. If the Circumference of a circle is equal to $1\frac{1}{2}$ times of the perimeter of a square. What is the ratio of the area of the circle to the area of the square?
A) 22 : 63 B) 63 : 20 C) 63 : 22
D) 9 : 11 E) None of the above

15. Two circles touch externally. The sum of their areas is 149π sqcm and the distance between their centres is 17 cm. The radius of the bigger circle is:
A) 6 cm B) 11 cm
C) 7 cm D) 10 cm
E) 15 cm

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert



ఏఐ తోడుగా ఈ-మెయిల్స్ ఇలా

ఉద్యోగానికీ, క్లయింట్‌తో కమ్యూనికేషన్‌కూ, బృందంతో కనెక్ట్ కావడానికీ.. ఇలా ఏ పనికైనా నేటి డిజిటల్ కార్పొరేట్ ప్రపంచంలో ఈ-మెయిల్ ఒక దివ్యాస్త్రంగా మారింది. ఇందులోని సమాచారం అపరిచితులనూ అయినవారిలా అనిపించేలా చేయాలి. మనం పంపే ఈ-మెయిల్ వృత్తి నైపుణ్యానికీ, వ్యక్తిత్వానికీ, నిబద్ధతకూ అద్దం పట్టాలి. అందువల్ల పాఠశాల విద్యార్థుల నుంచీ పరిశోధనా శాస్త్రజ్ఞుల వరకూ, తొలి దశలో ఉన్న ఉద్యోగుల నుంచీ సీఈఓ దాకా అద్భుతమైన ప్రొఫెషనల్ ఈ-మెయిల్ రాయగలగడం అత్యంత కీలక నైపుణ్యం.

చాలా మంది ఈ-మెయిల్ విషయంలో తడబడుతుంటారు. వాట్సాప్ సందేశాల తరహాలో, అసంపూర్ణ వాక్యాలతో, వ్యాకరణ దోషాలతో లేదా అమర్యాద పూర్వకంగా వీటిని పంపి, ఎన్నో మంచి అవకాశాలను చేజార్చుకుంటారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఉండటానికి కమ్యూనికేషన్‌కు మెరుగులు దిద్దాలి. దీంతో విద్యా సంబంధ (అకడమిక్) లేదా వృత్తిపరమైన (ప్రొఫెషనల్) జీవితంలో వేగంగా ముందుకు సాగవచ్చు.

ప్రొఫెషనల్‌గా..

ఒక మంచి ఈ-మెయిల్‌లో కొన్ని ప్రాథమిక భాగాలు ఉంటాయి. వీటిని సరిగ్గా పాటిస్తే సగం విజయం సాధించినట్లే.

● క్లుప్తమైన 'సబ్జెక్ట్ లైన్' ఇది చాలా ముఖ్యం. "Hi" లేదా "Important" అని కాకుండా, ఈ-మెయిల్ దేని గురించో స్పష్టంగా చెప్పాలి. ఉదాహరణ: "Request for Meeting - Research Proposal" (పరిశోధన ప్రతిపాదన గురించి సమావేశం కోసం అభ్యర్థన) లేదా "Application for the Machine Learning Engineer Position" (మెషీన్ లెర్నింగ్ ఇంజినీర్ పోస్టు కోసం దరఖాస్తు).

● సరైన సంబోధన (Salutation): ఎల్లప్పుడూ గౌరవప్రదంగా ప్రారంభించండి.

ఉదాహరణకు

1. "Dear Dr. Srinivas," (మీకు ఆ వ్యక్తి పేరు, హోదా తెలిస్తే).
2. "Dear Hiring Manager," (ఎవరో తెలియకపోతే).
3. "Respected Sir/Madam," (మరింత ఫార్మల్‌గా ఉండాలనుకుంటే).
4. "Hi" లేదా "Hey" లాంటివి స్నేహితులకు మాత్రమే పరిమితం చేయండి.

● స్పష్టమైన ముఖ్య విషయం మొదటి వాక్యంలోనే మీరు ఎందుకు రాస్తున్నారో చెప్పండి. పెద్ద విషయాన్ని చిన్న చిన్న పేరాలుగా విభజించండి. మీ భాష మర్యాద పూర్వకంగా, స్పష్టంగా ఉండాలి. అనవసర విషయాలు, ఎమోజీలు వాడకండి.

ముగింపు, సంతకం

"Sincerely," (హృదయ పూర్వకంగా), "Regards," (నమస్కారాలతో) లాంటి వాటితో ముగించండి.

1. పూర్తి పేరు, ప్రస్తుత హోదా (ఉదా: "B.Tech Student, XYZ University" లేదా "Research Scholar"), ఫోన్ నంబర్, అవసరమైతే మీ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ లింక్‌ను సంతకంలో చేర్చండి.

కృత్రిమ మేధ (ఏఐ)తో

ఈ రోజుల్లో, ప్రొఫెషనల్ ఈ-మెయిల్స్ రాయడానికి మనకు శక్తిమంతమైన ఏఐ సాధనాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గూగుల్ జెమినీ, జీమెయిల్‌లోనే అంతర్నిర్మితంగా ఉండే "Help me write" (రచనలో సహాయం) లాంటివి మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే, వీటిని కాపీ-పేస్ట్ చేయడం కాకుండా, మన ఆలోచనలను మెరుగు పరుచుకోవడానికి వాడాలి.

1. ఉద్యోగ దరఖాస్తులకు

ఉద్యోగానికి దరఖాస్తు చేసేటప్పుడు, కేవలం రెజ్యూమె జతచేసి పంపితే సరిపోదు. దానికి ఒక మంచి కవర్ లెటర్‌ను ఈ-మెయిల్ బాడీలో రాయాలి.

ఎలా వాడాలి: మీరు జెమినీని ఇలా అడగవచ్చు: 'నేను ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగానికి దరఖాస్తు చేస్తున్నాను. నా రెజ్యూమె, కవర్ లెటర్ జత చేస్తున్నాను. ఈ సంస్థపై నా ఆసక్తి, నైపుణ్యాలను వివరిస్తూ ఒక ప్రొఫెషనల్ ఈ-మెయిల్ డ్రాఫ్ట్ రాయి'

ఏఐ ఏమి చేస్తుంది: అది ఒక చక్కటి డ్రాఫ్ట్‌ను ఇస్తుంది. మీరు దాన్ని తీసుకుని, సంస్థ పేరు, మీ నైపుణ్యాల గురించి నిర్దిష్టమైన వివరాలను జోడించి, దాన్ని మీ అవసరానికి అనుగుణంగా మార్చాలి.

2. ప్రొఫెసర్లకు

పరిశోధన విద్యార్థులు ప్రొఫెసర్లకు ఈ-మెయిల్ చాలా గౌరవంగా, వారి సమయానికి విలువ ఇస్తూ రాయాలి.

ఎలా వాడాలి: జీమెయిల్‌లోని 'Help me write' బటన్ నొక్కి, "Ask my professor for a 30-minutes meeting next week to discuss my research proposal on Telugu NLP" (తెలుగు NLP పై నా పరిశోధన ప్రతిపాదన గురించి చర్చించడానికి వచ్చే వారం 30 నిమిషాల సమావేశం కోసం నా ప్రొఫెసర్‌ను అడగాలి) అని టైప్ చేయండి.

ఏఐ ఏమి చేస్తుంది: ఇది "Dear Professor [Name], I hope this email finds you well..." అంటూ ఒక మర్యాద పూర్వకమైన ఈ-మెయిల్ రూపొందిస్తుంది. ఇది మీరు సమయం అడగడమే కాకుండా, ఎందుకు కోరుతున్నారో కూడా స్పష్టం చేస్తుంది.

3. హెచ్ఆర్, కొత్త ఉద్యోగులకు

ఇంటర్వ్యూ షెడ్యూల్ చేయడం, జీతభత్యాల గురించి చర్చించడం, లేదా కొత్తగా ఉద్యోగంలో చేరినవారు మేనేజర్‌కు ప్రాజెక్ట్ అప్‌డేట్స్ ఇవ్వడం లాంటివి సున్నితమైన విషయాలు.

ఎలా వాడాలి: మీ ఈ-మెయిల్ డ్రాఫ్ట్ రాసిన తర్వాత, దాన్ని జెమినీలో పేస్ట్ చేసి, "Make this sound more professional and polite" (దీన్ని మరింత మర్యాదపూర్వకంగా, వృత్తిపరంగా మార్చు) లేదా "Shorten this email" (దీన్ని సంక్షిప్తీకరించు) అని అడగవచ్చు.

ఏఐ ఏమి చేస్తుంది: ఇది మీ భాషలోని తడబాటును, అనవసర పదాలను తొలగించి, సూటిగా, స్పష్టంగా ఉండేలా మారుస్తుంది. ఉదాహరణకు, "I want to know about salary" అనడానికి బదులుగా, "Could you please provide details regarding the compensation package for this role?" అని మార్చి, మీ వృత్తి నైపుణ్యాన్ని పెంచుతుంది.

ముఖ్య గమనిక

ఏఐ సాధనాలు అద్భుతమైనవే. కానీ అవి మీ మెదడుకు ప్రత్యామ్నాయం కావు. ఏఐ రూపొందించిన ప్రతి డ్రాఫ్ట్‌నూ ఒకటికి రెండుసార్లు చదవాలి (ప్రూఫ్ రీడింగ్). అందులో మీ వ్యక్తిగత అనుకూలీకరణలు తప్పనిసరిగా ఉండాలి. మీరు ఏ ప్రొఫెసర్‌కు రాస్తున్నారో, వారి పరిశోధన గురించి మీకు తెలిసిన ఒక చిన్న విషయాన్ని ప్రస్తావించడం లాంటివి ఏఐతో సాధ్యం కావు, మీరే రాయాలి.

చివరగా, ఈ-మెయిల్ పంపే ముందు 'అటాచ్‌మెంట్లు' (రెజ్యూమె, ప్రపోజల్) జతచేశారా లేదా సరిచూసుకోవాలి. అక్షర దోషాలు లేవని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం.

ఈ-మెయిల్ మీ మొదటి ముద్ర. దాన్ని బలంగా, సానుకూలంగా వేయండి. ఏఐ సహాయంతో మీ కమ్యూనికేషన్ నైపుణ్యాలకు సానపెట్టి, అవకాశాలను అందిపుచ్చుకోండి.



- రహ్మాన్

మెడికల్ సర్వీసెస్‌లో

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రెగ్యులర్ ప్రాతిపదికన.. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసిస్టెంట్ ప్రొఫెసర్ (క్లినికల్) - 130
● అసిస్టెంట్ ప్రొఫెసర్ (నాన్-క్లినికల్) - 16
● అసిస్టెంట్ ప్రొఫెసర్ (సూపర్ స్పెషాలిటీ) - 74

విభాగాలు: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, గైనకాలజీ, అనస్థీషియా, జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియేషన్ థెరపీ, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్.. తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ/ డీఎం/ ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 01.07.2025 నాటికి 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.68,900- 2,05,500.
ఎంపిక: విద్యార్హతలు, అనుభవం.. మొదలైన వాటితో.
దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.2000. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు రూ.1500.
ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 8 నుంచి 22 వరకు స్వీకరిస్తారు.
వెబ్‌సైట్: https://dme.ap.nic.in/

బీఎస్సీతో ఏ ఉద్యోగాలు?

మా అమ్మాయి బీఎస్సీ(బోటనీ, జియాలజీ, ఇంగ్లిష్) చేసింది. పీజీ చదవాలనే ఆసక్తి లేదు. బీఎస్సీతో ఉద్యోగాలు ఉంటాయా? - ఎం.మురళి

■ బీఎస్సీ (బోటనీ, జియాలజీ, ఇంగ్లిష్) పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వివిధ ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలు, ఆసక్తుల ఆధారంగా విభిన్న రంగాల్లో కొలువులు పొందవచ్చు.

✦ ప్రభుత్వ రంగంలో.. బోటనీ నేపథ్యంతో అటవీ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. అరణ్య సంరక్షణ అధికారి సహాయకులు, ఉద్యానవన అభివృద్ధి సిబ్బంది లాంటి ఉద్యోగాలు పొందవచ్చు. బయోడైవర్సిటీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రభుత్వ సంస్థల్లో రిసెర్చ్ అసిస్టెంట్ గానూ పని చేయవచ్చు.

✦ జియాలజీ గ్రాడ్యుయేట్లకు.. గనులు, ఖనిజాల శాఖ, జల వనరుల శాఖ, భూగర్భ జల విభాగాలలో ఉద్యోగాలు లభిస్తాయి. భూసర్వే సహాయకులు, నీటి వనరుల పరిశీలకులు, ఖనిజ పరిశోధన సహాయకులు లాంటి బాధ్యతలు నిర్వహించవచ్చు. ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించిన ప్రభుత్వ విభాగాల్లోనూ వీరి అవసరం ఉంటుంది.



✦ ఇంగ్లిష్‌తో.. విద్యాశాఖలో సమాచార, ప్రచార విభాగాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార నిర్వహణ లాంటి ఉద్యోగాలు పొందవచ్చు.

✦ డిగ్రీ అర్హత ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ పోటీ పడవచ్చు. బోధనరంగంపై ఆసక్తి ఉంటే, బీఈడీ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు.

✦ ప్రైవేటు రంగంలో బోటనీ నేపథ్యంతో..విత్తన సంస్థలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, నర్సరీలు, ఔషధ మొక్కల సాగు కేంద్రాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. పర్యావరణ సలహాదారులు, జీవ వనరుల నిర్వహణ సహాయకులుగా పనిచేయవచ్చు. జియాలజీ చదివినవారికి నిర్మాణ రంగం, భూసర్వే సంస్థలు, నీటి వనరుల నిర్వహణ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి.

డిగ్రీలో ఇంగ్లిష్‌తో ప్రైవేటు పాఠశాలలు, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కేంద్రాల్లో బోధించవచ్చు. పత్రికా సంస్థలు, ప్రచురణ సంస్థలు, సమాచార సంస్థల్లో సంపాదకుల సహాయకులుగా పని చేయవచ్చు. వివిధ సంస్థలలో సమాచార మార్పిడి, ప్రజా సంబంధాల బాధ్యతలు కూడా వీరికి అనుకూలంగా ఉంటాయి.

✦ ఉపాధి అవకాశాలు పెంచుకోవడానికి న్యూట్రిషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్, మెడిసినల్ ప్లాంట్స్, హెర్బల్ టెక్నాలజీ, ప్లాంట్ టిష్యూ కల్చర్, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అండ్ రిమోట్ సెన్సింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్, మైనింగ్ సేఫ్టీ, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, బిజినెస్ కమ్యూనికేషన్, కంటెంట్ రైటింగ్ అండ్ ఎడిటింగ్, జర్నలిజం, కెరియర్ కౌన్సెలింగ్ లాంటి రంగాల్లో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు చేయడం శ్రేయస్కరం.

సరైన దిశలో ప్రయత్నం, అవసరమైన అదనపు నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలను మరింతగా విస్తరించుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

రెడిట్ మార్కెటింగ్

సంస్థ: డిజిటల్ గురూజీ నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://tinyurl.com/mswpdnmj

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఫిఫ్టీసెవన్ నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, బ్రాండింగ్, గ్రాఫిక్ డిజైన్ స్టైపెండ్: రూ.5,000 **దరఖాస్తు గడువు:** జనవరి 28
☛ https://tinyurl.com/yjvsruzf

డీ2సీ గ్రోత్

సంస్థ: అప్‌మెంటర్-ఎక్స్ నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, లీడ్ జనరేషన్, మార్కెట్ రిసెర్చ్, సేల్స్ స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/84e3939v

యానిమేషన్

సంస్థ: వెబ్‌ట్రీ గ్లోబల్ ప్రై.లి.
నైపుణ్యాలు: యానిమేషన్, బ్లెండర్ 3డీ
స్టైపెండ్: రూ.1,000-6,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://hosturl.link/soOHbO

ఎగ్జిక్యూటివ్ ఆపరేషన్స్

సంస్థ: ది ఈమెయిల్ మాఫియా
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ డాక్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిక్రూట్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.20,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/d22dd2we

క్రియేటివ్ కంటెంట్ స్ట్రాటజిస్ట్ అండ్ ఎడిటింగ్

సంస్థ: సీఎస్‌టీఈ ఇంటర్నేషనల్
నైపుణ్యాలు: క్రియేటివిటీ, వీడియో ఎడిటింగ్, వాయిస్‌ఓవర్
స్టైపెండ్: రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/5apub4em

కమ్యూనిటీ మేనేజ్‌మెంట్

సంస్థ: తంత్రబోధ్ ఏఐ (ఓపీసీ) ప్రై.లి.
నైపుణ్యాలు: కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ రాయడం, ఇన్‌ఫ్లుయెన్సర్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/mreryudw

ప్రొఫెసర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, కర్నూలు.. తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రొఫెసర్: 04
● అసోసియేట్ ప్రొఫెసర్: 03
● అసిస్టెంట్ ప్రొఫెసర్: 03

అర్హత: పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 35 ఏళ్లు; అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు; ప్రొఫెసర్‌కు 55 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: రూ.500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.01.2026.
వెబ్‌సైట్: https://iiitk.ac.in/

పీజీఐఎంఈఆర్‌లో



పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(పీజీఐఎంఈఆర్), చండీగఢ్ ఒప్పంద ప్రాతిపదికన 59 గ్రూప్- ఏ, బీ, సీ పోస్టులను భర్తీచేయనుంది. రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు...

పోస్టు: జూనియర్ ఇంజినీర్ (సివిల్)
ఖాళీలు: 4
అర్హతలు: సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా.
వేతన శ్రేణి: నెలకు రూ.35,400-1,12,400.

పోస్టు: స్టోర్ కీపర్
ఖాళీలు: 6
అర్హతలు: మ్యాథ్స్/ ఎకనామిక్స్/ కామర్స్/ స్టాటిస్టిక్స్‌తో డిగ్రీ. మ్యాథ్స్/ ఎకనామిక్స్/ కామర్స్/ స్టాటిస్టిక్స్/ ఫైనాన్స్‌తో ఎంబీఏ.
వేతన శ్రేణి: నెలకు రూ.35,400-1,12,400.

పోస్టు: డార్క్ రూమ్ అసిస్టెంట్ గ్రేడ్-3
ఖాళీలు: 5
అర్హతలు: పదో తరగతి, ఏడాది వ్యవధి ఉన్న రేడియోగ్రఫీ డిప్లొమా/ సర్టిఫికెట్. ఏడాది ఉద్యోగానుభవం ఉన్నవారికి ప్రాధాన్యం.
వేతన శ్రేణి: నెలకు రూ.19,900-63,200.

పోస్టు: టెక్నీషియన్ గ్రేడ్-1 (లాండ్రీ)
ఖాళీలు: 11
అర్హతలు: పదోతరగతి, ఐటీఐ, రెండేళ్ల అనుభవం.
వేతన శ్రేణి: నెలకు రూ.18,000-56,900.

ఎంపిక

ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)తో ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. 100 ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. సీబీటీలో జనరల్/ఈడబ్ల్యూఎస్‌లు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ 35 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

- ప్రశ్నపత్రం విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీ/ డిప్లొమా స్థాయిలోనే ఉంటుంది.
- సీబీటీలో అర్హత మార్కులు పొందిన వారిని పోస్టుకు ఐదుగురు చొప్పున స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- రాత పరీక్ష తేదీ, వివరాలను అడ్మిట్ కార్డ్‌లో తెలియజేస్తారు. దీన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- దేశవ్యాప్తంగా 13 కేంద్రాల్లో.. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో రాత పరీక్షను నిర్వహిస్తారు.

వివరాలు

వయసు: 30 సంవత్సరాల లోపు ఉండాలి. ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500. ఎస్సీ, ఎస్టీలకు రూ.800. దివ్యాంగులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.02.2026
వెబ్‌సైట్: https://www.pgimer.edu.in/

ఎన్‌సీఈఆర్‌టీలో నాన్-టీచింగ్ పోస్టులు

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ).. 173 నాన్-టీచింగ్ పోస్టులను భర్తీచేయనుంది. రాత పరీక్ష/ ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.



మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 86, ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్(ఈడబ్ల్యూఎస్)కు 11, ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్(ఎన్‌సీఎల్)కు 44, ఎస్సీకి 14, ఎస్టీకి 18 కేటాయించారు. ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు...

పోస్టు: లోయర్ డివిజన్ క్లర్క్ **ఖాళీలు:** 54
అర్హత: ఇంటర్మీడియట్. టైపింగ్ స్పీడ్ ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు/ హిందీలో నిమిషానికి 30 పదాలు ఉండాలి. రాత పరీక్షతో ఎంపిక చేస్తారు.

పోస్టు: స్టోర్ కీపర్ గ్రేడ్-1 **ఖాళీలు:** 19
అర్హత: ఇంటర్మీడియట్, స్టోర్ కీపింగ్ అండ్ పర్చేజింగ్ సర్టిఫికెట్/డిప్లొమా. స్టోర్స్ ఇన్‌స్పెక్షన్, వెరిఫికేషన్‌లో మూడేళ్ల అనుభవం ఉండాలి. రాత పరీక్షతో ఎంపిక చేస్తారు.

పోస్టు: ప్రొడక్షన్ అసిస్టెంట్
ఖాళీలు: 5
అర్హత: డిగ్రీ (ప్రింటింగ్ టెక్నాలజీ)/ బుక్ ప్రొడక్షన్ స్పెషలైజేషన్‌లో రెండేళ్ల పీజీ డిప్లొమా. ప్రింటింగ్/ ప్రొడక్షన్‌లో ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ బేస్డ్ ప్రింటింగ్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. రాత పరీక్షతో ఎంపిక చేస్తారు.

పోస్టు: ఇంజినీరింగ్ అసిస్టెంట్
ఖాళీలు: 7
అర్హత: ఎలక్ట్రానిక్స్/ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్/ టీవీ/ రేడియో బ్రాడ్‌కాస్ట్ ఎక్విప్‌మెంట్ నిర్వహణలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం. రాత పరీక్షతో ఎంపిక చేస్తారు.

పోస్టు: టెక్నీషియన్ గ్రేడ్-1
ఖాళీలు: 8
అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. ఎలక్ట్రానిక్స్/ కమ్యూనికేషన్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ/ రేడియో/ టెలివిజన్ కమ్యూనికేషన్ డిప్లొమా, మూడేళ్ల అనుభవం ఉండాలి. ఆడియో/ వీడియో ప్రోగ్రాములకు అవసరమయ్యే సామగ్రి నిర్వహణ నైపుణ్యం ఉండాలి. రాత పరీక్షతో ఎంపిక చేస్తారు.

పోస్టులను బట్టి ఎంపిక విధానం మారుతుంది. రాతపరీక్ష/ స్కిల్/ ప్రొఫిషియన్సీ/ ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూ లేదా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. అనంతరం కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

✦ అడ్మిట్‌కార్డ్ జారీ, సీబీటీ/ రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తేదీల వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

✦ ఎంపికైనవారు న్యూదిల్లీ, భోపాల్, కోల్‌కతా, అహ్మదాబాద్, మైసూర్, నెల్లూరు, షిల్లాంగ్, బెంగళూరుల్లో ఎక్కడి నుంచైనా సేవలందించాలి.

ముఖ్యాంశాలు

వయసు: గ్రూప్-బీ పోస్టులకు 30 సంవత్సరాలు, గ్రూప్-సీ పోస్టులకు 27 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు: గ్రూప్-ఏకు రూ.1500. గ్రూప్-బీకి రూ.1200. గ్రూప్-సీకి రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.01.2026

వెబ్‌సైట్: www.ncert.nic.in



వాయిస్ కమాండ్‌తో ఫ్యాన్లు, లైట్లు బంద్

నలంద విద్యార్థి 'స్మార్ట్' ప్రయోగం

ఈటీవీ భారత్: స్విచ్ బోర్డు దగ్గరకు వెళ్లే పని లేకుండా, కూర్చున్న చోట నుంచే ఇంటిని కంట్రోల్ చేసేలా 'స్మార్ట్ బ్రెయిన్' పరికరాన్ని ఆవిష్కరించాడు బిహార్‌కు చెందిన అనిల్ అలోక్. నలంద బిహార్ షరీఫ్‌లోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన అనిల్ ప్రస్తుతం రాంచీలోని ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. అతడు హాస్టల్‌లో చలికి దుప్పటి కప్పుకొని పడుకున్నాక, లైట్ లేదా ఫ్యాన్ ఆపాలంటే లేవడానికి బద్ధకంగా ఉండేది. ఆ బద్ధకమే ఇప్పుడు 'స్మార్ట్ బ్రెయిన్' ఆవిష్కరణకు పునాది వేసింది. అనిల్ రూపొందించిన ఈ పరికరానికి రోబో అని పేరు పెట్టాడు. ఇది మన ఇళ్లలో ఉండే పాత స్విచ్ బోర్డులో ఇట్టే అమరిపోతుంది. ఇది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. 'హే రోబో, ఫ్యాన్ ఆపు' అని మనం అనగానే, అందులోని మైక్రోఫోన్లు మన గొంతును గుర్తుపడతాయి. వెంటనే మైక్రో కంట్రోలర్ ద్వారా సిగ్నల్ పంపి ఫ్యాన్, లైట్‌ను ఆపేస్తాయి. ఇందులో వై-ఫై, బ్లూటూత్ సదుపాయాలు ఉన్నాయి. మీరు ఆఫీసులో ఉన్నా, వేరే ఊరు వెళ్లినా, ఇంట్లో గీజర్ లేదా లైట్లను ఫోన్ ద్వారా ఆపేయొచ్చు. ఝార్ఖండ్‌లో జరిగిన యూత్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో అనిల్‌కు మొదటి బహుమతి వచ్చింది.

ఆరాటమంతా ఆధిపత్యానికే!

● మన్రో సిద్ధాంతానికి పదును పెట్టిన ట్రంప్

వెనెజువెలా నేత నికోలస్ మదురోను తాము నిర్బంధించడాన్ని సమర్థించుకుంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన్రో సిద్ధాంతం గురించి ప్రస్తావించారు. ఇంతకీ ఆ సిద్ధాంతం ఏంటి..? అమెరికా విదేశాంగ విధానాన్ని గత రెండు శతాబ్దాల్లో అది ఎలా మలిచింది..? ఆ సిద్ధాంతాన్ని అనుకూలంగా మలచుకుంటూ అమెరికా ఇతర దేశాల వ్యవహారాల్లో ఎలా జోక్యం చేసుకుంటోంది..?

1823లో సూత్రీకరణ

అమెరికా ఐదో అధ్యక్షుడు జేమ్స్ మన్రో 1823లో తమ దేశ కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మన్రో సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. దీనిద్వారా పశ్చిమార్ధగోళంలోని స్వతంత్ర దేశాల్లో ఐరోపా దేశాల జోక్యాన్ని నివారించాలన్నది ఆయన ప్రధాన ఉద్దేశం. 19వ శతాబ్దం ఆరంభం నాటికి.. చాలా లాటిన్ అమెరికా దేశాలు ఐరోపా సామ్రాజ్యాల నుంచి స్వాతంత్ర్యం సంపాదించుకున్నాయి. ఆ దేశాలపై ఐరోపా తిరిగి నియంత్రణ సాధించకుండా నిలువరించేందుకు, అదే సమయంలో పశ్చిమార్ధ గోళంలో అమెరికా ప్రాబల్యాన్ని చాటుకునేందుకు తన సిద్ధాంతం దోహదపడుతుందని మన్రో భావించారు.

తమ జోక్యాన్ని సమర్థించుకునేలా..

ప్రధానంగా పశ్చిమార్ధ గోళ దేశాల వ్యవహారాల్లో ఐరోపా జోక్యాన్ని నిలువరించేందుకు పుట్టుకొచ్చిన మన్రో సిద్ధాంతానికి.. కాలక్రమంలో పలువురు అమెరికా అధ్యక్షులు తమకు అనుకూలంగా భాష్యం చెప్పడం ప్రారంభించారు. ఇతర దేశాల్లో తమ జోక్యాన్ని సమర్థించుకునేందుకు దాన్ని వాడుకున్నారు. 1860ల్లో మెక్సికోలో మాక్సిమిలియన్ చక్రవర్తికి ఫ్రాన్స్ పాలనా పగ్గాలు ఇప్పించింది. అది మన్రో సిద్ధాంతానికి నేరుగా ఎదురైన తొలి సవాలు. అయితే అంతర్యుద్ధం తర్వాత అమెరికా ఒత్తిడికి తలొగ్గి.. మెక్సికో నుంచి ఫ్రాన్స్ తమ బలగాలను ఉపసంహరించుకుంది. అస్థిర లాటిన్ అమెరికా దేశాల్లో జోక్యం చేసుకునేందుకు అమెరికాను అనుమతించాలని 1904లో అప్పటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ వాదించారు. ఆ వాదనను 'రూజ్‌వెల్ట్ ఉప సిద్ధాంతం'గా పిలుస్తారు. కొలంబియా నుంచి విడిపోవడంలో పనామాకు మద్దతివ్వడం సహా చాలా వ్యవహారాల్లో వాషింగ్టన్ ఈ ఉప సిద్ధాంతాన్ని వాడుకుంది. పనామా వేర్పాటుతో అమెరికాకు పనామా కెనాల్ జోన్ దక్కింది.

కమ్యూనిజానికి వ్యతిరేకంగా..

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా మన్రో సిద్ధాంతాన్ని అమెరికా ప్రయోగించింది. క్యూబా నుంచి క్షిపణులను ఉపసంహరించుకోవాలని సోవియట్ యూనియన్‌ను 1962లో అమెరికా డిమాండ్ చేయడం, నికరాగువాలో వామపక్ష సాండినిస్టా ప్రభుత్వాన్ని రీగన్ ప్రభుత్వం వ్యతిరేకించడం వంటివి ఇందుకు ఉదాహరణలు. అమెరికా తన వాణిజ్య, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మన్రో సిద్ధాంతానికి ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేసుకుందని వీటి ద్వారా చెప్పొచ్చు.



ట్రంప్‌దీ అదే బాట

వెనెజువెలాలో తాజా ఆపరేషన్‌ను ట్రంప్ సమర్థించుకుంటూ- మదురో పాలన వల్ల ప్రాంతీయంగా అమెరికాకు విదేశీ విరోధ శక్తుల ముప్పు పెరుగుతోందని.. అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగించే ప్రమాదకర ఆయుధాలు వాటి చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. రెండు శతాబ్దాలకుపైగా అమెరికా అనుసరిస్తున్న విదేశాంగ విధానంలోని మూలసూత్రాలకు ఈ చర్యలు భంగం కలిగిస్తున్నాయన్నారు. అమెరికాకు చుట్టూ మంచి దేశాలు, సుస్థిర ప్రభుత్వాలు ఉండాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. అమెరికాను మరింత శక్తిమంతంగా మార్చే ప్రయత్నాల్లో భాగంగానే తాజా ఆపరేషన్‌ను చేపట్టినట్లు చెప్పారు. విశ్లేషకులు కూడా మన్రో సిద్ధాంతాన్ని ట్రంప్ 'డొన్‌రో' సిద్ధాంతంగా మార్చేశారని అంటున్నారు. పశ్చిమార్ధగోళంలో అమెరికా ప్రాభవాన్ని పునరుద్ధరించడమే ఈ ట్రంప్ సిద్ధాంతం లక్ష్యమని చెబుతున్నారు.

-నేషనల్ డెస్క్



సోమవారం జైపుర్‌లో ఆర్మీ డే వేడుకల సన్నాహాల్లో రోబో శునకాలతో పాల్గొన్న సైనికులు

ప్రభుత్వంలోని వాళ్లే ద్రోహం చేశారు

● మదురో కుమారుడి ఆరోపణ

కారకస్: తన తండ్రిని ఎత్తుకెళ్లడానికి తమ ప్రభుత్వంలోని వాళ్లే అమెరికాతో కలిసి కుట్ర పన్నారని మదురో కుమారుడు నికోలస్ మదురో గువెరా సంచలన ఆరోపణలు చేశారు. ద్రోహులు ఎవరో చరిత్రే చెబుతుందని, విశ్వాస ఘాతుకుల పేర్లను చరిత్రే తప్పకుండా బయటపెడుతుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. తన తండ్రిని అమెరికా అపహరించినా.. అధికార యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనెజువెలా (పీఎస్‌యూవీ) ఏకంగానే ఉందని వెల్లడించారు. మదురో నాయకత్వాన్ని బలపర్చాలని దేశ ప్రజలను కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని బయటి ముప్పుల నుంచి కాపాడేందుకు రాజకీయ, సైనిక సమన్వయం అవసరమని గువెరా అభిప్రాయపడ్డారు. అమెరికా వారు వెనెజువెలా ప్రజలను బలహీన స్థితిలో చూడాలని భావిస్తున్నారని, కానీ తాము దేశ ఔన్నత్యాన్ని చాటేలా కదం తొక్కితీరతామని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమాలను విజయవంతం చేస్తామని గువెరా వెల్లడించారు. తన అమ్మ, నాన్నలను అమెరికా కిడ్నాప్ చేయడం ఆగ్రహాన్ని తెప్పించిందని, ఆవేదనను కలిగించిందని తెలిపారు. 'నా జీవితంపై ప్రమాణం చేసి చెబుతున్నా.. ఎన్ని ప్రయత్నాలు చేసినా అమెరికా వారు మమ్మల్ని బలహీనపరచలేరు' అని ఆయన శపథం చేశారు. గువెరా అధికార పీఎస్‌యూవీ పార్టీ తరఫున లా గుయారా రాష్ట్రం నుంచి ఎంపీగా వ్యవహరిస్తున్నారు. వెనెజువెలా నుంచి అమెరికాలోని సరిహద్దు రాష్ట్రాలకు డ్రగ్స్‌ను సరఫరా చేసే ముఠాలతో గువెరా కలిసి పని చేశారని అమెరికా ఆరోపిస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో గువెరా విషయంలో వెనెజువెలా ప్రభుత్వ వైఖరి మారుతుందా.. అమెరికాతో స్నేహం కోసం గువెరాను అరెస్టు చేస్తుందా.. అనేది వేచి చూడాలి.

'ఇరాన్‌లో భారతీయులు అప్రమత్తంగా ఉండండి'

దిల్లీ: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో నిరసనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ వ్యవహారాల శాఖ భారతీయులకు అడ్వైజరీ జారీ చేసింది. తదుపరి నోటీసు ఇచ్చేవరకు భారత పౌరులు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను మానుకోవాలని సూచించింది. ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సూచించారు. నిరసన ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని కోరారు. ఇరాన్‌లో రెసిడెంట్ వీసాలపై ఉంటున్న భారత పౌరులు ఇప్పటికే భారత రాయబార కార్యాలయంలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలని పేర్కొన్నారు.

4 రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతపై ఈసీ అధికారుల సమీక్ష

దిల్లీ: త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడుతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలలో సన్నాహాలపై ఎలక్షన్ కమిషన్ (ఈసీ) సీనియర్ అధికారులు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయా రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు.

వణుకు తగ్గని వెనెజువెలా

- **ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రాజధాని**
- **మూసే ఉన్న దుకాణాలు, రెస్టారెంట్లు, చర్చిలు**
- **అమెరికా దాడుల్లో 32 మంది క్యూబా అధికారుల మృతి**

కారకస్, హవానా: అమెరికా ఆకస్మిక దాడితో ఉలిక్కిపడ్డ వెనెజువెలా ఇంకా ఆ షాక్ నుంచి కోలుకోలేదు. రాజధాని కారకస్‌లో వణుకు తగ్గలేదు. ఆదివారమూ చాలావరకు దుకాణాలు, రెస్టారెంట్లు, చర్చిలు మూసే ఉన్నాయి. తరువాత ఏం జరుగుతుందోనని దేశం మొత్తం ఎదురుచూస్తోంది. శనివారం తెల్లవారుజామున ఉరుములేని పిడుగులా దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా అమెరికా ఎత్తుకెళ్లిన తర్వాత ప్రజలు ఇప్పుడిప్పుడే తమ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. కానీ వీధుల్లో జన సంచారం పెద్దగా కనిపించలేదు. అధ్యక్ష భవనంవద్ద సాయుధ గార్డులు రక్షణగా ఉన్నారు.

- వెనెజువెలాలో రాజకీయ ఘర్షణలు కొత్తేమీ కాదు. ఎప్పుడూ ఆ దేశం కల్లోలంగానే ఉంటుంది. కానీ అమెరికా చేసిన దాడి ఊహించనిది.



అమెరికా దాడి నేపథ్యంలో పొరుగున ఉన్న కొలంబియాకు తరలివెళ్తున్న వెనెజువెలా పౌరులు

మదురోను విడుదల చేయాలి

న్యూయార్క్‌లో అమెరికా భద్రతా దళాల నిర్బంధంలో ఉన్న తమ అధ్యక్షుడు మదురోను వెంటనే విడుదల చేయాలని వెనెజువెలా ప్రభుత్వ ఉన్నతాధికారులు డిమాండు చేశారు. ఆయన చేతికి బేడీలు వేసిన దృశ్యాలను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేయలేదు. ఆయన అభిమానులు మాత్రం.. దేశానికి దేవుడు శక్తినివ్వాలని కోరుకుంటున్నారు. మదురోకు బేడీలు వేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వారు సోషల్ మీడియాలో వచ్చిన దృశ్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు.

క్యూబా అధికారుల మృతి

వెనెజువెలాలో అమెరికా చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో 32 మంది తమ సైనిక, పోలీసు అధికారులు మరణించారని క్యూబా ప్రభుత్వం ప్రకటించింది. వెనెజువెలా ప్రభుత్వ అభ్యర్థన మేరకు అనేక ఏళ్లుగా అక్కడ భద్రతా విధుల్లో వారు పాల్గొంటున్నారు. క్యూబా-వెనెజువెలా మధ్య చాలాకాలంగా సన్నిహిత సంబంధాలుండటంతో, క్యూబా తన సైనిక, పోలీసు బలగాలను పంపుతోంది. మరణించిన తమ అధికారుల స్మారకార్థం క్యూబా ప్రభుత్వం రెండు రోజుల జాతీయ సంతాప దినాలను ప్రకటించింది.

- అమెరికా దాడిలో ఎంత మంది మరణించారనే విషయంలో ఇంకా స్పష్టత కాలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.
- తీర రాష్ట్రమైన లా గుయారాలో అమెరికా ఆపరేషన్ సందర్భంగా పలు ఇళ్లు దెబ్బతిన్నాయి.

నిరసనలు.. సంబరాలు

మదురోను ఎత్తుకెళ్లడాన్ని నిరసిస్తూ వెనెజువెలాలో ఆయన మద్దతుదారులు అమెరికా జెండాలను తగులబెట్టారు. అమెరికాతోపాటు మరికొన్ని లాటిన్ అమెరికా దేశాల్లో మదురోను తప్పించడంపై సంబరాలు చేసుకున్నారు.

కార్బన్ డైఆక్సైడ్‌తో మిథనాల్ ఇంధనం ఉత్పత్తి

● సూర్యకాంతితో ఐఐటీ పరిశోధకుల ఘనత

దిల్లీ: కార్బన్ డైఆక్సైడ్‌ను మిథనాల్ ఇంధనంగా మార్చేందుకు ఉపయోగపడే ఫొటోకెటలిటిక్ పదార్థాన్ని గువాహటిలోని ఐఐటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇది సూర్యకాంతి సాయంతో ఈ చర్య జరుపుతుంది. పర్యావరణానికి మరింత హాని జరగకుండా.. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చేందుకు ఇది మెరుగైన ఆవిష్కరణ అవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పెట్రోలియం ఆధారిత ఇంధనాలపై ఆధారపడటం వల్ల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు పెరుగుతున్నాయి. దీనివల్ల పర్యావరణంపై ఒత్తిడి పడటంతోపాటు భూతాపం పెరుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి శాస్త్రవేత్తలు ఫొటోకెటలిటిక్ విధానాల రూపకల్పనపై పనిచేస్తున్నారు. తద్వారా కార్బన్ డైఆక్సైడ్‌ను హరిత ఇంధనాలుగా మార్చాలన్నది వారి లక్ష్యం. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు గ్రాఫైటిక్ కార్బన్ నైట్రైడ్‌ను ఉపయోగించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇది చౌకైన, లోహరహిత పదార్థం. దీనిద్వారా విషతుల్యతకు ఆస్కారం ఉండదు. అయితే దీనిలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఇది వేగంగా శక్తిని కోల్పోతుంది. ఇంధన ఉత్పత్తి కూడా తక్కువే. ఈ సమస్యలకు గట్టి విరుగుడు ఇప్పటివరకూ కనుగొనలేదు. ఈ నేపథ్యంలో గువాహటిలోని ఐఐటీ గ్రాఫైటిక్ కార్బన్ నైట్రైడ్‌ను ఫ్యూ లేయర్ గ్రాఫీన్‌తో కలిపారు. అత్యంత పలుచగా ఉండే ఈ గ్రాఫీన్ పదార్థం.. శక్తి నష్టాన్ని తగ్గించింది. సూర్యకాంతి సమక్షంలో ఇది సాధ్యమైంది. ఇది ఉత్ప్రేరకాన్ని దీర్ఘకాలం క్రియాశీలంగా ఉండేలా చేసింది. కార్బన్ డైఆక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చడానికి ఇది సమర్థ విధానమవుతుందని పరిశోధకులు తెలిపారు.

భూమితో గ్రహాంతర ధూళి రేణువుల ఢీ

● గుర్తించిన ఇస్రో డెక్స్ పరికరం

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ధూళి రేణువుల డిటెక్టర్ కీలక ఆవిష్కారం చేసింది. గ్రహాంతర ధూళి రేణువులు భూమిని ముంచెత్తడాన్ని గుర్తించింది. డస్ట్ ఎక్స్‌పెరిమెంట్ (డెక్స్) అనే ఈ సాధనాన్ని గత ఏడాది పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్)లో దీన్ని ఇస్రో.. రోదసిలోకి పంపింది. గ్రహాంతర ధూళి రేణువులు సూక్ష్మ రేణువులు. ఇవి తోకచుక్కలు, గ్రహశకలాల నుంచి వెలువడుతుంటాయి. పుడమి వాతావరణానికి వెలుపల అంతుచిక్కని పొరలో ఇవి ఉంటాయి. రాత్రివేళ ఇవి వాతావరణంలోకి దూసుకొచ్చి తారాజువ్వల్లా వెలుగులీనతాయి. డెక్స్ సాధనాన్ని అహ్మదాబాద్‌లో ఇస్రోకు చెందిన ఫిజికల్ రీసెర్చ్ ల్యాబ్ రూపొందించింది. ఇది శరవేగంతో దూసుకొచ్చే తారాంతర ధూళి రేణువులను గుర్తిస్తుంది. వాతావరణంలో వాటి రాపిడిని కూడా గమనిస్తుంది. ఇది అందించే కీలక డేటాతో విశ్వానికి సంబంధించిన కొత్త అంశాలను తెలుసుకోవచ్చు. తద్వారా సుదూర రోదసి మిషన్లను మరింత సురక్షితంగా చేపట్టడానికి వీలవుతుంది.



జపాన్ రాజధాని టోక్యోలోని తొయోసు చేపలమార్కెట్‌లో సోమవారం 243 కిలోల బ్లూఫిన్ ట్యూనా చేప ముందు కియోమురా సంస్థ అధ్యక్షుడు కియోషి కిమురా. వేలం పాటలో ఈ మత్స్యానికి భారీ స్థాయిలో 3.24 మిలియన్ డాలర్ల ధర పలికింది. కిమురా..సుషి జాన్‌మై పేరిట గొలుసుకట్టు సుషి రెస్టారెంట్‌లను నిర్వహిస్తున్నారు

బంగ్లాదేశ్‌లో మరో రెండు దారుణాలు

- **హిందూ వ్యాపారవేత్త కాల్చివేత**
- **వితంతువుపై అమానుషం**

ఢాకా, ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. జెస్సోర్ జిల్లాలో హిందూ వ్యాపారవేత్త రాణా ప్రతాప్ బైరాగి (38)ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం కాల్చిచంపారు. ఆయన ఒక వార్తాపత్రికకు తాత్కాలిక సంపాదకునిగా ఉన్నారు. ఐసు తయారీ కర్మాగారం యజమాని అయిన ఆయన ఆ కర్మాగారంలో ఉన్నప్పుడు ముగ్గురు వ్యక్తులు ఒక మోటారుసైకిల్‌పై వచ్చి బయటకు పిలిచారు. కాస్తదూరంలోకి తీసుకువెళ్లి సమీపం నుంచి తలపై గురిపెట్టి కాల్పులు జరిపారు. తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. బైరాగి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. హత్యకు కారణాలు తెలియరాలేదని, మృతుడి గొంతు కోసి ఉందని పోలీసులు తెలిపారు. బైరాగిపై రెండు పోలీసుస్టేషన్లలో నాలుగు కేసులున్నాయని వారు వెల్లడించారు.

హిందూ మహిళపై అత్యాచారం

బంగ్లాదేశ్‌లోని కలిగంజ్‌లో హిందూ వితంతువుపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత అమానవీయంగా వ్యవహరించారు. షహీన్ అనే వ్యక్తి, అతని సోదరుడి వద్ద నుంచి రెండున్నరేళ్ల క్రితం బాధిత మహిళ కొంత భూమిని, ఇంటిని కొనుగోలు చేసింది. అప్పటి నుంచి షహీన్ ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. శనివారం సాయంత్రం బాధిత మహిళ ఇంటికి బంధువులు వచ్చారు. అదే సమయంలో షహీన్, అతడి అనుచరుడు హసన్ ఆమె ఇంట్లోకి చొరబడ్డారు. బంధువులను తరిమికొట్టి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఇవ్వడానికి నిరాకరించడంతో చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించారు. ఈ ఉదంతాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయిన ఆమెను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు.

అజ్‌మేర్ దర్గాకు ప్రధాని చాదర్‌పై పిటిషన్.. కొట్టివేత

దిల్లీ: అజ్‌మేర్ షరీఫ్ దర్గాలో చాదర్ సమర్పించకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నిలువరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారం కోర్టు విచారణ పరిధిలోకి రాదని తేల్చిచెప్పింది. అజ్‌మేర్‌లో ఖాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాకు పవిత్ర వస్త్రాన్ని (చాదర్) సమర్పించే సంప్రదాయాన్ని 1947లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఒక శివాలయాన్ని కూల్చి ఈ దర్గాను నిర్మించారని సివిల్ కోర్టులో దావా వేశారని తెలిపారు. దిల్లీ, అజ్‌మేర్‌లపై దండెత్తి పెద్దఎత్తున మతాంతరీకరణలకు పాల్పడినవారితో చిస్తీకి సంబంధాలున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. పిటిషన్‌ను తాము కొట్టివేసినంత మాత్రాన సివిల్ కోర్టు విచారణకు అడ్డంకులేమీ ఉండవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

దేవుడినీ వదిలిపెట్టలేదు

శబరిమల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

ఇంటర్నెట్‌డెస్క్: శబరిమల బంగారు తాపడాల కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుడినీ వదిలిపెట్టలేదంటూ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను కొట్టివేసింది. కనీసం దేవుడు, ఆలయం జోలికి వెళ్లకుండా ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో శంకర్‌దాస్ కూడా బాధ్యులేనని పేర్కొంది. కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం అదృశ్యం వ్యవహారంపై దర్యాప్తు జరుగుతున్న విషయం తెలిసిందే. 2019లో రాగి రేకులకు ఎలక్ట్రోప్లేటింగ్ (విద్యుత్ సాయంతో బంగారు పూత పూయడం) ప్రక్రియ పూర్తైన తర్వాత ఆ రేకులపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి దానిని మళ్లించాడని సిట్ ఆరోపించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడంటూ గోవర్ధన్ అనే మరో నిందితుడు సిట్‌కు ఇప్పటికే బంగారం అప్పగించాడు. ఈ కేసు విచారణలో భాగంగా తనపై కేరళ హైకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలను తొలగించాలన్న బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

బార్ కౌన్సిల్ కమిటీలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం

సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల ఎన్నికలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించడానికి చట్టపరమైన సవరణలు అవసరమనీ, అవి జరిగేలోపు వివిధ కమిటీలలో వారికి కోఆప్షన్ ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం సోమవారం ఆదేశించింది. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రూ.1.25 లక్షల నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దివ్యాంగ అభ్యర్థుల నుంచి రూ.15,000 మాత్రమే వసూలు చేయాలని భారత బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. న్యాయవాది పంకజ్ సిన్హా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. బార్ కౌన్సిల్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించడానికి పార్లమెంటు చట్టమేదీ చేయలేదని బీసీఐ అధ్యక్షుడు వివరించగా, భావి ఎన్నికల్లో అర్హులైనవారందరికీ రిజర్వేషన్ కల్పించడానికి చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని ధర్మాసనం సూచించింది. మహిళా అభ్యర్థులకు 30% శాతం కోటా ఇవ్వాలని బార్ కౌన్సిల్ ఎన్నికలకు ముందే సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఎటువంటి పిటిషన్లనూ అనుమతించవద్దని హైకోర్టులను ఆదేశించింది కూడా.

సంశయ లబ్ధి కింద హత్యానేరం కొట్టివేత

2004 కేసులో సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: హత్యా నేరం కింద ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారిస్తూ ట్రయల్ కోర్టు, అలహాబాద్ హైకోర్టు విధించిన శిక్షను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. అతనిని నిర్దోషిగా ప్రకటించి విముక్తి కల్పించింది. దిగువ కోర్టులు నిందితుడికి సంశయ లబ్ధిని కలిగించాల్సిన కేసుగా దీనిని అభివర్ణించింది. జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం ఈ తీర్పు వెలువరించింది. 2004 అక్టోబరు 20న దుర్గా పూజ ఉత్సవాల సందర్భంగా జరిగిన ఘర్షణలో సుమారు 100 మంది ఉన్న గుంపుపై అంజనీ సింగ్, అతని సోదరుడు నాటు తుపాకితో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారన్నది ప్రాసిక్యూషన్ ఆరోపణ. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న వ్యక్తి సహా పలువురు గాయపడ్డారు. ట్రయల్ కోర్టు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించింది. అయితే, ఇతర సాక్షులు తెలిపిన వివరాల్లోని వ్యత్యాసాలు, నాటు తుపాకి సామర్థ్యం, ఘటన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటిగా ఉండటం, ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోకపోవడం తదితర లోపాలను ఎత్తిచూపుతూ సందేహ లబ్ధి కింద అంజనీ సింగ్‌కు కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తెలిపింది.

తీర్పులో తప్పులున్నాయని న్యాయాధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోరాదు: సుప్రీం

దిల్లీ: న్యాయాధికారి ఇచ్చిన తీర్పు సరిగా లేదని కానీ, అందులో తప్పులున్నాయని కానీ అతని/ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సదరు న్యాయాధికారిపై విచారణ జరపరాదనీ పేర్కొంది. ఎక్సైజ్ చట్టం కింద భిన్నమైన కారణాలతో నిందితుడికి బెయిల్ మంజూరు చేశారనే ఆరోపణతో జిల్లా జడ్జిని తొలగిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం కొట్టివేసింది. జడ్జీలు నిర్భయంగా పనిచేయగలిగితేనే న్యాయ స్వతంత్రత మనగలుగుతుందని తెలిపింది. జడ్జీలపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంటుందని, తీర్పులివ్వడం కత్తిపై సాము వంటిదేనని పేర్కొంది. తీర్పు ప్రతికూలంగా వస్తే సహించలేని వ్యక్తులు బూటకపు ఆరోపణలు చేస్తారని తెలిపింది. జడ్జిగా నిర్భయ్ సింగ్ సులియా 27ఏళ్ల పాటు ఎలాంటి మచ్చలేకుండా పనిచేశారని పేర్కొంది. నాలుగు బెయిల్ ఉత్తర్వులను తప్పుపడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఆయనపై విచారణకు ఆదేశించడం, ఆ తర్వాత విధుల నుంచి తొలగించడం వంటి చర్యలను ఆక్షేపించింది. జడ్జిని తిరిగి విధుల్లో నియమించడంతో పాటు తొలగించిన తేదీ నుంచి జీత భత్యాలు అన్నింటినీ చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. స్టెనోగ్రాఫర్‌ను, ఫిర్యాదు చేసిన వ్యక్తిని విచారణ పరిధిలోకి తీసుకురాకపోవడంపై సందేహాలు వ్యక్తం చేసింది.

రూ.180 కోట్ల సైబర్ మోసాల నెట్‌వర్క్ రట్టు

ఈటీవీ భారత్: దిల్లీ పోలీసులు రూ.180 కోట్ల సైబర్ మోసాల నెటవర్క్ ఛేదించారు. 'ఆపరేషన్ సై-హాక్' పేరుతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, నకిలీ కంపెనీలు, మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా అక్రమ సొమ్మును చలామణి చేస్తున్న ఇద్దరు కీలక నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మనీ లాండరింగ్ కోసం నిందితులు ఏకంగా 20 నకిలీ కంపెనీలను సృష్టించి పలు దశల్లో నిధులను మళ్లించినట్లు గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముఠాకు సుమారు రూ.180 కోట్ల విలువైన 176 సైబర్ మోసాలతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ కేసుకు సంబంధించి సుశీల్ చావ్లా, రాజేష్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రెండ్రోజుల పర్యటనకు రానున్న జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్

దిల్లీ: వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకునేందుకు జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ మన దేశ పర్యటనకు రానున్నారు. మన సరకులపై అమెరికా విధిస్తున్న సుంకాల మోత నేపథ్యంలో ఛాన్స్‌లర్ హోదాలో మెర్జ్ తొలిసారి భారత్‌కు వస్తున్నారు. 12న ఆయన అహ్మదాబాద్‌కు చేరుకుంటారు. ప్రధాని నరేంద్రమోదీతో అక్కడ చర్చలు జరపనున్నారు. ఇరుదేశాల భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంపై ఆయా రంగాల్లో పురోగతిని ఇద్దరు నేతలూ సమీక్షిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, విద్య, నైపుణ్యం, రక్షణరంగ దిగుమతులు, నవకల్పనలు, ప్రజల మధ్య సంబంధాలు వంటివి ప్రస్తావనకు రానున్నాయి. అక్కడి నుంచి ఆయన బెంగళూరు వెళ్తారు.

తేనెలొలికే తెలుగుకు సాటేదీ..

● ఆంగ్ల భాషలో చదువుతున్నా తెలుగును విస్మరించాల్సిన అవసరం లేదు

● ప్రపంచ తెలుగు మహాసభల్లో యువత అభిప్రాయాలు

ఈనాడు, అమరావతి: వారంతా ఉప్పొంగే యువ కెరటాలు. ఆనందం వచ్చినా, ఆవేదన కలిగినా..సారీ..వాట్ అనే ఆంగ్ల పదాలే వారి నోట పలికే రోజులివి. కానీ ఆంగ్లం కంటే తేనెలొలికే తెలుగు పదాలే తమకు ఇష్టమని చెబుతున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల వల్ల మాతృభాష గొప్పతనం తెలిసిందని పలువురు యువతీయువకులు తెలిపారు. తెలుగు పాలకులు, కవులు, రచయితలు, సాహిత్య వైభవం మరింత బోధపడిందని వెల్లడించారు. ఇలాంటి సభలు భవిష్యత్తులో మరిన్ని జరగాలని... అందులో యువత భాగస్వామ్యం పెరగాలని ఆకాంక్షించారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన పలువురు యువతీ యువకులు 'ఈనాడు'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. వారి మాటల్లోనే...

తెలుగు మాధ్యమంలో బోధన జరగాలి..

–హేమంత్, గుంటూరు



'ఒకటి నుంచి ఐదో తరగతి వరకైనా తెలుగు మాధ్యమంలో బోధన చేయాలి. మరీ ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు దీనిపై దృష్టి పెట్టాలి. మాకు తెలుగు చదవడం, రాయడం వచ్చు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే రాబోయే తరాలకి అవి కూడా రావేమోననిపిస్తోంది'

మార్వాడీనైనా తెలుగును మాతృభాషగా భావిస్తా

– కల్పేశ్, రాజస్థాన్



''మాది రాజస్థాన్. నాన్న ఇక్కడ వస్త్రవ్యాపారం చేస్తారు. నేను పుట్టింది, పెరిగింది ఇక్కడే. నా స్నేహితుడితో కలిసి ఇక్కడికి వచ్చాను. తెలుగును మాతృభాషగా భావిస్తాను. నేను మార్వాడీనైనా స్పష్టంగా మాట్లాడతాను. చదువుతాను. ఈ భాష చాలా సరళంగా ఉంటుంది. తెలుగు నేర్చుకోవాలి.

ఆంగ్లం అవసరమే... తెలుగు మర్చిపోయేంత కాదు..

– మహ్మద్‌రఫీ, అనంతపురం



'మా స్వస్థలం అనంతపురం. ఎనిమిదో తరగతి వరకు తెలుగులోనే చదువుకున్నాను. మొదటిసారి ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చాను. చాలా ఆనందంగా ఉంది. తెలుగులో చదివితే ఉద్యోగాలు రావు. విదేశాల్లో స్థిరపడటానికి ఉపయోగపడదనే దుష్ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. కొన్ని పాఠశాలలు తెలుగులో మాట్లాడితే జరిమానాలు వేస్తున్నాయి. అక్కడే సగం మంది మాతృభాషకు దూరమవుతున్నారు. ఇంగ్లిష్ నేర్పించడం వరకూ సరేకానీ...మన మాతృభాషను మనమే తక్కువ చేసుకోవడం మంచిది కాదు. ఇంగ్లిష్ కావాలి..అదే సమయంలో అమ్మభాషను మర్చిపోకూడదు'

తెలుగు కవుల రచనలు చదవాలనిపిస్తోంది...

–భవ్యశ్రీ, పొన్నూరు



నా తోటి వయసు వారు తెలుగులో రచనలు చేస్తున్నారని నాకు ఇప్పుడే వచ్చాకే తెలిసింది. వారి నుంచి ప్రేరణ పొందాను. ఇప్పటి వరకూ తెలుగు పుస్తకాలు చదివే అలవాటు లేదు. ఇక్కడికొచ్చాక తెలుగు కవుల జీవిత చరిత్రలు, వారి రచనలు చదవాలనిపిస్తోంది. కొన్ని కొత్త పదాలు నేర్చుకున్నాను.

తెలుగు నేర్చుకోవడం ఎందుకు అవసరమో తెలిసింది

–పి.చైత్రిక, పల్నాడు



'తెలుగు మహాసభలు ఇంత వైభవంగా జరుగుతాయని మేం ఊహించలేదు. కొన్ని పదాలు మాకు అసలు తెలియదు. చాలా స్ఫూర్తి పొందాం. భవిష్యత్తు తరాలు తెలుగు నేర్చుకోవడం ఎందుకు అవసరమో తెలిసింది. మొదటి నుంచి మేం ఆంగ్ల మాధ్యమమే చదివినా.. ఇక్కడికి వచ్చి తెలుగు కవులు రచయితల గొప్పతనాన్ని తెలుసుకున్నాం'



ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రామకృష్ణ, కార్యవర్గం సభ్యులు

సీఎంను కలిసిన సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

ఈనాడు, అమరావతి: నూతనంగా ఎన్నికైన రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు.. అధ్యక్షుడు జి.రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వారిని సీఎం అభినందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌కు పూర్తి స్థాయిలో సహకరిస్తామని ముఖ్యమంత్రికి ఏపీ సచివాలయ సంఘం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాల పరిష్కారానికి ముఖ్యమంత్రికి అధ్యక్షుడు రామకృష్ణ వినతిపత్రం సమర్పించారు.

ఆటోమేషన్‌పై అవగాహన కల్పించండి

ఈనాడు, అమరావతి: సూక్ష్మసేద్య పరికరాలు రైతులకు అందేలా చూడటంతో పాటు ఆటోమేషన్ పైనా వారికి అవగాహన కల్పించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. సోమవారం ఆయన విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. కోకో సహా అన్ని పంటల ధరలపై ముందస్తు అంచనాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లు, ఏడీ హరినాథ్‌రెడ్డి, జేడీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో 'వీబీ జీ రామ్ జీ'పై అవగాహన

ఈనాడు, అమరావతి: 'వీబీ జీ రామ్ జీ'పై శ్రామికులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో 'జీ రామ్ జీ' ప్రత్యేకతలతో పాటు ఏడాదికి పని దినాలు 100 నుంచి 125కి పెంచిన విషయాన్ని అధికారులు వివరించారు. జలసంరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులకు 'జీ రామ్ జీ'లో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

గ్యాస్ లీకేజీ ఘటనలపై విచారణ చేయించాలి

● ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: కోనసీమ ప్రాంతంలో వరుస గ్యాస్ లీకేజీ ఘటనలపై ప్రభుత్వం విచారణ చేయించి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. మలికిపురం మండలంలో ఓఎన్‌జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకేజీ కారణంగా ఎగసిపడుతున్న మంటలను అదుపులోకి తెచ్చేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో ఆమె కోరారు. మంటలు అదుపులోకి వచ్చే వరకు ప్రజలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు షర్మిల సూచించారు.

మార్చి 1 నుంచి తెలంగాణ పట్టణాల్లోని మహిళలకు చీరలు

● సంక్రాంతి లోపు గ్రామాల్లో పంపిణీ పూర్తి

● తెలంగాణ మంత్రి సీతక్క

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లోని 35 లక్షల మంది మహిళలకు మార్చి 1 నుంచి ఉచిత చీరలను పంపిణీ చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి చీరల పంపిణీ లక్ష్యం కాగా... ఇప్పటికే గ్రామాల్లోని 50 లక్షల మందికి ఇచ్చామని, మిగిలిన 15 లక్షల మందికి కూడా సంక్రాంతిలోపు అందజేస్తామన్నారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

సినీ పరిశ్రమ-దర్యాప్తు సంస్థల సమన్వయంతోనే పైరసీకి అడ్డుకట్ట

● తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి



ఒప్పంద పత్రంతో ఎస్పీ హర్షవర్ధన్, శిఖా గోయల్, శివధర్‌రెడ్డి, సురేశ్‌బాబు. చిత్రంలో దిల్‌రాజు, అశోక్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: వ్యవస్థీకృత నేరంగా మారిన డిజిటల్ పైరసీని అరికట్టాలంటే సినీ పరిశ్రమ-దర్యాప్తు సంస్థలు కలిసికట్టుగా, నిరంతర సమన్వయంతో పని చేయాలని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ పైరసీ, ఆన్‌లైన్ కాపీరైట్ ఉల్లంఘనలపై పోరాడేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ల మధ్య డీజీపీ సమక్షంలో సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పైరసీ నిరోధానికి, దర్యాప్తు సంస్థలకు దిశానిర్దేశం చేసేలా ఉన్న ఈ ఒప్పందం సృజనాత్మకతకు దన్నుగా నిలవడమే కాకుండా నిర్మాతలకు ఆర్థికంగానూ ఉపయోగపడుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖా గోయల్ మాట్లాడుతూ.. డిజిటల్ పైరసీ పలు రూపాల్లో జరుగుతోందని.. ఇప్పుడు కుదుర్చుకున్న ఒప్పందం వేగవంతమైన సమాచార మార్పిడి, తక్షణమే చట్టపరమైన జోక్యం, దర్యాప్తు సంస్థలు-సినీ పరిశ్రమ మధ్య సమన్వయానికి ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ దన్నుగా నిలుస్తోంది అనడానికి తాజా ఐబొమ్మ ఉదంతమే నిదర్శనం అన్నారు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దగ్గుపాటి సురేశ్‌బాబు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, తెలుగు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు.. ప్రతినిధులు రాజ్‌కుమార్ ఆకెళ్ల, అశోక్‌కుమార్, సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు వేగమే కీలకం: డీజీపీ

సైబర్‌నేరాల నియంత్రణలో వేగం, సాంకేతిక నైపుణ్యం, సమన్వయం అత్యంత కీలకమని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సైబర్ పోలీసుస్టేషన్లలో పని చేస్తున్న సైబర్ వారియర్లలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని గుర్తించి ప్రతి మూడు నెలలకు ఒకసారి సన్మానం చేస్తుంటారు. దీనిలో భాగంగా గడిచిన రెండు త్రైమాసికాలకు సంబంధించి సోమవారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ 47 మంది సైబర్ వారియర్లను సన్మానించారు.

దేశానికి స్వాతంత్య్రం రావడమూ తన ఘనతే అనగలరు

● జగన్‌ను ఎద్దేవా చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ''వైకాపా అధినేత జగన్‌ను ఇలాగే వదిలేస్తే.. దేశానికి తానే స్వాతంత్య్రం తెచ్చానని, పోఖ్రాన్ అణుపరీక్షలు తన కుటుంబ ఘనతేనని, ఆపరేషన్ సిందూర్ వెనక తన వ్యూహాలు ఉన్నాయని కూడా చెబుతారు'' అని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. భోగాపురం విమానాశ్రయాన్ని జగన్ తెచ్చినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని 'ఎక్స్' వేదికగా సోమవారం ఆయన మండిపడ్డారు. ఎర్రబస్సు రాని ఊళ్లకు ఎయిర్‌పోర్టు ఎందుకని ఉత్తరాంధ్రను నాడు జగన్ హేళన చేశారని దుయ్యబట్టారు. నేడు కనీస నైతికత కూడా లేకుండా ఆయన చెబుతున్న డైలాగులు వెగటు పుట్టిస్తున్నాయని పేర్కొన్నారు.

కుటుంబ సంక్షేమ శాఖకు రూ.245 కోట్ల అదనపు నిధులు

ఈనాడు, అమరావతి: మాతాశిశు ఆరోగ్యం, వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ. 245.67 కోట్ల అదనపు నిధులు మంజూరు చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధులు ఖర్చు చేసేలా పరిపాలన ఆమోదం తెలుపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బడేమియా.. ఛోటేమియా



మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. నాందేడ్‌లోని 18వ వార్డుకు మజ్లిస్ అభ్యర్థిగా దేశంలోనే అత్యంత పొడవైన వ్యక్తి (8 అడుగులు)గా గుర్తింపు పొందిన మోహిన్ బరిలో నిలిచారు. ఈ వార్డుకు హైదరాబాద్ కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్‌ను ఆ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించింది. ఈయన 5.5 అడుగుల ఎత్తు ఉంటారు. వీరిద్దరూ కలిసి ప్రచారం చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

– న్యూస్‌టుడే, కార్వాన్

మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ అండతో భూకబ్జా

● తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి : వైకాపా ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఆదిమూలపు సురేశ్ అండదండలతో కొందరు వ్యక్తులు తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించారని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన సాలమ్మ అనే మహిళ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తప్పుడు ధ్రువపత్రాలతో తన భూమిని ఆక్రమించిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరానికి చెందిన కామిశెట్టి చెన్నకేశవరావు కోరారు. గత ప్రభుత్వంలో స్థానిక వాలంటీర్ సహకారంతో తమ కుటుంబ వ్యక్తిగత సమాచారం తీసుకొని తప్పుడు ధ్రువపత్రాలతో వారసత్వ ఆస్తిని దక్కకుండా అడ్డుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లికి చెందిన మస్తానయ్య ఫిర్యాదు చేశారు.

ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: స్వచ్ఛ సర్వేక్షణ్-2026లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు 46 పట్టణాల్లో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఆమోదిస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రాధాన్యాంశాలు గుర్తించి వాటిని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగ్గా నిర్వహించడం ద్వారా ప్రజారోగ్యం, పర్యావరణపరంగా మంచి ఫలితాలతోపాటు జాతీయస్థాయిలో ఎక్కువగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించగలమని సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

తెలుగుకు వెలుగులద్దుతున్నారు

● భాషాభివృద్ధికి స్ఫూర్తి ప్రదాతల కృషి

ఈనాడు, అమరావతి: వృత్తి, ప్రవృత్తి ఏదైనా తెలుగు గొప్పదనాన్ని ఇనుమడింపజేసేందుకు పాటుపడుతున్నారు కొందరు స్ఫూర్తిప్రదాతలు. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ భాషాభివృద్ధికి వినియోగిస్తున్నారు. పుస్తక, కవిత్వ రచనలతోనే సరిపెట్టకుండా కవి సమ్మేళనాలు, క్విజ్ పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగుకు వెలుగులద్దుతున్న పలువురిని మహాసభల్లో 'ఈనాడు' పలకరించింది...

శతక పద్యాలతో భాషను నేర్పుతున్నా...

– శ్రీపాద సీతామహాలక్ష్మి, రంగంపేట, తూర్పుగోదావరి జిల్లా



నేను స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలిని. పిల్లలు తెలుగు మాట్లాడటం తగ్గిపోతోంది. ఇది శోచనీయం. బుజ్జాయిలకు విరామ సమయాల్లో 'శతక' పద్యాలను నేర్పుతున్నా. ఇప్పటివరకు వేమన, తెలుగుబాల, సుమతీ శతకాలను నేర్పించా. చిన్నారులు పద్యాలు నేర్చుకుంటే నైతిక విలువలు పెరుగుతాయి. భాషా ఉచ్చారణ బాగుంటుంది. ఐదేళ్లుగా రచనలు చేస్తున్నా. 50 సెమినార్లలో పాల్గొన్నా. మహోపాధ్యాయ, కళామిత్ర, గురుబోధనా అవార్డులు దక్కాయి.

భాషపై మమకారాన్ని పెంచుతున్నా...

– పోలగాని భాను తేజశ్రీ, పెద్దఅవుటపల్లి, కృష్ణా జిల్లా



నేను ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతున్నా. 5 ఏళ్లుగా రచనలు చేస్తున్నా. డిగ్రీలో ఉన్నప్పుడు శ్రీశ్రీ మహాప్రస్థానం చదివా. అది నా జీవితాన్ని మార్చింది. తెలుగుపై ఇష్టం ఏర్పడింది. కలంతో దేన్నైనా సాధించవచ్చనిపించింది. భావ, వచన, వ్యాస సంపుటులను రాస్తున్నా. 3 పుస్తకాలను వెలువరించా. కాళోజీ జాతీయ పురస్కారం, యువ కిరీటి, శ్రీదేవి సినీ అవార్డు సహా పలు పురస్కారాలు వరించాయి. విద్యార్థుల్లో భాషపై మమకారం పెంచేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

ప్రతినెలా కార్యక్రమం...

– సాగంటి మంజుల, హన్మకొండ



ఆరేళ్లుగా సాహిత్యరంగంలో నేను రాసిన రచనలు, కవితలకు 200కుపైగా అవార్డులు వచ్చాయి 'మహిళ అనే నేను' వచన కవిత్వానికి జాతీయ స్థాయిలో తెలుగు కీర్తి కిరీటం అవార్డు దక్కింది. సాంగటీస్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నా. తెలుగు అభివృద్ధికి పాటుపడుతున్న వారిని సన్మానిస్తున్నా. పిల్లలకు ప్రత్యేకంగా భాష కేంద్రంగా పెయింటింగ్, డ్రాయింగ్, క్విజ్ పోటీలను పెడుతున్నా. ప్రతినెలా ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు ఇస్తున్నా.

స్పందించే గుణాన్ని పెంపొందిస్తున్నా...

– ఆర్.గిరిజారాణి, కాట్రపాడు, గుంటూరు జిల్లా



నేను స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయురాలిని. చిన్నప్పటి నుంచి తెలుగు అంటే ఇష్టం. చిన్నారుల్లో అమ్మభాషపై మమకారం పెరిగేలా పదాలతో 'ఆటకేళి' ఆడిస్తుంటా. తెలుగు మాధుర్యం ఎంత గొప్పదో వివరిస్తున్నా. కథల పుస్తకాలు, బాల సాహిత్యం చదివేలా ప్రోత్సహిస్తున్నా. స్పందించే గుణం కవయిత్రి ప్రధాన లక్షణం. దాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు కృషి చేస్తున్నా. నేను రాసిన 'ప్రకృతి శాపం' కవితకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది.


రేషన్ మాఫియా అక్రమాలపై విచారణ జరపాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెర పంపిణీలో జరుగుతున్న అవకతవకలు, తూకాల్లో మోసాలపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ రాశారు. ''రేషన్ దుకాణాల ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం, చక్కెర సరఫరా చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నప్పటికీ ఆచరణలో అది సరిగా అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ మాఫియా ఆగడాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పేదవాడికి నెలకు ఐదు కిలోల బియ్యం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా.. దాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నీరుగారుస్తోంది. బియ్యం అక్రమ రవాణాకు పంచదార అక్రమాలు తోడయ్యాయి'' అని పేర్కొన్నారు.

సంక్రాంతి కిట్లు అందించాలి: సీపీఎం

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి కుటుంబానికి బియ్యం, పప్పు, చింతపండు, నూనె, చక్కెర తదితర నిత్యావసరాలతో కిట్లు.. పిల్లలు, మహిళలకు ఉచితంగా వస్త్రాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ''రాష్ట్రంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగ సంక్షోభంతో ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి సంతోషంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా ప్రతి కుటుంబానికి కిట్లు అందించాలి. తమిళనాడు తరహాలో ధోతి, చీర, నగదు, ఇవ్వాలి'' అని పేర్కొన్నారు.

ఆకుట్టుకుందా..!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడులో ఓ చిక్కుడు చెట్టు ఆకులపై ఆకు మాదిరిగా ఉన్న ఈ కీటకం కనిపించింది. చిత్రంగా ఉన్న దీని గురించి అశ్వారావుపేట వ్యవసాయ వర్సిటీ ఆచార్యుడు ఐవీ శ్రీనివాసరెడ్డిని వివరాలు అడగగా.. దీని పేరు 'ఆకు కట్టెపురుగు' అని తెలిపారు. 'ఫాస్మిడా' కుటుంబానికి చెందిన మిడత అని... ఏ చెట్టు ఆకులపై వాలితే వాటి మాదిరిగా రంగును, రూపాన్ని మార్చుకుంటూ రక్షణ పొందుతుందని వివరించారు. మిడతల్లో 'ఊసరవెల్లి'గా దీనిని అభివర్ణించవచ్చని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, అశ్వారావుపేట గ్రామీణం

సెల్‌ఫోన్ కోసం.. స్నేహితుడిని కడతేర్చిన నిందితుడికి ఉరిశిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్, డబ్బుల కోసం స్నేహితుడినే కడతేర్చిన నిందితుడికి నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి దుర్గాప్రసాద్ సోమవారం ఉరిశిక్ష విధించారు. నిజామాబాద్ వాసి కండెల సందీప్(28) ఆటోడ్రైవర్. గతేడాది ఫిబ్రవరి 15న ఆటో తీసుకెళ్లి రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. అతడి భార్య లత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సందీప్ సెల్‌ఫోన్ మాధవనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ భైరగోని సతీష్‌గౌడ్(35) వద్ద ఉన్నట్లు నాలుగు రోజుల తర్వాత లొకేషన్ ఆధారంగా పసిగట్టారు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం తెలిసింది. స్నేహితులైన సందీప్, సతీష్ కంఠేశ్వర్‌లో మద్యం తాగి ఇంటికొస్తుండగా చంద్రాయన్‌పల్లి దగ్గర మూత్రవిసర్జన కోసం చెరువు వద్ద ఆగారు. అప్పుడే సందీప్‌ను సతీష్ వెనుక నుంచి నెట్టి బండరాయితో మోది హత్యచేశాడు. అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్, డబ్బులు తీసుకొన్నాడు. మృతదేహంపై చెత్త, కర్రలు పోగేసి నిప్పంటించి పరారయ్యాడు. నిజామాబాద్ తిరిగి రాగానే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఉరిశిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు.

నలుగురి ప్రాణాలు తీసిన కుళాయి వివాదం

● కర్నూలు జిల్లాలో భగ్గుమన్న పాతకక్షలు

● అన్నదమ్ముల దారుణ హత్య

● మరో సోదరుడికి తీవ్ర గాయాలు



పరమేశ్



వెంకటేష్



ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడి ట్రాక్టరుపై ఒరిగిపోయిన గోవింద్

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని కందనాతిలో పాతకక్షలు భగ్గుమన్నాయి. రెండేళ్ల క్రితం కుళాయి వద్ద ఏర్పడిన వివాదం అప్పుడొక ఇద్దరిని, ఇప్పుడు మరో ఇద్దరిని బలి తీసుకుంది. కందనాతిలో 2024 ఫిబ్రవరిలో దేవర ఉత్సవం సందర్భంగా కుళాయి వద్ద నీటిని పట్టుకునే విషయంలో గొడవ జరిగింది. ఒకరిపై మరొకరు దాడులు చేసుకోగా తీవ్రంగా గాయపడిన నరసింహులు, ఆయన అన్న కుమారుడు రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాటి కేసులో నిందితులైన అన్నదమ్ములు పరమేశ్, వెంకటేష్, గోవింద్‌తో పాటు మరికొందరు తర్వాత ఊరు విడిచి వెళ్లిపోయారు. గత ఏడాది దసరాకు కొందరు రాజకీయ నేతలతో మధ్యవర్తిత్వం చేసుకుని మళ్లీ గ్రామానికి చేరుకున్నారు. వారిపై పగ పెంచుకొన్న ప్రత్యర్థులు ప్రతీకారం తీర్చుకునేందుకు అదను కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం దాదాపు 15 మంది వేటకొడవళ్లు, మారణాయుధాలతో పరమేశ్ (42) ఇంటిపై దాడి చేశారు. విచక్షణరహితంగా నరకడంతో అతడి తల ఛిద్రమై అక్కడికక్కడే చనిపోయాడు. అడ్డొచ్చిన ఆయన భార్య జయలక్ష్మి కాలికి గాయమైంది. పరమేశ్ సోదరులు పొలంలో ఉన్నట్లు తెలుసుకొని మారణాయుధాలతో అక్కడికి వెళ్లారు. గ్రామ శివారులో గోవింద్ తన భార్య వీరేశమ్మ, ఐదేళ్ల కుమారుడు లోకేంద్రతో కలిసి ట్రాక్టరుపై ఇంటికి వెళ్తున్నాడు. అతడిపై వేట కొడవళ్లతో దాడి చేయడంతో పొట్ట వద్ద తీవ్ర గాయమై పేగులు బయటకు వచ్చాయి. భార్య, కుమారుడికి గాయాలయ్యాయి. అయినా అతడు అలాగే ట్రాక్టరును వేగంగా నడిపి అక్కడి నుంచి తప్పించుకుని ఆసుపత్రికి చేరుకున్నాడు. పొలంలో ఉన్న వెంకటేష్ (39) విషయం దాడి తెలుసుకొని ఇంటికి వస్తుండగా ప్రత్యర్థులు దారిలోనే నరికి చంపేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు బాధితులను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఒకే సామాజికవర్గానికి చెందిన మృతులు, వారి ప్రత్యర్థులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. పొలాల వద్ద చిన్న చిన్న తగాదాలు ఇరువర్గాల మధ్య మనస్పర్థలకు దారితీసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ భార్గవి పరిశీలించారు.

వెనెజువెలా అధ్యక్షురాలు సత్యసాయిబాబా భక్తురాలు

● పలుమార్లు పుట్టపర్తి సందర్శన



పుట్టపర్తి, న్యూస్‌టుడే: వెనెజువెలా అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సత్యసాయిబాబా భక్తురాలు. ఆమె ఉపాధ్యక్షురాలి హోదాలో పలుమార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయిబాబా మహా సమాధిని దర్శించుకున్నారు.



బాబా మహాసమాధిని మొక్కుతున్న రోడ్రిగ్జ్



విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గవర్నర్‌కు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "జస్టిస్ అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, రాజ్యాంగ ధర్మాసనాల్లో భాగస్వామిగా చారిత్రాత్మక తీర్పులు ఇచ్చారు. గవర్నర్‌గా ఆయన మార్గదర్శకత్వంలో ఏపీలో ప్రజాస్వామ్య సంస్థలు బలోపేతం కావడంతో పాటు మెరుగైన ప్రజాపాలన అందుతోంది. ఆయురారోగ్యాలతో దేశానికి ఆయన ఇంకా అనేక సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని సోమవారం 'ఎక్స్'లో పవన్ పేర్కొన్నారు.

అబ్దుల్ నజీర్‌కు జగన్ శుభాకాంక్షలు

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వైకాపా అధ్యక్షుడు జగన్ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. గవర్నర్ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్లు సోమవారం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.

అత్యాధునిక సౌకర్యాలతో 108, 104 వాహనాలు

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో 108, 104 వాహనాల్ని నడుపుతోందని రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత పేర్కొన్నారు. దురుద్దేశపూరితంగా వైకాపా వాళ్లు 108, 104 సేవలపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 300కుపైగా కొత్త అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

భోగాపురం విమానాశ్రయం ఘనత చంద్రబాబుదే: ఎంపీ కలిశెట్టి

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల్ని 95 శాతం పూర్తిచేసి, రికార్డు సృష్టించినట్లు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. రాబోయే అయిదారు నెలల్లో విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "భోగాపురం విమానాశ్రయానికి కర్త, కర్మ, క్రియ చంద్రబాబే. కానీ, తామే విమానాశ్రయాన్ని పూర్తి చేసినట్లు వైకాపా వాళ్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు" అని ధ్వజమెత్తారు.

నూర్‌బాషా/దూదేకుల సహకార ఆర్థిక సంస్థ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. నూర్‌బాషా/దూదేకుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా నూర్‌బాషా/దూదేకుల సహకార ఆర్థిక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నూర్‌బాషా/దూదేకుల సంక్షేమం, అభివృద్ధి సంస్థని రద్దు చేసింది.

స్టేట్ ఆర్కిటెక్ట్‌గా నవీన్

ఈనాడు, అమరావతి: ఆర్‌అండ్‌బీ శాఖ జాయింట్ స్టేట్ ఆర్కిటెక్ట్ కె.నవీన్‌కు స్టేట్ ఆర్కిటెక్ట్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఇది సీఈ స్థాయి పోస్టు కావడంతో.. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీలో ఎన్‌డీబీ విభాగం సీఈగా ఉన్న వీకే విజయశ్రీని ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చీఫ్ జనరల్ మేనేజర్‌గా డిప్యుటేషన్‌పై పంపారు. ఆర్‌అండ్‌బీలోని సీఈ పోస్టుల్లో సివిల్ ఇంజినీరింగ్ 3, ఎలక్ట్రికల్, స్టేట్ ఆర్కిటెక్ట్‌లకు ఒక్కో సీఈ పోస్టులున్నాయి. ఇంతకాలం స్టేట్ ఆర్కిటెక్ట్ పోస్టుకి అర్హులెవరూ లేకపోవడంతో.. సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సీఈలకు అందులో పోస్టింగులిస్తూ వస్తున్నారు. తాజాగా నవీన్‌కు స్టేట్ ఆర్కిటెక్ట్‌గా పదోన్నతి దక్కడంతో.. ఆయనకు సీఈ స్థాయి కలిగిన పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలిచ్చారు.

అన్నింటా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్

- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్ కేంద్రంలో సీఎం సమీక్ష

ఈనాడు, అమరావతి: అన్ని అంశాల్లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అమలు కావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుతున్న సేవలు, పథకాలపై మంత్రులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తరచూ సమీక్షిస్తూ, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ప్రభుత్వ శాఖలు ప్రజలకు 800 రకాల సేవల్ని అందిస్తున్నాయి. అవి మరింత మెరుగ్గా అందేలా కృషి చేయాలి. ప్రభుత్వ చర్యలు, ఆర్థిక దన్నుతో రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మేర ఘనవ్యర్థాలు రీసైక్లింగ్ చేయాలి. గ్రామీణ ప్రాంతాలకు నెట్‌వర్క్ కనెక్టివిటీ పెంచేందుకు బ్యాండ్ విడ్త్ విస్తరించాలి. వివిధ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అన్నింటికీ వర్తింపజేయాలి. ప్రభుత్వ సేవలపై అభిప్రాయ సేకరణకు ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ సహా వినూత్న విధానాలను అనుసరించాలి' అని పేర్కొన్నారు. మంత్రి పార్థసారథి, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్వర్ణ గ్రామ-వార్డు శాఖ 2026 క్యాలెండర్‌ను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో కలిసి సీఎం ఆవిష్కరించారు.

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో చంద్రబాబు భేటీ

ఈనాడు, అమరావతి: గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో సీఎం చంద్రబాబు సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన ఆహ్వానం మేరకు ఉండవల్లి నివాసానికి వచ్చిన అశోక్ గజపతిరాజుకు చంద్రబాబు సాదరస్వాగతం పలికారు. పలు అంశాలపై వారు చర్చించారు. భోగాపురంలో నిర్మించే జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీకి భూమి ఇచ్చినందుకు అశోక్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు వివరించారు.



సోమవారం సచివాలయంలో స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కొలుసు పార్థసారథి ◆ గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్‌నజీర్ పుట్టినరోజు సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో పరిపూర్ణ జీవితం గడపాలని ఎక్స్ వేదికగా సోమవారం ఆకాంక్షించారు.

◆ అబ్దుల్‌నజీర్‌కు మరో ప్రకటనలో మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పరిపూర్ణ ఆరోగ్యంతో ఆయన దేశానికి మరింత కాలం సేవ చేయాలని ఆకాంక్షించారు.

దేశ ఇంధన భద్రతకు విశాఖ రిఫైనరీ ఆధునికీకరణ

- ఎక్స్‌లో ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆత్మనిర్భర్ భారత్‌కు ఏపీ మరో ప్రధాన మైలురాయి సాధించిందని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'విశాఖ హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా మూడు దశల్లో శుద్ధి చేసేలా ఆధునికీకరణ చేశాం. దీనివల్ల ప్రపంచంలోనే మూడు భారీ రియాక్టర్లతో అవశేషాలను శుద్ధి చేసే స్థాయికి అది చేరింది. ఆధునికీకరణ ప్రాజెక్టు వల్ల ప్రాంతీయ ఇంధన అవసరాలు తీర్చడంతోపాటు సామాజిక ఆర్థికాభివృద్ధి సాధించడంలో దోహదపడుతుంది. దేశ ఇంధన భద్రత అవసరాలకు అనుగుణంగా విశాఖ రిఫైనరీని బలోపేతం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. దీంతో తూర్పు తీరం ప్రపంచ స్థాయి శుద్ధి కేంద్రంగా మారుతుంది' అని ట్వీట్ చేశారు. విశాఖ రిఫైనరీలో హెచ్‌పీసీఎల్ అవశేషాల అప్‌గ్రేడేషన్ సదుపాయం విజయవంతంగా ప్రారంభించడంతో ఇంధన భద్రతను సాధించే దిశగా భారత్ ప్రయాణం ఒక మైలురాయికి చేరుకుందని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి చేసిన ట్వీట్, విశాఖ రిఫైనరీ వీడియోను ట్యాగ్ చేశారు.

రాష్ట్ర కార్యక్రమాలుగా ప్రముఖుల జయంతులు, వర్ధంతులు

క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మహనీయుల జయంతులు, వర్ధంతులు, ఆత్మార్పణ దినాలను నిర్వహిస్తున్న ప్రభుత్వం.. ఈ ఏడాది క్యాలెండర్‌ను విడుదల చేసింది. వేడుకలు/దినాలు రాష్ట్ర స్థాయి కార్యక్రమాలుగా సంబంధిత శాఖలు గౌరవప్రదంగా, శాస్త్రీయంగా నిర్వహించాలని సోమవారం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తేదీ/రోజు	రాష్ట్ర స్థాయి కార్యక్రమం
జనవరి 11	వడ్డే ఓబన్న జయంతి
జనవరి 15	త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి
జనవరి 19	యోగి వేమన జయంతి
మాఘ శుద్ధ విదియ	వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం
ఫిబ్రవరి 14	దామోదరం సంజీవయ్య జయంతి
ఫిబ్రవరి 22	ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి
మార్చి 13	కవయిత్రి మొల్లమాంబ (మొల్ల) జయంతి
మార్చి 16	పొట్టి శ్రీరాములు జయంతి
మార్చి 28	పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి
ఏప్రిల్ 5	డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి
ఏప్రిల్ 11	మహాత్మా జ్యోతిబా పులె జయంతి
ఏప్రిల్ 14	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి
అక్షయ తృతీయ (ఏప్రిల్/మే)	మహాత్మ బసవేశ్వర జయంతి
మే 7	అల్లూరి సీతారామరాజు వర్ధంతి
మే 28	ఎన్టీ రామారావు జయంతి
జులై 4	అల్లూరి సీతారామరాజు జయంతి
ఆగస్టు 2	బళ్లారి రాఘవ (తాడిపత్రి రాఘవాచార్యులు) జయంతి
ఆగస్టు 16	సర్దార్ గౌతు లచ్చన్న జయంతి
ఆగస్టు 23	ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి
సెప్టెంబర్ 17	విశ్వకర్మ జయంతి
ఆశ్వయుజ పౌర్ణమి	మహర్షి వాల్మీకి జయంతి
నవంబర్ 11	మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి
కార్తిక శుద్ధ త్రయోదశ తిథి	కనకదాసు జయంతి
డిసెంబర్ 15	పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మార్పణ దినం)

సమర్థ నిర్వహణతోనే రికార్డుస్థాయి విద్యుత్ ఉత్పత్తి

- జెన్‌కో ఎండీ నాగలక్ష్మి

ఈనాడు-అమరావతి: బొగ్గు నాణ్యత.. సరఫరాదారులకు నిర్దేశిత వ్యవధిలో బిల్లుల చెల్లింపు.. సమర్థ నిర్వహణ కారణంగా ఏపీ జెన్‌కో థర్మల్ ప్లాంట్ల ద్వారా రికార్డు స్థాయిలో 6,009 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమైందని ఎండీ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ అందించడంపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. 'బొగ్గు సరఫరా సంస్థలతో సంప్రదింపుల ద్వారా అధిక గ్రాస్ కలోరిఫిక్ వాల్యూ (జీసీవీ) బొగ్గు తీసుకొచ్చాం. వాటికి చెల్లించాల్సిన బిల్లులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేశాం. వాష్డ్‌కోల్ సరఫరా చేసే వారికి ముందుగా చెల్లింపులు జరిపాం. కృష్ణపట్నం మొదటి యూనిట్‌లో ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ పునరుద్ధరించడం వల్ల 105 నుంచి 200 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యమైంది. థర్మల్ కేంద్రాల దగ్గర 10 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉంచుతున్నాం. బొగ్గు సరఫరా కంపెనీల బకాయిలు చెల్లించేందుకు హడ్కో నుంచి 8.95 శాతం వడ్డీ రేటుకు రూ.1,000 కోట్ల నిర్వహణ మూలధనం కోసం రుణాన్ని తీసుకున్నాం. థర్మల్, జల విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఆధునికీకరణ పనుల కోసం 9 శాతం వడ్డీ రేటుకు రూ.993 కోట్లు రుణంగా తీసుకున్నాం. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులతో సంప్రదింపుల ద్వారా క్యాష్ క్రెడిట్, వర్కింగ్ క్యాపిటల్ డిమాండ్ రుణాలపై వడ్డీ రేటును 8.7, 9.05కు తగ్గించాం. దీనివల్ల ఏటా రూ.60 కోట్ల మేర సంస్థకు ఆదా అవుతుంది. పెనాల్టీ వడ్డీ కింద బ్యాంకులకు గతంలో చెల్లించిన రూ.17 కోట్లు సంప్రదింపుల ద్వారా తిరిగి వసూలు చేశాం' అని తెలిపారు.

విద్యుత్‌రంగాన్ని ప్రైవేటీకరించం

- స్పష్టం చేసిన మంత్రి గొట్టిపాటి
- ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఇంజినీర్ల కొరతపై త్వరలో శుభవార్త వస్తుందన్నారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ విజయవాడలోని నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్ నుంచి ఇంజినీర్ల వరకు చేసిన సమష్టి కృషితోనే ప్రజలకు ట్రూడౌన్ రూపంలో ఉపశమనం లభించింది. దేశంలోనే మొదటిసారి ట్రూడౌన్ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుంది. వైకాపా ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేసింది. అవసరం లేకున్నా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేసి.. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాన్ని మోపింది' అని విమర్శించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

'విద్యుత్ ఉద్యోగుల మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం చూపుతాం. పీఆర్సీతో పాటు ఇంజినీర్ల కొరత అంశాన్ని ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లాం. ఏపీ జెన్‌కోలో రికార్డు స్థాయిలో 6,009 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రావడం రాష్ట్రానికే గర్వకారణం. సీఎం చంద్రబాబు అమలు చేసిన సంస్కరణల కారణంగా విద్యుత్ కోతల బాధ ప్రజలకు తప్పింది. ఇప్పుడు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందిస్తున్నాం. శ్రీకాకుళంలో కొత్త థర్మల్ విద్యుత్‌కేంద్ర నిర్మాణానికి సంబంధించి స్థానికులతో చర్చించి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తాం' అని పేర్కొన్నారు. ఉద్యోగుల కృషి కారణంగానే ఏపీజెన్‌కో, ట్రాన్స్‌కోలకు దేశంలోనే గుర్తింపు లభించిందని సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్, జనరల్ సెక్రటరీ నాగప్రసాద్ పాల్గొన్నారు.

గుత్తేదార్ల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సబ్కా లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏఐఐబీ సహా, పలు నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి తొలుత వచ్చిన బిల్లులకు, తొలుత చెల్లింపు (ఫిఫో) విధానం అనుసరించడంలేదని, దీనిని తప్పకుండా పాటించేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిల్డింగ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ (సబ్కా) కోరింది. ఈ సంఘం సర్వసభ్య సమావేశం ఇటీవల జరగగా, అందులో చర్చించిన పలు అంశాలతో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖరాసింది. గత ఏడాది మార్చి ఆఖరుకి చెల్లించకుండా మిగిలిన బిల్లులను ఆటోమైగ్రేషన్ చేయకుండా రిటర్న్ చేయడం, వాటికి బడ్జెట్ కేటాయించకపోవడం, కేంద్రం పీఎఫ్ఎంఎస్ ఖాతాలను ప్రవేశపెట్టడానికి ముందు మున్సిపాలిటీల్లో మళ్లించిన 15వ ఆర్థిక సంఘం నిధులపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం, నిధి పోర్టల్‌లో బిల్లులు అప్‌లోడ్ కావడంలో అడ్డంకులు.. తదితర అంశాలను లేఖలో ప్రస్తావించింది. అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల పనులు చేసే సబ్కా గుత్తేదార్లు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని, తమ సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలని లేఖలో కోరినట్లు సబ్కా రాష్ట్ర కోఆర్డినేటర్ కె.శివకుమార్ తెలిపారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ రుసుము రూ.50 వేలు

రూ.1.25 లక్షలుగా నిర్ణయించడాన్ని తప్పుపట్టిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ఫీజును రూ.50 వేలుగా నిర్ణయిస్తూ సోమవారం హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. నామినేషన్ ఫీజును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూ.1.25 లక్షలుగా నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలని పిటిషనర్లకు సూచించారు. న్యాయవాదుల మండలి (బార్ కౌన్సిల్) ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ రుసుము కింద రూ.1.25 లక్షలు చెల్లించాలంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించడాన్ని సవాలు చేస్తూ పలువురు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

గ్రూప్-I అప్పీళ్లలో అనుబంధ పిటిషన్లపై ముగిసిన వాదనలు

- తీర్పు రిజర్వు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలపై దాఖలైన అప్పీళ్లలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు కొందరు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. నిర్ణయాన్ని వాయిదా(రిజర్వు) వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. అనుబంధ పిటిషన్లపై నిర్ణయం వెల్లడించిన రోజే ప్రధాన అప్పీళ్లపై వాదనలు వింటామని తెలిపింది. ◆ గ్రూప్ 1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో (చేతితో దిద్దడం) అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. ఇటీవల వాదనలు ముగిసి తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల అభ్యర్థన మేరకు అప్పీళ్లపై పునర్విచారణ జరుపుతోంది.

◆ ఎంపికైనవారు తాజాగా అనుబంధ పిటిషన్లు దాఖలు చేసి.. కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చాలని, నవంబర్ 2021 నుంచి జూన్ 2022 మధ్యలో జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకుల జాబితాను, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్ స్లిప్పులకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికలను కోర్టు ముందు ఉంచేలా సిట్‌ను ఆదేశించాలని, కోర్టు నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక అసంపూర్తిగా ఉందని పేర్కొంటూ అనుబంధ పిటిషన్లు వేశారు.

వాదనల సాగదీతపై ధర్మాసనం అసహనం

సోమవారం జరిగిన విచారణలో ఎంపికైన ఉద్యోగుల తరఫు ఓ సీనియర్ న్యాయవాది వాదనలను సాగదీయడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది.

కేంద్ర సిల్క్ బోర్డ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి గిరీష

ఈనాడు, దిల్లీ: బెంగళూరు ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న కేంద్ర సిల్క్ బోర్డ్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా 2012 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి పీఎస్ గిరీష నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఆయన డిప్యుటేషన్‌పై కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తారు. ఈ నేపథ్యంలో ఆయన్ను తక్షణం ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సోమవారం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

అపెడ్కో ఎండీగా అభిషేక్ కుమార్‌కు అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థిక నగరాల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (అపెడ్కో) ఎండీగా అభిషేక్ కుమార్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎండీ వీర రాఘవరావు పదవీ విరమణ కారణంగా ఆ స్థానంలో ఏపీ మారిటైం బోర్డు సీఈవోగా ఉన్న అభిషేక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

తప్పుడు బిల్లులతో వైకాపా హయాంలో రూ.968 కోట్ల అదనపు చెల్లింపులు

తెదేపా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్)లో డూప్లికేట్ బిల్లులు తనిఖీ చేయకపోవడంతో 1,41,917 బిల్లులపై రూ.968 కోట్లు అదనంగా చెల్లించారని తెదేపా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "పింఛన్ల విషయంలో లిమిట్ చెక్ లేకపోవడంతో 2,545 మందికి అర్హతకు మించి పింఛన్లు ఇచ్చారు. ఈ మోసాల్లో 193 మంది ట్రెజరీ అధికారులు, డీడీవోలు భాగస్వాములయ్యారు. రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చిన వైకాపా ప్రభుత్వం.. అభివృద్ధి కోసం రూ.7,244 కోట్లే ఖర్చు చేసింది" అని విమర్శించారు.

'ఉపాధి హామీ'లో లోపాల సవరణకే వీబీ- జీ రామ్ జీ సంస్కరణలు: లంకా దినకర్

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకం అమల్లో తప్పుడు లావాదేవీలు, నిధుల దుర్వినియోగం అరికట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం 'వీబీ- జీ రామ్ జీ' సంస్కరణలు తీసుకొచ్చిందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీ చట్టం ఆ పార్టీ నాయకుల ఉపాధికే పనికొచ్చిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వాలు చట్టాలు చేస్తే వాటితో ప్రజలకు, దేశానికి మేలు జరగాలి. అంతేగాని నిధులు పక్కదారి పట్టి అవినీతికి ఆస్కారం ఇవ్వకూడదు. గతంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులున్న ఉపాధి హామీని ఇప్పుడు 125 రోజులకు పెంచడం కీలక సంస్కరణ. పని కోరిన 15 రోజుల్లో ఉపాధి కల్పించకపోతే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భత్యం చెల్లించే నిబంధన ఇప్పుడూ కొనసాగుతుంది. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నందున 60 రోజులపాటు ఉపాధి నిలిపివేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీని ద్వారా గ్రామీణ కార్మికులకు ప్రభుత్వ పథకం కింద 125 రోజులు, వ్యవసాయ సీజన్‌లో అదనంగా 60 రోజుల ఉపాధి దక్కే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు.

తింటేనే సింగారింపు!

సౌందర్య లేపనాల కన్నా ఇదే మేలు

చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో సి విటమిన్ పాత్ర కీలకం. అందువల్ల సౌందర్య లేపనాల్లో దీన్ని విరివిగా వాడుతుంటారు. అయితే దీన్ని స్కిన్ కేర్ ఉత్పత్తుల ద్వారా పొందడం కన్నా.. ఆహారం ద్వారా తీసుకుంటే మెరుగైన ఫలితాన్ని పొందొచ్చని శాస్త్రవేత్తలు తేల్చారు. ఫలితంగా అది రక్త ప్రవాహంలో కలిసి.. చర్మంలోని ప్రతి పొరనూ చేరుతుందని వివరించారు. దీనివల్ల చర్మంలో కొలాజన్ వృద్ధి చెంది, నిగారింపు పెరుగుతుందని పేర్కొన్నారు. చర్మం పలుచబడే సమస్య తగ్గుతుందన్నారు.

శరీరానికి సహజసిద్ధ రక్షణ కవచం చర్మం. నిత్యం ఎండ, గాలి, వాతావరణ కాలుష్యం కారణంగా ఈ కవచం దెబ్బతింటుంటుంది. దాని పరిరక్షణలో కొలాజన్ కీలకం. ఈ పదార్థం చర్మానికి దృఢత్వాన్ని, సాగే గుణాన్ని, తేమను కాపాడుకునే లక్షణాన్ని అందిస్తుంది. మృదుత్వాన్ని, నిగారింపును అందిస్తుంది. ముడతలు పడటం వంటి వాటిని తగ్గిస్తుంది. చర్మ సహజసిద్ధ పునరుజ్జీవన సామర్థ్యాన్ని ఇనుమడింపచేస్తుంది. తీవ్ర సూర్య కాంతి వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది.



'సి'లోనే ఉంది..

కొలాజన్ ఉత్పత్తికి విటమిన్ సి చాలా అవసరం. ఇది ప్రొలిల్ హైడ్రాక్సిలేజ్, లైజిల్ హైడ్రాక్సిలేజ్ అనే ఎంజైమ్‌లను బలమైన కొలాజన్ ఆకృతులను ఏర్పరిచేలా వీలు కల్పిస్తుంది. అందువల్లే చర్మపరిరక్షణ ఉత్పత్తుల్లో దీన్ని జోడిస్తుంటారు. అయితే ఇది నీటిలో సులువుగా కరిగిపోతుంటుంది. చర్మం వెలుపలి పొర ద్వారా అంత సులువుగా లోపలికి చొచ్చుకెళ్లలేదు.

ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌లోని ఒటాగో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చర్మం-సి విటమిన్ తీరుతెన్నులపై పరిశోధన చేశారు. ఇందులో భాగంగా 24 మంది ఆరోగ్యవంతులను పరిశీలించారు. వారికి విటమిన్ సి పుష్కలంగా ఉండే ఒకరకం కివీ పండును రోజుకు రెండు చొప్పున ఇచ్చారు. ఇది 250 మైక్రోగ్రాముల సి విటమిన్‌ను తీసుకోవడంతో సమానం. 8 వారాల పాటు దీన్ని కొనసాగించారు. ఆ తర్వాత వారి చర్మంలోని సి విటమిన్ స్థాయిని పరిశీలించారు. చర్మం మందం, సాగే గుణం, అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ సామర్థ్యం, పైపొరలోని కణాల పునరుజ్జీవనం వంటి అంశాలపైనా దృష్టిసారించారు.

- చర్మం, రక్తంలోని సి విటమిన్ పరిమాణాలకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఇందులో తేలింది. సి విటమిన్ పుష్కలంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తంతోపాటు చర్మంలోనూ ఈ విటమిన్ పరిమాణం పెరుగుతుందని వెల్లడైంది. దానికి తగ్గట్టే కొలాజన్ ఉత్పత్తి, వెలుపలి చర్మ పొర పునరుజ్జీవనానికి దోహదపడినట్లు వివరించింది.
- రక్తం, చర్మంలోని సి విటమిన్‌ల పరిమాణం దాదాపు ఒకేలా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. చర్మంలోని అన్ని పొరల్లోకి ఇది చొచ్చుకెళుతున్నట్లు తొలిసారిగా వారు రుజువు చేశారు. రక్త ప్రసరణ ద్వారా వచ్చే సి విటమిన్‌ను శోషించుకోవడంలో చర్మ కణాలు చాలా సమర్థంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది.

సరిపడా అవసరం

రక్తంలో స్థిరంగా సి విటమిన్ స్థాయి ఉండేలా చూడటం చాలా ముఖ్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. దీన్ని శరీరం ఎక్కువ కాలం నిల్వ చేసుకోదని వారు పేర్కొన్నారు. ఆరోగ్యవంతులు రోజుకు 250 మిల్లీగ్రాముల మేర తీసుకుంటే రక్తంలో సరిపడా సి విటమిన్ స్థాయి ఉంటుందని చెప్పారు. తాజా పండ్లు, కూరగాయలు, బెర్రీలు, క్యాప్సికమ్‌లు, బ్రకోలీలో ఇది ఉంటుంది.

ఈహెచ్‌ఆర్ యాప్‌తో వైద్యుల రోజువారీ పనితీరు పర్యవేక్షణ

- వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్

ఈనాడు, అమరావతి: వైద్యుల రోజువారీ పనితీరు వివరాలు రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు యాప్ (ఈహెచ్‌ఆర్)లో నమోదుచేయాలని వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఓపీ, ఐపీల్లో సేవలు పొందిన రోగుల సంఖ్య, వ్యక్తిగత వివరాలు, అందించిన చికిత్స, రాసిచ్చిన మందులు, నిర్ధారణ పరీక్షలు తదితరాలను నమోదు చేయాలన్నారు. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో సోమవారం ఆయన వైద్యవిద్యపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాల (ఆభా) ఆధారంగానే రోగులకు సేవలు అందుతున్నాయని తెలిపారు. చికిత్సలు, ఇతర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే వైద్య సేవల్లో నాణ్యత పెరుగుతుందని, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బోధనాసుపత్రుల్లో వైద్యసేవలు మరింత మెరుగుపడాలని, ఇన్‌పేషెంట్ రోగులకు నడక ప్రాంగణాలు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మనమిత్ర ద్వారా వైద్యుల వద్దకు వెళ్లే ముందుగానే అపాయింట్‌మెంట్ తీసుకునే అవకాశం త్వరలో కల్పిస్తామని వెల్లడించారు. సమీక్షలో డీఎంఈ రఘునందన్, ఏడీఎంఈ వెంకటేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు ఎంపీపీ స్థానాల కోసం ఇంత దారుణమా?

కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

ఈనాడు, అమరావతి: కొన్ని స్థానాలకు జరిగిన ఎంపీపీ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన తీరు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రమాదకర స్వభావాన్ని బట్టబయలు చేస్తోందని వైకాపా అధ్యక్షుడు జగన్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "ఉదయగిరి, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో రెండు ఎంపీపీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెళుతున్న వైకాపా ఎంపీటీసీ సభ్యులను అడ్డుకున్నారు. రాయదుర్గంలో ఎంపీటీసీ సభ్యులను నిర్బంధించారు. వింజమూరు మండలంలో ఎంపీటీసీ సభ్యుడిని కిడ్నాప్ చేశారు. ఇలాంటి అప్రజాస్వామిక సంఘటనలను పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు. ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడడంలో విఫలమయ్యారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం.. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకోవడం తెదేపా నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి సర్వసాధారణమైపోయింది" అని ఆరోపించారు.